
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 51
మంగళవారం 13-5-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'



టెస్టు క్రికెట్‌కు కోహ్లి వీడ్కోలు..

భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి టెస్టు క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకుంటున్నట్లు సోమవారం అధికారికంగా ప్రకటించాడు. తన 14 ఏళ్ల టెస్టు కెరీర్‌లో కోహ్లి 123 టెస్టులు ఆడి 9,230 పరుగులు చేశాడు. ఇందులో 30 సెంచరీలు ఉన్నాయి. కోహ్లి సారథ్యంలో 68 టెస్టులు ఆడిన భారత్ 40 మ్యాచ్‌ల్లో గెలిచింది. 17 మ్యాచ్‌ల్లో ఓడి, 11 మ్యాచ్‌లను 'డ్రా' చేసుకుంది. 14లో

అణుమాత్రం బెదరం!

దాయాదికి ప్రధాని మోదీ హెచ్చరిక

- ఉగ్ర భూతంపై ఆపరేషన్ సిందూర్
- ఇకపై మన దేశ అధికారిక విధానమిదే
- పాకిస్తాన్ దుశ్చర్యలన్నింటికీ ఇలాగే బదులిస్తాం
- ఉగ్రవాదాన్ని, పాకిస్తాన్‌ను ఇక వేరుగా చూడబోం
- పాక్ సైన్యం, ప్రభుత్వమే ఉగ్రవాద పోషకులు
- ఎప్పటికైనా ఆ భూతానికే బలవుతుంది
- ఉగ్రవాదం, వాణిజ్యం, చర్చలు ఒకే ఒరలో ఇమడవు
- నీళ్లు, రక్తమూ ఎన్నటికీ కలిసి ప్రవహించలేవు
- ఉగ్రవాదులు మన మహిళల సిందూరం తుడిచేశారు
- ఉగ్రమూలాలతో పాటు వారి స్థైర్యాన్నీ పెకిలించేశాం
- 9/11 వంటి ఉగ్ర దాడుల కేంద్రాలు భస్మీపటలం
- దాంతో పాక్ నాయకత్వం బిక్కచచ్చిపోయింది
- చేతులు కలపాల్సింది పోయి మనపైనే దాడి
- దాయాదికి కనీవినీ ఎరగని రీతిలో బుద్ధి చెప్పాం
- కలలో కూడా ఊహించని నష్టాలు చవిచూపాం
- దిక్కుతోచక కాళ్లబేరానికొచ్చి శరణు వేడింది
- ఉగ్రవాదం, సైనిక దుశ్చర్యలుండవని హామీ ఇచ్చింది
- అందుకే విరమణ, సైనిక చర్యకు కేవలం విరామమే
- సైనికులకు నా సెల్యూట్.. మహిళలకు సిందూర్ అంకితం

సిందూర్ తర్వాత తొలిసారి జాతినుద్దేశించి మోదీ ప్రసంగం



"పాక్ మన సరిహద్దులపై దాడులకు ప్రయత్నిస్తే మనం ఏకంగా దాయాది గుండెలనే చీల్చి చెండాడి చూపించాం.

న్యూఢిల్లీ: ''ఉగ్రవాద చర్యలకు ఇకపై ఆపరేషన్ సిందూర్‌తోనే బదులిస్తాం. ఇదే భారత ప్రభుత్వ నీతి. ఇదే మన నూతన విధానం'' అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ''దాయాది అణు బెదిరింపులకు దిగితే సహించే ప్రసక్తే లేదు. అంతే కాదు, ఉగ్రవాదాన్నీ, దానికి వెన్నుదన్నుగా నిలుస్తూ వస్తున్న పాక్ ప్రభుత్వాన్నీ ఇకనుంచి వేర్వేరుగా చూడబోం. పాక్ చర్యలన్నింటినీ ఇకపై 'సిందూర్' గీటురాయితోనే పరిశీలిస్తాం. మనపై ఎలాంటి దుశ్చర్యకు పాల్పడ్డా 'సిందూర్' తరహాలో ఆ దేశంపై నిర్ణాయక రీతిలో దాడులు చేస్తాం. జన్మలో మర్చిపోలేని రీతిలో గుణపాఠం నేర్పుతాం'' అని కుండబద్దలు కొట్టారు. పాక్ 'అణు' ఆటలు మనముందు సాగవని ఆ దేశ సైనిక స్థావరాలపై జరిపిన దాడులతో ప్రపంచానికి ఇప్పటికే నిరూపించామన్నారు. ''కశ్మీర్ మంచుకొండల నుంచి రాజస్తాన్ ఎడారుల దాకా పాక్ దాడులన్నింటినీ తిప్పికొట్టాం. కేవలం మన సరిహద్దులపై దాడికి ప్రయత్నించినందుకే దాయాది ఆయువుపట్లను తూట్లు చేశాం. అది గొప్పగా చెప్పుకునే వైమానిక స్థావరాలన్నింటినీ పూర్తిగా నేల మట్టం చేసి కాళ్లబేరానికి తీసుకొచ్చాం. భారత్‌తో యుద్ధానికి దిగిన ప్రతిసారీ పాక్‌ను మట్టి కరిపించాం'' అని గుర్తు చేశారు. ఆ విజయ పరంపరలో ఆపరేషన్ సిందూర్‌ను మిగతా 2వ పేజీలో ▶

తెలంగాణకు అంబాసిడర్లుగా మారండి



- రాష్ట్ర విజయాలను ప్రపంచానికి చూపండి
- ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యానికి సహకరించండి
- పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు
- హైదరాబాద్‌లో సొనాటా సాఫ్ట్‌వేర్ నూతన ప్రాంగణం ప్రారంభం

- వివరాలు 3లో



కియానా తుమీత



హూన్ త్రాన్ నీ

మీకూ మాకూ సామ్యం.. బౌద్ధం

మిస్ జపాన్ కియానా తుమీత

వైవిధ్యమే అందం..

మిస్ వియత్నాం హూన్ త్రాన్ నీ 13లో

సీజ్‌ఫైర్.. బుల్ జోష్

కలిసొచ్చిన అమెరికా–చైనా వాణిజ్య ఒప్పందం

సెన్సెక్స్ 2,975 పాయింట్లు పెరిగి 82 వేల స్థాయి పైకి.. 917 పాయింట్లు పెరిగి 24,925 వద్ద ముగిసిన నిఫ్టీ 15లో

అణుయుద్ధాన్ని ఆపాం



భారత్, పాక్ మధ్య సయోధ్య కుదిర్చాం: ట్రంప్
ఇరువైపులా లక్షలాది మరణాలను నివారించాం
వాణిజ్య తాయిలాలు పని చేశాయన్న అధ్యక్షుడు

- వివరాలు 6లో


చూపింది శాంపిలే



మరో యుద్ధమే వస్తే ఆ కథే వేరు
పాక్‌కు సైన్యం తీవ్ర హెచ్చరికలు
మర్చిపోలేని గుణపాఠం నేర్పాం: ఆపరేషన్స్ డీజీలు

- వివరాలు 6లో

మళ్లీ డ్రోన్ల కలకలం



సాంబా సెక్టార్‌లో నేలమట్టం చేసిన బలగాలు
చిన్న డ్రోన్లతో ఆందోళన అక్కర్లేదన్న సైన్యం
అమృత్‌సర్, హోషియార్‌పూర్‌లో బ్లాక్‌ఔట్

- వివరాలు 6లో

క్లుప్తంగా...

ఆన్‌లైన్ తరగతులు నిర్వహించండి

● యూనివర్సిటీ అధికారులతో రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్

సాక్షి, న్యూఢిల్లీ: భారత్–పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని యూనివర్సిటీ అధికారులను ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ (ఆర్‌సీ) గౌరవ్ ఉప్పల్ కోరారు. సరిహద్దు ప్రాంతాల నుంచి తెలంగాణకు చెందిన విద్యార్థులు సుమారు 160 మంది సోమవారం ఉదయం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. వీరికోసం ఇక్కడ బస, భోజన ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం.. వారు తిరిగి స్వస్థలాలకు వెళ్లే వరకూ అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో గౌరవ్ ఉప్పల్ ముఖాముఖిగా మాట్లాడారు. ఇలా వచ్చామో లేదో.. అప్పుడే క్లాసెస్‌కు అటెండ్ అవ్వాలంటూ యూనివర్సిటీల నుంచి ఫోన్‌లు వస్తున్నాయని విద్యార్థులు తెలిపారు. దీంతో తమ రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్లాసెస్ నిర్వహించాలని సంబంధిత యూనివర్సిటీ అధికారులతో గౌరవ్ ఉప్పల్ ఫోన్‌లో మాట్లాడారు. సాధారణ పరిస్థితులు వచ్చేవరకూ విద్యార్థులు యూనివర్సిటీకి రాలేరని స్పష్టం చేశారు. దీంతో వర్సిటీ అధికారులు సానుకూలంగా స్పందించి, ఆన్‌లైన్ క్లాసెస్ నిర్వహించేందుకు అంగీకరించారు. సోమవారం వరకు తెలంగాణ భవన్‌కు 162 మంది చేరుకున్నారని గౌరవ్ ఉప్పల్ తెలిపారు. ఏపీకి చెందిన విద్యార్థులు కేవలం నలుగురు మాత్రమే ఢిల్లీకి రాగా.. వారిని సోమవారం సాయంత్రం స్వస్థలాలకు పంపించారు.

సైనిక సంక్షేమానికి విప్ ఐలయ్య కుమారుడి రూ. లక్ష విరాళం



రూ.లక్ష నగదును కలెక్టర్ హనుమంతరావుకు అందజేస్తున్న బాలుడు శివమణి

సాక్షి, యాదాద్రి: ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుమారుడు శివమణి తన కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న రూ.లక్షను సైనిక సంక్షేమ నిధికి విరాళంగా అందజేశాడు. సోమవారం భువనగిరి కలెక్టరేట్‌లో తన తల్లి, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనితతో కలిసి ఆ బాలుడు కలెక్టర్ హనుమంతరావుకు రూ.లక్ష నగదు అందజేశాడు. తాను దాచుకున్న డబ్బును ఇండియన్ ఆర్మీకి ఇస్తానని ఇటీవల పాకిస్తాన్‌తో భారత్ యుద్ధం చేస్తున్న సమయంలో శివమణి తన తండ్రి బీర్ల ఐలయ్యతో చెప్పాడు. పదేళ్ల వయసులోనే ఇంతటి ఔదార్యాన్ని కనబరిచిన శివమణి భవిష్యత్తులో మరింత ప్రయోజకుడు కావాలని కలెక్టర్ హనుమంతరావు ఆకాంక్షించారు. శివమణి, అతని తల్లి అనితను కలెక్టర్ శాలువా కప్పి సన్మానించారు. చిన్నారి ఔదార్యానికి పలువురు అభినందనలు తెలిపారు.



అణుమాత్రం బెదరం!



జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

▶ మొదటి పేజీ తరువాయి

కలికితురాయిగా అభివర్ణించారు. పాక్ ప్రభుత్వం, సైన్యం కలసికట్టుగా దశాబ్దాలుగా పెంచి పోషిస్తున్న ఉగ్రవాద భూతం చివరికి ఆ దేశాన్నే కబళిస్తుందని మోదీ హెచ్చరించారు. ''ఆ దేశం మనుగడ సాగించాలంటే ఉగ్రవాదాన్ని దాని గడ్డపై నుంచి కూకటివేళ్లతో పెకిలించాల్సిందే. దానికి మరో మార్గం లేదు'' అంటూ హితవు పలికారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని తొలిసారిగా సోమవారం రాత్రి జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. పాక్‌పై మన సైనిక విజయాన్ని దేశంలోని ప్రతి తల్లికి, సోదరికి, కూతురికి అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

సిందూర్... దేశ భావనకు ప్రతిరూపం

''సిందూరం కేవలం పేరు కాదు. సరైన న్యాయానికి అఖండ ప్రతిజ్ఞ. కోట్లాది భారతీయుల భావనలకు ప్రతిరూపం. ఉగ్రవాదం తాలూకు వికృత రూపమే పహల్గాం దాడి! అమాయక పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడి నన్నెంతగానో కలచివేసింది. భార్యాపిల్లల కళ్లముందే ఒక్కొక్కరిని కాల్చి పొట్టన పెట్టుకున్న వికృతత్వాన్ని ప్రపంచ దేశాలన్నీ తీవ్రంగా ఖండించాయి. అందుకు ప్రతీకారం కోసం దేశమంతా ఒక్కటైంది. ఉగ్రవాదులను మట్టిలో కలిపేందుకు సైన్యానికి ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. వారు కలలో కూడా ఊహించని విధంగా పాక్, పీఓకేలోని బహావల్‌పూర్, మురిద్కే తదితర ఉగ్రవాద కేంద్రాలు, శిక్షణ శిబిరాలపై మన సైన్యం విరుచుకుపడి నేలమట్టం చేసింది. అవన్నీ నిజానికి ప్రపంచ ఉగ్రవాద యూనివర్సిటీలు. అమెరికాపై 9/11, లండన్ మెట్రో తదితర దాడులన్నింటికీ అక్కడినుంచే పథక రచన జరిగింది. అలాంటి కేంద్రాలతో పాటు ఉగ్రవాదుల స్థైర్యాన్ని కూడా మన సైన్యం ధ్వంసం చేసింది. దశాబ్దాలుగా పాక్ గడ్డపై బాహాటంగా రొమ్ములు విరుచుకుని సంచరిస్తున్న 100 మందికి పైగా అత్యంత కరడుగట్టిన ఉగ్రవాదులను హతమార్చింది. మన మహిళల నుదుటి సిందూరం తుడిపేస్తే ఏమవుతుందో ప్రతి ఉగ్ర ముఠాకూ తెలిసొచ్చేలా చేశాం. ఉగ్రతండాలనే సమూలంగా తుడిచిపెట్టేశాం.

కాల్పులకు కేవలం విరామమే



ఉగ్ర కేంద్రాలపై మన దాడితో పాక్ బిక్కచచ్చిపోయింది. మన దాడుల్లో హతమైన ఉగ్రవాదులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపింది. వాటిలో పాక్ సైనిక ఉన్నతాధికారులు బాహాటంగా పాల్గొన్నారు. పాక్ ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉగ్రవాదులు చెలరేగిపోతున్నారనేందుకు ఇది తిరుగులేని రుజువు. తన గడ్డ మీది ఉగ్ర శిబిరాలు తుడిచిపెట్టుకుపోయాయనే నిరాశతో పాక్ దుస్సాహసానికి దిగింది. ఉగ్ర పోరులో మనతో కలిసి రావాల్సింది పోయి మనపైనే దాడులకు తెగబడింది. విచక్షణ కోల్పోయి మన సైనిక స్థావరాలతో పాటు విద్యా సంస్థలు, ప్రార్థనాలయాలు, ఇళ్లను కూడా లక్ష్యం చేసుకుంది. కానీ ఆ ప్రయత్నంలో ఘోరంగా విఫలమైంది. పాక్ డ్రోన్లు, క్షిపణులను మన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ఎక్కడివక్కడ నేలకూల్చింది. మనం అంతటితో ఆగలేదు. వాళ్ల సరిహద్దులపై దాడి చేస్తే నేరుగా పాక్ గుండెకాయకే గురిపెట్టాం. ప్రధాన నగరాల్లోని వాళ్ల కీలక సైనిక, వైమానిక స్థావరాలన్నింటినీ నేలమట్టం చేశాం. పాక్ సైన్యానికి ఊహించలేనంత నష్టం మిగిల్చాం. ఆ క్రమంలో మన బలగాలు అంతులేని సామర్థ్యాన్ని, సంయమనాన్ని ఏకకాలంలో అద్భుత రీతిలో ప్రదర్శించాయి. మన దేశీయ ఆయుధ వ్యవస్థ తాలూకు పాటవాన్ని పూర్తిస్థాయిలో రుచిచూపాయి. దాంతో బెంబేలెత్తిపోయి దాయాది కాళ్లబేరానికొచ్చింది. ఎలాగోలా పరువు కాపాడుకునే ప్రయత్నాలకు దిగింది. కాపాడండంటూ ప్రపంచ దేశాలను వేడుకుంది. మే 10న పాక్ డీజీఎంఓ మన డీజీఎంఓకు కాల్ చేశారు. ''ఇకపై మా గడ్డపై ఎలాంటి ఉగ్రవాద కార్యకలాపాలూ, సైనిక దుస్సాహసాలూ జరగబోవు'' అని స్పష్టంగా హామీ ఇచ్చారు. అప్పటికే పాక్ గుండెలపై పుట్టుకొచ్చిన ఉగ్ర తండాలన్నింటినీ మనం నేలమట్టం చేయడమే గాక దాని పీచమణచాం. కనుక వారి అభ్యర్థనపై ఆలోచించాం. అయినా కాల్పులకు కేవలం విరామం మాత్రమే ఇచ్చాం. ఎలాంటి కవ్వింపులకు దిగినా పాక్‌కు మరోసారి బుద్ధి చెప్పేందుకు మన సైన్యం, వైమానిక, నావికాదళాలు, బీఎస్‌ఎఫ్ సర్వ సన్నద్ధంగా ఉన్నాయి.

ఐక్యతే మన శక్తి

ఉగ్రవాదాన్ని ఇకముందు ఏమాత్రమూ సహించేది లేదు. మన ఐక్యతే దానికి మరణశాసనం. అదే మన అతి పెద్ద శక్తి. ఇది యుద్ధాల యుగం కాదు. నిజమే. కానీ ఉగ్రవాద యుగం కూడా కాదని ప్రపంచమంతా ఒక్కతాటిపైకి వచ్చి స్పష్టమైన సందేశమివ్వాలి. 21వ శతాబ్దపు అధునాతన యుద్ధ రీతులతో ఉగ్రవాదాన్ని తుదముట్టించాల్సిన సమయం ఆసన్నమైంది. అప్పుడే మెరుగైన సమాజానికి బాటలు పరిచిన వాళ్లమవుతాం.''

మోదీ 3 సూత్రాలు

1. భారత్‌పై ఎలాంటి ఉగ్రదాడి జరిగినా మనం ఎంచుకున్న విధంగా నిర్ణాయక రీతిలో సైనిక ప్రతిచర్యలు.

2. అణు బెదిరింపులను ఎంత మాత్రమూ సహించేది లేదు. వాటి ముసుగులో మనుగడ సాగించే అన్ని రకాల ఉగ్ర శిబిరాలనూ నేలమట్టం చేస్తాం. అందుకోసం ఎలాంటి దాడులైనా చేస్తాం.

3. ఉగ్రవాదం, దాన్ని పెంచి పోషించే ప్రభుత్వం వేర్వేరు కాదు. కనుక ఇకపై ఆ రెండింటి నడుమ ఎలాంటి తేడానూ చూడబోం. వాటినుంచి భారత్‌కు పొంచి ఉన్న ముప్పును తొలగించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటాం

పీఓకేను అప్పగించాల్సిందే.. ఏ చర్చలైనా ఆ అంశంపైనే

ఉగ్రవాదంపై భారత వైఖరి సుస్పష్టమని మోదీ చెప్పారు. ''ఉగ్రవాదం, వాణిజ్యం, చర్చలు ఏకకాలంలో కొనసాగలేవు. నీళ్లు, రక్తం కలసికట్టుగా పారడం జరగని పని'' అని స్పష్టం చేశారు. తద్వారా ఉగ్రవాదానికి పాక్ పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసేదాకా ఆ దేశంపై ఆర్థిక, వాణిజ్య ఆంక్షలు, సింధూ జలాల ఒప్పందం నిలిపివేత తదితర చర్యలు కొనసాగుతాయని చెప్పకనే చెప్పారు. ''ఉగ్రవాదాన్ని ఆపాల్సిందే. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌కు అప్పగించి తీరాల్సిందే. పాక్‌తో ఏ చర్చలైనా కేవలం ఈ రెండు అంశాలపైనే జరుగుతాయి. పాక్‌తో పాటు ప్రపంచ దేశాలకు కూడా ఈ విషయం స్పష్టం చేస్తున్నా'' అంటూ ప్రధాని కుండబద్దలు కొట్టారు.

శక్తితోనే శాంతి

''నేడు బుద్ధపూర్ణిమ. ప్రపంచానికి బుద్ధుడు చూపిన శాంతిమార్గం కూడా శక్తి గుండానే సాగుతుంది'' అని మోదీ స్పష్టం చేశారు. 'ప్రతి భారతీయుడూ శాంతియుతంగా జీవించాలి. వికసిత భారత స్వప్నం సాకారం కావాలి. అందుకు భారత్ శక్తిమంతమైన దేశంగా మారడం తప్పనిసరి. ఆ శక్తిని అవసరమైనప్పుడు ప్రదర్శించి చూపాలి. గత కొద్ది రోజులుగా మనం చేసింది సరిగ్గా అదే. ఆ యజ్ఞంలో భాగస్వాములైన సైనిక బలగాలకు, నిఘా వర్గాలకు, శాస్త్రవేత్తలకు అందరికీ ప్రతి భారతీయుని తరఫునా నా సెల్యూట్.

విద్యుత్ పంపిణీ సంస్థ ఉద్యోగులకు యూనిఫాం

● దీంతో అటెండర్ నుంచి సీఎండీ వరకు అందరూ సమానమే అనే భావన
● ఎస్పీడీసీఎల్ సిబ్బందితో ముఖాముఖిలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



విద్యుత్ ఉద్యోగుల ముఖాముఖిలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ పంపిణీ సంస్థలోని సిబ్బందికి యూనిఫాం (ఒకే రూపం దుస్తులు) అమలు చేస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిస్కంలో పనిచేస్తున్న అటెండర్ మొదలు సీఎండీ వరకు అందరూ ఒకటే అన్న భావన తీసుకొచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. యూనిఫాం డిజైన్ చేసేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) సహకారం తీసుకుంటామని చెప్పారు. సోమవారం ప్రజాభవన్‌లో ఎస్పీడీసీఎల్ మెయింటెనెన్స్ అండ్ ఆపరేషన్స్ సిబ్బందితో ముఖాముఖి నిర్వహించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినప్పటికీ క్షణం కూడా అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ విజయం సాధించామన్నారు. ఈ ఏడాది మార్చిలో 17,162 మెగావాట్లకు పైగా పీక్ డిమాండ్ వచ్చినప్పటికీ ఒక్క నిమిషం కూడా కరెంటు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసినందుకు సిబ్బందిని భట్టి అభినందించారు. రాష్ట్రంలో ఐటీ ఇండస్ట్రీ విస్తరణతో పాటు డేటా సెంటర్స్ ఏర్పాటవుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు కావాల్సిన విద్యుత్ గురించి ప్రణాళికలు తయారు చేసుకుని ముందుకు వెళ్తున్నామన్నారు. న్యూ ఎనర్జీ పాలసీ తీసుకురావడం వల్ల మిగులు విద్యుత్ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడంతో పాటు ఇతర రాష్ట్రాలకు విద్యుత్ అమ్మే స్థాయికి అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇంధన శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

19న ప్రభుత్వ శాఖాధిపతులతో బీసీ కమిషన్ సమావేశం

● త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖాధిపతులతో రాష్ట్ర బీసీ కమిషన్ ఈనెల 19న ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల వివరాలను సేకరిస్తున్న బీసీ కమిషన్ తాజాగా చేపట్టనున్న సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సమావేశంలో శాఖల వారీగా నివేదికలు స్వీకరించాలని నిర్ణయించింది. సోమవారం బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ జి.నిరంజన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై నిర్ణయం తీసుకున్నారు. దొమ్మర, పిచ్చకుంట్ల, తమ్మలి, బుడబుక్కల, వీరముష్టికులాల పేర్లు మార్పు చేయాలని, కుమ్మర, రజక, మేర కులాల విషయంలో నిర్దిష్ట సిఫారసులతో కూడిన ఒక సవివరమైన నివేదికను కమిషన్ సభ్యులు సోమవారం సమావేశంలో ఆమోదించారు. ఈ నివేదికను త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ అందజేయనుంది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీసీ జాబితాను రూపొందించే క్రమంలో తొలగించబడిన 26 కులాలను తిరిగి చేర్చే విషయమై బహిరంగ విచారణ జరిపి, ఈ విషయంలో వినతులు, అభ్యంతరాలను స్వీకరించాలని కమిషన్ నిర్ణయించింది. ఇందుకోసం ఈనెల 15న నోటిఫికేషన్‌ను జారీ చేయాలని నిర్ణయం తీసుకుంది. జూన్ 9, 10, 11 తేదీల్లో బహిరంగ విచారణ నిర్వహణతోపాటు ఈ నెల 31వ తేదీ నుంచి వచ్చే నెల 13 వరకు పోస్టు ద్వారా మరియు స్వయంగా కమిషన్ కార్యాలయంలో వినతులు, అభ్యంతరాల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాటు చేయనుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'సీడ్'పథకం దరఖాస్తు స్వీకరణలో కుల ధ్రువీకరణ పత్రంలో డీఎన్‌టీ అనే పదాన్ని పేర్కొనాలని సూచించింది. కొన్ని కులాలను అత్యంత వెనుకబడిన తరగతు (ఎంబీసీ)ల్లో చేర్చే విషయమై ప్రభుత్వం ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించడానికి అవసరమైన సమాచారాన్ని తెప్పించాలని నిర్ణయం తీసుకుంది.

నేడు అండమాన్‌లోకి నైరుతి!

● రుతుపవనాల ప్రవేశానికి అనుకూలంగా వాతావరణం
● 27 నాటికి కేరళ తీరాన్ని తాకే అవకాశం
● అండమాన్‌లో ఇప్పటికే మొదలైన భారీ వర్షాలు
● నేడు రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు
● వాతావరణ శాఖ అంచనాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలపై వాతావరణ శాఖ తాజా అంచనాలను విడుదల చేసింది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున మంగళవారం (13వ తేదీ) సాయంత్రానికి అండమాన్–నికోబార్ దీవుల్లోని కొంత భాగంలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉన్నట్లు తెలిపింది. అండమాన్–నికోబార్ దీవుల్లోని కొన్ని ప్రాంతాలతో పాటు అండమాన్ సముద్రం, దక్షిణ బంగాళాఖాతంలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని పేర్కొంది. ప్రస్తుతం అండమాన్–నికోబార్ దీవుల్లో వర్షాలు కురుస్తున్నాయని, రానున్న 24 గంటల్లో అక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు, అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అండమాన్‌లోకి ప్రవేశించిన తర్వాత నైరుతి రుతుపవనాలు క్రమంగా ముందుకు కదిలి కేరళను తాకుతాయని, ఇందుకు కనీసం రెండు వారాల సమయం పడుతుందని వెల్లడించింది. ఈ నెల 27 నాటికి రుతుపవనాలు కేరళను తాకవచ్చని అంచనా వేసింది. గతేడాదితో పోలిస్తే ఈసారి మూడురోజులు ముందుగా రుతుపవనాలు కేరళను తాకనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

గత ఐదేళ్లలో నైరుతి రుతుపవనాలు కేరళను తాకిన తేదీలు

సంవత్సరం	ప్రవేశం	అంచనా
2020	జూన్-1	జూన్-5
2021	జూన్-3	మే-31
2022	మే-29	మే-27
2023	జూన్-8	జూన్-4
2024	మే-30	మే-31

రాష్ట్రంలో రెండు రోజులు తేలికపాటి వర్షాలు

తెలంగాణలో రానున్న రెండు రోజులు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రధానంగా దక్షిణ ప్రాంత జిల్లాల్లో తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మరాఠ్వాడా నుంచి అంతర్గత కర్ణాటక, తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు కొనసాగిన ఉపరితల ద్రోణి బలహీనపడింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఖమ్మంలో అత్యధికంగా 41.8 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 23.3 డిగ్రీల సెల్సియస్‌గా రికార్డయ్యింది. రానున్న రెండురోజులు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. సోమవారం వికారాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, రంగారెడ్డి, ఆసిఫాబాద్ జిల్లాల్లోని కొన్నిచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి.

సోమవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	40.3	25.2
భద్రాచలం	40.2	27.0
దుండిగల్	37.1	26.7
హకీంపేట్	37.2	27.8
హనుమకొండ	40.0	26.0
హైదరాబాద్	37.2	27.5
ఖమ్మం	41.8	26.6
మహబూబ్‌నగర్	39.4	28.0
మెదక్	40.6	23.3
నల్లగొండ	40.5	24.8
నిజామాబాద్	39.3	27.3
రామగుండం	40.4	27.1

విజయ పాల ధర పెంపు

● లీటర్‌కు రూపాయి పెంచుతూ నిర్ణయం
● అర లీటర్ డబుల్ టోన్డ్ పాలు ఇకపై రూ.28
● టోన్డ్ మిల్క్ లీటర్ ధర రూ.59కి పెంపు

సాక్షి, హైదరాబాద్: విజయ డెయిరీ పాల ధరలు మరోసారి పెరిగాయి. లీటర్‌కు రూపాయి చొప్పున పెంచినట్లు ఆ సంస్థ సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఈ నెల ఒకటో తేదీ నుంచే కొత్త ధరలు అమల్లోకి వచ్చినట్లు వెల్లడించింది. విజయ డెయిరీ వెల్లడించిన ప్రకారం డబుల్ టోన్డ్ మిల్క్ ధర రూ.27 నుంచి రూ.28కి (500 ఎంఎల్) పెరిగింది. టోన్డ్ మిల్క్ లీటర్ ధర రూ.58 నుంచి 59కి పెరిగింది. అదేవిధంగా 500 ఎంఎల్ స్పెషల్ టోన్డ్ మిల్క్ రూ.28 నుంచి 29కి, స్టాండర్డైజ్డ్ మిల్క్ రూ.31 నుంచి రూ.32కి, హోల్‌మిల్క్ రూ.36 నుంచి రూ.37కి, డైట్ మిల్క్ రూ.26 నుంచి రూ.27కి పెరిగింది. లీటర్, అర లీటర్, 300 ఎంఎల్, 200 ఎంఎల్ ధరలు పెరిగినట్టు విజయ డెయిరీ వెల్లడించింది.

'ఆపరేషన్ సిందూర్'పై ప్రజల్లోకి బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: పహల్గాం దాడి తర్వాత కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలు, విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు బీజేపీ సిద్ధమైంది. దేశవ్యాప్తంగా ఈ నెల 13 నుంచి 23వ తేదీ వరకు 11 రోజులపాటు తిరంగా యాత్ర చేపట్టాలని నిర్ణయించనుంది. రాజకీయాలతో సంబంధం లేకుండా కేవలం ప్రజలను ఈ అంశంపై ఏకం చేయడమే దీని ఉద్దేశమని చెబుతున్నారు. ఇందుకోసం, రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించనుంది. ఆపరేషన్ సిందూర్‌పై పార్టీ నాయకులకు వివరణాత్మక సమాచారాన్ని అందజేసే అంశమై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో ఆదివారం రాత్రి కీలక చర్చలు జరిగాయి. భేటీకి హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్, సమాచార, ప్రసార మంత్రి అశ్విని వైష్ణవ్ సహా బీజేపీ ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. కచ్చితమైన, సమగ్రమైన సమాచారాన్ని నాయకులకు చేరవేసే అంశాలపై ఇందులో చర్చించారు. అమెరికా మధ్యవర్తిత్వంతో సైనిక చర్యలను భారత్ నిలిపివేసిందన్న ప్రతిపక్షాల విమర్శలకు జవాబిచ్చేలా ఓ డ్రైవ్ చేపట్టనున్నారు. సోమవారం సీనియర్ నేత సంబిత్ పాత్రా పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సాయుధ దళాల విజయాలను హైలైట్ చేస్తూ, ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైనప్పటి నుంచి జరిగిన పరిణామాలను వివరించారు. 'పహల్గాంలో 26 మంది మరణానికి ప్రతీకారం తీర్చుకుంటామని ప్రధానమంత్రి హామీ ఇచ్చారు. ప్రతీకారం శత్రువు ఊహకు అందని విధంగా ఉంటుందని ప్రధాని అన్నారు..అలాగే జరిగింది. ప్రధాని మోదీ నిర్ణయం మేరకే ఉగ్రవాద స్థావరాలు నేలమట్టమయ్యాయి' అని పేర్కొన్నారు.

పహల్గాం దారుణంపై అనుమానాలెన్నో?

సమాధానమివ్వాలని కేంద్రానికి కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ: పహల్గాం ఘాతుకానికి పాల్పడిన ముష్కరులు పట్టుబడ్డారా లేక హతమయ్యారా? అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సోమవారం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. 26 మంది పర్యాటకుల మరణానికి కారణమైన భద్రతా లోపాలకు కారకులెవరో వెల్లడించాలని కోరింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భూపేశ్ బఘేల్ పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మనోభావాలతో ఆటలాడుకుంటోందని ఆయన తీవ్ర ఆరోపణ చేశారు. సోషల్‌మీడియా ద్వారా పహల్గాం దాడిని బీజేపీ రాజకీయం చేసిందని విమర్శించారు. భారత్, పాకిస్తాన్ మధ్య విభేదాల పరిష్కారంలో మరొకరి మధ్యవర్తిత్వాన్ని అంగీకరించేలా మన విదేశాంగ విధానాన్ని మార్చారా అని ఆయన కేంద్రాన్ని ప్రశ్నించారు. భారత్, పాకిస్తాన్‌లు కాల్పుల విరమణకు అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేయడం మన దౌత్యపరమైన వైఫల్యమా? కాదా?అని భూపేశ్ బఘేల్ నిలదీశారు.ఇలాంటి అత్యంత కీలకమైన పరిణామాలపై చర్చించేందుకు పార్లమెంట్‌ను లేదా అఖిల పక్ష సమావేశాన్ని ప్రధాని మోదీ అధ్యక్షతన ప్రత్యేకంగా ప్రభుత్వం ఎందుకు ఏర్పాటు చేయడం లేదని బఘేల్ ప్రశ్నించారు. ప్రధాని మోదీ రాని పక్షంలో ఇకపై జరిగే అఖిల పక్ష భేటీలకు కాంగ్రెస్ చీఫ్ ఖర్గే సైతం హాజరు కాబోరని స్పష్టం చేశారు. ఎలాంటి సంక్షోభం ఎదురైనా దేశం పక్షాన్నే కాంగ్రెస్ నిలబడుతుందని, ఇలాంటప్పుడు రాజకీయాలను పక్కనబెడుతుందని బఘేల్ వివరించారు.

ప్రశ్నించే గొంతును నొక్కేద్దామనుకోవడం పొరపాటు

'సాక్షి'ఎడిటర్ ఇంట్లో సోదాలు దుర్మార్గం

చరిత్ర నేర్పిన గుణపాఠాలను పాలకులు గమనంలో పెట్టుకోవాలి

రాయలసీమ కార్మిక, కర్షక సమితి అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖరరెడ్డి





సాక్షి ప్రతినిధి, కడప: 'నియంతృత్వ పాలన ఈ దేశంలో ఎప్పుడూ మనుగడ సాగించలేదు. విపరీత జనాకర్షణ కలిగిన నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి పత్రికా స్వేచ్ఛ గొంతు నొక్కారు. ప్రజలు ఎమర్జెన్సీని తిరస్కరిస్తూ ఆమెకు, ఆమె పార్టీకి గుణపాఠం చెప్పారు' అని రాయలసీమ కార్మిక, కర్షక సమితి అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ నియంతృత్వ చర్యలపై తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

రాష్ట్రంలో గనులు ధారాదత్తం

రాష్ట్రంలో ప్రభుత్వ పెద్దలు ప్రశ్నించిన వారినంతా అణిచివేయాలనే దృక్పథంతో ఉన్నారు. ఎమర్జెన్సీని పెట్టిన ఇందిరాగాంధీ ప్రజాగ్రహానికి గురయ్యారన్న విషయం వారికి తెలియంది కాదు. చరిత్ర ఎన్నిమార్లు గుణపాఠాలు నేర్పినా పాలకులు ఆ పంథా వీడడం లేదు. రాష్ట్రంలో గనులు, భూములను ప్రభుత్వం ఇష్టారాజ్యంగా తమకు కావాల్సిన వాళ్లకు ధారాదత్తం చేస్తోంది. ఓబుళాపురం ఇనుప ఖనిజ గనుల్లో అధికారులు ఎంతమందికి శిక్ష పడిందో గమనించి కూడా గనులను అస్మదీయులకు ధారాదత్తం చేస్తున్నారు.

రూ.9వేల కోట్లు అప్పు కోసం..

ప్రభుత్వానికి రూ.9 వేల కోట్ల అప్పు కోసం దాదాపు రూ.రెండు లక్షల కోట్ల విలువైన 436 రకాల ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకు సిద్ధపడటం దురదృష్టకరం. ఏపీఎండీసీ ఆధ్వర్యంలో ఆ గనుల తవ్వకాలు చేపడితే వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చు. నిరుద్యోగుల అసంతృప్తిని చల్లార్చవచ్చు. ప్రభుత్వం ప్రజలకు మేలు చేసినా, చేయకపోయినా వారికున్న స్వేచ్ఛను హరించకుండా ఉంటే అదే పదివేలనిపిస్తోంది. రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులు కొనసాగుతున్నాయి. నాటి పరిస్థితిని పాలకులు మరిపిస్తున్నారు. ఉన్నత న్యాయస్థానాలు అనేక పర్యాయాలు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగ చర్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మందలించినప్పటికీ అప్రజాస్వామిక దాడులు ఆగడం లేదు. ఇది ఏమాత్రం సహేతుకం కాదు.

ప్రభుత్వానికి ప్రజాస్వామ్యంపై విశ్వాసం కన్పించడం లేదు

ప్రజాస్వామ్యంపై విశ్వాసం కలిగించాల్సిన ప్రభుత్వమే వ్యవస్థను బలహీన పరుస్తోంది. తద్వారా రాబోయే ప్రభుత్వాలకు తప్పుడు సంకేతాలు ఇస్తోంది. ఇలాంటి పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో ప్రజలు చాలా ఇబ్బందులు పడతారు. వివిధ వర్గాల ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వ పాలన పట్ల వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో వారి గొంతుకగా నిలుస్తూ, ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న 'సాక్షి'పై అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఆ పత్రికా ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో సోదాలు, పోలీసుల దురుసు ప్రవర్తన, ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా వ్యవహరించిన తీరు చాలా దుర్మార్గమైన విషయం. ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించడంపై ప్రజల పక్షంగా 'సాక్షి' నిలుస్తోంది. ఇలాంటివి మనస్సులో ఉంచుకొని మానసికంగా దెబ్బకొట్టే చర్యలకు ప్రభుత్వ పెద్దలు సిద్ధమయ్యారు. ఇప్పటికే వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తూ సోషల్ మీడియా యాక్టివిస్టులను తొక్కిపెట్టారు. మరోవైపు పత్రికల గొంతు నొక్కే చర్యలకు సిద్ధమయ్యారు. పత్రికా స్వేచ్ఛను దెబ్బతీసే పరిస్థితులకు ప్రభుత్వమే దిగడం ప్రజాస్వామ్యవాదులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

హై ప్రొటీన్ మంత్రం



గతంలో అన్ని పోషకాలూ ఇందులోనే ఉన్నాయి అంటూ పాలల్లో కలుపుకొని తాగే పొడులు, బిస్కెట్ల వంటివాటిని కంపెనీలు తీసుకొచ్చేవి. ఇప్పుడు ట్రెండ్ మారింది. కరోనా తరవాత ప్రజల్లో ఆరోగ్య స్పృహ బాగా పెరిగింది. రాగి ఇడ్లీ మొదలు మొలకలు, ఫ్రూట్ సలాడ్లు, చిరుధాన్యాల వంటకాలు.. ఇవన్నీ చాలామంది నిత్య జీవితంలో భాగమైపోయాయి. విడివిడిగా పోషకాలు, వాటి అవసరంపై అవగాహనా పెరిగింది. ఈ నేపథ్యంలో ఇటీవల కొన్ని కంపెనీలు ప్రొటీన్ మంత్రాన్ని జపిస్తున్నాయి. మా ఉత్పత్తిలో అత్యధిక ప్రొటీన్ ఉందంటూ ప్రత్యేకంగా ప్రచారం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసలు మనకు రోజువారీ ఎంత ప్రొటీన్ కావాలి? అది ఎలా లభిస్తుంది? భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎమ్ఆర్), జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) ఏం చెబుతున్నాయి?

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఉత్పత్తులకు సరికొత్త 'హెల్త్ ట్యాగ్'
- పేరులోనే ప్రొటీన్ ప్రస్తావన
- అమూల్, బ్రిటానియా, ఐటీసీ.. అన్నీ ఇదే బాటలో
- లేబుళ్లను జాగ్రత్తగా చదవాలి
- ఐసీఎమ్ఆర్ – ఎన్ఐఎన్ సూచన

- అమూల్ కంపెనీ ఇటీవల 'ప్రొటీన్ కుల్ఫీ'ని మార్కెట్లోకి విడుదల చేసింది. ఇందులో 10 గ్రాముల ప్రొటీన్ ఉంటుందని ప్యాక్‌మీద పెద్దగానే ముద్రించింది. అమూల్ ఇప్పటికే బటర్ మిల్క్, రోజ్ లస్సీ, కూల్ కేసర్, కూల్ కాఫీ, టిన్ పనీర్ వంటి వాటిని 'హై ప్రొటీన్'పేరుతో విక్రయిస్తోంది. ఇంకా ఆసక్తికరం ఏంటంటే.. ప్రొటీన్ సమోసా, ప్రొటీన్ వడాపావ్ వంటివి కూడా తీసుకొచ్చింది.
- అలాగే మిల్కీ మిస్ట్ కంపెనీ 'స్కైఆర్'– హై ప్రొటీన్ పెరుగు తీసుకొచ్చింది. ఇందులో 11 గ్రాముల ప్రొటీన్ ఉంటుందట.
- ఐటీసీ కంపెనీ 'ఆశీర్వాద్'ఉత్పత్తుల్లో భాగంగా...నమ్మ చక్కీ పేరిట గోధుమ పిండి విక్రయిస్తోంది. ఇందులోనూ 'హై ఇన్ ప్రొటీన్'అని ప్యాక్ మీదే ముద్రించి, ప్రతి 100 గ్రాముల్లో 14.7 గ్రాముల ప్రొటీన్ ఉంటుందని రాశారు.
- బ్రిటానియా కంపెనీ 'బి యు'పేరిట ప్రొటీన్ బార్‌లు తెచ్చింది. 45 గ్రాముల ఈ బార్‌లో 10.8 గ్రాముల ప్రొటీన్ ఉంటుందని పేర్కొంది.
- ఇవేకాదు, ఇంకా చాలా కంపెనీలు.. ఇప్పుడు ప్రొటీన్ మంత్రం జపిస్తున్నాయి. కరోనా తరవాత ప్రజల్లో పెరిగిన ఆరోగ్య స్పృహను దృష్టిలో పెట్టుకుని, వినియోగదారులను ఆకట్టుకునేందుకు ఇలాంటి ఉత్పత్తులు తీసుకొస్తున్నాయి.

ఐసీఎమ్ఆర్ – ఎన్ఐఎన్ ఏమంటున్నాయి?

భారతీయులు ఎలాంటి ఆహారం తీసుకోవాలో పూర్తి మార్గదర్శకాలతో ఐసీఎమ్ఆర్ – ఎన్ఐఎన్... 'డైటరీ గైడ్‌లైన్స్ ఫర్ ఇండియన్స్ 2024'పుస్తకం వెలువరించాయి. శరీరంలో ఎంజైములు, హార్మోన్లు, హిమోగ్లోబిన్, కణత్వచం భాగాల వంటివాటి తయారీ.. ఇలాంటి ఎన్నో పనులకు ప్రొటీన్లు చాలా అవసరం. విరిగిపోయిన కణజాలాల స్థానే కొత్తవాటి కోసమూ ప్రొటీన్లే కావాలి. ఎదిగే పిల్లల్లో కండరాలు, ఎముకల నిర్మాణానికీ ఇవే అవసరం.



ప్రొటీన్లు అత్యధికంగా ఉండేవి

- మాంసం, గుడ్లు, చికెన్, చేపలు
- పాలు, పప్పు దినుసులు, సోయా బీన్, కిడ్నీ బీన్స్, బఠానీ, పెసలు, శనగలు, బాదం, పిస్తా, జీడిపప్పు, అక్రోటు, గుమ్మడి గింజలు, అవిసె గింజలు, నువ్వులు, క్వినోవా మొదలైనవి
- మాంసాహారులకు వారంలో 700 –900 గ్రాముల చేపలు లేదా చికెన్ తినడం వల్ల వారికి అవసరమైన ప్రొటీన్ అందుతుంది.

ఎంత ప్రొటీన్ అవసరమంటే...

ఐసీఎమ్ఆర్ – ఎన్ఐఎన్ సూచనల ప్రకారం.. ఆరోగ్యంగా ఉండే ఒక వ్యక్తి... తన శరీరంలో ప్రతి కేజీ బరువుకీ రోజుకి 0.83 గ్రాముల ప్రొటీన్ తీసుకోవాలి. అంటే సగటున 25 కేజీల బరువుండే మనిషి రోజుకి సుమారు 21 గ్రాముల ప్రొటీన్, 50 కిలోలుంటే 42 గ్రాములు, 65 కిలోలుంటే 54 గ్రాముల ప్రొటీన్ తీసుకోవాలి. అలాగని ప్రొటీన్ ఉండే ఆహారం ఒక్కటే తీసుకుంటే.. కండరాల బలం పెరగదు. కార్బోహైడ్రేట్లు, కొవ్వులు కూడా చాలా అవసరం. అంతేకాదు, రోజూ సరిపడా శారీరక వ్యాయామం చేయకపోయినా మనం తీసుకున్న ప్రొటీన్లు కండరాల నిర్మాణానికి తోడ్పడవు.

మార్కెట్లోకి కొన్ని కంపెనీలు ప్రొటీన్ పౌడర్లను కూడా విడుదల చేస్తున్నాయి. ఇందులో అదనంగా షుగర్లు, స్వీటెనర్లు, ఇతరత్రా కృత్రిమ పదార్థాలు ఉంటున్నాయి. ప్రొటీన్ సప్లిమెంట్ల రూపంలో అత్యధిక ప్రొటీన్ తీసుకోవడం కూడా ఆరోగ్యానికి మంచిది కాదని ఐసీఎమ్ఆర్ చెబుతోంది. చాలామంది అథ్లెట్లు సప్లిమెంట్ల అవసరం లేకుండానే.. తమ రోజువారీ ఆహారంలోనుంచే తమ శరీరానికి అవసరమైన ప్రొటీన్ పొందగలుగుతారని స్పష్టం చేస్తోంది.

లేబుల్ చదవాలి

మార్కెట్లో ఏ వస్తువు కొన్నా లేబుల్ మాత్రం తప్పనిసరిగా చదవాలని ఐసీఎమ్ఆర్ సూచిస్తోంది. ఉదాహరణకు 'తక్కువ కొవ్వులు (లో ఫ్యాట్)' అని లేబుల్‌లో రాస్తారు. కానీ, ఆ ఉత్పత్తి ద్వారా చాలా క్యాలరీలు వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల మిగతా సమాచారాన్ని కూడా చదవాలి. గుడ్ సోర్స్ ఆఫ్ ప్రొటీన్, విటమిన్ డి.. వంటివి లేబుల్‌లో రాసి ఉంటే.. సింగిల్ సెర్వింగ్ ద్వారా 10 నుంచి 19 శాతం ఆ పోషకం మనకు అందే అవకాశం ఉంటుంది.

ప్రాసెస్డ్ ఫుడ్ కొనేస్తున్నారు

కేంద్ర గణాంక శాఖ 'గృహ వినియోగ వ్యయ సర్వే' ప్రకారం... పానీయాలు, ప్రాసెస్డ్ ఆహారంపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు నెలకు సగటున చేసే ఖర్చు 2022-23తో పోలిస్తే 2023-24లో పెరిగింది.

సంవత్సరం	గ్రామీణ	పట్టణ
2022–23	9.6%	10.6%
2023–24	9.8%	11.1%



క్లుప్తంగా...

ప్రభుత్వ వైద్య రంగంలో నర్సింగ్ వ్యవస్థ బలోపేతం

మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ వైద్య రంగంలో నర్సింగ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా సోమవారం నర్సింగ్ ఆఫీసర్లకు మంత్రి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది 6,956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేశామని, మరో 2,322 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. రెండేళ్లలోనే 9 వేలకు పైగా పోస్టులను భర్తీ చేసి, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నర్సులకు ఉద్యోగావకాశాలు కల్పించామని తెలిపారు. దేశ, విదేశాల్లో నర్సింగ్‌కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, 16 ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలను ఇక్కడి యువతకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ప్రభుత్వ నర్సింగ్ ఆఫీసర్లకు ప్రమోషన్లు ఇచ్చి, వారి ఆకాంక్షలను నెరవేర్చినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేషెంట్లకు సేవలందిస్తున్న నర్సులకు మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఒత్తిడి, బాధలో ఉంటారని.. అలాంటి వారితో ఒక్కమాట ప్రేమగా మాట్లాడితే ఎంతో ఉపశమనం పొందుతారని సూచించారు. నర్సుల పని ఒత్తిడిని పేషెంట్లు, కూడా అర్థం చేసుకుని, వారికి సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగుల సమస్యలకు వేగంగా పరిష్కారం చూపాలి

త్రిసభ్య కమిటీకి ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి వినతి



మిత్తల్‌తో సమావేశమైన ఉద్యోగ జేఏసీ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి.. త్రిసభ్య కమిటీని కోరారు. సోమవారం త్రిసభ్య కమిటీ చైర్మన్ నవీన్ మిత్తల్‌ను కలిశారు. ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని విన్నవించారు. ప్రభుత్వ శాఖల్లో పొరుగు సేవల ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జీవో 317 ద్వారా నష్టపోయిన ఉద్యోగులకు బదిలీలు చేపట్టాలని, ప్రభుత్వ ఖజానాపై తక్షణ భారం లేని 24 అంశాలను తొలుత పరిష్కరించి, ఆ తర్వాత 14కు పైగా ఆర్థిక భారం పడే అంశాలను దశలవారీగా పరిష్కరించాలని కోరారు. జేఏసీ భాగస్వామ్య సంఘాల ఉద్యోగుల ప్రత్యేక సమస్యలను కూడా నవీన్ మిత్తల్‌కు నివేదించారు.

అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలకు సంసిద్ధం

ప్రభుత్వ ఆరోగ్య శాఖ కార్యదర్శి

సాక్షి, హైదరాబాద్: ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా ఆరోగ్య వ్యవస్థకు సంబంధించిన సేవలందించడంలో ఆరోగ్య శాఖ యంత్రాంగం సన్నద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ తెలిపారు. సోమవారం సచివాలయంలో 'అత్యవసర పరిస్థితుల్లో ఆరోగ్య వ్యవస్థ సన్నద్ధత'పై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించిన హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

తెలంగాణకు అంబాసిడర్లుగా మారండి

రాష్ట్ర విజయాలను ప్రపంచానికి చూపండి
- ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యానికి సహకరించండి
- పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు
- పెట్టుబడుల సాధనలో తెలంగాణే నంబర్ వన్
- హైదరాబాద్‌లో ప్రపంచ సుందరి తరహా పోటీలు నిర్వహిస్తామని వెల్లడి
- నగరంలో సొనాటా సాఫ్ట్‌వేర్ నూతన ప్రాంగణం ప్రారంభం
- ఏఐ లీడర్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం: మంత్రి శ్రీధర్‌బాబు



సొనాటా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, మండలి చైర్మన్ గుత్తా, సంస్థ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్/రాయదుర్గం: వివిధ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను ప్రపంచానికి చూపడంతో పాటు హైదరాబాద్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని వాణిజ్య, పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'తెలంగాణ రైజింగ్'నినాదాన్ని ఆచరణలోకి తీసుకురావడం ద్వారా ఆర్థికాభివృద్ధితోపాటు పెట్టుబడులు, ఉద్యోగాలు, మౌలిక వసతులు, సంక్షేమంతో కూడిన సమతుల పాలన రాష్ట్రంలో సాగుతోందని తెలిపారు. హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్ది, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్లకు చేర్చడంలో అందరూ సహకరించాలని కోరారు. హైదరాబాద్‌లో సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థ కొత్త ప్రాంగణాన్ని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే పేరొందిన 'మిస్ వరల్డ్'పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్నాయని, ఈ తరహా ప్రపంచ స్థాయి కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు. డ్రై పోర్టు నిర్మాణం, ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరంలో ఓడరేవులతో అనుసంధానం, ఫ్యూచర్ సిటీలో ఏఐ నగరం, యంగ్ ఇండియా స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీలు, వంద అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం జరుగుతోందని సీఎం వెల్లడించారు.

పెట్టుబడుల ఆకర్షణలో అగ్రస్థానం

పెట్టుబడులను ఆకర్షించటంలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'రాష్ట్ర ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం పనిచేస్తున్నాం.. పరిశ్రమలకు మద్దతుగా నిలుస్తూ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. దేశీయంగా, అంతర్జాతీయంగా పెట్టుబడుల ఆకర్షణలో అగ్రస్థానంలో ఉంది. డిసెంబర్, 2023లో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలుకుని ఇప్పటివరకు రాష్ట్రానికి కొత్తగా రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం. లక్షకు పైగా ఉద్యోగాలు సృష్టించాం. 2025లో దావోస్‌లో తెలంగాణ రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడం ద్వారా దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచింది. పోలీసింగ్, శాంతిభద్రతలు, ద్రవ్యోల్బణ కట్టడి, ఉద్యోగ సృష్టి, పన్ను వసూళ్లలోనూ మొదటి స్థానంలో ఉంది. 66 లక్షల మంది మహిళలకు స్వయం సహాయక బృందాల ద్వారా సాధికారత, రాజీవ్ యువ వికాసం ద్వారా యువత వ్యాపారాలు, స్వయం ఉపాధికి అవసరమైన నిధులు ప్రభుత్వం అందిస్తోంది. హైదరాబాద్ ట్రాఫిక్ ఫోర్స్‌లో ట్రాన్స్‌జెండర్ స్వచ్ఛంద సేవకులను నియమించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. హైదరాబాద్ మహానగరం సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్, పారిశ్రామిక రంగాలతో పాటు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హబ్‌గా మారింది. ఏఐ రెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకు కేంద్రంగా తయారైంది. మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటీ దిగ్గజ కంపెనీలు రాష్ట్రంలో క్యాంపస్‌లను విస్తరిస్తున్నాయి'అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.

ఏఐ లీడర్‌గా తీర్చిదిద్దుతాం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ లాంటి అత్యాధునిక టెక్నాలజీల్లో ప్రపంచంలోనే తెలంగాణను లీడర్‌గా తీర్చిదిద్దడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. 'తెలంగాణను ఏఐ లీడర్‌గా మార్చేందుకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించాం. ఏఐ సిటీలో భాగస్వామి అయ్యేందుకు మైక్రోసాఫ్ట్ లాంటి టెక్ దిగ్గజ సంస్థలు ఆసక్తి చూపించాయి. ఏఐలో ప్రపంచ స్థాయి నిపుణులను తయారు చేసేందుకు త్వరలోనే ఏఐ యూనివర్సిటీని ప్రారంభించబోతున్నాం. పౌర సేవలను ఏఐతో అనుసంధానించి ప్రజల ముంగిటకు చేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ హబ్‌గా మారింది. ఈ జీసీసీలను గ్లోబల్ వాల్యూ యాడెడ్ సెంటర్లుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది'అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సొనాటా ప్రతినిధులు సమీర్ ధీర్, సుజిత్ మొహంతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోహ్లి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది: సీఎం

సాక్షి, హైదరాబాద్: దేశ క్రికెట్ చరిత్రలో విరాట్‌కోహ్లి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్లాఘించారు. క్రికెట్‌లో ఆయన సాధించిన విజయాలను పొగిడారు. టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అవుతున్నట్లు కోహ్లి ప్రకటించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి 'ఎక్స్'వేదికగా స్పందించారు. ఉన్నత క్రమశిక్షణ కలిగిన, కమిట్‌మెంట్ ఉన్న ఆటగాడిగా ఆయన సాధించిన పలు రికార్డులే స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. యువ క్రికెటర్లకు ఆయన ఒక మార్గదర్శి అని తెలిపారు. టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయిన తర్వాత తన తదుపరి దశ విజయవంతంగా కొనసాగాలని కోరుకుంటున్నట్లు సీఎం పేర్కొన్నారు.

నువ్వు ముదిరాజ్‌వా.. రెడ్డివా?

దద్దమ్మగా ఉన్న నిన్ను తంతే బీజేపీలోకి వెళ్లావు.. ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నట్టున్నావు
- అధ్యక్ష పదవి రాలేదన్న ఆక్రోశాన్ని రేవంత్‌పై వెళ్లగక్కుతున్నావు
- ఒక్క విజిల్ వేస్తే.. కాంగ్రెస్ కార్యకర్తలు ఏం చేస్తారో మాకే తెలియదు
- బీజేపీ ఎంపీ ఈటలపై పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను బీసీ బిడ్డగా ఎవరూ ఆమోదించడం లేదని, ఆయన అసలు ముదిరాజ్ కులానికి చెందిన వారో, లేక రెడ్డి కులానికి చెందిన వారో చెప్పాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో అనుభవమున్న నాయకుడు రాజేందర్‌కు ఇంత దిగజారుడు తనం ఎందుకో అర్థం కావడం లేదని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ఇష్టారాజ్యంగా మాట్లాడడం తగదని, ఇక ముందు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉంటే మంచిదని హెచ్చరించారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, పీసీసీ నేతలు ఈర్ల కొమురయ్య, సలీం, గజ్జి భాస్కర్, ఇందిరా శోభన్‌లతో కలసి ఆయన మాట్లాడుతూ.. ఈటల బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రావడం లేదనే నిస్పృహలో ఉన్నారని, అందుకే కిషన్‌రెడ్డిపై ఉన్న ఆక్రోశాన్ని రేవంత్‌పై వెళ్లగక్కుతున్నారని చెప్పారు. కేసీఆర్ పాలనలోని అలీబాబా 40 దొంగల్లో ఈటల కూడా ఒక సభ్యుడని, రాష్ట్రం అప్పుల పాలు కావడానికి కేసీఆర్‌తో పాటు ఈటల నిర్వాకం కూడా కారణమని పేర్కొన్నారు. దద్దమ్మగా ఉన్న ఈటలను అప్పుడు బీఆర్ఎస్ నుంచి తంతే వెళ్లి బీజేపీలో పడ్డారని, మళ్లీ ఇప్పుడు అక్కడ ఇమడలేక కేసీఆర్‌వైపు చూస్తున్నట్టున్నారని ఎద్దేవా చేశారు. సీఎంను ఉద్దేశించి ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని, తాము ఒక్క విజిల్‌వేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు ఏం చేస్తారో తెలియదని అన్నారు. కేటీఆర్ బాణీలోనే రాజేందర్ మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతోంది కిషన్‌రెడ్డి, రాజేందర్ గ్యాంగేనని మండిపడ్డారు.

యువ వికాసం దరఖాస్తుల పరిశీలన ఎలా?

- క్షేత్రస్థాయిలో పరిశీలనపై స్పష్టత ఇవ్వని సంక్షేమ శాఖలు
- ఆన్‌లైన్ దరఖాస్తులకు సంబంధించి పలు చోట్ల అందని మాన్యువల్ కాపీలు
- మరోవైపు మాన్యువల్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయని అధికారులు
- దీంతో దరఖాస్తుల పరిశీలనపై మండల స్థాయిలో తర్జనభర్జన

సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో తలపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల పరిశీలనపై తీవ్ర గందరగోళం నెలకొంది. క్షేత్రస్థాయిలో దరఖాస్తుల స్వీకరణ గత నెల 14వ తేదీ సాయంత్రంతో ముగిసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు సంబంధించి 16.26 లక్షల దరఖాస్తులు అందినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. కానీ ఈ దరఖాస్తుల పరిశీలనపై ఇప్పటివరకు ఆయా సంక్షేమ శాఖల నుంచి స్పష్టత లేదని తెలుస్తోంది. రాజీవ్ యువవికాసం పథకం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా మండల, మున్సిపల్ స్థాయిలో దరఖాస్తుల పరిశీలన చేపట్టాలి. అయితే ఈ పరిశీలనను ఏవిధంగా చేపట్టాలి, కేటగిరీల వారీగా నిబంధనలు, మండలాల వారీగా లక్ష్యాలకు సంబంధించిన సమాచారమేదీ లేదు. దీంతో దరఖాస్తుల పరిశీలన అయోమయంలో పడింది. మరోవైపు వచ్చే నెల 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లబ్ధిదారులకు మంజూరీ పత్రాలు అందించాలని ప్రభుత్వం సన్నద్ధమవుతుండగా.. ఇప్పుడు పరిశీలన ప్రక్రియే ముందుకు సాగకపోవడం గమనార్హం.

రెండు రకాలుగా దరఖాస్తులు..

రాజీవ్ యువ వికాసం పథకం కింద రెండు విధాలుగా ప్రభుత్వానికి దరఖాస్తులు అందాయి. ఆన్‌లైన్ పద్ధతిలో ఓబీఎంఎంఎస్ ద్వారా కొందరు దరఖాస్తు చేసుకోగా, మరికొందరు ప్రజాపాలన కేంద్రాల ద్వారా మాన్యువల్ పద్ధతిలో దరఖాస్తులు ఇచ్చారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ.. అందుకు సంబంధించిన పత్రాలను మాన్యువల్‌గా అధికారులకు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ చాలాచోట్ల మెజార్టీ దరఖాస్తుదారులు వీటిని అధికారులకు అప్పగించలేదు. అదేవిధంగా మాన్యువల్ పద్ధతిలో వచ్చిన దరఖాస్తులను సైతం కంప్యూటరీకరించలేదు. దీంతో దరఖాస్తులను ఎలా పరిశీలించాలనే అంశంపై క్షేత్రస్థాయి అధికారుల్లో తికమక ఏర్పడింది. ముందుగా ఆన్‌లైన్ దరఖాస్తులు పరిశీలించాలంటే వాటిని ప్రింట్‌అవుట్ తీసి పరిశీలన చేయాలి. కానీ అందుకు సంబంధించిన వనరులు క్షేత్రస్థాయిలో లేవని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా మాన్యువల్‌గా వచ్చిన వాటిని ఆన్‌లైన్ చేసే విషయంలోనూ ఎలాంటి ఆదేశాలు లేవని తెలుస్తోంది.

లక్ష్యాలపైనా గందరగోళం..

2025–26 వార్షిక సంవత్సరం బడ్జెట్‌లో రాజీవ్ యువ వికాసం పథకానికి రూ.6 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా దాదాపు 4 లక్షల మందిని ఎంపిక చేసి వారికి ఆర్థిక సాయాన్ని అందించనుంది. ఈ పథకం కింద రాష్ట్రస్థాయి లక్ష్యాలను నిర్దేశించుకున్నప్పటికీ.. మండల, మున్సిపల్ స్థాయిలో లక్ష్యాలపై స్పష్టత లేదు. దీంతో దరఖాస్తులను పరిశీలించిన తర్వాత ఏయే కేటగిరీల్లో ఎంత మందిని ఎంపిక చేయాలనే విషయంపై స్పష్టత లేదని తెలుస్తోంది. ఈ దరఖాస్తుల పరిశీలనపై క్షేత్రస్థాయి అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని సమాచారం. ఇదిలావుండగా, వచ్చే నెల రెండో తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అర్హులకు మంజూరీ పత్రాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే పరిశీలన ప్రక్రియే ముందుకు సాగకపోవడంతో నిర్దేశించిన గడువులోగా మంజూరీ పత్రాల పంపిణీ ఎలా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

వర్కింగ్ ఉమెన్స్ కోసం వసతి గృహాలు

హైదరాబాద్ మహానగర పరిధిలో 15 హాస్టళ్ల ఏర్పాటు
- కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర మహిళాభివృద్ధి శాఖ నిర్మాణం
- ఇప్పటికే పలు చోట్ల స్థలాల గుర్తింపు
- కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన రాష్ట్రం
- కేంద్రం ఆమోదించిన వెంటనే నిర్మాణాలకు ప్రణాళికలు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగాలు చేస్తున్న మహిళలకు ఆశ్రయం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేస్తోంది. ప్రధానంగా హైదరాబాద్ మహానగరంలోని కంపెనీల్లో పెద్ద ఎత్తున మహిళలు పని చేస్తున్నారు. సుదూర ప్రాంతాలకు చెందిన చాలా మంది మహిళలు ఇక్కడ ఉద్యోగం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సొంత ప్రాంతాల్లోని కుటుంబాలను వదిలి ఉపాధి కోసం వస్తున్న వారికి మంచి వసతి కల్పించాలనే లక్ష్యంతో ఈ వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అందుబాటులోకి తెస్తోంది. ప్రస్తుతం కొత్తగా 15 హాస్టళ్లను నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేసింది. హైదరాబాద్‌తో పాటు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో వీటిని నిర్మిస్తారు. ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లను భూ లభ్యత కోసం వివరాలు కోరగా.. వారు అవసరమైన సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. ఈ 15 హాస్టళ్లలో కనీసం 5,150 మందికి వసతి కల్పిస్తారని తెలుస్తోంది.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో..

రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ నిర్మించతలపెట్టిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణానికి నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సఖినివాస్ పథకం కింద ఇప్పటికే రూ.202.68 కోట్లు కేటాయించింది. సఖినివాస్ నిధులతోనే వీటిని పూర్తిస్థాయిలో నిర్మించనున్నారు. ఖైరతాబాద్-1, ఖైరతాబాద్-2, షేక్‌పేట, ఆసిఫ్‌నగర్, ఉప్పల్, దుండిగల్, గాజులరామారం-1, గాజులరామారం-2, కూకట్‌పల్లి, బుద్వేలు, మాదాపూర్, నానక్‌రామ్‌గూడ, మోకిల, బాగ్ హయత్‌నగర్, మునగనూరు, సరూర్‌నగర్‌లో కొత్తగా హాస్టళ్లను నిర్మించేందుకు స్థలాలను గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. కేంద్రం ఆమోదం లభించిన వెంటనే మహిళాభివృద్ధి శాఖ వీటికి టెండర్లు పిలిచి, నిర్మాణాలను వేగవంతం చేయనుంది. ఈ ఏడాది చివరికల్లా వీటిని అందుబాటులోకి తెచ్చేలా రాష్ట్ర మహిళాభివృద్ధి శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది.





సర్వసాధారణంగా, మన సంతోషం పదింట తొమ్మిదొంతులు కేవలం మన ఆరోగ్యం మీద ఆధారపడి ఉంటుంది.

– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి

మంగళవారం, 13 మే 2025

దృఢనిశ్చయం

ప్రధాని నరేంద్ర మోదీ ఎలాంటి శషభిషలూ లేకుండా కుండబద్దలు కొట్టారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ వాణిజ్యం అంటే కుదరదని, ఉగ్రవాదానికి ఊతమిస్తూ నీళ్లు కావాలంటే చెల్లదని, ఉగ్రవాదానికి అండదండలందిస్తూ చర్చలంటే అంగీకరించబోమని, అణు బెదిరింపులు తమను భయపెట్టలేవని మోదీ పంపిన సందేశంతోనైనా పాకిస్తాన్ ఇకపై బుద్ధెరిగి ప్రవర్తించాలి. జాతినుద్దేశించి సోమవారం ఆయన చేసిన ప్రసంగం ఆద్యంతమూ కశ్మీర్ విషయంలో పాక్ తీరుతెన్నులపై భారత్ వైఖరిలో వచ్చిన మార్పునకు అద్దం పట్టింది. ఒక కొత్త క్రమం బయల్దేరిందన్న సంకేతాన్నిచ్చింది. ఇకపై ఉగ్రవాదులనూ, వారికి సాయం చేసే ప్రభుత్వాన్నీ వేర్వేరుగా పరిగణించబోమని ఆయన ప్రకటించటం ఒక్క పాకిస్తాన్ మాత్రమే కాదు...ప్రపంచ దేశాలన్నీ గమనించాల్సిన అత్యంత కీలక అంశం. కాల్పుల విరమణ తాత్కాలిక దశేనని, ఉగ్రవాదం శిరసెత్తినప్పుడల్లా 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతూనే వుంటుందని మోదీ చెప్పటం గమనార్హం. ఉగ్రవాదం విషయంలో అమెరికా నిర్లిప్తంగా ఉంటున్నది. 2001లో తమ దేశంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు 'ఉగ్రవాదంపై యుద్ధం' పేరిట ప్రపంచంలో ఎక్కడున్నా ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తామని ప్రకటించిన అమెరికా... కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్తాన్‌ను ఎప్పటికప్పుడు వెనకేసుకొస్తోంది. మొన్నటికి మొన్న పాక్‌కు ఐఎంఎఫ్ అప్పు పుట్టడంలో యథోచితంగా సహకరించింది. దాని చీకటి వ్యవహారాలు తెలియనట్టే ప్రవర్తిస్తూ ఎప్పటికప్పుడు నిధులూ, ఆయుధాలూ ఉదారంగా అందిస్తోంది. ఈ నేపథ్యంలోనే 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతుందని మోదీ ప్రకటించాల్సి వచ్చింది. దారుణ ఉదంతాలు జరిగినప్పుడల్లా ఏదో కారణం చూపి పాకిస్తాన్‌ను గట్టెక్కిస్తున్న దేశాలు ఇకముందు దీన్ని గమనించుకోక తప్పదు.

ఎంతటి క్లిష్టసమయాల్లోనైనా పట్టువిడుపులు ప్రదర్శించటంలోనే పరిణతి వ్యక్తమవుతుంది. 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్తాన్‌లోని ఉగ్రమూకల స్థావరాలను ధ్వంసం చేయటంలోనూ, అక్కడి సైన్యం ప్రతిఘటనను తిప్పికొట్టడంలోనూ తెగువనూ, సాహసాన్నీ చూపిన భారత్... లక్ష్యసాధన పూర్తికాగానే కాల్పుల విరమణకు కూడా సిద్ధపడి తన పరిణతిని తెలియజెప్పింది. కానీ విఫల రాజ్యం అనే పేరును సార్థకం చేసుకుంటూ కాల్పుల విరమణకు ఒప్పుకున్నట్టే ఒప్పుకుని ఆ వెంటనే ఉల్లంఘించి పాక్ తన నైజాన్ని చాటుకుంది. ఆ దేశంలో రాజకీయ నాయకత్వానికీ, సైన్యానికీ ఎప్పుడూ సరైన సంబంధాలు ఉండవన్నది ప్రపంచానికి తెలిసిన సత్యం. కానీ సైనిక దళాలు సైతం ముఠాలుగా చీలివున్నాయని, వాటిపై ఎవరికీ అదుపులేదని తాజా పరిణామాలు నిరూపించాయి. ఈ నిజాన్ని గ్రహించకుండా, పాకిస్తాన్‌కు చీవాట్లు పెట్టకుండా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అణు యుద్ధాన్ని నివారించామని స్వోత్కర్షకు పోవటం... భారత్, పాక్‌లను ఒకే గాటన కట్టడం ఆశ్చర్యకరం. పాకిస్తాన్ చర్యల పర్యవసానం తమ వరకూ రానేరాదన్న భ్రమేదో ఆయనకున్నట్టుంది. కానీ ఉగ్రవాదాన్ని దుంపనాశనం చేయకపోతే అది ఏ దేశాన్నీ విడవకుండా మింగేస్తుందని ట్రంప్ గ్రహించటం అవసరం. ఉగ్రముఠాలను ప్రోత్సహించి ఊచకోతలను సాగిస్తున్న దేశాన్ని ఎవరైనా ఎలా ఉపేక్షించగలరు? దాని దగ్గర అణ్వాయుధాలున్నాయనీ, అది ముప్పు కలిగిస్తుందనీ... కనుక నోర్మూసుకు పడివుండాలనీ ట్రంప్ చెప్పదల్చుకున్నారా? వాణిజ్యాన్ని ఆపేస్తానని బెదిరించటంవల్ల రెండు దేశాలూ దారికొచ్చి కాల్పుల విరమణకు ఒప్పుకున్నాయని ఆయన అనటం కూడా అత్యంత అభ్యంతరకరమైంది. ఇలాంటి తర్కంతో ప్రోత్సహిస్తున్నదెవరినో గమనించుకుంటున్నారా?

తాను ప్రపంచ దేశాలతో అధిక సుంకాల పేరిట యుద్ధం సాగిస్తున్నారు. గాజాలో ఇజ్రాయెల్‌ను నియంత్రించటం లేదు. అక్కడి మారణకాండను ఆపటం లేదు. మరి భారత్–పాక్ విషయంలో ఇంత ఆత్రుత దేనికో? ఎవరూ కోరకుండానే కశ్మీర్ సమస్యలో వేలెడతానని ఆయన తనకు తానుగా ఎలా చెప్పుకుంటారు? 2019లో సైతం ట్రంప్ ఇవే తరహా మాటలు మాట్లాడారు. ఆ తర్వాత జ్ఞానోదయమై ఆ సమస్యను రెండు దేశాలూ చర్చించి పరిష్కరించుకుంటాయని స్వరం మార్చారు. మళ్లీ ఇప్పుడేమైంది? తాజా ఘర్షణలకు మూలం ఎక్కడున్నదో ఆయన గ్రహించలేకపోయారని ట్రంప్ మాటలు గమనిస్తే తెలుస్తుంది. పహల్గామ్‌లో 26మంది పర్యాటకుల్ని పొట్టనబెట్టుకున్న ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'ని ప్రారంభించింది. పాక్‌లోని 24చోట్ల ఉగ్రముఠాల స్థావరాలను ధ్వంసం చేసింది. వందమంది ఉగ్రవాదుల్ని మట్టుబెట్టింది. కశ్మీర్‌లో ఉగ్రవాదులు చేసిన దాడికిది ప్రతీకారమే తప్ప కశ్మీర్ సమస్య పరిష్కారాన్ని ఉద్దేశించి మొదలెట్టిన దాడులు కాదు.

అమెరికాకు చిత్తశుద్ధి ఉంటే ఉగ్రవాదులకు ప్రోత్సాహం అందించినంతకాలమూ తమ వైపుగా ఎలాంటి సాయమూ అందబోదని పాకిస్తాన్‌కు చెప్పాలి. ఆ దేశంతో సంబంధ బాంధవ్యాలు కొనసాగించే దేశాలపై కూడా ఆంక్షలుంటాయని ప్రకటించాలి. కానీ అందుకు విరుద్ధంగా ఆ దేశం కారణంగా నష్టపోతున్న భారత్‌నూ, దాన్నీ ఒకే గాటన కట్టడం ఎలాంటి సందేశం పంపుతుంది? ఇరు దేశాల మధ్యా చర్చలంటూ ఉంటే అది కేవలం పాక్ ఆక్రమిత కశ్మీర్‌పైనా, ఉగ్రవాదుల అప్పగింతపైనా మాత్రమే ఉంటాయని తన సందేశంలో మోదీ చెప్పటం ప్రశంసించదగ్గది. అమెరికా పోకడలు గమనిస్తే వర్తమాన ప్రపంచంలో ఎలాంటి న్యాయం అమలవుతున్నదో స్పష్టంగానే అర్థమవుతుంది. దశాబ్దాలుగా చీకాకు పెడుతున్న ఉగ్రవాద సమస్యపై మోదీ దృఢ నిశ్చయాన్ని ప్రకటించటం ఈ తరహా న్యాయాన్ని ప్రశ్నించటమే!

ముక్కలు చేయడమే మార్గం!

విశ్లేషణ



హర్ష కక్కడ్

క్రమం తప్పకుండా జరుగుతున్న భారీ ఉగ్రవాద దాడులు భారత్, పాకిస్తాన్ సంబంధాలను ఘోరంగా దెబ్బతీశాయి. సాధారణంగా, ప్రతి పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ పదవీకాలంలో కనీసం ఒక్కసారైనా ఇలాంటి దాడులు జరుగుతాయి. ఎక్కువకాలం సైనిక నాయకత్వ స్థానంలో ఉన్న వ్యక్తి, పౌర అధికారంపై మరింతగా నియంత్రణ సాధించాల్సిన అవసరం ఉందని భావించినప్పుడు లేదా అతని బలగాలు దేశంలో గౌరవాన్ని కోల్పోతున్నప్పుడు ఉగ్రవాద దాడులు చోటు చేసుకుంటాయి. భారతదేశం నుండి సైనిక ముప్పు ఉందన్న ప్రచారం కంటే పాకిస్తాన్ ప్రజలను మరేదీ కలిపి ఉంచదు. పైగా వరదలు, కరవులు, ఉగ్రవాద ఘటనలతో సహా పాకిస్తాన్‌లో జరిగే ప్రతిదానికీ భారతదేశంపైనే నిందలు మోపుతూ వస్తారు.

భారతదేశం మన పాకిస్తాన్‌ను నాలుగు ముక్కలు చేయాలని చూస్తోందనీ, దాన్ని రక్షించే ఏకైక శక్తి పాక్ సైన్యమే అనీ పాక్ ప్రజలకు తొలి నుంచీ నేర్పించారు. భారత్ సహన పరిమితిని దాటిన ప్రతి ఉగ్రవాద ఘటన తర్వాత, పాకిస్తాన్ సాధారణ వ్యాఖ్యలను పునరావృతం చేస్తుంటుంది. వారి మంత్రులు దీనిని భారతదేశం ప్రారంభించిన 'తప్పుడు' ఆపరేషన్ అని, లేదంటే ఇది కశ్మీర్ 'స్వాతంత్ర్య సమరయోధుల' పని అని గావుకేకలు పెడతారు. తమ గడ్డపైనే ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నామనే ఆరోపణను వారు నిరంతరం తిరస్కరిస్తారు. పైగా ఉగ్రవాదానికి అత్యంత ప్రభావితమైన దేశం తమదే అని వాపోతుంటారు. అయితే దాదాపు ప్రతి ప్రపంచ స్థాయి ఉగ్రవాద ఘటనకూ పాకిస్తాన్‌తో సంబంధం ఉందనీ, ఐక్యరాజ్యసమితి ప్రకటించిన ఉగ్రవాదులలో అత్యధికులు పాక్‌లోనే ఆశ్రయం పొందారనీ ప్రపంచానికి తెలుసు.

ఎన్నని సహిస్తాం?

కథ పునరావృతమవుతుంది. పైగా విసుగు పుట్టిస్తుంది. బహిరంగ అంతర్జాతీయ దర్యాప్తునకు పాక్ వైపు నుంచి ఎప్పుడూ హామీ ఉంటుంది, కానీ ఈ ప్రతిపాదనను ఎవరూ నమ్మరు. ముంబై ఉగ్రదాడి సూత్రధారులలో ఒకరైన తహవ్వుర్ రానాను అమెరికా ఇటీవలే భారతదేశానికి అప్పగించింది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కూడా ముంబై ఉగ్రవాద దాడులపై ఇంకా దర్యాప్తు చేయవలసి వస్తోంది. ఉగ్రవాద నాయకులపై పాకిస్తాన్ ఎప్పటికీ చర్య తీసుకోదు. ఎందుకంటే వారే పాక్ ప్రధాన ఆస్తులు. పహల్గామ్ ఉగ్రదాడిపై దర్యాప్తు కూడా దశాబ్దాలుగా నిగూఢంగా ఉండిపోతుంది. దావూద్ ఇబ్రహీమ్ ఉనికిని అది ఎల్లప్పుడూ ఖండిస్తూ వచ్చింది. అయినప్పటికీ ప్రతి ప్రపంచ సంస్థకూ పాకిస్తాన్‌లో అతని బహుళ నివాసాల గురించి తెలుసు. దీనికి విరుద్ధంగా, ప్రతీకారం తీర్చుకుంటామని ఇండియా బెదిరిస్తే, వారు అకస్మాత్తుగా తమ భూభాగంపై ఉగ్రవాద కార్యకలాపాలలో భారతదేశ ప్రమేయం ఉందని ఇష్టారాజ్యంగా అబద్ధాలాడతారు.



ప్రజల మద్దతు పొందాలనే ఆశతో, సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలుపుదల చేయడంపై భారతదేశాన్ని పాక్ బెదిరించడం ప్రారంభించింది. దాని ఆనకట్టలు భారతీయ రక్తంతో నిండిపోతాయని రెచ్చ గొట్టేంత వరకు వెళ్ళింది. చరిత్ర గమనిస్తే, భారత ప్రభుత్వాలు రావల్పిండిని నియంత్రించడంపై ప్రపంచ మద్దతు కోరుతూ పాకిస్తాన్ ఉగ్రవాద దాడులపై తీవ్ర విమర్శ చేస్తూ వచ్చాయి. కానీ అది ఎప్పుడూ పని చేయలేదు. దీనికి విరుద్ధంగా, తరచుగా విరామాలతో కూడిన ఉగ్రవాద దాడులకు పాక్ తలుపులు తీసింది. 2001 అక్టోబర్‌లో జమ్మూ–కశ్మీర్ శాసనసభపై దాడి, ఆ తర్వాత అదే సంవత్సరం డిసెంబర్‌లో పార్లమెంటుపై దాడి, 2002 సెప్టెంబర్‌లో అక్షరధామ్‌పై దాడి, 2003 ఆగస్టులో ముంబై బాంబు దాడులు, ఆ తర్వాత 2005 అక్టోబర్‌లో ఢిల్లీలో బహుళ బాంబు దాడులు, 2006 జూలైలో ముంబై రైలు దాడులు, 2008 నవంబర్‌లో ముంబైలో జరిగిన ఉగ్రవాద దాడి కొన్ని ఉదాహరణలు. బాలాకోట్‌పై జరిగిన దాడి తర్వాత మాత్రమే భారత్ సందేశం అంతటా వినిపించింది. కానీ సరిహద్దులు దాటి భారత్ చేసిన బాలాకోట్ సర్జికల్ దాడి కూడా పాకిస్తాన్‌ను నిరోధించడంలో విఫలమైంది. ఎందుకంటే భారత్ దాడిలో సంభవించిన ప్రాణనష్టాన్ని పాక్ దాచగలిగింది. కారణం... హతమార్చబడిన వారు ఉగ్రవాదులు!

పెద్ద మార్పు ఉండదు!

సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలుపుదల చేసిన ప్రభావం ఇస్లామాబాద్‌కు బాగా తెలుసు. వారి నాయకత్వాన్ని అది భయపెట్టింది. కానీ, ఇది అంతర్జాతీయ చట్టానికి విరుద్ధమని చెప్పడం తప్ప వారికి వేరే పరిష్కారం లేదు. భారతదేశం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించుకోవాలని వారు ఇక ఒప్పించలేరు. రెండు దేశాల మధ్య సంబంధాలు శాంతియుతంగా ఉండాలనే ముందస్తు షరతుపైనే ఈ ఒప్పందంపై సంతకం చేశారనేది వాస్తవం. మరోవైపున అఫ్గానిస్తాన్‌కు భారతదేశం సన్నిహితం కావడం పాకిస్తాన్‌లో ఆందోళనలను మరింత పెంచింది. ముఖ్యంగా పాకిస్తాన్ తన బలగాలను భారత సరిహద్దుకు తరలించినప్పుడల్లా బలోచ్ లిబరేషన్ ఆర్మీ, తెహ్రీక్ ఎ తాలిబన్ పాకిస్తాన్ ఈ అంతరాన్ని బాగా ఉపయోగించుకుంటాయి. అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వెంట పాకిస్తాన్ తన సైన్యాన్ని మోహరించి ఉంచినంత కాలం, వారి ఆర్థిక వ్యవస్థపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

అయితే భారత్ ఎదుర్కొంటున్న సమస్య ఏమిటంటే, అది ఏ సైనిక చర్య తీసుకున్నా, పెద్దగా మార్పు ఉండదు. పాక్‌లో కొత్త ఆర్మీ చీఫ్ వచ్చి తనవంతుగా ఏదైనా చేయాలని భావించే వరకు, పాకిస్తాన్ ఉగ్రవాదానికి తక్కువ స్థాయిలో మద్దతు ఇస్తూనే ఉంటుంది. తర్వాత, మరొక ఘటన జరుగుతుంది. కథ పునరావృతమవుతూ ఉంటుంది. పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాదం నుండి భారతదేశాన్ని రక్షించడానికి ఏకైక పరిష్కారం దాని బాల్కనైజేషన్ మాత్రమే (అంటే ఒక దేశం లేదా ప్రాంతాన్ని బహుళ చిన్న, శత్రు యూనిట్లుగా విభజించే ప్రక్రియ). దీని కోసం, పాకిస్తాన్ నుండి స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న సమూహాలకు భారతదేశం తన మద్దతును ఇవ్వాలి.

◆ ప్రతి పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ పదవీకాలంలో ఒక్కసారైనా ఇలాంటి ఉగ్రదాడులు భారతదేశం మీద జరుగుతాయి.

◆ సింధూ నదీ జలాల ఒప్పంద నిలుపుదల నిర్ణయాన్ని పునఃపరిశీలించుకోవాలని పాక్ ఇక ఒప్పించలేదు. రెండు దేశాల మధ్య సంబంధాలు శాంతియుతంగా ఉండాలనే ముందస్తు షరతుపైనే ఈ ఒప్పందంపై సంతకం చేశారనేది వాస్తవం.

◆ పాక్ ప్రాయోజిత ఉగ్రవాదం నుండి ఇండియాను రక్షించే ఏకైక పరిష్కారం పాక్‌ను ముక్కలు చేయడమే! పాకిస్తాన్ నుండి స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న సమూహాలకు భారత్ మద్దతు ఇవ్వాలి.

వ్యాసకర్త భారత సైన్యంలో రిటైర్డ్ మేజర్ జనరల్
('ద స్టేట్స్‌మన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

ఆంగ్లం మాట్లాడాల్సిందే!



మీరు యూకేలో బతకాలనుకుంటే, మీరు తప్పనిసరిగా ఇంగ్లిష్ మాట్లాడాలి. అది కామన్ సెన్స్, అందుకే మేము ప్రతి ప్రధాన వలస రూట్ల వ్యాప్తంగా ఆంగ్ల భాషా అవసరాలను పెంచుతున్నాం.

– కీర్ స్టార్మర్, యూకే ప్రధాని

వాళ్లు లేకుండానా!



ఒక దశలో సచిన్ టెండూల్కర్ లేని భారత క్రికెట్ టెస్ట్ జట్టును నేను ఊహించలేకపోయాను– దానికి అలవాటు పడటానికి చాలాకాలం పట్టింది. ఇప్పుడు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ జట్టులో ఉండరన్న వాస్తవం... ప్చ్!

– అజయ్ కామత్, నేత్ర వైద్యులు

చెప్పుకోలేకపోయాం



తామే యుద్ధంలో గెలిచినట్టు ప్రతి నగటు పాకిస్తానీయుణ్ణీ భ్రమలో ఉంచినట్టుగా పాకిస్తాన్ నుంచి వస్తున్న ఫీడ్‌బ్యాక్ సూచిస్తోంది. సమాచారం ఇవ్వడంలో ఇండియా తనను మెరుగుపరుచుకోవాలి!

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

అది కాదా జాతీయవాదం?



ఇండియా భౌగోళిక రాజకీయ అధికారం లేదా హోదా గురించి మాత్రమే భారతీయ ఎగువ మధ్య తరగతి పురుషులకు (వాళ్లనే అంకుల్స్ అని కూడా అంటారు) పట్టింపు ఉంటుందిగానీ, పేద భారతీయుల స్థితిగతులు ఎందుకు పట్టవు? పేదల గురించి పట్టించుకోకుండా నిన్ను నువ్వు జాతీయవాది అని ఎలా అనుకోగలవు?

– మాధవన్ నారాయణన్, జర్నలిస్ట్

మంచి నిర్ణయం



పాకిస్తాన్‌కు వెళ్లిపోకుండా ఇండియాలో ఉండాలని నిశ్చయించుకుని లౌకికవాదాన్ని నిలబెట్టిన మా తాతకు నేను కృతజ్ఞురాలిని. అక్కడ భ్రమలు వేరే స్థాయిలో ఉన్నాయి. భారతీయురాలినైనందుకు ఎప్పుడూ గర్విస్తాను.

– సనా హాష్మీ, ఇండియా–తైవాన్ డైలాగ్ కోఆర్డినేటర్

ఒకే మూడ్



మనం అలవర్చుకోగలిగే ఏకైక గొప్ప నైపుణ్యం ఏమిటంటే, మంచి మూడ్‌లో ఉండదగిన విషయాలు జరగకపోయినా కూడా మంచి మూడ్‌లో ఉండగలగటం.

– అలెక్స్ హార్మోజీ, ఆంత్రప్రెన్యూర్

ఇన్ బాక్స్

గుర్తుకొచ్చిన 'నాజీల' పాలన



ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా ఏకంగా ఒక ప్రముఖ పత్రికా ఎడిటర్ ఇంట్లోకి పోలీసులు దౌర్జన్యంగా చొరబడి సోదాలు చేయడం ఒకప్పటి హిట్లర్ నాజీల పాలనను ప్రజల కళ్లకు కట్టింది. ప్రజాభిప్రాయాన్ని నాణేనికి రెండో పక్క ప్రతిబింబించే ప్రధాన పత్రిక 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయ రెడ్డిపై ఇప్పటికే మూడు, నాలుగు కేసులు పెట్టిన చంద్రబాబు ప్రభుత్వం, తాజా ఘటన ద్వారా ఏకంగా ఆయన నైతిక స్థైర్యాన్నే దెబ్బతీసే ప్రయత్నం చేసింది. 'సాక్షి'పై వీలైనప్పుడల్లా విషం కక్కే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలోని పోలీసులు నాటి నాజీ సేనలను గుర్తు చేశారు. నాజీల పాలనలో పత్రికా స్వేచ్ఛ ఎలా ఉందన్న విషయాన్ని ఒకసారి గుర్తుచేసుకుంటే...

ప్రజాభిప్రాయాన్ని నియంత్రించే సాధనాలుగా...

అడాల్ఫ్ హిట్లర్ నాజీ పాలనలో (1933–1945), ప్రెస్ స్వాతంత్ర్యాన్ని పూర్తిగా అణచివేశారు. ప్రజాభిప్రాయాన్ని నియంత్రించడానికి పత్రికలను ప్రచార పరికరంగా ఉపయోగించారు. ప్రభుత్వ నిర్దేశాలను అనుసరించి అన్ని మీడియా, పత్రికలు, రేడియోలకు కఠిన నియంత్రణలు విధించారు. జర్మనీలోని అన్ని మీడియా సంస్థలు ప్రభుత్వ పార్టీకి అనుకూలంగా ఉండాల్సిందే. నాజీ ప్రభుత్వాన్ని ప్రోత్సహించడానికి, నిరసనలు నెమ్మదింపచేయడానికి మీడియానే సాధనంగా వినియోగించారు. నాజీలకు నిరసనలు తెలిపే పత్రికలను మూసివేశారు. వ్యతిరేక వార్తలను ప్రచురించడాన్ని పూర్తిగా నిషేధించారు. యూదులపై ద్వేషాన్ని ప్రేరేపించడానికి, ప్రజల మనస్సులో హిట్లర్, నాజీ పార్టీకి అనుకూల భావనను పెంపొందించేందుకు పత్రికలు పనిచేసేవి.

* ప్రతి పత్రికనూ జర్మనీ ప్రచార, ప్రజల బోధన మంత్రిత్వ శాఖ (రీచ్ మినిస్ట్రీ ఆఫ్ పబ్లిక్ ఎన్‌లైటెన్‌మెంట్ అండ్ ప్రాపగాండా) పరిధిలోకి తీసుకొచ్చారు. దీనిని జోసెఫ్ గోబెల్స్ (తప్పుడు ప్రచారానికి ప్రస్తుత నానుడి) నాయకత్వం వహించారు. స్వతంత్రంగా పనిచేసే పత్రికలు, విపక్ష పత్రికలను నిషేధించారు లేదా బలవంతంగా మూసివేశారు. నాజీ పార్టీ ఆమోదించిన సమాచారం మాత్రమే ప్రచురితం కావాలి. ఒక జర్నలిస్ట్ చట్టబద్ధంగా పని చేయాలంటే, రీచ్ ప్రెస్ చాంబర్‌లో సభ్యత్వం తప్పనిసరి.

* కమ్యూనిస్టు, సోషలిస్టు, యూదు, లిబరల్ పత్రికలు తొలుత నిషేధానికి గురయ్యాయి. హిట్లర్ లేదా నాజీ పార్టీపై చేసే ఏవైనా విమర్శలను దేశద్రోహం లేదా రాజద్రోహంగా పరిగణించేవారు. * పత్రికల నుంచి రేడియో, సినిమాలు, పిల్లల పుస్తకాల వరకు కూడా నాజీ ప్రచారంతో నిండిపోయేవి. * భావ ప్రకటనా స్వేచ్ఛ రద్దయ్యింది. జర్నలిస్ట్ ఎవరైనా ఉన్నారంటే నాజీ ప్రభుత్వానికి సహకరించాలి. లేదంటే జైలుకు పోవాలి. లేదంటే ప్రాణాలే పోగొట్టుకోవాలి. * జర్నలిస్టులు నిరంతరం భయంతో నిఘా నీడన బ్రతకాల్సి వచ్చేది. * ఒక మాటలో చెప్పాలంటే, నాజీ పాలన పత్రికలను ప్రజాభిప్రాయం ప్రతిబింబించడానికి మాధ్యమాలుగా కాకుండా, తమకు అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని మలిచే శక్తిమంతమైన ఆయుధంగా మార్చింది.

– ఎన్. భాస్కర్ ప్రసాద్, విజయవాడ

బహుజన సాధికారతకు మరో మెట్టు!

అభిప్రాయం



జూలూరు గౌరీశంకర్

ఇది బీసీల కాలం. ఇది బీసీ శతాబ్దం. ఇది బీసీ చైతన్యం వెల్లివిరుస్తున్న కాలం. దేశానికి స్వాతంత్ర్యం వస్తే బహుజనులకు ఏమిస్తారో చెప్పండని 150 ఏళ్ల క్రితమే మహాత్మా జ్యోతిబా పూలే వేసిన ప్రశ్నకు నేటికీ భారత పాలకులు సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు. దేశమంతా బీసీ చైతన్యం రాజుకుంటోంది. బీసీలు నిప్పుల కుంపట్లయి భగ్గుమంటున్నారు. దేశమంతా బీసీ కులగణన చేయాలని బీసీ సంఘాలు, సామాజిక ఉద్యమకారులు కోరు తున్నారు. అనేక రాష్ట్రాలు తమ తమ అసెంబ్లీలలో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించాయి. రామస్వామి పెరియార్ తమిళనాడులో జరిపిన అలుపెరుగని పోరాటాలకు గుర్తుగా బీసీలకు విద్య, ఉద్యోగ రిజర్వేషన్లలో 69 శాతం రిజర్వేషన్లు ఆ రాష్ట్రంల్లో అమలులోకి వచ్చాయి. జనతా పార్టీ 'బీపీ మండల్' కమిషన్ వేస్తే జనతాదళ్ పాలనలో ప్రధాని వీపీ సింగ్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తూ తీర్మానించారు. మండల్ కమిషన్ అమలులో జరిగిన ఘర్షణల అనంతరం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగానే పీవీ నరసింహారావు ప్రభుత్వం మండల్ సిఫారసులను అమలు చేసింది.



తమ జనాభా నిష్పత్తి ప్రాతిపదికన రిజర్వేషన్లు పొంది చట్టసభల్లోకి అడుగు పెట్టగలిగినప్పుడే బీసీలకు సంపూర్ణ న్యాయం వచ్చినట్లు, స్వాతంత్ర్యం లభించినట్లు అవుతుంది. బీసీ సామాజిక వర్గాలు సుదీర్ఘకాలం చేసిన పోరాటాలకు ఫలితం దక్కినట్లవుతుంది. ఇది జరగడానికి బీసీ కుల గణన చేయటం తొలిమెట్టు అవుతుంది. ఆ పనికి ఇంతకాలానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చినందుకు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, అన్ని బీసీ సామాజిక వర్గాలు ముక్తకంఠంతో అభినందిస్తున్నాయి. హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

దేశంలో రావాల్సిన విప్లవం ఏదైనా ఉంటే అది బీసీ విప్లవమే! పాలకులు చాలావరకు ఏదో ఒక రకంగా బీసీ చైతన్యాన్ని అణచివేసినవాళ్ళే. బీసీలకు పాలించే లక్షణాలు లేవనీ, వారిని ఏవో కొన్ని సంక్షేమ పథకాలను అనుభవించడానికే పరిమితం చేశారు. ఈ పెత్తందార్లు ఇప్పటికీ బీసీలు ఐక్యం కారని గట్టిగా నమ్ముతున్నారు. బీసీ ఐక్యతపై వీలు చిక్కినప్పుడల్లా దాడి చేస్తూ విభజించడానికే ప్రయత్నిస్తున్నారు. అయితే ఇపుడిపుడే అన్ని పార్టీలూ గొంతులు సవరించుకుని బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని అంటున్నాయి. దీనికి సమాంతరంగా బీసీల చైతన్యం పెరిగింది. బీసీ భావజాల ప్రచారాలు విస్తృతంగా జరుగుతున్నాయి. బాబా సాహెబ్ అంబేడ్కర్ అన్నట్లుగా అన్నింటికీ రాజ్యాధికారమే అసలు 'కీ'. దాన్ని పొందాలంటే తొలుత బీసీ కులగణన జరగాలి. ఈ దిశలో కేంద్రం ఒక అడుగు ముందుకు వేసింది.

ఇందుకు సానుకూలంగా సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నా... బీసీ కులగణన జరిపి చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు పొందేంత వరకు పదును తగ్గని బీసీ ఉద్యమాలను కొనసాగించవలసే ఉంటుంది. అప్పటిదాకా దేశానికి బీసీ జ్వరం పట్టవలసిందే. బీసీల జనాభా ఎంతో లెక్కప్రకారం తేల్చేదాకా విశ్రమించకుండా ఉండాలి. బీసీలు చట్టసభల్లో, విద్య, ఉద్యోగాల్లో తమ వాటా తాము పొందేంతవరకు నిరంతర చైతన్యంతో ముందుకు సాగాలి. బీసీలు, ఇందులో బాగా వెనుకబడిన ఎంబీ సీలు, సంచార, విముక్త జాతులందరికీ జనాభా దామాషా పద్ధతిలో సమ వాటా పొందినప్పుడే బీసీలకు నిజమైన స్వాతంత్ర్యం సిద్ధిస్తుంది. ఆ స్ఫూర్తితోనే బీసీల అవగాహన, ఉద్యమాలు ఎగిసి పడాలి. బీసీ విద్యావంతులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు విస్తృతంగా బీసీలలో అవగాహన కల్పించే పనికి మరింత ముమ్మర కృషి చేయాలి.

ప్రధానంగా బీసీ యువత ఈ బాధ్యతను భుజం మీద వేసుకోవాలి. నెత్తుటి చుక్క చిందించకుండా బీసీల సంపూర్ణ హక్కుల సాధన దిశగా బీసీ యువత కదలాలి. బీసీల సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించే ఉద్యమాలలో బీసీ యువత కీలక పాత్రధారి కావాలి. పలు పార్టీలుగా చీలిపోయిన బీసీలంతా ఒక్కతాటిపైకి వచ్చి నిలవాల్సిన సమయం ఆసన్నమైంది. బీసీల కులగణన జరిపి, స్థానిక సంస్థల నుంచి అసెంబ్లీ, పార్లమెంటుల్లో వారి వాటా వారు పొందేంత వరకు విశ్రమించకూడదు. బీసీ కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావుల ఐక్యత వర్ధిల్లే విధంగా ఉద్యమాలు జరగాలి. 'బీసీలం ఇక ఎంతమాత్రం పాలితులం కాదు పాలకులమ'ని నిరూపించేదాకా విశ్రమించ కూడదు. 'చట్టసభల్లో సమ ప్రాధాన్యం' అన్న ఏకవాక్య నినాదమే ప్రతి బీసీ స్వప్నం, లక్ష్యం కావాలి.

వ్యాసకర్త తెలంగాణ తొలి బీసీ కమిషన్ సభ్యులు

ఈ సేన – ఆ సేన

మంచి మాటలు వినటంలో ధృతరాష్ట్రుడికి మహత్తరమైన ఆసక్తి. వ్యాసుడైనా, భీష్ముడైనా, విదురుడైనా, సంజయుడైనా, పెద్దయినా, చిన్నయినా – ఎవరు చెప్పినా ఎంతో శ్రద్ధగా వింటాడు.

'కౌరవ పాండవులకు యుద్ధం జరగబోతున్నది కదా! ఈ రెండు పక్షాలలో దేని బలం ఎక్కువంటావు?' అని ఆయన ఒక సందర్భంలో తన ఆంతరంగిక కార్యదర్శి సంజయుడిని అడిగాడు.

'అది మీ అంత ఘనుడికి, నా అంత అల్పుడు అంచనా కట్టి చెప్పే విషయం కాదు. మీరు పిలిస్తే పలికే మీ తండ్రిగారూ, ధీశాలీ, సర్వజ్ఞులూ అయిన వేద వ్యాసుల వారిని అడిగితే బాగుంటుంది!' అన్నాడు ఉచితానుచితాలు తెలిసిన సంజయుడు.

జ్యోతిర్మయం

ఆలోచన బాగున్నదని, ధృతరాష్ట్రుడు తన తండ్రి గారిని స్మరించాడు. ఆయన వెంటనే వచ్చాడు. వస్తూనే, ధృతరాష్ట్రుడు అడగకముందే ఆయన అడగబోతున్నదేమిటో గ్రహించాడు. 'సంజయా! నువ్వు సమస్తం తెలిసిన వాడివి కదా, మీ రాజు గారి మనసులో ఉన్న ప్రశ్నకు నువ్వే జవాబు చెప్పు' అని సంజయుడినే ఆదేశించాడు. ఇక సందేహించకుండా సంజయుడు కుండ బద్దలు కొట్టాడు:

'ఆ సేనకు, ఈ సేనకు/ వాసి అడిగె దీవు నన్ను, వసుదేవ సుతుండు/ ఆ సేన గలడు; తత్సము /నీ సేనన్ చూపుమా, నరేశ్వర!, నాకున్ (నరేంద్రా)!' ఆ సేనకూ, ఈ సేనకూ తేడా ఏమిటి చెప్పమని నువ్వు నన్ను అడిగావు. ఆ సేనలో వాసుదేవుడున్నాడు. ఈ సేనలో ఆయనకు సమానమైన వాళ్ళెవరున్నారో నాకు చూపించు!

ఏమిటా వాసుదేవుడి గొప్పతనం అంటావా? ఆయనకు ప్రతిపక్షంలో పోరాడి శివుడూ, ఇంద్రుడూ కూడా ఓడిపోయారు. ఆయన ఎంత కష్టమైన కార్యమైనా, అవలీలగా సాధిస్తాడు. జన్మాంతరంలో నర, నారాయణులుగా ఉండి ఉన్న కృష్ణార్జునుల స్నేహం గొప్పది. అందుకే ఆయన ఎప్పుడూ అర్జునుడికి అండదండగా ఉంటాడు. శ్రీకృష్ణుడి చక్రాయుధంలో శక్తి, పాండవుల ఆయుధాలన్నింటిలోనూ సూక్ష్మరూపంలో వ్యాపించి ఉండి, వాళ్ళకు విజయాన్నిస్తుంది. ఇంతెందుకు? అడిగావు గనుక పాండవుల బలమేమిటో ఒక్క మాటలో చెప్తాను. ఎక్కడ సత్యం నడుస్తుందో, ఎక్కడ ధర్మం విలసిల్లుతుందో, ఆ వైపే కృష్ణుడుంటాడు. ఆయన ఎక్కడ ఉంటాడో, ఆ పక్షానికే జయం కూడా కలుగుతుంది. లోకాలన్నీ ఒకవైపు నిలిచి, మరొకవైపు శ్రీకృష్ణుడొక్కడూ నిలిస్తే కూడా, హరి పక్షం బలమే ఉత్కృష్టంగా నిలుస్తుంది. **యతః ధర్మః తతః కృష్ణః / యతః కృష్ణః తతః జయః.** ఆ సేనకూ, ఈ సేనకూ అదే తేడా!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.10.57 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** విశాఖ ఉ.8.02 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ప.12.26 నుండి 2.12 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.04 నుండి 8.56 వరకు, తదుపరి రా.10.49 నుండి 11.33 వరకు, **అమృత ఘడియలు:** రా.10.56 నుండి 12.42 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.33, **సూర్యాస్తమయం:** 6.18.

క్లుప్తంగా...

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


రాజు

జఫర్‌గఢ్: అప్పుల బాధతో ఓ రైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జనగామ జిల్లా జఫర్‌గఢ్‌లో ఆదివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఎస్సై రామ్‌చరణ్ కథనం ప్రకారం.. జఫర్‌గఢ్‌కు చెందిన కాల్వ రాజు (40) తనకున్న మూడెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెట్టుబడుల కోసం బ్యాంకులో రూ.1.50 లక్షల రుణంతోపాటు భార్య బంగారు నగలు తాకట్టు పెట్టి మరికొంత రుణం తీసుకున్నాడు. దిగుబడులు పెద్దగా రాకపోవడంతో తీసుకున్న అప్పులు రెట్టింపు అయ్యాయి. అప్పులు ఎలా తీరుస్తావంటూ కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రాజు, ఆదివారం ఉదయాన్నే ఇంటినుంచి వెళ్లి సాయంత్రం అయినా తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా అప్పటికే రాజు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి వెంకటయ్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య అనూష, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గొంతులో మటన్ ముక్క ఇరుక్కుని వ్యక్తి మృతి

రుద్రూర్: ఫంక్షన్‌లో భోజనం చేస్తుండగా గొంతులో మటన్ ముక్క ఇరుక్కుని ఒకరు మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సుద్దులం తండాలో చోటు చేసుకుంది. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం బొప్పాస్‌పల్లి గ్రామానికి చెందిన రుత్వన్ తారాసింగ్ (48) ఆదివారం సుద్దులం తండాలో ఓ ఫంక్షన్‌కు వచ్చాడు. భోజనం చేస్తుండగా గొంతులో మటన్ ముక్క ఇరుక్కుని వాంతులు చేసుకుని మృతి చెందాడు. మృతుడి భార్య యమునాబాయి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారులో ఊపిరాడక చిన్నారి దుర్మరణం


అక్షయ

కడ్తాల్: ఇంటి ఎదుట నిలిపిన కారులోఎక్కిన ఓ చిన్నారి ఊపిరాడక మృతిచెందింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మక్తమాధారంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆఖ్యారి యాదయ్యకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురు అక్షయ (5) ఆదివారం సాయంత్రం ఇంటి ఎదుట నిలిపిన కారులో ఎక్కి డోర్ వేసుకుంది. డోర్ తీయడం రాకపోవడంతో ఊపిరాడక కారులోనే మృతిచెందింది. చాలా సమయం గడిచినప్పటికీ పాప కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికిన తల్లిదండ్రులు కారులో పరిశీలించగా విగత జీవిగా కనిపించింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

ఉపాధి కరువై చేనేత కార్మికుడు ఆత్మహత్య

- సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఘటన


బాల్‌రాజు

దుబ్బాక: ఉపాధి లేక ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో ఈ ఘటన జరిగింది. స్థానికుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు గొరిటాల బాల్‌రాజు (48) చేనేత సహకార సంఘంలో పని చేసేవాడు. కాలక్రమేణా వృత్తికి ఆదరణ తగ్గి, బాలరాజుకు పని లేకుండా పోయింది. దొరికిన దగ్గర కూలీ పనులు చేస్తున్నాడు. భార్యా, పిల్లలు ఉపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమైన బాల్‌రాజు సోమవారం సాయంత్రం ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ గంగరాజు తెలిపారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారాన్ని(ఆర్‌ఎఫ్‌సీఎల్) ఈ నెల 6వ తేదీన మూసివేశారు. ప్లాంట్‌లో వార్షిక మరమ్మతుల కారణంగానే షట్‌డౌన్ చేశారు. మరమ్మతులకు 30 నుంచి 45 రోజుల సమయం పట్టే అవకాశముంది. వాస్తవానికి ఏటా ఏప్రిల్ మొదటి వారంలో ప్లాంట్ షట్‌డౌన్ చేసి పనులు నిర్వహిస్తారు. ఏప్రిల్ చివరలో ఉత్పత్తి పునరుద్ధరిస్తారు. కానీ, ఈసారి మే మొదటి వారంలో షట్‌డౌన్ చేయడంతో వర్షాకాలానికి సకాలంలో యూరియా సరఫరా చేయడంలో అంతరాయం ఏర్పడే అవకాశముంది.

మరమ్మతులతో యూరియా కొరత?

పూర్తి వివరాలు : సాక్షి ప్లస్‌లో


నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం వద్ద మిస్ వరల్డ్ పోటీదారులు

బుద్ధవనంలో సౌందర్య ధ్యానం..

- ప్రపంచ సుందరి పోటీదారుల పర్యటన
- ఫొటోషూట్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి


ధ్యానం చేస్తున్న సుందరీమణులు

నాగార్జునసాగర్: ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొంటున్న సుందరీమణులు సోమవారం నాగార్జునసాగర్‌లో సందడి చేశారు. నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో సోమవారం నిర్వహించిన బుద్ధ పూర్ణిమ వేడుకలకు మిస్ వరల్డ్ ఓసియానా గ్రూప్–4లోని 22 దేశాల సుందరీమణులు హాజరయ్యారు. హైదరాబాద్ నుంచి సాయంత్రం 5 గంటలకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థకు చెందిన విజయవిహార్ అతిథిగృహానికి చేరుకున్నారు. వారికి పర్యాటక శాఖ, రెవెన్యూ అధికారులు స్వాగతం పలికారు. విజయవిహార్ వెనుకభాగంలోని పార్కులో ఫొటోలకు పోజులిచ్చారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీపర్వతారామంలోని బుద్ధవనానికి చేరుకున్నారు. ముందుగా బుద్ధుడి పాదుకల వద్ద పుష్పాంజలి ఘటించి పూజలు చేశారు. మహాస్తూపం వద్ద వీరికి తెలంగాణ గిరిజన మహిళలు నృత్య ప్రదర్శనతో స్వాగతం పలికారు. 6.42 గంటలకు వారికి శిల్పాలను చూపిస్తూ ఆర్కియాలజిస్టు శివనాగిరెడ్డి బుద్ధవనం ప్రాముఖ్యత, బుద్ధుడి జననం నుంచి నిర్యాణం వరకు జరిగిన సంఘటనలు, తెలంగాణకు బౌద్ధమతంతో గల సంబంధం తదితర అంశాలను వివరించారు. మహాస్తూపంలోని పంచ ధ్యానబుద్ధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి అంజలి ఘటించారు. అనంతరం అక్కడే కొద్దిసేపు ధ్యానం చేశారు. రాత్రి 7.08 గంటలకు బుద్ధ జయంతి కార్యక్రమాలలో భాగంగా బౌద్ధ భిక్షువులు నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం జాతకవనంలో కళాకారులు బుద్ధుడి చరిత్రను తెలియజేసే నృత్య ప్రదర్శన నిర్వహించారు. ప్రముఖుల సమావేశంలో పాల్గొన్న అనంతరం డిన్నర్ చేశారు. ఆ తర్వాత హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఎంసీ.కోటిరెడ్డి, శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు కుందూరు జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఐఏఎస్ అధికారి లక్ష్మి, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, ఏఎస్పీలు రమేశ్, మౌనిక, ఆర్డీఓలు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి కేంద్రంగా గంజాయి ప్రాసెసింగ్

- కిలోల కొద్దీ గంజాయి ప్రత్యేక ప్యాకింగ్
- కీలక ఆధారాలతో కూడిన వీడియోలు సేకరించిన ఎక్సైజ్‌శాఖ

సాక్షి, హైదరాబాద్: ఒడిశాలోని మల్కన్‌గిరి కేంద్రంగా కొన్ని ముఠాలు గంజాయి ప్రాసెసింగ్ చేస్తున్నట్టు ఎక్సైజ్‌శాఖ కీలక ఆధారాలు సేకరించింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో పండిస్తున్న గంజాయి అంతా మల్కన్‌గిరి అటవీ ప్రాంతానికి తరలిస్తున్న ముఠాలు.. అక్కడే ఎండబెట్టి, ప్రత్యేక పద్ధతుల్లో ప్రాసెస్ చేస్తున్నట్టు ఆధారాలు లభించాయి. మల్కనగిరి నుంచి గంజాయిని హైదరాబాద్‌కు రవాణా చేస్తున్న ఓ ముఠాను అరెస్టు చేయగా, అసలు విషయం వెలుగుచూసింది.

- ఉప్పల్ హెచ్‌సీఎల్ మల్లాపూర్‌లో జరిపిన సోదాల్లో ఎక్సైజ్ సిబ్బందికి చిక్కిన నిందితులు వివేక్‌రెడ్డి, మధుకిరణ్‌ల ఫోన్లలో ఈ మేరకు కీలక వీడియోలు లభించాయి. వీటిల్లో టన్నుల కొద్ది గంజాయిని కుప్పగా పోసి కొందరు వాటిని ప్యాకింగ్ చేస్తూ..గంజాయి రవాణా గురించి మాట్లాడుకుంటున్నట్టు ఉంది. గంజాయి ముఠా కార్యకలాపాలను క్షుణ్ణంగా వివరించే ఇలాంటి వీడియోలు దర్యాప్తు బృందాలకు చిక్కడం ఇదే తొలిసారి అని మల్కాజ్‌గిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు.


స్వాధీనం చేసుకున్న గంజాయి వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ సయ్యద్ ఖురేషి

ప్రాసెసింగ్ నుంచి ప్యాకింగ్ దాకా

అటవీ ప్రాంతంలో సేకరించిన గంజాయిని ఎండబెట్టిన తర్వాత అంతా ఒక్కచోటకు తెస్తారు. కుప్పలుగా పోసి..దానిని కిలోల చొప్పున అవసరం మేరకు ఎన్ని కిలోల ప్యాకెట్లు కావాలంటే అంత బరువు తూచి ఒక కవర్‌లో పెడతారు. ఈ కవర్లను చతురస్రాకార డబ్బాల్లో కూర్చి వీలైనంత వరకు ముద్దగా మార్చుతున్నారు. ఆ తర్వాత ఆ చతురస్రాకార బాక్స్‌ల్లోని గంజాయిని ప్రెసింగ్ రాడ్ కింద పెట్టి పదిమంది తిప్పుతూ వీలైనంత మేరకు తక్కువ పరిమాణంలో కనిపించేలా ముద్దలా అయ్యేలా చేస్తున్నారు. దీనిపై ప్లాస్టర్‌తో సీల్ చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల బరువు ఎక్కువగా ఉన్నా.. ప్యాకెట్ సైజు కుదించబడడంతోపాటు, గంజాయి రవాణా సమయంలో వాసన రాకుండా చేస్తున్నారు. దీన్ని దళారులు, గంజాయి ముఠాలతో డీల్ చేసుకొని గుట్టుచప్పుడు కాకుండా భద్రాచలం, రాజమండ్రి మార్గాల్లో రోడ్డు మార్గంలో, లేదంటే ఒడిశాలోని భువనేశ్వర్ నుంచి రైలు మార్గంలో దేశంలోని పలు పట్టణాలు, ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాయి.

రూ.53 లక్షల విలువైన గంజాయి సీజ్

మల్లాపూర్‌లోని హెచ్‌సీఎల్ ప్రాంతంలోని ఓ గోదాంలో 106 కిలోల గంజాయిని ఎక్సైజ్‌శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.53 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆబ్కారీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్, మల్కాజ్‌గిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ కుమార్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ కేసులో గంజాయి సరఫరా ముఠాకు చెందిన దగ్గుమల్లి మధు కిరణ్ , కట్ల వివేక్‌రెడ్డిలను అరెస్టు చేయగా, ఏ–1 మల్కన్‌గిరి జిల్లాకు చెందిన రాంబాబు పరారీలో ఉన్నట్టు తెలిపారు.

18న పీఎస్‌ఎల్‌వీ సీ-61 ప్రయోగం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈనెల 18న ఉదయం 6.59 గంటలకు పీఎస్‌ఎల్‌వీ సీ61 ప్రయోగాన్ని నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (రీశాట్–1బీ)ను ప్రయోగిస్తున్నారు. ఈ ఉపగ్రహంలో అమర్చిన సీ–బ్యాండ్ సింథటిక్ అపార్చర్ రాడార్ పగలు, రాత్రి వేళల్లోనే కాకుండా అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ భూమి ఉపరితలంపై అధిక రిజల్యూషన్ కలిగిన చిత్రాలను సంగ్రహిస్తుంది. ప్రస్తుతం భారత్–పాకిస్తాన్ మధ్య ఉన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఉపగ్రహం భారత సైన్యానికి అత్యంత ఉపయోగకరమైన సమాచారాన్ని అందించనుంది.

పూర్తిస్థాయి సమాచారం అందిస్తుంది

భారత సైన్యానికి కావాల్సిన పూర్తిస్థాయి సమాచారాన్ని ఈ ఉపగ్రహం అందిస్తుంది. ఉగ్రవాదుల శిబిరాలు, ఉగ్ర కార్యకలాపాలను కూడా అత్యధిక రిజల్యూషన్ కలిగిన చాయా చిత్రాలు తీయడమే కాకుండా సరిహద్దుల్లో శత్రు సైన్యాల కదలికల గురించి సమాచారాన్ని అందిస్తుంది. ఇందులోనే టెస్ట్ వెహికల్–డీ2 (టీవీ–డీ2) మిషన్‌ను రోదసిలోకి పంపిస్తున్నారు. అబార్ట్ దృశ్యాలను అనుకరించడానికి, గగన్‌యాన్ క్రూ ఎస్కేప్ సిస్టంను ప్రదర్శించడానికి దీన్ని రూపొందించారు.

వడదెబ్బతో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతు మృతి

- వేర్వేరు చోట్ల మరో ముగ్గురి మరణం

పెద్దవంగర/సుల్తానాబాద్: నాలుగురోజులుగా ధాన్యం అమ్ముకునేందుకు వడ్ల కొనుగోలు కేంద్రంలో పడిగాపులు పడిన ఓ రైతు తీవ్రమైన ఎండల వల్ల వడదెబ్బకు గురై అక్కడే మృతి చెందాడు. ఈ విషాద ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్ కథనం ప్రకారం.. పెద్దవంగర మండలం రామోజీ తండాకు చెందిన గుగులోత్ కిషన్ (60) యాసంగిలో పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు నాలుగు రోజుల క్రితం పోచంపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాడు. తేమశాతం అధికంగా ఉందని చెప్పటంతో ప్యాడీ క్లీనర్ సాయంతో వడ్లు తూర్పార పడుతూ సోమవారం ఎండ తీవ్రతతో ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన రైతులు వెంటనే సమీప గ్రామం గంట్లకుంటకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు బాలాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


పోచంపల్లి ఐకేపీ ధాన్యం కేంద్రంలో పడిపోయిన రైతు గుగులోత్ కిషన్

వడదెబ్బతో మరో ముగ్గురు మృతి

జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలం వడిచర్లకు చెందిన గండిపోష ఎల్లమ్మ (68) వడదెబ్బతో మృతి చెందింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని గడీమహల్‌కు చెందిన సముద్రాల మురళి (75) సోమవారం స్వగృహంలోనే వడదెబ్బకు కుప్పకూలిపోయాడు. స్థానిక డాక్టర్లు పరిశీలించి మృతిచెందినట్లు తెలిపారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన కంతుల ఉప్పలయ్య (75) కూడా వడదెబ్బతో చనిపోయాడు.

అన్నదాత మృతి సీఎం చేసిన హత్యే

- 'ఎక్స్' వేదికగా మాజీ మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: వరి ధాన్యపు కుప్పలపై వడదెబ్బకు గురై అన్నదాత మృతి చెందిన ఘటనకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని, ఇది సీఎం చేసిన హత్యేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు 'ఎక్స్'లో పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన గుగులోతు కిషన్ అనే రైతు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వడదెబ్బతో ప్రాణాలు కోల్పోయిన ఘటనపై కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. 'ఓవైపు సీఎం అందాల పోటీల్లో మునిగితేలుతుంటే, మరోవైపు వడదెబ్బకు తాళలేక ఓ రైతు ధాన్యపు కుప్పలపైనే ప్రాణాలు విడిచాడు. పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టి, రుణమాఫీ పేరిట మోసం చేసి, చివరికి పండించిన పంటను కొనుగోలు చేయనందునే రైతన్న అనాథలా మారాడు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో వారాల తరబడి పడిగాపులు పడుతున్నా పట్టించుకునే వారు లేరు. కిషన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి. కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ఏసీబీకి చిక్కిన సూర్యాపేట డీఎస్పీ, సీఐ

- ఓ వ్యక్తిని రిమాండ్ చేయకుండా ఉండేందుకు రూ.25 లక్షలు డిమాండ్
- రూ.16 లక్షలైనా ఇవ్వాలంటూ ఒత్తిడి


ఏసీబీకి పట్టుబడిన డీఎస్పీ, సీఐ

సూర్యాపేటటౌన్: సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి, పట్టణ సీఐ వీరరాఘవులు ఏసీబీకి చిక్కారు. ఓ కేసులో రిమాండ్‌కు పంపించకుండా ఉండేందుకు ఓ వ్యక్తి నుంచి రూ.25 లక్షలు డిమాండ్ చేసి.. రూ.16 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇద్దరూ ఆధారాలతో సహా ఏసీబీ అధికారులు సోమవారం పట్టుకున్నారు. రెండు గంటలకు పైగా చేసిన తనిఖీల్లో సరైన ఆధారాలు దొరకడంతో డీఎస్పీ, సీఐపై కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరు పర్చనున్నారు. దీనికి సంబంధించి ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌చందర్ తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట పట్టణంలో ఓ స్కానింగ్ సెంటర్‌ను నడిపిస్తున్న వ్యక్తిపై గత నెలలో సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆయన్ను రిమాండ్‌కు తరలించకుండా ఉండాలంటే రూ.25 లక్షలు ఇవ్వాలని సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి, సీఐ వీరరాఘవులు డిమాండ్ చేశారు. తాను అంత పెద్ద మొత్తంలో డబ్బు ఇచ్చుకోలేనని చెప్పడంతో రూ.16 లక్షలైనా ఇవ్వాలంటూ ఆ వ్యక్తిపై ఒత్తిడి చేశారు. ఆ ఒత్తిడిని తట్టుకోలేక బాధితుడు ఈ నెల మొదటి వారంలో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అతను ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి ఆధారాలు సేకరించారు. డీఎస్పీ, సీఐలపై గతంలోనూ పలు అవినీతి ఆరోపణలు ఉన్నట్టు తేలింది. కేసులో రిమాండ్ చేయకుండా ఉండటానికి, అతని స్కానింగ్ సెంటర్‌ను భవిష్యత్‌లో సక్రమంగా నడిపించడానికి డబ్బులు డిమాండ్ చేసినట్టు ఏసీబీ విచారణలో బట్టబయలైంది. పూర్తి ఆధారాలతో ఇద్దరిని కస్టడీలోకి తీసుకొని కార్యాలయాలు, ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సోదాల్లో డబ్బులు డిమాండ్ చేసినట్టు తేలడంతో డీఎస్పీ, సీఐలపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఏసీబీ అడిషనల్ ఎస్పీ కమలాకర్‌రెడ్డి, నల్లగొండ రేంజ్ ఏసీబీ టీం సభ్యులు పాల్గొన్నారు.

లంచం డిమాండ్ చేస్తే 1064కు ఫోన్ చేయండి

ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే చట్ట ప్రకారం చర్య తీసుకోవడానికి ఏసీబీ ఉంటుందని, లంచం డిమాండ్ చేస్తే వెంటనే 1064కు కాల్ చేయాలని డీఎస్పీ జగదీశ్‌చందర్ తెలిపారు.

ఉపాధి హామీ పనికెళ్తుండగా.. ఢీకొట్టిన కారు

- ఇద్దరు మహిళా కూలీలు అక్కడికక్కడే మృతి
- మరో మహిళకు గాయాలు

దుబ్బాక: ఉపాధి హామీ పనికెళ్తుండగా కారు ఢీకొట్టడంతో ఇద్దరు మహిళా కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట–భూంపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పోతారెడ్డిపేట గ్రామానికి చెందిన మహిళలు ప్రతిరోజూ మాదిరిగానే సోమవారం ఉదయం సిద్దిపేట–రామాయంపేట రహదారి వెంట ఉపాధి కూలీ పనికి వెళ్తున్నారు. ఇదే సమయంలో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నుంచి మెదక్ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి భ్యాగరి చంద్రవ్వ (45), గోప దేవవ్వ (48), బైండ్ల లాస్యను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రవ్వ, దేవవ్వ అక్కడికక్కడే మృతి చెందారు. లాస్యకు స్వల్పగాయాలు కాగా సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడే ఉన్న గ్రామస్తులు మృతదేహాలతో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి డీఆర్‌డీఓ పీడీ జయదేవ్ ఆర్య, ఆర్‌డీఓ సదానందం చేరుకొని మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని చెప్పారు. మృతుల కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరీశ్ తెలిపారు. డ్రైవింగ్ చేస్తున్న కారు యజమాని జ్ఞానసింగ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మహిళల మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


చంద్రవ్వ


దేవవ్వ

బయో మెడికల్ విద్యార్థినిపై లైంగిక దాడి


- ఇంటర్న్‌షిప్ కోసం హైదరాబాద్‌కు వచ్చిన జార్ఖండ్ యువతి
- మద్యం తాగించి స్నేహితుడితోపాటు మరో యువకుడి లైంగిక దాడి



అజయ్, హరి

నిజాంపేట్: హైదరాబాద్‌లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు జార్ఖండ్ నుంచి వచ్చిన ఓ యువతిపై ఇద్దరు యువకులు లైంగిక దాడి కి పాల్పడిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జార్ఖండ్ కు చెందిన యువతి (20) తమిళనాడులోని కలస లోకేషన్‌లింగం కాలేజీలో బయో మెడికల్ కోర్సు చదువుతోంది. అదే కాలేజీలో బాచుపల్లి హరితవనం కాలనీకి చెందిన అజయ్ (24) బీటెక్ చదువుతున్నాడు. దీంతో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఒక ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ చేయాలని యువతి నిర్ణయించుకుంది. దీంతో ఈ నెల 3న ఆమె హైదరాబాద్‌కు రాగా కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఆమెను అజయ్ ఉంచాడు. అదేరోజు సాయంత్రం పార్టీ చేసుకుందామని ఆమెను బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో ఉన్న తన స్నేహితుడు హరి ఇంటికి తీసుకెళ్లాడు. ముగ్గురు కలిసి అర్ధరాత్రి వరకు మద్యం సేవించిన అనంతరం అజయ్ యువతిపై లైంగిక దాడి చేశాడు. తర్వాత హరి కూడా యువతిపై లైంగిక దాడి చేయటానికి ప్రయత్నించగా యువతి కేకలు వేసింది. దీంతో చుట్టు పక్కలవారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం 4వ తేదీన అజయ్, హరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. యువతికి వైద్య పరీక్షలు నిర్వహించి సురక్షితంగా స్వస్థలానికి వెళ్లేందుకు సహాయం చేశారు. ఓ బైక్, మద్యం బాటిల్, ఇతర సామగ్రిని సీజ్ చేశారు.

నువ్వులేని లోకంలో నేనుండలేను కొడుకా..

- కుమారుడి మరణాన్ని తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య


నిఖిల్‌రావు


తిరుపతిరావు

తిమ్మాపూర్: 'కొడుకా.. నువ్వే గుర్తొస్తున్నావ్.. ఒక్కగానొక్క కొడుకని అపురూపంగా చూసుకున్నా.. చదువుకుంటా అంటే హైదరాబాద్ పంపిన. మాయదారి బెట్టింగ్‌లో రూ.లక్షలు పోగొట్టుకున్నా.. సరే బిడ్డా అని ధైర్యం చెప్పిన. అయినా మమ్మల్ని మోసం చేస్తివి. బెట్టింగ్‌కు బలై ఈ లోకాన్నే విడిచిపోతివి. నిన్ను మర్చిపోలేకపోతున్నా కొడుకా.. నీవు లేని లోకం నాకు వద్దు బిడ్డా'అంటూ.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో ఓ తండ్రి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మన్నెంపల్లి గ్రామానికి చెందిన తిరుపతిరావు(49) కొడుకు నిఖిల్‌రావు (21) ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు అలవాటుపడి రూ.లక్షల్లో అప్పు చేశాడు. అవి తీర్చలేక, మానసిక ఒత్తిడితో రెండు నెలల క్రితం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నిఖిల్ ఒక్కగానొక్క కొడుకు కావడంతో, అతని మృతిని తిరుపతిరావు తట్టుకోలేకపోయాడు. తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఆదివారం తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికులు వెంటనే అతన్ని హైదరాబాద్‌లోని ఒక ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం చనిపోయాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌తో కొడుకు.. అతని మరణం తట్టుకోలేక తండ్రి మరణించడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

టీజీసీఎస్‌బీ అంతర్రాష్ట్ర ఆపరేషన్.. 20 మంది అరెస్టు

- దేశవ్యాప్తంగా రూ.44.37 కోట్ల అనుమానాస్పద లావాదేవీల గుర్తింపు
- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల ఆట కట్టించడంలో భాగంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) గుజరాత్‌లో నిర్వహించిన అంతర్రాష్ట్ర ఆపరేషన్‌లో కీలక పురోగతి సాధించింది. సైబర్ నేరాలకు పాల్పడే వారికి మ్యూల్ బ్యాంకు ఖాతాలు (ఒకరి పేరిట ఉన్న బ్యాంకు ఖాతాను ఇతరులకు వినియోగించుకునేందుకు ఇవ్వడం) సరఫరా చేస్తున్న ఏజెంట్లు, మ్యూల్ బ్యాంకు ఖాతాల ద్వారా నగదు లావాదేవీల్లో సహకరిస్తున్న ముఠా గుట్టురట్టు చేసింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో గుజరాత్‌లోని సూరత్‌లో మే 1 నుంచి మే 10 వరకు ప్రత్యేక ఆపరేషన్‌లో 20 మందిని అరెస్టు చేసింది. వీరిలో 14 మంది మ్యూల్ ఖాతాదారులు, ఆరుగురు ఏజెంట్లు ఉన్నారు. పట్టుబడిన నిందితులకు తెలంగాణలో 60కి పైగా, దేశవ్యాప్తంగా 515 సైబర్ నేరాలతో సంబంధం ఉన్నట్టు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో పేర్కొన్న ప్రకారం..తెలంగాణలోని ఏడు సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా పలు అనుమానాస్పద నగదు ఉపసంహరణలు, చెక్కుల ద్వారా జరిగిన లావాదేవీలపై టీజీసీఎస్‌బీ అధికారులు ఫోకస్ పెట్టారు. ప్రాథమిక విచారణలో 27 మ్యూల్ ఖాతాల ద్వారా దేశవ్యాప్తంగా రూ.44.37 కోట్ల అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్టు తేలింది. తెలంగాణలోనే ఐదుగురు నిందితులు చెక్కుల ద్వారా రూ. 22,64,500 విత్‌డ్రా చేసుకున్నట్టు గుర్తించారు. అరెస్టయిన నిందితుల్లో ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, ఒక బ్యాంకు ఉద్యోగి (వాపీ శాఖకు చెందిన డీసీబీ బ్యాంకు రిలేషన్‌షిప్ మేనేజర్) ఉన్నారు. వీరు వ్యాపార, పెట్టుబడి మోసాలు, ట్రేడింగ్, పార్ట్–టైమ్ ఉద్యోగ సహా వివిధ సైబర్ మోసాల్లో పాల్గొన్నట్టు శిఖాగోయల్ తెలిపారు. అరెస్టు అయిన నిందితుల నుంచి 20 మొబైల్ ఫోన్లు, 28 సిమ్ కార్డులు, నాలుగు ఏటీఎం కార్డులు, ఐదు చెక్ బుక్‌లు, రెండు పాన్‌కార్డులు, రెండు రబ్బర్ స్టాంపులు, ఇతర నేర సంబంధిత డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. సూరత్ ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన డీఎస్పీలు ఫణీందర్, రంగారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు మహేందర్, రవికుమార్‌తోపాటు ఆపరేషన్‌కు సహకరించిన ఎస్పీ దేవేందర్ సింగ్, డీఎస్పీలు కేవీ సూర్యప్రకాశ్, హరికిషన్‌లను శిఖాగోయల్ అభినందించారు. సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పద లావాదేవీలు గుర్తిస్తే 1930 లేదా cybercrime.gov.inలో వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

అణుయుద్ధాన్ని ఆపాం: ట్రంప్

- భారత్, పాక్ మధ్య సయోధ్య కుదిర్చాం:
- ఇరువైపులా లక్షలాది మరణాలను నివారించాం
- వాణిజ్య తాయిలాలు పని చేశాయన్న అధ్యక్షుడు

న్యూయార్క్/వాషింగ్టన్: భారత్, పాకిస్తాన్ మధ్య అణుయుద్ధాన్ని అమెరికా నివారించిందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. సోమవారం వైట్‌హౌస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ''భారత ఉపఖండంలో కొద్ది రోజుల క్రితం చరిత్రాత్మక పరిణామాలు చోటుచేసుకున్నాయి. భారీ సంఖ్యలో అణ్వస్త్రాలున్న రెండు పొరుగు దేశాల మధ్య కొనసాగిన భారీ స్థాయి దాడులు ఎంతకూ ఆగేలా కన్పించలేదు. ఆ ప్రమాదకర ఘర్షణకు మా ప్రభుత్వ యంత్రాంగం ముగింపు పలికింది. కాల్పులను తక్షణం



విరమిస్తూ ఒప్పందానికి రావడంలో ఇరు దేశాలకూ సాయపడి శాశ్వత సంధి కుదిర్చింది'' అని చెప్పారు. ''ఘోరమైన అణుయుద్ధం జరిగి ఉండేది. లక్షలాది మంది మరణించేవారు. ఆ దారుణాన్ని నివారించినందుకు ఎంతగానో గర్వపడుతున్నా. ఇందుకు మా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా ఎంతో శ్రమించారు. భారత్, పాక్ కూడా పరిస్థితిని అర్థం చేసుకోవడంలో గొప్ప పరిణతి చూపాయి. నేను ఇరుదేశాల నాయకత్వంతో మాట్లాడాను. పరస్పర వైషమ్యాలకు తెర దించుకునే పక్షంలో రెండు దేశాలతో అమెరికా విస్తృత స్థాయిలో వాణిజ్యం చేపడుతుందని, లేదంటే లేదని చెప్పా. దాంతో యుద్ధాన్ని ఆపుతామని వాళ్లు చెప్పారు. అందుకు ఇతర కారణాలూ ఉన్నా మాతో వాణిజ్యమూ ఓ కారణంగా నిలిచింది. వాణిజ్యాన్ని గతంలో ఈ విధంగా ఉపయోగించిన నాయకులెవరూ లేరు'' అని చెప్పుకున్నారు. భారత్‌తో వాణిజ్య చర్చలను మరింత ముమ్మరం చేస్తున్నట్టు వివరించారు. కాల్పుల విరమణను తానే కుదిర్చానని శనివారం కూడా ట్రంప్ ప్రకటించడం తెలిసిందే. దాన్ని భారత్ తోసిపుచ్చింది. ''అది ద్వైపాక్షిక ఒప్పందం. ఇరుదేశాల డీజీఎంఓల స్థాయిలోనే కుదిరింది'' అని కేంద్ర ప్రభుత్వ వర్గాలు అప్పుడే స్పష్టం చేశాయి. కశ్మీర్ సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహిస్తానని కూడా ఆదివారం ట్రంప్ ప్రతిపాదించగా మోదీ సర్కారు నిర్ద్వంద్వంగా తిరస్కరించింది.



కరాచీ రేవుపై దాడి దృశ్యాలను సోమవారం మీడియా భేటీలో ప్రదర్శించిన డీజీఎంఓ

చూపింది శాంపిలే

మరో యుద్ధమే వస్తే ఆ కథే వేరు

- పాక్‌కు సైన్యం తీవ్ర హెచ్చరికలు
- ఉగ్రవాదులకు దన్నుగా పాక్ సైన్యం
- మర్చిపోలేని గుణపాఠం నేర్పాం
- కరాచీ ఎయిర్‌బేస్‌నూ ధ్వంసం చేశాం
- కూల్చేసిన జెట్లలో పాక్ మిరాజ్ కూడా
- దేశీయ ఎయిర్ డిఫెన్స్ దుమ్మురేపింది
- వెల్లడించిన సైనిక ఆపరేషన్స్ డీజీలు

న్యూఢిల్లీ: దాయాదికి మన సైన్యం మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ''పాక్ ఇప్పుడు చవిచూసిన తీవ్ర సైనిక నష్టాలు కేవలం శాంపిల్ మాత్రమే. మరోసారి యుద్ధమంటూ వస్తే అది పూర్తి భిన్నంగా, వాళ్లు ఊహించలేనంత తీవ్రంగా ఉంటుంది'' అని స్పష్టం చేసింది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎయిర్ ఆపరేషన్స్ (డీజీఏఓ) ఎయిర్ మార్షల్ ఏకే భారతి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ నావల్ ఆపరేషన్స్ (డీజీఎన్ఓ) వైస్ అడ్మిరల్ ఏఎన్ ప్రమోద్ సోమవారం మరోసారి మీడియాతో మాట్లాడారు. ''మన సైనిక వ్యవస్థలు, స్థావరాలు నిరంతరం అప్రమత్తంగా, పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నాయి. అవసరమైతే ఎలాంటి ఆపరేషన్లకైనా క్షణాల్లో రంగంలోకి దిగిపోతాయి'' అని ప్రకటించారు. ''మనం పోరాడింది కేవలం ఉగ్రవాదులతో. కానీ వారికి దన్నుగా పాక్ సైన్యం రంగంలోకి దిగడం శోచనీయం. ఆ దేశాన్ని ఎవరు నియంత్రిస్తున్నారో చెప్పేందుకు ఇంతకంటే మరో ఉదాహరణ అక్కర్లేదు'' అని డీజీఏఓ భారతి అన్నారు. మన వైమానిక దాడుల్లో కరాచీ సమీపంలోని మరో కీలక వైమానిక స్థావరం కూడా నేలమట్టమైందని ఆయన వెల్లడించారు. అయితే పాక్ తన అణ్వాయుధ, అణు కమాండ్ వ్యవస్థలను దాచి ఉంచినట్టు చెబుతున్న కిరానా హిల్స్‌పై తాము దాడులు చేయలేదని స్పష్టం చేశారు. దీనిపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పుకార్లేనన్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా కూల్చేసిన అత్యాధునిక పాక్ యుద్ధ విమానాల్లో ఒక మిరాజ్ కూడా ఉందని చెప్పారు. అనంతరం దాని తాలూకు శకలాల ఫొటోలను సైన్యం ఎక్స్‌లో షేర్ చేసింది.

ఆకాశ్.. హైలైట్

మనవి కాలపరీక్షకు తట్టుకుని నిలిచిన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలని డీజీఎంఓ రాజీవ్, డీజీఏఓ భారతి గుర్తు చేశారు. పాక్ దాడులను తిప్పికొట్టడంలో దేశీయంగా అభివృద్ధి చేసిన ఆకాశ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ హైలైట్‌గా నిలిచిందంటూ కొనియాడారు. ''నిరంతరాయంగా దూసుకొచ్చిన డ్రోన్లను ఆకాశ్, కాస్ వంటి దేశీయ రక్షణ వ్యవస్థలు అడ్డుకుని కూల్చేసిన తీరు మనకు గర్వకారణం. దశాబ్ద కాలంగా మన రక్షణ వ్యవస్థలు సాధించిన అద్భుత ప్రగతికి నిదర్శనం'' అని చెప్పారు. పాక్‌కు అతి కీలకమైన రహీంయార్ ఖాన్ వైమానిక స్థావరంలో జరిగిన విధ్వంసం తాలూకు వీడియో, ఫొటోలను ఈ సందర్భంగా విడుదల చేశారు. రాజస్తాన్ సరిహద్దుకు సమీపంలోని ఈ స్థావరంలో ఎక్కడ చూసినా భారీ గోతులే దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా రన్‌వేపై అతి భారీ గొయ్యి ఏర్పడింది. దాన్ని పూర్తిగా పూడ్చి సరిచేసేదాకా అక్కడ ఎలాంటి వైమానిక కార్యకలాపాలూ జరిగే అవకాశం లేదు. ఇవన్నీ మన దాడుల తాలూకు కచ్చితత్వానికి తిరుగులేని నిదర్శనాలని డీజీఏఓ భారతి చెప్పారు.

యోధుని నోట రాముని మాట

పాక్‌పై దాడులు తదితర వివరాలతో సీరియస్‌గా సాగుతున్న మీడియా భేటీలో డీజీఏఓ భారతి ఉన్నట్టుండి రామయణంలోని వారధి ఉదంతాన్ని ఉటంకించి ఆకట్టుకున్నారు. ''లంకకు వెళ్లేందుకు దారివ్వాలని మర్యాదగా కోరితే సముద్రుడు మూడు రోజులైనా స్పందించలేదు. భయపెట్టనిదే పనికాదంటూ రాముడు ఆగ్రహంతో కోదండం ఎక్కుపెట్టగానే తక్షణం కాళ్లబేరానికి వచ్చాడు'' అని చెప్పుకొచ్చారు. ఇందుకు సంబంధించి రామచరిత్ మానస్‌లోని 'వినయ్ న మానత్ జలధి...' పద్య పంక్తులను ఆశువుగా చెప్పి అలరించారు. ''నేనేం చెప్పదలచిందీ అర్థమైందిగా! తెలివైనవాడికి కనుసైగ చాలు'' అంటూ చమత్కరించడంతో అంతా నవ్వుల్లో మునిగిపోయారు. పాక్ నిరంతర కవ్వింపులు మనం గట్టిగా బదులివ్వక తప్పని పరిస్థితి కల్పించాయని ఆయన చెప్పుకొచ్చారు. ఆది, సోమవారాల్లో సైనిక డీజీల మీడియా బ్రీఫింగ్ సందర్భంగా కూడా రాయబార ఘట్టంలో కౌరవులకు కృష్ణుని హిత వచనాలు, హెచ్చరికలకు సంబంధించిన పద్యాలు, శివతాండవ స్తోత్రం తదితరాలను నేపథ్యంలో విన్పించడం విశేషం.



ఎయిర్ డిఫెన్స్‌కు క్రికెట్‌పరంగా భాష్యం

మన వైమానిక స్థావరాలను, సైనిక కేంద్రాలను లక్ష్యం చేసుకోవడం అత్యంత కష్టమని డీజీఎంఓ రాజీవ్ స్పష్టం చేశారు. పాక్ దాడుల వేళ మన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ఎంత శత్రు దుర్భేద్యంగా నిలిచిందో క్రికెట్ పరిభాషలో వివరించి అలరించారు. ''1970ల్లో జరిగిన ఓ యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా పేస్ బౌలింగ్ ద్వయం జెఫ్ థామ్సన్, డెన్నిస్ లిల్లీ ఇంగ్లండ్‌కు వణుకు పుట్టించింది. అయితే జెఫ్, లేకపోతే లిల్లీ అన్నట్టుగా సిరీస్ పొడవునా ఇంగ్లండ్ బ్యాటింగ్ లైనప్‌ను కకావికలు చేశారు. ఎస్-400 మొదలుకుని ఆకాశ్, కాస్, ఏడీ గన్స్ దాకా పలు శ్రేణులతో కూడిన మన ఎయిర్ డిఫెన్స్ కూడా అంతే. వాటిలో ఏదో ఒక వ్యవస్థ పాక్ వైమానిక దాడులను దీటుగా అడ్డుకుని పూర్తిగా తిప్పికొట్టింది'' అని చెప్పారు. సోమవారమే టెస్టుల నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ కోహ్లీ తన అభిమాన క్రికెటర్ అని చెప్పారాయన.



మళ్లీ డ్రోన్ల కలకలం

నేలమట్టం చేసిన భారత బలగాలు

చిన్న డ్రోన్లతో ఆందోళన చెందాల్సిన పనిలేదన్న సైన్యం

జమ్మూ/చండీగఢ్: కాల్పుల విరమణ ఒప్పందం సమగ్రస్థాయిలో అమలుకు భారత్ ప్రయత్నిస్తున్న వేళ సోమవారం రాత్రి మళ్లీ జమ్మూకశ్మీర్‌లోని సాంబా సెక్టార్‌లో అనుమానాస్పద డ్రోన్లు కలకలం సృష్టించాయి. వీటిని వెంటనే భారత భద్రతా బలగాలు నేలమట్టం చేశాయి. చిన్నపాటి డ్రోన్లతో ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆర్మీ అధికారులు స్పష్టంచేశారు. ఆవలి నుంచి అంతర్జాతీయ సరిహద్దు దాటి దూసుకొచ్చిన డ్రోన్లను ఆర్మీ డిఫెన్స్ గన్స్‌తో పేల్చేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో షేర్ అవుతున్నాయి. మే 8వ తేదీన సైతం ఇదే సాంబా సెక్టార్‌లో పాకిస్తానీ డ్రోన్లు రావడం, భారత బలగాలు పేల్చేయడం తెల్సిందే.

అమృత్‌సర్, హోషియార్‌పూర్‌లో బ్లాక్‌ఔట్

ముందుజాగ్రత్త చర్యగా పంజాబ్‌లోని అమృత్‌సర్, హోషియార్‌పూర్ జిల్లాల్లో సోమవారం స్థానిక యంత్రాంగం బ్లాక్‌ఔట్ ప్రకటించింది. ఈ జిల్లాల్లో సరిహద్దు సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేశారు. జలంధర్ పరిధిలోని ప్రాంతాల్లోనూ పాక్షికంగా బ్లాక్‌ఔట్‌ను అమలుచేశామని జలంధర్ డిప్యూటీ కమిషనర్ హిమాన్షు అగర్వాల్ తెలిపారు. పాకిస్తాన్‌తో పంజాబ్ 553 కి.మీ.ల మేర సరిహద్దు పంచుకుంటోంది. సోమవారం సైతం అమృత్‌సర్‌లో సైరన్ శబ్దాలు వినిపించాయి. కిటికీలు, తలుపులకు దూరంగా ఉండాలని అమృత్‌సర్ ప్రజలకు ఇప్పటికే సందేశాలు పంపించామని అమృత్‌సర్ డిప్యూటీ కమిషనర్ సాక్షి సాహ్నీ చెప్పారు. ముందుజాగ్రత్త చర్యగా అమృత్‌సర్, పఠాన్‌కోట్, ఫజిల్కా, ఫిరోజ్‌పూర్, తర్న్ తరన్ జిల్లాల్లోని సరిహద్దు ప్రాంతాల పాఠశాలలకు మంగళవారం కూడా సెలవు ప్రకటించారు. పఠాన్‌కోట్, అమృత్‌సర్ జిల్లాల్లో కళాశాలలు, విశ్వవిద్యాలయాలకూ మంగళవారం సెలవు ప్రకటించారు.



కశ్మీర్‌లోని సరిహద్దుల్లో పాక్ డ్రోన్లను కూల్చే పనిలో మన రక్షణ వ్యవస్థలు(ఎరుపు గీతలు)

మోహరింపుల తగ్గింపు!

మార్గాల పరిశీలనకు భారత్, పాక్ అంగీకారం • సైనిక చర్యకు తెర దించడంపై డీజీఎంఓల చర్చ

ఇస్లామాబాద్/న్యూఢిల్లీ: సరిహద్దుల వెంబడి బలగాల మోహరింపును కనీస స్థాయికి తగ్గించే అంశాన్ని పరిశీలించేందుకు భారత్, పాకిస్తాన్ అంగీకరించాయి. ఇరుదేశాల డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) మధ్య సోమవారం ఈ అంశంపై కీలక చర్చలు జరిగాయి. పాక్ డీజీఎంఓ మేజర్ జనరల్ కాషిఫ్ అబ్దుల్లా, భారత డీజీఎంఓ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ హాట్‌లైన్‌లో 45 నిమిషాలకు పైగా సంప్రదింపులు జరిపారు. సైనిక చర్యకు తెర దించే మార్గాలపైనా చర్చ జరిపారు. ఇరువైపుల నుంచీ ఒక్క తూటా కూడా కాల్చకుండా సంయమనం పాటించాలని గత భేటీలో తీసుకున్న నిర్ణయం అమలు దిశగా చర్యలు చేపట్టాలని అభిప్రాయపడ్డారు. ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాక జరిగిన తొలి ఉన్నతస్థాయి సమావేశం ఇదే. తొలుత నిర్ణయించినట్టు మధ్యాహ్నం 12 గంటలకు బదులు భేటీ సాయంత్రం ఐదింటికి జరిగింది. మే 10న కాల్పుల విరమణకు డీజీఎంఓ స్థాయిలోనే సూత్రప్రాయంగా అంగీకారం కుదరడం తెలిసిందే. అనంతర పరిణామాలు తదితరాలపై తాజా భేటీలో డీజీఎంఓలు ఎవరి వాదన వారు వినిపించినట్లు తెలుస్తోంది. భేటీపై అధికారికంగా ప్రకటన రాలేదు. వివరాలను త్వరలో వెల్లడిస్తామని సైన్యం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఇటు 30 అటు 10



అమెరికా ఉత్పత్తులపై 10% టారిఫ్ వేయనున్న చైనా

చైనా ఉత్పత్తులపై 30% టారిఫ్ విధించనున్న అమెరికా

- ఎట్టకేలకు టారిఫ్ యుద్ధానికి తాత్కాలికంగా తెరదించిన అమెరికా, చైనా
- ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారు

జెనీవా: ఎడాపెడా టారిఫ్‌లు విధించుకుంటూ వాణిజ్యయుద్ధాన్ని మొదలెట్టిన అమెరికా, చైనా ఎట్టకేలకు శాంతించాయి. పరస్పర వాణిజ్య ప్రయోజనాలే పరమావధిగా సమష్టిగా సంధికి ఆమోదముద్ర వేశాయి. ఇందులోభాగంగా సోమవారం స్విట్జర్లాండ్‌లోని జెనీవా నగర వేదికగా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుని టారిఫ్ రణానికి ముగింపు పలికినట్లు సంయుక్త ప్రకటనలో వెల్లడించాయి. చైనా ఉత్పత్తులపై 145 శాతం టారిఫ్ విధిస్తామని ట్రంప్ సర్కార్, అందుకు దీటుగా అమెరికా ఉత్పత్తులపై 125 శాతం టారిఫ్ వసూలుచేస్తామని జిన్‌పింగ్ ప్రభుత్వం గతంలో ప్రకటించడం తెల్సిందే. సోమవారం కుదిరిన తాజా వాణిజ్య ఒప్పందంతో ఈ టారిఫ్‌లు భారీగా దిగిరానున్నాయి. ఒప్పందం మేరకు ఇకపై చైనా ఉత్పత్తులపై అమెరికా 30 శాతం టారిఫ్‌లు విధించనుంది. అమెరికా ఉత్పత్తులపై చైనా కేవలం 10 శాతం టారిఫ్‌లు విధించనుంది.

తొలుత 3 నెలలపాటు అమలు

తొలుత 90 రోజులపాటు ఈ టారిఫ్‌లనే అమలుచేసి, సమీక్ష జరిపి అందుకు అనుగుణంగా తదుపరి నిర్ణయాలు తీసుకోనున్నారు. జెనీవాలో ఈ మేరకు అమెరికా, చైనా తరఫున అత్యున్నత స్థాయి అధికారులు మంతనాల జరిపి ట్రేడ్ డీల్‌ను ఖరారుచేశారు. ఐక్యరాజ్యసమితిలో స్విస్ రాయబారి అధికారిక నివాసంలో జరిగిన ఈ చర్చల్లో అమెరికా తరఫున అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్కాట్ బెసెంట్, వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి జేమ్సన్ గ్రీర్ పాల్గొన్నారు. ఆర్థిక, వాణిజ్యం సంబంధాలపై ఇకమీదటా ద్వైపాక్షిక చర్చలు కొనసాగుతాయని స్కాట్‌బెసెంట్ అన్నారు. '' ఇరువైపులా పెరిగిన అత్యధిక టారిఫ్‌లతో వాణిజ్యం ఒక్కసారిగా స్తంభించిపోయింది. చైనాతో వాణిజ్యబంధం బలోపేతానికే కృషిచేస్తున్నాం. అందుకే పెంచిన టారిఫ్‌లను మళ్లీ తగ్గిస్తున్నాం. సమతుల వాణిజ్యం కోరుకుంటున్నాం. ఈ తరహా వాణిజ్యాన్ని సాకారాంచేస్తాం'' అని బెసెంట్ వ్యాఖ్యానించారు. తర్వాత చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదలచేసింది. '' ఇరువైపులా 91 శాతం టారిఫ్ తగ్గించుకున్నాం. మేం మరో 90 రోజులకోసం మరో 24 శాతం తగ్గించాం. దీంతో అమెరికాపై మా టారిఫ్ 10 శాతానికి దిగొచ్చింది. ఏప్రిల్ రెండో తేదీన అమెరికా టారిఫ్‌లు పెంచాక మేం తీసుకున్న ప్రతీకార నిర్ణయాలనూ ఉపసంహరించుకుంటున్నాం'' అని చైనా ఆ ప్రకటనలో పేర్కొంది. అయితే 90 రోజులపాటు ఈ రేట్లనే కొనసాగించి తర్వాత సమీక్ష జరపనున్నారు. దీనిపై కొందరు అంతర్జాతీయ ఆర్థికవేత్తలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. '' ఇది తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం లాంటిదే. 90 రోజుల తర్వాత ఏం జరుగుతుందో చూద్దాం'' అని క్యాపిటల్ ఎకనమిక్స్‌లో చీఫ్ ఆసియా ఎకానమిస్ట్ మార్క్ విలియమ్స్ వ్యాఖ్యానించారు. '' 90 రోజుల తర్వాత ఏం జరుగుతుందనే ఇక్కడ అసలు ప్రశ్న'' అని చైనాలో యురోపియన్ యూనియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు జేన్స్ ఎస్కీలెండ్ అన్నారు. సింథటిక్ డ్రగ్ అయిన ఫెంటానిల్‌ను తమ దేశంలోకి చైనా పోటెత్తిస్తోందంటూ ట్రంప్ సర్కార్ తొలుత టారిఫ్‌ల పెంపు జెండా ఎగరేయడం తెల్సిందే.

బ్రిటన్ వీసా నిబంధనలు మరింత కఠినం

- స్థానికులకు పని అవకాశాలు పెంచడమే లక్ష్యంగా ముందుకెళ్తున్న స్టార్మర్ సర్కార్
- స్థిరనివాస హోదా పొందాలంటే కనీసం పదేళ్లు అక్కడ ఉండాల్సిందే
- శ్వేతపత్రం విడుదల చేసిన బ్రిటన్ హోం శాఖ

లండన్: గత ప్రభుత్వాల ఉదారవాద విధానాల కారణంగా బ్రిటన్‌లోకి వలసలు పోటెత్తాయని, స్థానికులకు ఉపాధి అవకాశాలు భారీగా తగ్గిపోయాయని ఆరోపిస్తూ అధికార లేబర్ పార్టీ కఠిన నిబంధనలను అమల్లోకి తేవాలని నిర్ణయించింది. బ్రిటన్‌లో వలసకార్మికుల సంఖ్యను భారీగా తగ్గించడమే లక్ష్యంగా కొత్త నిబంధనలను అమలుచేయనుంది. వలసదారులు బ్రిటన్‌లో శాశ్వత నివాస హోదా పొందాలంటే ఇకపై ఐదేళ్లకు బదులు కనీసం పదేళ్లు యూకేలో నివసిస్తూ ఉండాలని నిబంధనను కఠినతరం చేయనున్నారు. దీంతో అత్యధిక వర్క్ వీసాల పొందే భారతీయుల బ్రిటన్ శాశ్వత స్థిరనివాస కలలు నెలవేరడం మరింత కష్టంకానుంది. భారతీయులు ఎక్కువగా వైద్యం, ఐటీ, ఇంజనీరింగ్, విద్య, ఆతిథ్యం, కేటరింగ్, వాణిజ్యవిభాగాల్లో పనిచేసేందుకు వీసాలు పొంది బ్రిటన్‌కు వస్తుంటారు. 2024 జూన్‌లో ముగిసిన 12 నెలల కాలానికి 1,16,000 మంది భారతీయులు వర్క్ వీసాలు పొంది బ్రిటన్‌లో పలు రకాల్లో వృత్తుల్లో స్థిరపడ్డారు.

వీసా నిబంధనల్లో ముఖ్యమైన మార్పులేంటి?

చిన్నారులు, వృద్ధులు, రోగుల బాగోగులు చూసుకునే ఓవర్‌సీస్ కేర్ వర్కర్లకు ఇచ్చే వీసాలను ఇకపై ఆపేయనున్నారు. ఇకపై విదేశీయులను కేర్ వర్కర్లుగా నియమించుకోకూడదనే నిబంధనను అమల్లోకి తేనున్నట్లు పార్లమెంట్‌లో శ్వేతపత్రాన్ని ప్రవేశపెట్టనున్న హోం శాఖ మంత్రి వెట్టీ కూపర్ చెప్పారు. దీంతో ఈ ఉద్యోగాలు స్థానికులకు లభిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. నైపుణ్యమున్న వాళ్లకు మంజూరుచేసే స్కిల్డ్ వర్కర్ వీసాను ఇకపై కనీసం గ్రాడ్యుయేషన్ విద్యార్హత ఉన్న వ్యక్తులకే ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది. వైద్యులు, ఇంజనీర్లు, కృత్రిమ మేధ ఉద్యోగులు ఇలా నైపుణ్యమున్న వాళ్లకే స్కిల్డ్ వర్కర్ వీసా మంజూరుచేయాలని శ్వేతపత్రంలో ప్రతిపాదించారు. నిబంధనలను పాటిస్తూ దేశార్థికాన్ని తమ వంతు తోడ్పాటునందించే వాళ్లకే ప్రాధాన్యత ఇవ్వనున్నారు. స్కిల్డ్ వర్కర్ వీసా కోరే వాళ్లు కనీసం యూనివర్సిటీ డిగ్రీ పట్టభద్రులై ఉండాలి. ఈ నిబంధనలతో బ్రిటన్ హోం శాఖ సోమవారం ఒక శ్వేతపత్రం విడుదలచేసింది.



డిపెండెంట్‌లకూ ఇంగ్లిష్ పరీక్ష

వీసాదారులపై ఆధారపడి బ్రిటన్‌లో అడుగుపెట్టే వారి జీవితభాగస్వాములు, తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు ఇంగ్లిష్ భాషపై కనీస పరిజ్ఞానం, పట్టు ఉండాల్సిందే. వీళ్లంతా ఏ1-లెవల్ ఇంగ్లిష్ టెస్ట్‌ను పాసవ్వాల్సి ఉంటుంది. ఎక్కడ ఉంటున్నారు?. ఏ పని మీద వచ్చారు?. ఏం చేస్తారు? ఇలా బ్రిటన్ పోలీసులు ఎక్కడైనా ప్రశ్నిస్తే కనీసం సమాధానం ఇంగ్లిష్‌లో చెప్పేలా బేసిక్ లెవల్ ఇంగ్లిష్ తెలిసి ఉండాలనే నిబంధనను జతచేయనున్నారు. వీసా గడువు కాలాన్ని వర్కర్లుగానీ, వాళ్ల కుటుంబసభ్యులుగానీ పెంచుకోవాలనుకుంటే వారిపై ఆధారపడే వాళ్లు హై లెవల్ ఏ2 ఇంగ్లిష్ టెస్ట్ పాస్ అవ్వాల్సి ఉంటుంది. బ్రిటన్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకున్న విదేశీ విద్యార్థులు అదనంగా మరో 24 నెలలపాటు బ్రిటన్‌లోనే ఉండేందుకు వెసులుబాటు ఉండేది. దానిని ఇప్పుడు 18 నెలలకు కుదించారు. ఊహించనంతగా చట్టబద్ధంగా, అక్రమంగా వస్తున్న వారితో బ్రిటన్ 'అపరిచితుల ద్వీపం'గా తయారవుతోందని సోమవారం 10 డౌనింగ్ స్ట్రీట్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ప్రధాని స్టార్మర్ వ్యాఖ్యానించారు.

పాక్‌కు సైనిక సామగ్రి తరలింపు అబద్ధం: చైనా

బీజింగ్: పాకిస్తాన్‌కు సరుకు రవాణా విమానంలో సైనిక సామగ్రిని తాము సరఫరా చేశామంటూ వస్తున్న వార్తలను చైనా ఖండించింది. ఇటువంటి వదంతులను వ్యాప్తి చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. జియాన్ వై-20 రకం విమానంలో పెద్ద మొత్తంలో సామగ్రిని పాకిస్తాన్ తరలించినట్లు ఆన్‌లైన్‌లో వస్తున్న వార్తలు అసత్యాలని పేర్కొంది. 'ఇంటర్నెట్ చట్టానికి అతీతం కాదు. సైనిక సంబంధమైన వదంతులను, అసత్యాలను వ్యాప్తి చేసే వారిని బాధ్యులను చేస్తాం'అని స్పష్టం చేసింది. భారత్‌తో కాల్పుల విరమణకు అంగీకారం కుదిరాక పాక్‌కు అత్యవసరమైన సామగ్రిని చైనా పంపించిందంటూ ఆన్‌లైన్‌లో వార్తలు షికారు చేశాయి. పాక్, చైనాల మధ్య అత్యంత సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్న విషయం తెల్సిందే. పాక్ ఆయుధ సామగ్రి, వ్యవస్థల్లో ఏకంగా 81 శాతం చైనా నుంచి కొనుగోలు చేసినవేనని స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సిప్రి) తెలిపింది.

కిరానా హిల్స్ కథేంటి?

- పాకిస్తాన్ అణు స్థావరాలు ఇక్కడ ఉన్నట్లు గతంలో కథనాలు
- కిరానాపై దాడులను తోసిపుచ్చిన భారత వైమానిక దళం

న్యూఢిల్లీ/ ఇస్లామాబాద్: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌లోని కిరానా హిల్స్ కొండప్రాంతంపై బాంబులు వేశారనే వార్తలను భారత్ పూర్తిగా తోసిపుచ్చింది. పాకిస్తాన్ అణు స్థావరాల జోలికి వెళ్లలేదని ఎయిర్ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ ఎయిర్ మార్షల్ ఏకే భారతి సోమవారం స్పష్టం చేశారు. '' ఆ కొండలో అణుస్థావరం ఉన్నట్లు మాకైతే తెలీదు. ఇప్పుడు మీరు చెప్తేనే తెల్సింది. రహస్యం చెప్పినందుకు థాంక్యూ'' అని ఏకే భారతి సరదాగా మాట్లాడారు. తర్వాత సీరియస్‌గా సమాధానం చెప్పారు. '' పాక్ అణుస్థావరాలపై భారత్ ఎలాంటి దాడులు చేయలేదు. ముఖ్యంగా మీరు చెబుతున్న కిరానా న్యూక్లియర్ బేస్‌పై బాంబులు వేయలేదు'' అని సోమవారం మీడియా ప్రతినిధులకు ఏకే భారతి స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో ఈ కిరానా కొండల గురించి చర్చ మొదలైంది. పాకిస్తాన్ అణుస్థావరాలు భద్రంగా ఉన్నాయా?. వాటిపై నిజంగానే భారత్ దాడులు చేసిందా? అనే ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కిరానా హిల్స్ విశేషాల కోసం నెటిజన్లు ఆన్‌లైన్‌లో తెగ వెతికేస్తున్నారు.

కొండల్లో అణుబాంబులు!?

పాకిస్తాన్ తన అణువార్‌హెడ్‌లను పంజాబ్ ప్రావిన్స్‌లోని సర్గోదా జిల్లాలోని కిరానా కొండల్లో దాచిందని దశాబ్దాల క్రితం వార్తలొచ్చాయి. అయితే తాజాగా ఆపరేషన్ సిందూర్ పేరిట భారత వాయుసేన ఇక్కడ కూడా కొన్ని క్షిపణులు, బాంబులను పడేసిందని సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈ కొండల్లో పేలుళ్లు వినిపించాయని, కనిపించాయంటూ కొన్ని ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. రక్షణ శాఖ పరిధిలోని అణు విభాగానికి సంబంధించిన స్థావరం ఈ కొండల్లో ఉందని తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ కొనసాగింపులో భాగంగా పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై భారత్ దాడులుచేయడం తెల్సిందే. రావల్పిండి సమీపంలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌పైనా క్షిపణులు వేసింది. ఈ ఎయిర్‌బేస్‌కు అత్యంత సమీపంలోనే పాక్ 'స్ట్రాటజిక్ ప్లాన్స్ డివిజన్' ఉంది. పాక్ అణు వార్‌హెడ్‌ల నిర్వహణ బాధ్యతలను ఇదే చూసుకుంటుంది. ఎయిర్‌బేస్‌పై దాడిచేసినప్పుడే స్ట్రాటజిక్ ప్లాన్స్ డివిజన్‌పైనా భారత్ దాడి చేసిందని వార్తలొచ్చాయి. అదీగాక ముషాఫ్ ఎయిర్‌బేస్‌పైనా భారత్ దాడిచేసింది. ఈ బేస్ అడుగుభాగంలోనే అణువార్‌హెడ్‌ల నిల్వకేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. సర్గోదా ఎయిర్‌బేస్‌కు రోడ్డుమార్గంలో కిరానా హిల్స్ కేవలం 20 కి.మీ.ల దూరంలో ఉంది. కుషాబ్ అణుకేంద్రానికి 75 కి.మీ.ల దూరంలో ఉంది. అణ్వాయుధంలో వాడే ప్లుటోనియం తయారీకోసం నాలుగు భారజల రియాక్టర్లు కుషాబ్‌లో పనిచేస్తున్నట్లు 3 నెలల క్రితం వరల్డ్ న్యూక్లియర్ అసోసియేషన్ నివేదించింది. 68 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని ఆ కొండప్రాంతంలో 39 కి.మీ.ల పరిధిని మిలటరీ జోన్‌గా పాక్ ఏనాడో ప్రకటించింది. ఇక్కడ బహుళ అంచెల రక్షణ వ్యవస్థను ఏర్పాటుచేసింది. ఇక్కడ స్పెషల్ వర్క్స్ శాఖ 10 సొరంగాలను తవ్వింది. పొరపాటున లోపల పేలుళ్లు జరిగినా సమీప జనావాసాల్లో ప్రాణనష్టం జరక్కుండా సొరంగాల గోడలను అత్యంత మందంగా నిర్మించారని భారత ఆర్మీలో రిటైర్డ్ కల్నల్ వినాయక్ భట్ ఎనిమిదేళ్ల క్రితం ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

హమాస్ చెర నుంచి అమెరికా బందీ విడుదల

డెయిర్ అల్-బలాహ్: తమ చెరలో ఉన్న అమెరికా పౌరుడైన ఇజ్రాయెల్ సైనికుడు ఈడన్ అలెగ్జాండర్‌ను గాజాలోని హమాస్ సాయుధ సంస్థ సోమవారం రెడ్ క్రాస్ సిబ్బందికి అప్పగించింది. 2023 అక్టోబర్ 7న హమాస్ శ్రేణులు ఇజ్రాయెల్ సరిహద్దుల్లో మెరుపుదాడి చేపట్టి వందలాది మందిని చంపడంతోపాటు 250 మందిని బందీలుగా పట్టుకుపోవడం తెల్సిందే. వీరిలో ఈడన్ సహా ఇప్పటికీ చెరలోనే ఉన్న 59 మందిలో 24 మంది మాత్రమే సజీవంగా ఉన్నట్లు చెబు తున్నారు. పట్టుబడిన సమయంలో ఇతడు ఇజ్రాయెల్ సైన్యంలోని ఇన్‌ఫాంట్రీ విభాగంలో విధుల్లో ఉన్నాడు. దాదాపు 19 నెలలపాటు గాజాలో హమాస్ వద్ద సజీవంగా ఉన్న వారిలో అమెరికాకు చెందిన ఏకైక వ్యక్తి ఈడన్. ఈడన్ కోసం సురక్షిత కారిడార్ ఏర్పాటు చేశామని ఇజ్రాయెల్ తెలిపింది. ట్రంప్ ప్రభుత్వంపై సాను కూల ధోరణితోనే ఈడన్‌ను వదిలిపెట్టినట్లు హమాస్ ప్రకటించింది. యుద్ధం ముగిసే దిశగా సానుకూల పరిణామమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు.



106 కిలోల గంజాయి పట్టివేత
ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు రూ.50 లక్షల విలువైన 106 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కొందరు జట్టుగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయి తెచ్చినట్లు గుర్తించారు. -8లో



మెరిపిస్తూ.. మురిపిస్తూ..
నగరంలో గృహ అక్వేరియం సంస్కృతి అంతకంతకూ విస్తరిస్తోంది. ఇళ్లలో అక్వేరియంలను ఏర్పాటు చేయడం ద్వారా ఆహ్లాదకర వాతావరణాన్ని ఇష్టపడుతున్నారు. - సిటీప్లస్‌లో...

గరిష్ఠం/కనిష్ఠం
39.0/28.0

వాతావరణం
నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 39, కనిష్ఠంగా 28 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

నేడు పాతబస్తీకి ప్రపంచ సుందరాంగులు


చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్

- చౌమహల్లా ప్యాలెస్‌లో డిన్నర్
- కొనసాగనున్న ట్రాఫిక్ ఆంక్షలు
- కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

ఓల్డ్ సిటీ.. న్యూ బ్యూటీ



విద్యుత్ కాంతుల్లో పాతబస్తీ



చార్మినార్:

మిస్ వరల్డ్–2025 పోటీదారులతో చార్మినార్ నుంచి లాడ్ బజార్ వరకు మంగళవారం నిర్వహించనున్న హెరిటేజ్ వాక్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు పాతబస్తీలో కొన్ని ఆంక్షలు కొనసాగనున్నాయి. ఇప్పటికే చిరు వ్యాపారులను కట్టడి చేసే దిశగా అందరికీ మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఒకరోజు తమ వ్యాపారాలకు సెలవు ఇవ్వాలని సూచించారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. చార్మినార్‌కు నాలుగు వైపులా ఉన్న దారుల్లో మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. అణువణువూ తనిఖీ చేసిన అనంతరమే చార్మినార్ వరకు అనుమతించనున్నారు. ఇప్పటికే బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో చార్మినార్, లాడ్ బజార్ పరిసరాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ రూట్లో రహదారులను అందంగా తీర్చిదిద్ది..ఇరువైపులా తాత్కాలిక విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. చార్మినార్ నుంచి లాడ్ బజార్ వరకు హెరిటేజ్ వాక్ అనంతరం అందాల పోటీదారులు ఇక్కడ షాపింగ్ చేయనున్నారు. అంతరం అక్కడి నుంచి వాహనాల ద్వారా చౌమహల్లా ప్యాలెస్‌కు చేరుకొని డిన్నర్ చేయనున్నారు. ఈ డిన్నర్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికార, అనధికార ప్రముఖులు పాల్గొననున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

- దాదాపు 120 దేశాలకు చెందిన ప్రపంచ సుందరాంగులు ఈ హెరిటేజ్ వాక్‌లో పాల్గొననున్నారు. చార్మినార్ నుంచి లాడ్ బజార్ వరకు నిర్వహించే వాక్‌లో ప్రపంచ సుందరాంగులు పాల్గొని ఇక్కడి ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకుంటారు. అనంతరం షాపింగ్ చేయనున్నారు.
- తెలంగాణ జరూర్ ఆనా..అనే టైటిల్‌తో చూడముచ్చటగా తయారు చేయించిన ప్రత్యేక ఏసీ బస్సులో మిస్ వరల్డ్ పోటీదారులు పాతబస్తీకి వస్తారు. శివారు ప్రాంతమైన ఆరాంఘర్ నుంచి డాక్టర్ మన్‌మోహన్ సింగ్ ఫ్లై ఓవర్ ద్వారా పాతబస్తీలోకి ప్రవేశిస్తారు. అనంతరం బహదూర్‌పురా, పురానాపూల్, పేట్లబురుజు, మదీనా సర్కిల్, పత్తర్‌గట్టి, గుల్జార్‌హౌజ్, చార్‌కమాన్ మీదుగా చార్మినార్‌కు చేరుకుంటారు. డిన్నర్ అనంతరం తిరిగివచ్చిన రూట్‌లోనే వెళ్లనున్నారు.
- హెరిటేజ్ వాక్ కోసం పాతబస్తీలో దాదాపు 10 కిలో మీటర్ల రేడియస్‌లో అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న తెలిపారు. వీధి దీపాల ఏర్పాటుతో పాటు తాత్కాలిక విద్యుత్ దీపాలంకరణ, బీటీ రోడ్లు, డివైడర్ల మరమ్మతులు చేయించామన్నారు. దాదాపు 250 మంది కార్మికులు పారిశుధ్య పనుల్లో పాలుపంచుకున్నారని తెలిపారు.



ముస్తాబైన చౌమహల్లా ప్యాలెస్

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

- మదీనా నుండి చార్మినార్, చార్మినార్ నుండి శాలిబండ, శాలిబండ (రాజేష్ మెడికల్ హాల్) నుండి వోల్గా జంక్షన్, వోల్గా జంక్షన్ నుండి మూసాబౌలి వయా ఖిల్వత్ రోడ్డుకు వెళ్లే రోడ్లలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు అన్ని రకాల వాహనాల రాకపోకల్ని నియంత్రించనున్నారు. ఈ రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నట్లు నగర పోలీస్ (ట్రాఫిక్) జాయింట్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.
- **మదీనా జంక్షన్:** నయాపూల్ నుండి చార్మినార్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను మదీనా జంక్షన్ వద్ద సిటీ కాలేజ్ వైపు మళ్లిస్తారు.
- **హిమ్మత్‌పుర:** నాగల్‌చింత/శాలిబండ ప్రాంతాల నుండి చార్మినార్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను హిమ్మత్‌పురా జంక్షన్, హరి బౌలి మరియు వోల్గా జంక్షన్ వైపు ఫతే దర్వాజా రోడ్డు వరకు తరలిస్తారు.
- **వోల్గా జంక్షన్:** హిమ్మత్‌పురా నుండి వచ్చే ట్రాఫిక్‌ను చౌమొహల్లా ప్యాలెస్ వైపు అనుమతించరు. వీటిని వోల్గా జంక్షన్ ఫతే దర్వాజా వైపు మళ్లిస్తారు. ఫతే దర్వాజా నుండి వచ్చే ట్రాఫిక్‌ను హిమ్మిత్‌పురా వైపు మళ్లిస్తారు.
- **మూసబౌలి:** పురానాపూల్ (గుడ్ విల్ కేఫ్) నుండి వచ్చే ట్రాఫిక్‌ను చార్మినార్/చౌమహల్లా ప్యాలెస్ వైపు అనుమతించరు మరియు మూసాబౌలి వద్ద సిటీ కాలేజ్ మరియు ఫతే దర్వాజా వైపు దూద్‌బౌలి ద్వారా మళ్లిస్తారు.
- **చౌక్ మైదాన్ కమాన్:** చౌక్ మైదాన్ నుండి చార్మినార్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను చౌక్ మైదాన్ వద్ద కోట్ల అలిజా లేదా మొఘల్‌పురా వైపు మళ్లిస్తారు.
- **ఎతేబార్ చౌక్:** ఎతేబార్ చౌక్ ప్రాంతం నుండి గుల్జార్‌హౌస్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను ఎతేబార్ చౌక్ వద్ద మండి మిరాలం మార్కెట్ లేదా బీబీ బజార్ వైపు మళ్లిస్తారు.
- **షేర్ ఎ బైతుల్ కమాన్:** మిట్టి కా షేర్ నుండి వచ్చే ట్రాఫిక్‌ను గుల్జార్ హౌస్ వైపు అనుమతించరు మరియు మిట్టి–కే–షేర్ జంక్షన్ వద్ద ఘాన్సీ బజార్ వైపు మళ్లించి హైకోర్టు రోడ్డుకు చేరుకుంటారు.
- **లక్కడ్ కోట్ (పాత సీపీ ఆఫీస్ జంక్షన్):** అఫాట్ వైపు నుండి చార్మినార్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను లక్కడ్ కోట్ వద్ద (ఓల్డ్ సీపీ ఆఫీస్ లేన్) మరియు మిరాలం మండి మార్కెట్ వైపు మళ్లిస్తారు (అవసరమైతే) ఈ పరిమితులు ఆర్టీసీ బస్సులకు కూడా వర్తిస్తాయి.

– హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులతో ప్రజలు సహకరించాలని.. ప్రయాణంలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే, ప్రయాణ సహాయం కోసం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ హెల్ప్‌లైన్ **90102 03626**కు కాల్ చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

వారంలోగా ఆస్తి పన్ను డేటా

జోనల్, డిప్యూటీ కమిషనర్లను ఆదేశించిన కమిషనర్ కర్ణన్

- ప్రజావాణి ఫిర్యాదులు బాధ్యతతో పరిష్కరించాలని సూచన

జోన్లలో..

జోన్లలో జరిగిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 111 ఫిర్యాదులు రాగా, వాటిల్లో కూకట్‌పల్లి జోన్‌లో 37, శేరిలింగంపల్లి జోన్‌లో 18, ఎల్బీనగర్ జోన్ లో 7, సికింద్రాబాద్ జోన్ లో 34, చార్మినార్ జోన్ లో 14, ఖైరతాబాద్ జోన్‌లో 1 ఉన్నాయి.

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఆస్తి పన్నుకు సంబంధించి ఏఐ ఆధారిత జీఐఎస్ సర్వే, క్షేత్రస్థాయి సర్వేల స్కెచ్‌తో వారంలోగా పూర్తిస్థాయి నివేదికను అందజేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ జోనల్, డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సికింద్రాబాద్ జోన్‌లో ఆయా పనులను జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పనుల గురించి ప్రస్తావనకు రావడంతో వారంలోగా ఆస్తి పన్నుకు సంబంధించిన నివేదికను అందజేయాలన్నారు.



ఈ–వేస్ట్ తరలించని వారికి జరిమానాలు విధించాలని ఆదేశించారు. తార్నాక, చిలకలగూడ, పాటిగడ్డ, రసూల్‌పుర, ప్రకాశ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రతిపాదిత అభివృద్ధి పనులను పరిశీలించారు. తార్నాక జంక్షన్ ఐల్యాండ్ నిర్మాణ పనులతో పాటు పచ్చదనం పెంపు పనులను, చిలకలగూడ ఆర్‌యూబీ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఇ–ఈ వేస్ట్ తరలించని వారికి జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. రసూల్‌పురా ఫ్లైఓవర్ ప్రతిపాదిత స్థలాన్ని, అలైన్‌మెంట్ పనులను, పాటిగడ్డ ఆర్‌ఓబీకి అవసరమైన భూసేకరణ ప్రక్రియను పరిశీలించారు. ప్రకాశ్‌నగర్ ఐఓసీ బంక్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సమీపంలోని నీటినిల్వ ప్రాంతాల్లో పూడికతీత పనులు వెంటనే పూర్తిచేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలోని డిప్యూటీ కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులు కమిషనర్ వెంట ఉన్నారు.

‘ప్రజావాణి’ ఫిర్యాదులపై శ్రద్ధ వహించండి

జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ‘ప్రజావాణి’లో కమిషనర్ కర్ణన్ పాల్గొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమకు అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు బాధ్యతగా పరిష్కరించాలని సూచించారు. ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి మొత్తం 62 ఫిర్యాదులు రాగా, అందులో టౌన్‌ప్లానింగ్‌వి 40, ట్యాక్స్ సెక్షన్‌వి 6, పరిపాలనకు సంబంధించి 3, ఇంజినీరింగ్ విద్యుత్, ఫైనాన్షియల్ విభాగాలకు సంబంధించి రెండేసి చొప్పున, భూసేకరణ, ఆరోగ్యం విభాగాలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, చంద్రకాంత్ రెడ్డి, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, రఘు ప్రసాద్, అశోక్ సామ్రాట్, నళిని పద్మావతి, ఆయా విభాగాల ఉన్నతాధికారులు, అడిషనల్ సీసీపీలు గంగాధర్, వీరన్న, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ కర్ణన్

స్థిరాస్తి రిజిస్ట్రేషన్ ఇక చకచకా!

మరో 12 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్ విధానం ఆరంభం

- అరగంటలోనే స్థిరాస్తి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న దస్తావేజుదారులు

సాక్షి, సిటీబ్యూరో: రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్ విధానం అమలుతో స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చకచకా కొనసాగుతోంది. స్థిరాస్తి దస్తావేజుల నమోదు కోసం క్రయ, విక్రయదారులు గంటల తరబడి వేచి చూడకుండా కేవలం 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి, మరో 15 నుంచి 20 నిమిషాల్లో చేతికి దస్తావేజులు అందుతున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ సంస్కరణల్లో భాగంగా ప్రయోగాత్మకంగా మరో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలు సోమవారం ప్రారంభమైంది. హైదరాబాద్, హైదరాబాద్ సౌత్, రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ ఆఫీస్‌లతోపాటు ఫరూక్ నగర్, షాద్‌నగర్, మహేశ్వరం, వనస్థలిపురం, శేరిలింగంపల్లి, ఉప్పల్, ఘట్‌కేసర్, నారపల్లి, మల్కాజ్‌గిరి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్ విధానం ద్వారా సత్వరమే స్థిరాస్తి దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు వెసులుబాటు కలిగినట్లయింది. ఇప్పటికే గత నెల రోజులుగా ఆజంపురా, చిక్కడపల్లి, మేడ్చల్ ఆర్వో, కుత్బుల్లాపూర్, వల్లభ్ నగర్, శంషాబాద్, సరూర్ నగర్, చంపాపేట్ తదితర సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్ విధానం అమలవుతోంది.

రోజువారీగా 48 నుంచి 144 స్లాట్లు..

గ్రేటర్ పరిధిలో ఎంపిక చేసిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజువారీగా 48 చొప్పున స్లాట్లను అమలు చేస్తున్నారు. దస్తావేజుల తాకిడి అధికంగా ఉండే ఆఫీసుల్లో మాత్రం 144 స్లాట్స్ వరకు అవకాశం కల్పిస్తున్నారు. దస్తావేజుదారులకు కేటాయించి స్లాట్ల సమయం ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసే విధంగా ప్రయత్నిస్తున్నారు. స్లాట్ బుక్ చేసుకోని అత్యవసర దస్తావేజుదారుల కోసం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు కేవలం ఐదు ‘వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లను’ అనుమతిస్తున్నారు. నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో దస్తావేజులు స్వీకరించి నమోదు ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల కోసం గంటల తరబడి నిరీక్షించే పనిలేకుండా కేవలం అర్ధగంటలోపు దస్తావేజుల ప్రక్రియ పూర్తి కావడం పట్ల స్థిరాస్తి క్రయవిక్రయదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి

కొత్తగా కొనుగోలు చేసిన ఫ్లాట్ రిజిస్ట్రేషన్ కోసం రెండురోజుల ముందు ఉప్పల్ రిజిస్ట్రార్ ఆఫీసులో స్లాట్ బుకింగ్ చేసుకున్నా. కేవలం పది నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. అరగంట వ్యవధిలోనే డాక్యుమెంటు తీసుకుని ఇంటికి వచ్చేశాం. నిజంగా ఈ విధానం చాలా బాగుంది. దీని వల్ల ఎక్కడా ఇబ్బంది పడలేదు సరికదా సమయం చాలా ఆదా అయింది. సో హ్యాపీ.
– సంతోష్‌కుమార్ రెడ్డి, ఉప్పల్

చాలా ఈజీ అయింది

కాప్రా సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నాం. గతంలో రిజిస్ట్రేషన్‌కు ఒక రోజంతా పట్టేది. తరువాత 2,3 రోజుల తర్వాత రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు చేతికి అందించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. రిజిస్ట్రేషన్ 15 నిముషాల్లో పూర్తయింది. మరో 15 నిమిషాల్లో డాక్యుమెంట్లు సిద్ధం చేసి చేతికి అందించారు. రద్దీ లేకుండా ప్రశాంత వాతావరణంలో పని చాలా ఈజీగా పూర్తయింది.
– ఎ.శ్రీలత, కాప్రా

గతంలో డీటీసీపీ నుంచి.. ఇకపై హెచ్‌ఎండీఏ నుంచే ‘రియల్’ అనుమతులు

- రెండు నెలలు గడుస్తున్నా స్పందన నిల్
- లే అవుట్‌లు, నిర్మాణాలకు ఇప్పటి వరకు ప్రారంభించని పనులు...
- స్తంభించిన స్థిరాస్తి లావాదేవీలు
- కొత్తగా చేరిన ప్రాంతాల మ్యాపింగ్ చేపట్టినట్లు అధికారుల వెల్లడి

‘అనుమతులు’ ఎప్పుడిస్తరు?

ట్రిపుల్ ఆర్ వరకు పెరిగిన హెచ్‌ఎండీఏ పరిధి

సాక్షి, సిటీబ్యూరో:

ట్రిపుల్‌ఆర్ వరకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిని విస్తరించినప్పటికీ ఇంకా లే అవుట్‌లు, భవన నిర్మాణ అనుమతులు జారీ చేయడం ప్రారంభం కాలేదు. దీంతో నిర్మాణ, రియల్ ఎస్టేట్ సంస్థలు అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయి. హెచ్‌ఎండీఏ విస్తరణకు ముందు డైరెక్టరేట్ ఆఫ్ టౌన్‌ప్లానింగ్ అండ్ కంట్రీప్లానింగ్ (డీటీసీపీ) నుంచి అనుమతులు లభించేవి. ప్రస్తుతం డీటీసీపీ పరిధిలోని ప్రాంతాలన్నీ హెచ్‌ఎండీఏకు బదిలీ అయ్యాయి. రెండు నెలల క్రితమే ఈ బదిలీ ప్రక్రియ ముగిసింది. ఈ మేరకు హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు లభించవలసి ఉంది. కానీ రెండు నెలలుగా దీనిపైన ఎలాంటి స్పష్టత లేకపోవడంతో నిర్మాణ సంస్థల్లో గందరగోళం నెలకొంది. రూ.కోట్లల్లో అప్పులు తెచ్చి భూములు కొనుగోలు చేసిన సంస్థలు వాటిని లే అవుట్‌లుగా అభివృద్ధి చేసేందుకు ఇటు డీటీసీపీ నుంచి అటు హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు లభించకపోవడంతో సందిగ్ధంలో పడ్డాయి. మరోవైపు రియల్ ఎస్టేట్ అభివృద్ధికి సైతం ఇది ఆటంకంగా మారినట్లు నిర్మాణ రంగానికి చెందిన నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రీజనల్ రింగురోడ్డు వరకు మారిన సీన్...

హైదరాబాద్ మహానగర పరిధి 7,257 చదరపు కిలోమీటర్ల నుంచి 10,472.723 చదరపు కిలోమీటర్లకు పెరిగిన సంగతి తెలిసిందే. నగరం చుట్టూ సుమారు 354 కిలోమీటర్ల పరిధిలో నిర్మించనున్న రీజనల్‌రింగ్‌రోడ్డు వరకు అన్ని రకాల అనుమతులు, ప్రొసీడింగ్‌లు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌లు, తదితర నిర్మాణ రంగానికి సంబంధించిన కార్యకలాపాలన్నీ హెచ్‌ఎండీఏ పరిధిలోకి వచ్చాయి. ఈ మేరకు కొత్త ప్రాంతాలను హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగంలోని 6 జోన్లలో చేర్చారు. హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరించినప్పటి నుంచి ఆ పరిధిలో డీటీసీపీ అనుమతులను నిలిపివేసింది. కానీ అప్పటి నుంచి ఇప్పటి వరకు హెచ్‌ఎండీఏ నుంచి కొత్తగా ఎలాంటి అనుమతులు లభించలేదు. హెచ్‌ఎండీఏ వెలుపల ఉన్న ప్రాంతాల్లో మాత్రం డీటీసీపీ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. టీజీబీపాస్ స్థానంలో కొత్తగా ప్రవేశపెట్టిన బిల్డ్‌నౌ పోర్టల్ సేవలను డీటీసీపీ ప్రాంతాలకు కూడా విస్తరించారు. కానీ గతంలో ఉన్న 7,257 చదరపు కిలోమీటర్ల పరిధిలో మాత్రమే హెచ్‌ఎండీఏ అనుమతులు లభిస్తుండగా, కొత్తగా చేరిన 3,215 చదరపు కిలోమీటర్లకు పైగా ఉన్న గ్రామాలు, మండలాలు, మున్సిపల్ ప్రాంతాల్లో మాత్రం ఇంకా అనుమతులు మొదలు కాకపోవడం గమనార్హం.

మ్యాపింగ్‌లో జాప్యమేల...

హెచ్‌ఎండీఏ కొత్తగా విస్తరించిన ప్రాంతాల మ్యాపింగ్‌లో జాప్యం వల్లనే అనుమతుల ప్రక్రియను ఇంకా ఆరంభించలేకపోయినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం మ్యాపింగ్ తుదిదశకు చేరిందని, త్వరలోనే పూర్తిచేయనున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు ట్రిపుల్‌ఆర్ వరకు రాబోయే 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మెగా మాస్టర్ ప్లాన్ ఏర్పాటుకు సైతం హెచ్‌ఎండీఏ కసరత్తును చేపట్టింది. దీంతో నిర్మాణరంగంపైన స్పష్టత కొరవడినట్లు రియల్‌వర్గాలు పేర్కొంటున్నాయి. ‘షాద్‌నగర్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేసి లే అవుట్‌లు అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. రెండు నెలల నెంచి ఎదురుచూస్తున్నాం. కానీ ఈ మ్యాపింగ్ పూర్తయిన తరువాత అనుమతినిస్తారా లేక, కొత్త మాస్టర్‌ప్లాన్ వచ్చే వరకు నిలిపివేస్తారా తెలియడం లేదు.’ అని ఒక రియల్టర్ విస్మయం వ్యక్తం చేశారు. ఒకవేళ మెగామాస్టర్‌ప్లాన్ అమల్లోకి వచ్చే వరకు అనుమతులు లభించకపోతే తాము తీవ్రంగా నష్టపోవలసి వస్తుందని పేర్కొన్నారు. భారీ లే అవుట్‌లే కాకుండా అపార్ట్‌మెంట్‌లు, భవన నిర్మాణాలకు సైతం ఇబ్బందులు తలెత్తనున్నాయి.





హెచ్‌ఎంఏ డెవలప్‌మెంట్ ప్లాన్..

hmda
Growing Global

- హెచ్‌ఎండీఏ పరిధి విస్తరణతో ప్రస్తుతం 11 జిల్లాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సిద్దిపేట్, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి, నల్లగొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల్లోని 104 మండలాలు, 1355 గ్రామాలతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా (హెచ్‌ఎంఏ) ఏర్పడింది.
- ఈ హెచ్‌ఎంఏ పరిధిలో ఎకనమిక్ డెవలప్‌మెంట్ ప్లాన్, కాంప్రహెన్సివ్ మొబిలిటీప్లాన్, బ్లూగ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రణాళికలతో మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు సన్నాహాలు చేపట్టారు. ఈ ప్రణాళికలు ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి ముసాయిదా విడుదలయ్యే అవకాశం ఉంది. వచ్చే సంవత్సరం నుంచి సరి కొత్త మాస్టర్‌ప్లాన్ రానుంది.
- ఈ క్రమంలో నిర్మాణరంగానికి సంబంధించిన కార్యకలాపాలకు అనుమతులను ఎప్పటి నుంచి ఇస్తారనేది సందిగ్ధంగా మారింది.
- బ్లూన్‌గ్రీన్ ప్రణాళికలో భాగంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా (హెచ్‌ఎంఏ) వరకు చెరువులు, కుంటలు, తదితర నీటివనరులను గుర్తించి వాటి పరిరక్షణకు చర్యలను చేపట్టవలసి ఉంది.దీంతో అప్పటి వరకు వేచి ఉండవలసిందేనా అనే సందేహం వ్యక్తమవుతోంది.

106 కిలోల గంజాయి పట్టివేత


పోలీసుల అదుపులో నిందితులు

ఉప్పల్: ఉప్పల్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు రూ. 50 లక్షల విలువైన 106 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓంకార్ కేసు వివరాలు వెల్లడించారు. మేడిపల్లిలో ఉంటున్న హనుమకొండ ప్రాంతానికి చెందిన కట్ల వివేక్ రెడ్డికి వరంగల్‌లో ఉంటున్న పశ్చిమ గోదావరి చిల్లా, చింతల పూడి గ్రామానికి చెందిన దగ్గుమల్లి మధుకిరణ్‌తో పరిచయం ఉంది. జల్సాలకు అలవాటు పడిన వీరు సులువుగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి ప్రాంతానికి చెందిన కర్నెన్ రాంబాబు అలియాస్ రాముతో ఒప్పందం చేసుకుని అతని ద్వారా గంజాయి అక్రమ రవాణాకు తెరలేపారు. రాంబాబు చెప్పిన వ్యక్తికి గంజాయి అందజేస్తే ఒక్కో డీల్‌కు రాంబాబు వారికి రూ.50 వేలు కమీషన్‌గా ఇచ్చేవాడు. ఇదే తరహాలో పలుమార్లు గంజాయి తీసుకువచ్చి అవసరమైన వారికి అందజేశారు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం ఇద్దరు వ్యక్తులు మల్లాపూర్‌లోని హెచ్‌సీఎల్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు గుర్తించిన స్థానికులు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఉప్పల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓంకార్, సిబ్బంది వారిని అదుపులోకి తీసుకుని ఆరా తీయగా ఒడిశాకు చెందిన రాంబాబు కారులో తీసుకు వచ్చి వారికి అప్పగించినట్లు వెల్లడైంది. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు పక్కనే ఉన్న భవనంలో డంప్ చేసిన 106 కిలో గంజాయి, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సూత్రధారి రాంబాబుతో పాటు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వరుసకు కూతుళ్లపై మారుతండ్రి లైంగిక దాడి

- అతడి నుంచి ప్రాణహాని ఉందంటూ బాధితుల తల్లి ఫిర్యాదు

బంజారాహిల్స్: వరుసకు కూతుళ్లపై ఓ మారుతండ్రి లైంగిక దాడికి పాల్పడడమే కాకుండా కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితుల తల్లిని దారికాసి బెదిరించిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. లంగర్‌హౌస్‌కు చెందిన మహిళకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత కొంతకాలంగా మారు తండ్రి వారిపై లైంగిక దాడికి పాల్పడుతుండటంతో బాధితుల తల్లి గత జనవరి 1న లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటీవల బెయిల్‌పై బయటికి వచ్చిన నిందితుడు తనను జైలుకు పంపించిందనే కోపంతో బాధితుల తల్లిని బెదిరింపులకు గురిచేయసాగాడు. ఈ విషయంపై గత నెల 17న బాధితుల తల్లి నగర పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు రావడంతో ఆమెను వెంబడించిన నిందితుడు అక్కడికి కూడా వచ్చాడు. దీంతో ఆమె భయంతో తన కుమార్తెతో కలిసి రోడ్డునెంబర్–12లోని ఓ హోటల్‌లోకి వెళ్లి దాక్కోగా అక్కడికి వెళ్లిన నిందితుడు ఆమెను బెదిరించాడు. అతడి నుంచి తమకు ప్రాణహాని ఉందంటూ బాధితుల తల్లి సోమవారం బంజారా హిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

7 సార్లు..
5402 ఫోన్లు


బాధితులతో సైబరాబాద్ సీసీఎస్ పోలీసులు

సెల్‌ఫోన్ల రికవరీలో మొదటి స్థానం సాధిస్తాం
- డేటా పరిరక్షణపై అవగాహన అవసరం
- సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ ఎల్‌సీనాయక్

గచ్చిబౌలి: సీఈఐఆర్ పోర్టల్ ఆధారంగా చోరీకి గురైన సెల్ ఫోన్ల రికవరీలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచేందుకు కృషి చేస్తున్నామని సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ ఎల్‌సీనాయక్ అన్నారు. చోరీకి గురైన ఫోన్లలోని సమాచారాన్ని కాపాడుకోవడంలో వినియోగదారులకు సరైన అవగాహన ఉండటం లేదన్నారు. సోమవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను 7వ సారి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఈఐఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్ ఆధారంగా చోరీకి గురైన మొబైల్ ఫోన్‌ను సులభంగా రికవరీ చేసేందుకు వీలుంటుందన్నారు. ఫోన్ పోగొట్టుకున్న తరువాత దానిలోని డేటాను రక్షించుకోవడంపై బాధితులు అవగాహన పెంచుకోవాలన్నారు. సీఈఐఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేస్తే ఈఎంఐ బ్లాక్ చేయడం ద్వారా డేటా సురక్షితంగా ఉండే అవకాశం ఉందన్నారు. సంబంధిత బ్యాంకులకు సమాచారం ఇచ్చి యూపీఐలను లాక్ చేయాలని సూచించారు.ఈ సందర్భంగా రూ.95 లక్షల విలువైన 310 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేసినట్లు తెలిపారు. మాదాపూర్ సీసీఎస్ పరిధిలో 80, బాలానగర్ సీసీఎస్‌లో 65, మేడ్చల్‌లో 55, రాజేంద్రనగర్ 55, శంషాబాద్ పరిధిలో 55 ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు 5402 ఫోన్లను బాధితులకు అందజేసినట్లు డీసీపీ వివరించారు.


బాధితురాలికి సెల్‌ఫోన్ అందజేస్తున్న డీసీపీ ఎల్‌సీ నాయక్

సైబర్ బాధితుల్లో విద్యావంతులే అధికం..

ఇటీవలి కాలంలో సైబర్ నేరాల సంఖ్య గణనీయంగా పెరిగిందని, బాధితుల్లో విద్యావంతులే అత్యధికంగా ఉన్నారని డీసీపీ పేర్కొన్నారు. సెల్ ఫోన్‌కు వచ్చే లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయరాదని సూచించారు. బంగారం ధర పెరగడంతో చైన్ స్నాచింగ్‌ల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. వేసవిలో తలుపులు వేసుకోకుండా నిద్ర పోవద్దన్నారు. ఊరికి వెళితే పక్కవారితో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలను తగ్గించవచ్చారు.

కార్డు చూపితే కాజేశారు.!

- రూ.1.8 లక్షలు స్వాహా చేసిన నేరగాళ్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ బాధితుడు సైబర్ నేరగాళ్లకు ఓటీపీలు చెప్పకున్నా.. వీడియో కాల్ ద్వారా తన క్రెడిట్‌కార్డు చూపడంతో రూ.1.8 లక్షలు నష్టపోవాల్సి వచ్చింది. దీనిపై సోమవారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగికి (48) ఇటీవల ఓ ఫోన్ కాల్ వచ్చింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) క్రెడిట్ కార్డ్స్ విభాగానికి చెందిన కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నట్లు సైబర్ నేరగాడు చెప్పాడు. బాధితుడు సుదీర్ఘ కాలంగా తన క్రెడిట్ కార్డు వినియోగించట్లేదు. ఈ కారణంగా బ్యాంకు భారీ పెనాల్టీ విధించిందని నేరగాడు చెప్పాడు. ఆ మొత్తాన్ని మాఫీ చేస్తానంటూ వీడియో కాల్‌కు మార్చాడు. క్రెడిట్ కార్డును, దాని సీవీవీ నెంబర్‌ను చూపించమని కోరాడు. అతడి మాటలు నమ్మిన బాధితుడు అలానే చేయడంతో ఆ క్రెడిట్ కార్డు నుంచి కొంత మొత్తం డెబిట్ అయింది. బాధితుడు ఓటీపీలు (వన్–టైమ్ పాస్‌వర్డ్) వచ్చినప్పటికీ దఫదఫాలుగా రూ.1.8 లక్షలు డెబిట్ అయినట్లు సందేశాలు వచ్చాయి. సదరు క్రెడిట్‌కార్డు లిమిట్ కేవలం రూ.50 వేలే అయినప్పటికీ ఇంత మొత్తం పోయిందంటూ బాధితుడు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశాడు.

స్నేహితుడి భార్యపై లైంగిక దాడికి యత్నం

అమీర్‌పేట: స్నేహితుడి భార్యపై కన్నేసిన ఓ కామాంధుడు భర్త ఇంట్లో లేని సమయంలో ఆమెపై లైంగిక దాడికి యత్నించిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బల్కంపేటకు చెందిన మహిళ భర్త గతంలో ప్రైవేటు సంస్థలో పనిచేసేవాడు. అతడి స్నేహితుడైన పేసుపులేటి వెంకట నరసింహారావు అలియాస్ పీవీ అనే వ్యక్తి అతడితో ఉద్యోగం మాన్పించి తన సొంత సంస్థ అయిన లోన్ వాలా డాట్ కామ్‌లో చేర్చుకున్నాడు. ఉద్యోగం ఇచ్చాననే సాకుతో తరచూ స్నేహితుడి ఇంటికి వెళ్లేవాడు. స్నేహితుడి భార్యపై కన్నేసిన అతను తన కోరిక తీర్చాలంటూ ఆమెను వేధిస్తున్నాడు. ఆమె ఫోన్‌కు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపేవాడు. బాధితురాలు ఈ విషయం భర్త దృష్టికి తీసుకెళ్లడంతో అతను పీవీ వద్ద పని మానేసి మరో సంస్థలో చేరాడు. ఆదివారం మధ్యాహ్నం స్నేహితుడు లేని సమయంలో ఇంట్లోకి చొరబడిన పీవీ ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. అతడి భారి నుంచి తప్పించుకున్న బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. గర్భవతినని చెప్పినా వినిపించుకోకుండా లైంగిక దాడికి యత్నించాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అర్జీలను పెండింగ్ పెట్టొద్దు

- అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్
- ప్రజావాణికి 46 దరఖాస్తులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఆయా శాఖల వారీగా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఫిర్యాదుదారులు అందజేసిన 46 దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, సూపరింటెండెంట్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి..

మొయినాబాద్ రూరల్: తోల్‌కట్టలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను రక్షించాలని పలువురు గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 107లో 12.16 ఎకరాల లావణీ భూమి ఉందని తెలిపారు. ఇందులో కొంత భూమిని ఇతరులు క్రయవిక్రయాలు చేశారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి, సర్కారు భూమిని స్వాధీనం చేసుకోవాలని శివశంకర్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, నర్సింహ్మా, మల్లేష్, యాదయ్య తదితరులు అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు దరఖాస్తు అందజేశారు.

రోడ్డుపై పార్కు చేసిన కార్లు దగ్ధం



బన్సీలాల్‌పేట్: రోడ్డుపై పార్కు చేసిన కార్లు అగ్నికి ఆహుతైన సంఘటన సోమవారం గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ హరీష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. న్యూబోయిగూడలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ పక్కన మహీంద్రా, ఓక్స్ వ్యాగన్ కార్లను పార్కు చేశారు. సోమవారం తెల్లవారు జామున పక్కనే ఉన్న చెత్తకుండీలో చెలరేగిన మంటలు చుట్టుపక్కలకు వ్యాపించడంతో రెండు కార్లకు నిప్పంటుకుని దగ్ధమయ్యాయి. దీనిపై సమాచారం అందడంతో గాంధీనగర్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇష్టపడిన యువతి దక్కలేదని..

- ఆమె భర్త దారుణ హత్య
- స్నేహితులతో కలిసి యువకుడి ఘాతుకం


వెంకటరమణ (ఫైల్)


వెంకట రమణ మృతదేహం

కూకట్‌పల్లి: తాను ఇష్టపడిన యువతి మరో వ్యక్తిని పెళ్లి చేసుకోవడాన్ని జీర్ణించుకోలేని ఓ యువకుడు తన స్నేహితులతో కలిసి ఆమె భర్తను దారుణంగా హత్య చేసిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా, అడవిపూడి గ్రామానికి చెందిన జగదీష్, అతడి సోదరుడు దుర్గా ప్రసాద్ కేపీహెచ్‌బీ కాలనీలోని సర్దార్ పటేల్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరి సమీప బంధువు కాళ్ల వెంకటరమణ భగత్ సింగ్ నగర్‌లో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దుర్గాప్రసాద్ భార్య, వెంకట రమణ భార్య అక్కా చెల్లెళ్లు కావటంతో మూడు కుటుంబాల మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వెంకట రమణ తరచూ దుర్గా ప్రసాద్, జగదీష్‌ల వద్దకు వచ్చి వెళుతుండేవాడు. కాగా అదే గ్రామానికి చెందిన పవన్ ఎనిమిదేళ్ల క్రితం వెంకట రమణ భార్య శ్రావణి సంధ్యను వివాహం చేసుకునేందుకు ప్రయత్నించగా అతడి ప్రవర్తన సరిగా లేకపోవడంతో ఆమె తల్లిదండ్రులు అందుకు అంగీకరించలేదు. ఆ తర్వాత కొన్నాళ్లకే ఆమెకు కాళ్ల వెంకటరమణతో వివాహం జరిపించారు. తనకు దక్కని శ్రావణి సంధ్య మరొకరిని పెళ్లి చేసుకోవడం జీర్ణించుకోలేని పవన్ అప్పటి నుంచి వారిపై కక్ష పెంచుకున్నాడు. పథకం ప్రకారం నగరానికి మకాం మార్చిన పవన్ కూడా కూకట్‌పల్లి ప్రాంతంలోనే ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శ్రావణి సంధ్యను వివాహం చేసుకున్న వెంకటరమణపై కక్ష పెంచుకున్న పవన్ అతడిని హత్య చేసేందుకు అతడి కదలికలపై నిఘా ఏర్పాటు చేశాడు. వెంకట రమణ తరచూ జగదీష్ ఇంటికి వస్తున్నట్లు గుర్తించిన పవన్ అదను కోసం ఎదురు చూస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం దీనిని పసిగట్టిన జగదీష్ తన ఇంటి ఎదుట నిలుచుని ఉన్న పవన్‌ను గుర్తించి ఇక్కడ ఎందుకు ఉన్నావని నిలదీయగా తన స్నేహితుల కోసం ఎదురు చూస్తున్నట్లు చెప్పాడు. వారం రోజుల క్రితం శ్రావణి సంధ్య, ఆమె సోదరి ఉమా మహేశ్వరితో కలిసి స్వగ్రామంలో పెళ్లికి వెళ్లింది. ఆదివారం రాత్రి వెంకటరమణ జగదీష్ ఇంటికి వచ్చినట్లు సమాచారం అందడంతో పవన్ తన స్నేహితులు మరో నలుగురితో కలిసి అక్కడికి వచ్చి మాటు వేశాడు. జగదీష్ ఇంటి గేటు స్కూటీని అడ్డు పెట్టి స్నేహితులతో కలిసి సిగరెట్ తాగుతూ ఉండటాన్ని గుర్తించిన జగదీష్ అతడిని నిలదీయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. పవన్ జగదీష్‌తో గొడవ పడుతుండటాన్ని గుర్తించిన వెంకట రమణ బయటికి వచ్చి అతడిని అడ్డుకునే ప్రయత్నం చేయగా పవన్ కత్తితో వెంకటరమణ ఛాతిలో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన వెంకటరమణ అక్కడికక్కడే కుప్పకూలడంతో పవన్, అతడి స్నేహితులు అక్కడి నుంచి పరారయ్యారు. అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న డాక్టర్ సంజన సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని పరీక్షించగా వెంకటరమణ అప్పటికే మృతి చెందాడు. జగదీష్ ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల్లో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రధాన నిందితుడు పవన్ పరారీలో ఉన్నట్లు తెలిసింది.

గోపన్‌పల్లి తండాలో ఐటీ పార్క్ వద్దు


అభివాదం చేస్తున్న ఎస్.రాజు నాయక్, తదితరులు

హిమాయత్‌నగర్: శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి తండాలో ఐటీ పార్క్ ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని ఆలిండియా బంజారా సేవా సంఘ్ జాతీయ అధ్యక్షుడు ఎస్.రాజు నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆలిండియా ట్రైబల్ జేఏసీ చైర్మన్ రవీంద్ర నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మ నాయక్, హైకోర్టు అడ్వొకేట్ శ్రీనివాస్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. గోపన్‌పల్లి తండా పరిసరాల్లో 440 ఎకరాల్లో ప్రభుత్వం ఐటీ పార్కు ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించడంతో గోపన్‌పల్లి తండా లంబాడీలలో భయాందోళన నెలకొందని తెలిపారు. దాదాపు 400 ఏళ్ల నుంచి తమ పూర్వీకులు ఇక్కడి కొండ కోనల్లో పశు పోషణ, వ్యవసాయం చేస్తుకుంటూ జీవనం కొనసాగించి వారసత్వంగా ఈ భూములు ఇచ్చారని వివరించారు. ఇప్పుడు తండావాసులు ఆ భూముల్లో వరి, కూరగాయలు, ఇతర ఆహార పంటలు పండించుకొని జీవిస్తున్నారని తెలిపారు. ఈ భూములకు ప్రభుత్వం పట్టా పాసుబుక్‌లు కూడా జారీ చేసిందని పేర్కొన్నారు. ఐటీ పార్కు కోసం సర్వే చేసి పనులు ప్రారంభించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించడంతో తమ భూముల జోలికి రావొద్దని తండావాసులు వేడుకుంటున్నారని పేర్కొన్నారు. మొండిగా ముందుకు వెళ్తే, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గిరిజన సంఘాలతోపాటు రాజకీయ పార్టీల సహకారంతో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘ్ నేతలు కిషన్, గోడి నాయక్, హనుమంతు, పాండు, రాంచందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో అడ్మిషన్లకు 'దోస్త్'లో రిజిస్ట్రేషన్ చేసుకోండి

షాద్‌నగర్ రూరల్: ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీలో అడ్మిషన్ కోసం వెంటనే దోస్త్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీతాపోలె సూచించారు. ఈనెల 21 వరకు అవకాశం ఉందని తెలిపారు. 29న అడ్మిషన్ల కేటాయింపుపై తొలి జాబితా విడుదలవుతుందని పేర్కొన్నారు. ఈనెల 30 నుంచి జూన్ 6 వరకు అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. వివరాలకు 63050 51490, 9885003390, 9703441345 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇబ్రహీంపట్నం కళాశాలలో..

ఇబ్రహీంపట్నం: 2025–26 విద్యాసంవత్సరానికి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్) ద్వారా ప్రథమ సంవత్సరంలో విద్యార్థులు చేరేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా.రాధిక సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 89199 96725, 94417 05076, 93810 6920 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు స్పీకర్ పర్యటన

మోమిన్‌పేట: మండల పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు మంగళవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ విచ్చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుద్దోడ్కతండా బీటీ రోడ్డు, ఏన్కతల పెద్ద చెరువు మరమ్మతులు, మల్‌రెడ్డిగూడెం చెరువు మరమ్మతులు, మొరంగపల్లి, ఎన్కేపల్లి, కేసారం, సయ్యద్ అల్లిపూర్, ఇజ్రాచిట్టంపల్లి, వెల్‌చాల్, దుర్గంచెర్వు గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

విద్యార్థులకు గవర్నర్ అభినందనలు



బంజారాహిల్స్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 500 మార్కులకు పైగా సాధించిన రాజ్‌భవన్ పాఠశాల విద్యార్థులను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అభినందించారు. 500లకు పైగా సాధించిన 21 మందికి జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. లక్ష్య సాధనకు అంకితభావం, నిబద్ధతతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ డీఈఓ రోహిణి, డిప్యూటీ ఈఓ శామ్యూల్‌రాజ్, ఇన్‌చార్జి హెచ్‌ఎం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక..

- ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్: ఒంటరితనం భరించలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురాం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గోదావరి ఖనికి చెందిన గుటుకు శ్రీశైలం (45) ఘట్‌కేసర్‌కు వలస వచ్చి బోగారం లిక్కర్ గోదాములో కూలీగా పనిచేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో అతను మూడు నెలలుగా స్థానిక బాలాజీనగర్‌లోని ఓ గదిలో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. సోమవారం అతడి గది నుంచి దుర్వాసన వస్తున్నట్లు గుర్తించిన ఇంటి యజమానురాలు కాశమ్మ శ్రీశైలం కుమార్తెకు సమాచారం అందించింది. దీంతో ఆమె తండ్రికి ఫోన్ చేయగా స్పందించకపోవడంతో బాలాజీనగర్‌లో తండ్రి ఉంటున్న ఇంటికి వచ్చింది. స్థానికుల సాయంతో తలుపులు తెరిచి చూడగా శ్రీశైలం బెడ్‌రూంలో చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. కుటుంబ కలహాలు, ఒంటరితనంతో మనస్తాపానికి లోనై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారానికి అడ్డొస్తున్నాడనే..

- కొంపల్లి హత్య కేసులో వీడిన మిస్టరీ
- ఐదుగురు నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: కొంపల్లి మార్కెట్‌లో ఆదివారం రాత్రి జరిగిన హత్య కేసును పేట్‌బషీరాబాద్ పోలీసులు చేదించారు. వ్యాపారానికి అడ్డొస్తున్నాడని..కేసు వెనక్కి తీసుకోవడం లేదన్న కోపంతోనే ఈ హత్య జరిగినట్లుగా నిర్ధారించారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, అడిషనల్ డీసీపీ పురుషోత్తం, పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ విజయ వర్ధన్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. మేడ్చల్ ప్రాంతానికి చెందిన సయ్యద్ సిద్దిక్ గత 15 ఏళ్లుగా కొంపల్లి, మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో జరిగే వారాంతపు సంత మార్కెట్‌లలో బ్యాటరీ లైట్లు అద్దెకు ఇచ్చే వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో బొల్లారం ప్రాంతానికి చెందిన షేక్ అహ్మద్ సైతం మూడు నెలల క్రితం అదే వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఈ విషయమై వారి మధ్య గొడవ జరగడంతో మేడ్చల్ పోలీస్ స్టేషన్ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో తన వ్యాపారానికి అడ్డురావడమేగాక, కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్న సయ్యద్ సిద్దిక్ అడ్డు తొలగించుకోవాలని షేక్ అహ్మద్ నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా వారం రోజులుగా సిద్దిక్ కదలికలపై నిఘా ఉంచిన అతను తన సోదరుడు షేక్ రహమత్, స్నేహితులు శశి కుమార్, రాజ్ కమల్‌తోపాటు పాత నేరస్తుడు జంపన్నతో కలిసి అతడిని హత్య చేసేందుకు పథకం రూపొందించాడు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి సిద్దిక్ కొంపల్లి మార్కెట్ సంతలో సిద్దిక్ ఉన్నట్లు గుర్తించిన వారు కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కత్తులను స్వాధీనం చేసుకున్నారు.

ఒక్కరూ అడ్డుకోలేదు..

మార్కెట్‌లో వందల మంది సమక్షంలో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేస్తున్నా ఒక్కరూ స్పందించకపోవడం దారుణమని డీసీపీ కోటిరెడ్డి అన్నారు. బహిరంగంగా ఐదుగురు వ్యక్తులు ఒకరిని హత్య చేస్తున్నా పట్టించుకోకుండా తమాషా చూడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయమై ఎవరికి వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలని.. ఈ రోజు అతడిపై జరిగిన దాడి రేపు మనపై దాడి జరగదు.. అన్న భావన ఉండకూడదన్నారు. ఇలాంటి సమయాల్లో ఎవరో ఒకరు ఎదిరిస్తే ఒక ప్రాణం పోకుండా ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసును 12 గంటల్లోనే చేదించిన సిబ్బందికి సీపీ చేతుల మీదుగా రివార్డు అందజేయనున్నట్లు తెలిపారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్స్



క్రికెట్ కిట్స్‌ను అందజేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ

బంజారాహిల్స్: ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ డివిజన్‌లోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో యువకులకు సోమవారం క్రికెట్ కిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిట్స్‌ను సద్వినియోగం చేసుకుని క్రికెట్‌లో రాణించాలని ఆకాంక్షించారు. వేసవి శిబిరాలతోనే చాలా మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ఆటలో నిరంతర ప్రాక్టీస్ చేయాలన్నారు.

నడుచుకుంటూ వెళ్తున్న బాలుడిపై బ్లేడ్‌తో దాడి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-11లోని గౌరీశంకర్‌కాలనీలో నివసించే రాజేష్ అనే యువకుడు సాయిబాబా టెంపుల్ నుంచి ఫోన్ మాట్లాడుకుంటూ తన స్నేహితుడు రాజు ఇంటికి రాత్రి 9 గంటల ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో ఓ గుర్తుతెలియని యువకుడు (18) దారికాసి రాజేష్‌తో గొడవకు దిగాడు. తనతో పాటు తెచ్చుకున్న బ్లేడ్‌తో రాజేష్ ఛాతిపై పొడవడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. బాధితుడు వెంటనే అక్కడి నుంచి తప్పించుకుని తన స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులకు సమాచారం అందగా చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. తనపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాయిని నర్సింహారెడ్డి సేవలు భేష్



నాయిని నర్సింహారెడ్డికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ నాయకులు, మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి జయంతి సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయిని నర్సింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లతో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చెస్‌లో సత్తాచాటుతున్న పట్లోళ్ల ఇంద్రారెడ్డి



శ్రీనగర్‌కాలనీ: చెస్ ఫిడే రేటింగ్స్‌లో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మనవడు పట్లోళ్ల ఇంద్రారెడ్డి సత్తాచాటాడు. గతవారం యూరప్ బాస్నియాలో జరిగిన ఇంటర్నేషనల్ రాపిడ్ చెస్‌టోర్నమెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించి 400 ఫిడే పాయింట్లు పెంచుకొని 1,804 పాయింట్స్‌తో ఫిడే రేటింగ్స్‌లో ప్రతిభ కనబరిచాడు. జూబ్లీహిల్స్‌లోని ఏకాగ్ర చెస్ అకాడమీలో ఫిడే రేటింగ్స్‌లో టాప్‌స్థానాల్లో ఉన్న చెస్ క్రీడాకారులతో ఒకేసారి పదిమందితో సోమవారం చెస్ టోర్నమెంట్ ఆడాడు. గ్రాండ్‌మాస్టర్ మరియన్ పెట్రోవ్ తదితరులు పాల్గొన్నారు.

‘యువ వికాసం’ స్క్రూటినీ పూర్తి

- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో పరిశీలిన పూర్తి
- బ్యాంక్‌లకు పంపించిన మండల సిబ్బంది
- సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక
- జూన్ 2న అర్హులకు రుణ పత్రాల పంపిణీ



రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకుంటున్న యువత(ఫైల్)

బంజారాహిల్స్: యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక సాయం అందించాలన్నదే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం. ఏప్రిల్ 14 వరకు దరఖాస్తులు స్వీకరించగా, చాలామంది వార్డు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో ఫిజికల్‌గా సంబంధిత ధ్రువపత్రాలతో కూడిన ఆన్‌లైన్ దరఖాస్తులు అందించాలని మరో అవకాశాన్ని కూడా కల్పించారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు అన్ని వార్డు కార్యాలయాల్లో అధికారులు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటుచేసి ఆన్‌లైన్ దరఖాస్తులను ఫిజికల్‌గా తీసుకున్నారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పిస్తుండటంతో అర్జీలు చాలామంది సమర్పించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో షేక్‌పేట, ఖైరతాబాద్ మండల కార్యాలయాల్లో ఈ దరఖాస్తుల పరిశీలన రెండు రోజుల క్రితమే ముగిసింది. ఆయా డివిజన్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభా ప్రాతిపదికన యూనిట్ల లక్ష్యాలు నిర్దేశించనున్నారు. ఇప్పటికే దరఖాస్తులను వడబోసి ఆయా బ్యాంకులకు దరఖాస్తుదారుల వివరాలను సోమవారం పంపించారు. అన్ని సంక్షేమ శాఖల సిబ్బంది, బ్యాంకర్లతో కూడిన బృందం ముఖాముఖి నిర్వహించి మే నెలాఖరు వరకు లబ్ధిదారుల జాబితాను రూపొందించనుంది.

పథకం అమలు ఇలా..

ప్రభుత్వ విధి విధానాల ప్రకారం కుటుంబంలో ఒక్కరికే అవకాశం కల్పిస్తారు. మొత్తం యూనిట్లలో 25 శాతం వరకు మహిళలకు కేటాయిస్తారు. వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇస్తారు. గతంలో స్వయం ఉపాధి పొందని వారికి ప్రాధాన్యం లభిస్తుంది. పథకానికి ఎంపికైన వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్వయం ఉపాధి శిక్షణకు ఎంపికై న వారికి తెలంగాణ ఆవిర్భావం దినోత్సవం జూన్ 2న రుణపత్రాలు అందజేయనున్నారు. బ్యాంక్‌కు పంపించిన దరఖాస్తుదారుల్లో ఎవరు ఎంపికవుతారో, ఎందరు తిరస్కరణకు గురవుతారో వేచి చూడాల్సి ఉంది.

సిబిల్ స్కోర్ ఆధారం..

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి సిబిల్ స్కోర్ ఆధారంగా రుణాలు మంజూరు కానున్నాయి. ఇప్పటికే దరఖాస్తులను బ్యాంక్‌లకు పంపించగా, బ్యాంక్ సిబ్బంది ఈ దరఖాస్తులను మరోసారి పరిశీలించనున్నారు. పాన్‌కార్డు, ఆధార్‌కార్డు ఆధారంగా గతంలో వీరేమైనా రుణాలు పొందారా? అని ఆరా తీస్తారు. ఇళ్లు, కార్లు, స్థలాలు, ఇతరత్రా సామాగ్రి బ్యాంక్ రుణాల ద్వారా తీసుకుని ఉంటే సిబిల్ స్కోర్ ఆధారంగా వీరికి ఈ పథకం వర్తిస్తుంది. ఇదిలా ఉండగా దరఖాస్తుదారులు రూ.50 వేలలోపు రుణానికి అర్హులు అయితే బ్యాంక్‌తో సంబంధం లేకుండా వీరికి నేరుగా రుణం అందజేస్తారు. రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వారి ఖాతాల్లో నగదు జమ చేస్తారు.

షేక్‌పేట మండల పరిధిలో..

షేక్‌పేట మండల పరిధి కిందికి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్లు వస్తాయి. ఈ నాలుగు డివిజన్ల పరిధిలో మొత్తం 6,308 దరఖాస్తులు రాగా, ఇందులో 2,370 దరఖాస్తులను స్క్రూటినీ అనంతరం దరఖాస్తుదారులు ఏ బ్యాంక్‌లో ఖాతా కలిగి ఉన్నారో ఆ బ్యాంకులకు పంపించారు. 2,370 మంది బ్యాంక్‌లకు పంపించిన దరఖాస్తుదారుల్లో ఎస్సీలు 520, ఎస్టీలు 140, బీసీలు 857, ఈబీసీ 6, మైనార్టీ 816, క్రిస్టియన్ మైనార్టీ 31 ఉన్నాయి.

ఖైరతాబాద్ మండల పరిధిలో..

ఖైరతాబాద్ మండల పరిధి కిందికి సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్ డివిజన్లు వస్తాయి. ఈ డివిజన్ల పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకానికి మొత్తం 8,848 ఆన్‌లైన్ దరఖాస్తులు రాగా, ఇందులో 3,558 మంది ఫిజికల్‌గా ఆన్‌లైన్ దరఖాస్తులకు ధ్రువపత్రాలను జతచేసి వార్డు కార్యాలయాల్లో అందజేశారు. 10 రోజుల నుంచి ఈ దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. స్క్రూటినీ అనంతరం 2,584 దరఖాస్తులను సోమవారం ఆయా బ్యాంక్‌లకు పంపించారు. ఇందులో ఎస్సీ 608, ఎస్టీ 273, బీసీ 764, ఈబీసీ 51, మైనార్టీ 854, క్రిస్టియన్ మైనార్టీ 34 ఉన్నాయి.



వీర జవాన్లకు నివాళులర్పిస్తున్న మధురానగర్‌కాలనీ నేతలు

వీర జవాన్లకు నివాళి

వెంగళరావునగర్: కష్టకాలంలో దేశాన్ని కాపాడుతున్న వీర జవాన్లకు దేశ ప్రజలంతా రుణపడి ఉంటారని మధురానగర్‌కాలనీ నేతలు తెలియజేశారు. ఇండో-పాక్ యుద్ధం నేపథ్యంలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ల ఆత్మలకు శాంతి కలగాలని కోరుకుంటూ వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు సోమవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పలువురు వీర జవాన్ల చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు కోడె సాంబశివరావు, మనోహర్‌రావు, హనుమంతరావు, సుగుణ, రాజేంద్రప్రసాద్, కొల్లి లక్ష్మణ్‌రావు, చిలకల వెంకటేశ్వరరావు, దేవిరెడ్డి నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



ఫిలింనగర్: వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఫిలింనగర్‌లోని ఫిలింనగర్ దైవసన్నిదానం ఆలయంలో శ్రీరమా సమేత సత్యనారాయణ స్వామి వ్రతాలు సోమవారం ఘనంగా జరిగాయి. సామూహిక వ్రతాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పౌర్ణమి సందర్భంగా సతీసమేతంగా స్వామి వారి వ్రతాలను ఆచరిస్తే మంచి జరుగుతుందని, ఎంతో పుణ్యఫలం లభిస్తుందని అని భక్తుల విశ్వాసమని ఆలయ అర్చకులు తెలిపారు.

జూబ్లీహిల్స్‌లో డిబ్బర్ స్కూల్ ఇండియా ప్రారంభం



డిబ్బర్ స్కూల్ ఇండియాను ప్రారంభిస్తూ..

బంజారాహిల్స్: ఉత్తర ఐరోపాకు చెందిన డిబ్బర్ నగరంలోని జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-48లో తన కొత్త క్యాంపస్‌ను ప్రారంభించింది. డిబ్బర్ స్కూల్ ఇండియా సీఈఓ మార్విన్ డిసౌజా, ఐఐటీ (ఐఎస్ఎం) ధన్‌బాద్‌లోని మేనేజ్‌మెంట్ స్టడీస్ మాజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ప్రమోద్ పాతక్, డిబ్బర్ స్కూల్ ఇండియా గ్రోత్ అండ్ ప్రాజెక్ట్స్ హెడ్ లగ్నజిత్ మొహంతి, టాలీవుడ్ నటుడు కృష్ణసాయితో కలిసి ప్రారంభించారు. డిబ్బర్ స్కూల్స్ ఇండియా సీఈఓ మార్విన్ డిసౌజా మాట్లాడుతూ చిన్నారుల వ్యక్తిత్వ వికాసం, సృజనాత్మకత, మానసిక ఎదుగుదలపై దృష్టి పెట్టే అరుదైన విద్యా విధానానికి డిబ్బర్ పేరుగాంచిందన్నారు.

సర్కిల్-19లో ఒక్క ఫిర్యాదు మాత్రమే..



ప్రజావాణిలో అధికారులు

వెంగళరావునగర్: ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ఏర్పాటు చేస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి స్పందన లభించడం లేదు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ సర్కిల్-19 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన కార్యక్రమంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జవహర్‌నగర్ నుంచి కేవలం ఒక్క ఫిర్యాదు మాత్రమే అందింది. ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో అధికారులు కూడా వెళ్లిపోయారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్-19 ఉప కమిషనర్ జకియా సుల్తానా, డీపీఓ వెంకట కిషన్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రవీద, ఏఎంసీ బాల్‌రాజ్, శానిటేషన్ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తాచాటిన యూసుఫ్‌గూడ ఎన్‌సీసీ కెడెట్స్



సీఏటీసీ క్యాంపులో ఎన్‌సీసీ కేడెట్స్

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ కెడెట్స్ సీఏటీసీ-1 క్యాంపులో పాల్గొన్నారు. నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 3 నుంచి ప్రారంభమై 12వ తేదీ వరకు కొనసాగింది. ప్రభుత్వ పాఠశాలకు చెందిన 38 మంది ఎన్‌సీసీ కెడెట్స్ ఈ క్యాంపులో పాల్గొని వివిధ అంశాల్లో శిక్షణ తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆయా కెడెట్స్‌కు డ్రిల్, ఫైరింగ్, ఎన్‌సీసీ సబ్జెక్ట్స్ క్లాసులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను ఎలా కాపాడాలి తదితర మాక్ డ్రిల్ అంశాలను నేర్పించారు. శిక్షణ అనంతరం కెడెట్స్‌కు పోటీలను నిర్వహించారు. యూసుఫ్‌గూడ ఎన్‌సీసీ కెడెట్స్ రెండు బహుమతులను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం పి.పరమేశ్వరమ్మ, ఎన్‌సీసీ అధికారి పి.ప్రభాకర్ తదితర టీచర్లు ఎన్‌సీసీ కెడెట్స్‌ను అభినందించారు.

సేవల్లో నర్సుల పాత్ర భేష్



కేర్ ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు

బంజారాహిల్స్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రిలో నర్సింగ్ సిబ్బంది సేవలకు కృతజ్ఞతగా వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ‘మా నర్సులు.. మా భవిష్యత్తు’ థీమ్‌తో చేపట్టిన వేడుకల్లో భాగంగా కేర్ ఆస్పత్రి అన్ని యూనిట్లలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. నర్సుల సేవలను గుర్తించి వారిని ఉత్సాహపరిచేందుకు చేపటినట్లు నిర్వాహకులు తెలిపారు. సేవల్లో నర్సుల పాత్ర కీలకం అన్నారు. కేర్ హాస్పిటల్స్ నర్సింగ్ బృంద అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందన్నారు. నైపుణ్యం, మానసిక బలంతో ప్రతిరోజూ పేషెంట్లకు నాణ్యమైన సేవ అందిస్తున్నారన్నారు. కేర్ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ (నర్సింగ్ అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ విస్సీ అశోక్ త్రిభువన్, గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ విశాల్ మహేశ్వరి, గ్రూప్ చీఫ్ మెడికల్ సర్వీసెస్ ఆఫీసర్ డాక్టర్ నిఖిల్ మాథుర్, చీఫ్ హెచ్‌ఆర్ ఆఫీసర్ అమిత్‌సింగ్, వెస్ట్ అండ్ సెంట్రల్ ఇండియా రీజనల్ సీఈఓ హరీష్ త్రివేది, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ వినోద్ రామన్‌తో పాటు వివిధ ఆస్పత్రుల ప్రముఖులు, డాక్టర్లు పాల్గొన్నారు.

ఎన్‌ఓసీ జారీలో అవకతవకలు

- అనుమతుల జారీలో నిబంధనలు పాటించని జీహెచ్ఎంసీ
- క్షేత్రస్థాయిలో పర్యటించిన షేక్‌పేట్ రెవెన్యూ అధికారులు
- జీహెచ్ఎంసీ అధికారులకు లేఖ రాసిన తహసీల్దార్
- ఈ వ్యవహారంపై సమగ్ర వివరాలతో కలెక్టర్‌కు నివేదిక



నాలా ఆక్రమణలను పరిశీలిస్తున్న అధికారులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-11లోని ఉదయ్‌నగర్ నాలాను ఆనుకుని బఫర్ జోన్‌లో వెలిసిన నిర్మాణాలను జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. షేక్‌పేట మండలం సర్వే నంబర్-403లో తెలంగాణ భవన్ నుంచి అంబేడ్కర్‌నగర్ మీదుగా తాజ్‌బంజారా చెరువు వరకు ఉన్న నాలాను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో మూడు రోజులుగా ప్రైవేటు వ్యక్తులు ఫెన్సింగ్ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. ఫెన్సింగ్ వేస్తున్న ప్రాంతం నాలాకు చెందిన బఫర్ జోన్‌లోకి వస్తుందని, దాని పక్కనున్న సుమారు 400 గజాల ఖాళీ స్థలం ప్రభుత్వ స్థలం అంటూ స్థానికులు అడ్డుకునే ప్రయత్నాలు చేయడంతో వివాదం నెలకొంది. కోర్టు ఆదేశాలు ఉన్నాయని చెప్పిన సదరు నిర్మాణదారులు ఆదివారం రోజు ఫెన్సింగ్ పనులు పూర్తి చేశారు. కాగా ఈ వ్యవహారంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి జోనల్ కమిషనర్‌తో పాటు సిటీ ప్లానర్ సాంబయ్య, సర్కిల్-18 డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ తదితరులు సోమవారం నాలాను పరిశీలించారు.

- నీటి పారుదల శాఖ ఇచ్చిన ఎన్‌ఓసీలోని వివరాలకు, జీహెచ్ఎంసీ అనుమతి కోసం స్థలం యజమానులు ఇచ్చిన వివరాల్లో తేడాలు ఉన్న విషయాన్ని అధికారులు గుర్తించారు. 2023 అక్టోబర్‌లో నీటి పారుదల శాఖ అధికారులు జారీ చేసిన ఎన్‌ఓసీలో ఇక్కడ నాలా విస్తీర్ణం కేవలం 3.70 మీటర్లు మాత్రమే అని పేర్కొన్నారు. అయితే రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉదయ్‌నగర్ నాలా విస్తీర్ణం సుమారు 20 నుంచి 25 మీటర్ల దాకా ఉందని తెలుస్తోంది.
- నీటి పారుదల శాఖ ఎన్‌ఓసీ ఇచ్చిన సమయంలో షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాల్సి ఉండగా ఏకపక్షంగా నాలా విస్తీర్ణాన్ని 3.70 మీటర్లుగా నిర్ణయించడం వివాదాస్పదంగా మారింది. జీహెచ్ఎంసీ అనుమతి ఇచ్చిన సమయంలో కూడా నిబంధనలు ఉల్లంఘించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. 2023లో జీహెచ్ఎంసీ అనుమతి కోసం చేసుకున్న దరఖాస్తులను అప్పటి జోనల్ కమిషనర్ తిరస్కరించారు.
- షేక్‌పేట మండల సిబ్బంది సైతం సోమవారం నాలా స్థలాన్ని పరిశీలించారు. తమ రికార్డుల్లో నాలా విస్తీర్ణం ఎక్కువగా ఉందని, నాలాలోకి చొచ్చుకుని వచ్చి ఫెన్సింగ్ వేశారని రెవెన్యూ సిబ్బంది గుర్తించారు. ఇదిలాఉండగా షేక్‌పేట్ మండల రెవెన్యూ అధికారులు సోమవారం చేపట్టిన క్షేత్రస్థాయి విచారణలో కీలక అంశాలు బయటకు వచ్చాయి. గున్నా జైదీప్‌రెడ్డి, సందీప్‌రెడ్డి తదితరులు ఫెన్సింగ్ వేసిన స్థలం మొత్తం టీఎస్ నంబర్ 2, బ్లాక్ ఎస్, వార్డ్ 11లోకి వస్తుందని తేలింది. ఈ స్థలం ప్రభుత్వానికి చెందినదిగా గుర్తించారు. కాగా జీహెచ్ఎంసీ అనుమతి ఇచ్చిన స్థలం టీఎస్ 29, బ్లాక్ వో, వార్డ్ 11లోకి వస్తుందని తేలింది.
- రెవెన్యూ క్లియరెన్స్ లేకుండా సర్వే నంబర్ 403లో అనుమతులు ఎలా ఇస్తారని షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి జీహెచ్ఎంసీ అధికారులకు లేఖ రాశారు. జీహెచ్ఎంసీ ఇచ్చిన భవన నిర్మాణ అనుమతులను పునః పరిశీలించుకోవాలని కోరారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదిక రూపొందించి జిల్లా కలెక్టర్‌కు పంపించామని ఆమె తెలిపారు. జీహెచ్ఎంసీ అనుమతులు ఇచ్చిన స్థలానికి, ఫెన్సింగ్ వేసుకున్న స్థలానికి పొంతన లేదని, ఇదే విషయంపై మరిన్ని వివరాలు సమర్పించాలని ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేశారు.

మాజీ ప్రియురాలిపై దాడి చేసిన యువకుడి అరెస్టు

బంజారాహిల్స్: మాజీ ప్రియురాలిపై దాడికి పాల్పడటమే కాకుండా ఆమె తాజా బాయ్‌ఫ్రెండ్‌ను బెదిరింపులకు గురిచేస్తూ ఆమెను తీవ్రంగా కొట్టిన ఘటనలో నిందితుడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. నాచారం ప్రాంతానికి చెందిన కోటి అఖిల్‌కుమార్(28) బంజారాహిల్స్ రోడ్డు నంబర్-14లోని ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అందులో పనిచేస్తున్న యువతిని కొంతకాలంగా ప్రేమించాడు. ఇద్దరూ కలిసి ఉన్నత చదువుల కోసం పోలాండ్ దేశానికి వెళ్లి అక్కడ కొద్ది రోజులు సహజీవనం చేసిన తర్వాత ఇద్దరి మధ్య గొడవలు రావడంతో ఒకరి తర్వాత ఒకరు హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. ఇక్కడికి వచ్చిన తర్వాత బాధిత యువతి మరో యువకుడితో ప్రేమలో పడింది. ఈ విషయాన్ని మాజీ ప్రియుడు అఖిల్ జీర్ణించుకోలేకపోయాడు. ఆమెను తరచూ వెంబడిస్తూ ఆమె రాకపోకలపై నిఘా ఉంచి ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే ఆమె విధులు ముగించుకుని బంజారాహిల్స్ నుంచి క్యాబ్‌లో తార్నాకలోని తన గదికి వెళ్తుండగా ఆమెను అనుసరించి ఆమెకు తెలియకుండా నేరుగా ఆమె గదిలోకి వెళ్లి తాజా ప్రియుడితో కలిసి ఉండగా ఫొటోలు తీశాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆమె సెల్‌ఫోన్ లాక్కొని అందులో డేటాను తొలగించి ధ్వంసం చేశాడు. ఆమెను తీవ్రంగా కొట్టడంతో కన్ను, ముక్కుపై తీవ్ర గాయాలయ్యాయి. అఖిల్ నుంచి తనకు ప్రాణహాని ఉందని, తన ప్రైవేటు వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరిస్తున్నాడని, తన కుటుంబ సభ్యులను కూడా వేధింపులకు గురిచేస్తున్నాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు అఖిల్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

దడువాయిలకు కనీస వేతనాలు చెల్లించండి



మంత్రికి వినతి పత్రం అందిస్తున్న నాగన్న గౌడ్

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో పనిచేస్తున్న దడువాయిలను స్కిల్డ్ వర్కర్స్‌గా గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ మార్కెట్ దడువాయి హమాలి యూనియన్(ఐఎన్‌టీయూసీ) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దడువాయి హమాలి యూనియన్ గౌరవ సలహాదారు ఎరగాని నాగన్నగౌడ్ నేతృత్వంలో యూనియన్ అధ్యక్షులు సరసాని సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.రవికుమార్, కోశాధికారి బి.వీరన్న తదితరులు సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు.

పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కూడా ముఖ్యం

స్వామి కృష్ణ చైతన్య



శ్రీశ్రీ యూనివర్సిటీ కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న స్వామి కృష్ణ చైతన్య

బంజారాహిల్స్: విద్యార్థులకు చదువుతో పాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, సంస్కృతి, సంప్రదాయాలు కూడా అవసరమని శ్రీశ్రీ యూనివర్సిటీ ఆపరేషన్స్ డైరెక్టర్ స్వామి కృష్ణ చైతన్య అన్నారు. పంజగుట్టలోని నాగార్జున సర్కిల్‌లో శ్రీశ్రీ యూనివర్సిటీ ప్రాంతీయ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాప్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ సంస్థ అనుసంధానంతో శ్రీశ్రీ యూనివర్సిటీ పనిచేస్తుందని తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండర్ రవిశంకర్ ఎంతో గొప్ప లక్ష్యంతో శ్రీశ్రీ యూనివర్సిటీని స్థాపించారని తెలిపారు. ఈ యూనివర్సిటీ చదువుతో పాటు ముందుకు సాగడం, సేవ చేయడం అనే గొప్ప నినాదంతో కొనసాగుతుందని చెప్పారు. ఇంటర్మీడియట్ తర్వాత భవిష్యత్ చదువులపై శ్రీశ్రీ యూనివర్సిటీ సహకరిస్తుందని, ఈ యూనివర్సిటీలో అడ్వాన్స్‌డ్ కోర్సులను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్లు శివరాం, పవన్‌కుమార్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సీనియర్ ఫ్యాకల్టీ స్వామి రిషి దేవరథ్, మనోజ్ మనయ్‌తోడి తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రభుత్వాలు యాదవులను విస్మరిస్తున్నాయి

సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహ యాదవ్



ముఖ్యనాయకుల సమావేశంలో యాదవ సేవా సమితి నాయకులు

పంజగుట్ట: పేదరికంలో మగ్గిపోతున్న యాదవ కులస్తులకు చేయూత ఇవ్వడమే లక్ష్యంగా శ్రీకృష్ణ భారతీయ యాదవ సేవా సమితి పనిచేస్తుందని యాదవ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహ యాదవ్ అన్నారు. ఖైరతాబాద్, తుమ్మలబస్తీలోని సమితి కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులకు చదువుకునేందుకు స్కాలర్‌షిప్స్, అనారోగ్యంతో కొట్టుమిట్టాడుతున్న పేదలకు వైద్యం, పేద యాదవ నిరుద్యోగ యువతకు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పించడం, వివాహ వేదికల ద్వారా పేద యాదవులకు సామూహిక వివాహాలు జరిపించడం వంటి సేవా కార్యక్రమాలు చేసేందుకు తమ సేవా సంస్థ నడుం బిగించిందన్నారు. పూర్వ కాలంలో గౌరవంగా బతికిన యాదవులు ప్రస్తుతం పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని కులాలకు జిల్లా కేంద్రాల్లో విద్యార్థులు చదువుకునేందుకు హాస్టల్స్ ఉన్నాయని, కానీ యాదవులకు లేకపోవడం బాధాకరమన్నారు. అన్ని ప్రభుత్వాలు యాదవులను విస్మరిస్తూనే వస్తున్నాయని వెంటనే యాదవులను బీసీ డీ నుంచి బీసీ బీలోకి మార్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఓరుగంటి వెంకటేష్ యాదవ్, రాజారాం యాదవ్, పేర్ని రామచందర్ యాదవ్, పాండు యాదవ్, వినోద్ యాదవ్, బి.రాజేష్, లక్ష్మీకాంత్, మమతా యాదవ్, శెట్టి ప్రదీప్ యాదవ్, శ్రీకాంత్, మాలతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- మిస్ వరల్డ్–2025 పోటీదారులు చార్మినార్ వద్ద ఉదయం 6.30 గంటలకు హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నారు.
- మాదాపూర్ హైటెక్స్‌లో ప్రపంచ సుందరి పోటీలు జరుగుతాయి.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సెవెన్ విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మిస్ వరల్డ్ పోటీల ప్రారంభ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జానపద కళాకారుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- కేపీహెచ్‌బీ కాలనీలో లులు మాల్‌లో లులు బిగ్ చాకో దేస్ ఫెస్టివల్ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లీష్ పద్యాలు, పాటలపై శిక్షణ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవులు సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మైలార్‌దేవ్‌పల్లి గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 నుంచి ఉదయం 11 గంటల వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజు నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

మేడ్చల్ జిల్లా 'ప్రజావాణి'కి 60 ఫిర్యాదులు



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) హరిప్రియకు 60 ఫిర్యాదులు వచ్చాయి. వీటిల్లో పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా ఉన్నాయి. అక్రమ భవన నిర్మాణాలు, భూకబ్జాలు తదితర వాటిపై కూడా పలువురు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ విభాగంలోని రెవెన్యూ అధికారి రాజేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ హరిప్రియ మాట్లాడుతూ ప్రజావాణి వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

తార్నాక జంక్షన్‌ను పరిశీలించిన కమిషనర్



లాలాపేట: ఇటీవల జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆర్.వి.కర్ణన్ సోమవారం తార్నాక మున్సిపల్ డివిజన్‌లో పర్యటించారు. తార్నాక జంక్షన్ పునరుద్ధరణ, ట్రాఫిక్ నియంత్రణను పరిశీలించారు. జంక్షన్‌ను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. దీంతో పాటుగా తార్నాక డివిజన్‌లో శానిటేషన్, కొనసాగుతున్న అభివృద్ధి పనులపై కింది స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ సుభాష్, ఏఈ వేణు, శానిటేషన్ డీఈ వెంకటేష్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు మీ సేవా కేంద్రాల ద్వారా లైసెన్స్ సర్వే శిక్షణ కార్యక్రమానికి ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్(గణిత శాస్త్రం) ఒక అంశంగా ఉండి కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఐటీఐ డ్రాఫ్ట్‌మన్(సివిల్), డిప్లొమా సివిల్, బీటెక్ సివిల్ లేదా ఇతర సమానమైన విద్యార్హత కలిగి ఉండాలన్నారు. శిక్షణ ఫీజు ఓసీ అభ్యర్థులకు రూ.10,000లు, బీసీలకు రూ.5,000, ఎస్సీ /ఎస్టీలకు రూ. 2,500 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రంలో 50 పనిదినాలలో తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్(తాలీమ్) ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు వి.శ్రీరామ్ జిల్లా సర్వే అధికారి హైదరాబాద్ 98483 68659, డి.అనంతరెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే 94404 38475లను సంప్రదించాలని సూచించారు.

నజీర్... మరో జైలుపక్షి!

- నేపాల్ మీదుగా భారత్‌కు అక్రమంగా వచ్చిన పాకిస్థానీ
- యునానీ డాక్టర్‌గా బార్కస్‌లో స్థిరపడిన నజీర్
- నకిలీ గుర్తింపుకార్డులు తీసుకున్న వైనం
- కోర్టు విధించిన ఐదేళ్ల శిక్ష 2018లోనే పూర్తి
- వెనక్కి తీసుకెళ్లడానికి ఆసక్తి చూపని పాక్ ప్రభుత్వం

సాక్షి, సిటీబ్యూరో: ఉగ్రవాదం, గూఢచర్యంతో పాటు ఆ ముష్కరులకు సహకరించడానికి భారత్‌కు వచ్చే పాకిస్థానీల విషయంలోనే కాదు... పొరపాటునో, గ్రహపాటునో బతుకుతెరువు కోసం అక్రమంగా సహరిద్దులు దాటిన 'దాయాదుల'విషయంలోనూ ఆ దేశ వైఖరి వదిలించుకునే ధోరణిలోనే ఉంటోంది. సైనిక రహస్యాలు తెలుసుకోవడానికి వచ్చిన గూఢచారి అర్షద్ మాలిక్‌కు సహకరించిన షేర్ అలీ కేశ్వానీ చర్లపల్లి కారాగారంలో ఉండగా... బతుకుతెరువు కోసం వచ్చి, యునానీ వైద్యుడి అవతారం ఎత్తిన మహ్మద్ నజీర్ ఇనాఖలియాబి అలియాస్ హకీమ్ చంచల్‌గూడ జైలులో మగ్గుతున్నాడు.

కరాచీ నుంచి బార్కస్‌కు వచ్చి...

పాకిస్థాన్‌లోని కరాచీకి చెందిన నజీర్ 2006లో నేపాల్ మీదుగా భారత్‌లో ప్రవేశించాడు. బీహార్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఇతడు బార్కస్ ప్రాంతంలో స్థిరపడ్డారు. నకిలీ యునానీ డాక్టర్ అవతారం ఎత్తి కొన్నాళ్లు స్థానికులకు వైద్యం కూడా చేశాడు. అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళను వివాహం చేసుకున్నాడు. ఆధార్, పాన్ కార్డు, ఓటర్ ఐడీలను తీసుకోవడంతోపాటు వీటి ఆధారంగా భారతీయ పాస్‌పోర్టు పొంది బ్యాంకు ఖాతాలు తెరిచారు. నజీర్ నకిలీ యునానీ డాక్టర్ అనే సమాచారం అందుకున్న పోలీసులు ఇతడిని 2008లో అరెస్టు చేశారు. అయితే అతడు పాకిస్థానీ అనే విషయాన్ని పోలీసులు గుర్తించలేకపోయారు. ఈ కేసులో బెయిల్ పొంది వచ్చిన నజీర్ పాతబస్తీలోనే నివసించాడు.



ఐదేళ్ల శిక్ష విధించిన న్యాయస్థానం...

సిట్ అధికారులు నజీర్‌పై 2014లో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. దీన్ని విచారించిన న్యాయస్థానం అతడికి ఐదేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ 2018 ఏప్రిల్ 24న తీర్పు చెప్పింది. ఇతడు అప్పటికే సుదీర్ఘకాలం బెయిల్ లేకుండా జైలులో ఉన్నాడు. దీంతో ఆ కాలాన్ని కూడా శిక్షగా పరిగణించడంతో అదే ఏడాది డిసెంబర్ 9తో శిక్షాకాలం పూర్తయింది. అప్పటి నుంచి నజీర్‌ను పాకిస్థాన్‌కు పంపడానికి చంచల్‌గూడ జైలు అధికారులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఏడాదీ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ద్వారా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను సంప్రదిస్తున్నా పాకిస్థాన్‌లో ఉలుకూపలుకూలేదు.

భుజ్‌లో బీఎస్‌ఎఫ్‌కు చిక్కి..

గుజరాత్‌లోని భుజ్ జిల్లాలో ఉన్న ఇండో–పాక్ బోర్డర్ గుండా తమ దేశానికి వెళ్లేందుకు యత్నిస్తుండగా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) అధికారులు 2013 నవంబర్ 18న పట్టుకున్నారు. విచారణలో అతడి జాతీయత, నకిలీ పత్రాల విషయాలు వెలుగులోకి రావడంతో హైదరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చి గుజరాత్ జైలుకు తరలించారు. నజీర్‌పై చాంద్రాయణగుట్ట ఠాణాలో ఫారెనర్స్ యాక్ట్, పాస్‌పోర్టు యాక్ట్ సహా వివిధ చట్టాల కింద సుమోటోగా కేసు నమోదైంది. నాంపల్లి కోర్టు నుంచి ప్రిజనర్స్ ట్రాన్సిట్ వారెంట్ తీసుకుని హైదరాబాద్‌కు తరలించారు. చాంద్రాయణగుట్ట నుంచి ఈ కేసు సీసీఎస్ అధీనంలోని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)కు బదిలీ అయింది.

'చిల్' అవుతున్నారు!

- భగ్గున మండుతున్న ఎండలు
- గ్రేటర్‌లో భారీగా బీర్ల అమ్మకాలు

సాక్షి, సిటీబ్యూరో: అసలే ఎండలు.. ఆపై వేసవి తాపం.. ఉక్కిరిబిక్కిరి అవుతున్న మద్యంప్రియులు బీర్లతో చిల్ అవుతున్నారు. పెద్దఎత్తున బీర్లు సేవిస్తున్నారు. దీంతో రెండు నెలలుగా బీర్ల అమ్మకాలు అనూహ్యంగా పెరిగాయి. గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈసారి బీర్ల అమ్మకాలు రెట్టింపైనట్లు ఎక్సైజ్ శాఖ తెలిపింది. సాధారణంగా విస్కీ, బ్రాందీ వంటి లిక్కర్‌ను సేవించే వాళ్లు సైతం 'చిల్'అయ్యేందుకు చల్లటి బీర్లను ఆశ్రయిస్తున్నారు. ఒక్కసారిగా వీటికి డిమాండ్ పెరగడంతో వైన్‌షాపులు సహా మార్టుల్లో చల్లని బీర్లు దొరకని పరిస్థితి నెలకొంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో చల్లటి బీర్ల కొరత ఏర్పడుతోంది. సాధారణ రోజుల్లో రోజుకు పది నుంచి పదిహేను కాటన్ల బీర్లను మాత్రమే రిఫ్రిజిరేటర్లలో బీర్లను పెట్టేవారు. ప్రస్తుత డిమాండ్ నేపథ్యంలో రోజుకు 30 నుంచి 40 కేసుల బీర్లను రిఫ్రిజిరేటర్లలో నిల్వ చేయాల్సి వస్తోంది. అయినా చిల్డ్ బీరు దొరకడం కష్టమవుతోంది. తెలంగాణ వ్యాప్తంగా ఏప్రిల్‌లో లిక్కర్ అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి రూ.3,272.32 కోట్ల ఆదాయం సమకూరగా, కేవలం గ్రేటర్ జిల్లాల నుంచే రూ.1160 కోట్లకుపైగా ఆదాయం సమకూరడం గమనార్హం.

ఏప్రిల్ నెలలో మద్యం అమ్మకాలు ఇలా...

ఎక్సైజ్ జిల్లా	లిక్కర్ కేసులు	బీరు కేసులు	ఆదాయం
హైదరాబాద్	1,57,070	1,53,329	రూ.152.49 కోట్లు
సికింద్రాబాద్	1,47,891	1,48,739	రూ.143.44 కోట్లు
మల్కాజ్‌గిరి	58,975	88,413	రూ.61.66 కోట్లు
మేడ్చల్	2,23,303	3,03,371	రూ.234.34 కోట్లు
సరూర్‌నగర్	2,23,135	3,56,499	రూ.244.80 కోట్లు
శంషాబాద్	2,19,649	3,27,711	రూ.256.32 కోట్లు
వికారాబాద్	70,833	95,657	రూ.67.18 కోట్లు

సేల్ డీడ్ రద్దు కుదరదు

అయ్యన్న ఇన్‌ఫ్రాకు రెరా షాక్

సాక్షి, సిటీబ్యూరో: గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయకుండా గృహ కొనుగోలుదారుడిని మోసగించిన ఓ నిర్మాణ సంస్థకు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ–రెరా) షాక్ ఇచ్చింది. కస్టమర్‌తో చేసుకున్న సేల్ డీడ్ అగ్రిమెంట్‌ను రద్దు చేస్తూ అయ్యన్న ఇన్‌ఫ్రా తీసుకున్న నిర్ణయాన్ని టీజీ–రెరా తప్పు పడుతూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి... అయ్యన్న ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ శేరిలింగంపల్లి లోని గుట్టల బేగంపేట సమీపంలో 2,500 గజాల్లో రెండు సెల్లార్లతో 12 అంతస్తుల అపార్ట్‌మెంట్ ను నిర్మిస్తున్నామని ప్రచారం చేసింది. ఇందులో ఒక్కొక్కటి సుమారు 4,500 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఫ్లాటు అమ్మకానికి ఉన్నట్లు ప్రచారం చేసింది. దీనితోపాటు ఒక్కో ఫ్లాటుకు మూడు పార్కింగ్ ప్లేసులు మరో 150 గజాల ఉమ్మడి స్థలం వంటి ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించింది. ఈ మాయమాటలను నమ్మిన ఆది వనజ అనే కొనుగోలుదారు 2020 నుంచి పలు దఫాలుగా మొత్తం రూ.3.82 కోట్లు చెల్లించింది. కానీ, కంపెనీ కస్టమర్‌కు సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేసింది. త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని కస్టమర్ లేఖ రాయగా, అనుకున్న సమయానికి వాయిదాల ప్రకారం సొమ్ము చెల్లించనందుకు అగ్రిమెంట్ రద్దు చేస్తున్నామని వనజ భర్త మోహన్‌రావుకు కంపెనీ ఈ–మెయిల్ పంపింది. నిబంధన ప్రకారం నష్టపరిహారం తర్వాత కొంత సొమ్మును బాధితురాలి ఖాతాలో వేస్తామని పేర్కొంది. దీంతో బాధితురాలు టీజీ–రెరాను ఆశ్రయించి రసీదులు, ఇతరత్రా ఆధారాలు అందజేసింది. రెరా మధ్యంతర ఉత్తర్వులు రెరా విభాగం లోతుగా పరిశీలించి అయ్యన్న ఇన్‌ఫ్రా అగ్రిమెంట్ ను రద్దు చేస్తూ ఇచ్చిన ఈ–మెయిల్‌ను నిరాకరించింది. బాధితురాలికు కేటాయించిన 801 నంబర్ ఫ్లాట్‌తోపాటు కార్ పార్కింగ్, ఉమ్మడి స్థలాన్ని ఆమె పేరిటే కొనసాగించాలని, మరే ఇతరులకు అమ్మటం లేదా కేటాయించడం వంటివి చేయరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

బీసీ కమిషన్ నిర్ణయం హర్షణీయం

తొలగించిన 26 కులాల పోరాట సమితి అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ



హిమాయత్‌నగర్: తెలంగాణ బీసీ కమిషన్ నిర్ణయంపై 'తొలగించిన 26 కులాల పోరాట సమితి' అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. బీసీ కులాల జాబితా నుంచి 2014లో తొలగించిన 26 బీసీ కులాలను తిరిగి బీసీ జాబితాలో కలపడానికి తెలంగాణ బీసీ కమిషన్ జూన్ 9 నుంచి 11 తారీఖుల మధ్య బహిరంగ విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. గత 11 ఏళ్లుగా 26 బీసీ కులాల వారు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రభుత్వ పథకాల్లో రిజర్వేషన్ కోల్పోయి తీవ్ర అన్యాయానికి గురయ్యారని ఆవేద వ్యక్తం చేశారు. 11 ఏళ్ల అవిశ్రాంత పోరాటాల ఫలితంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఈ 26 కులాలను తిరిగి తెలంగాణ బీసీ లిస్టులో కలుపుతామని హామీ ఇచ్చిందని తెలిపారు. సుప్రీంకోర్టుకు తెలంగాణ బీసీ కమిషన్ అఫిడవిట్లలో పేర్కొన్నట్టు కులసర్వే అనంతరం ఈ 26 బీసీ కులాలను ఆయా గ్రూపుల్లో కలుపుతామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.

దరఖాస్తుదారులందరికీ సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

– బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: రాజీవ్ యువ వికాసం పథకం కింద ఇచ్చే సబ్సిడీ రుణాలను దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ అందించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సిబిల్ నిబంధనల పేరిట షరతులు విధించి దరఖాస్తుదారుల సంఖ్య తగ్గించాలని ప్రయత్నిస్తే సహించబోమని హెచ్చరించారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌ను రూ.ఆరు వేల కోట్ల నుంచి రూ.15 వేల కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. దరఖాస్తుదారులందరికీ రూ. ఐదు లక్షల నుంచి 10 లక్షల మేర రుణాలు మంజూరు చేయాలని కోరారు. బ్యాంకుల జోక్యం లేకుండా లబ్ధిదారులను అధికారులే ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు నీల వెంకటేష్, అనంతయ్య, మణికంఠ, రాజు నేత, పగిళ్ల సతీష్, కౌశిక్ పాల్గొన్నారు.

ఆ మాటలకు కట్టుబడి ఉన్నా: ఈటల



మేడ్చల్: సీఎం రేవంత్‌రెడ్డిపై పాలనాపరంగా విమర్శించిన మాటలకు కట్టుబడి ఉన్నానని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. తన ఇంటి వద్ద యూత్ కాంగ్రెస్ చేసిన హడావుడి అనంతరం బీజేపీ నాయకులతో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో విఫలమవడంతోనే ఆయనను ఉద్దేశించి సైకో, శాడిస్టు అనే మాటలు అన్నానని పేర్కొన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలుస్తూ ఎవరిమాటా వినకుండా రేవంత్‌రెడ్డి సైకోలాగా ప్రవర్తిస్తున్నారని మరోసారి ఘాటుగా విమర్శించారు. తాము అధికారులకు విషయం చెబితే వింటున్నారేగాని, సీఎం ఎవరి మాటా వినడంలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలనపై పూర్తిగా పట్టుకోల్పోయారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, మల్లికార్జున్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఏ ఆఫీస్‌లో నాగార్జున సందడి

ప్రముఖ టాలీవుడ్ హీరో అక్కినేని నాగార్జున సోమవారం ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయానికి వచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కోసం వచ్చిన ఆయనను అధికారులు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం డ్రైవింగ్ లైసెన్సు ప్రక్రియను పూర్తి చేశారు. ఆర్టీఏ పౌర సేవల పట్ల నాగార్జున సంతృప్తి వ్యక్తం చేశారు.
–సాక్షి, సిటీబ్యూరో



ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీని అరికట్టాలి

కలెక్టరేట్ వద్ద ధర్నాలో సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో బిల్లుల రూపంలో దోపిడీని అరికట్టాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కార్యదర్శి పి.సత్యం డిమాండ్ చేశారు. జిల్లా వైద్య రంగంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ,ప్రజలు ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు, బ్యానర్లు చేతబూనిన కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదానాలు చేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ అల్వాల్ ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. మేడ్చల్, శామీర్‌పేట్, ఘట్కేసర్ ఆసుపత్రులను వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేసి, అందుకు తగినట్టుగా సిబ్బంది నియమించాలన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలన్నారు. ప్రమాణాలు పాటించని ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అశోక్, వినోద, రాజశేఖర్, నాయకులు నరేష్, శంకర్, సంతోష్, మంగ, పూజ, నర్సింగ్ రావు, కొమురయ్య, ధర్మారెడ్డి, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ హరిప్రియకు వినతి పత్రాన్ని అందజేశారు. సత్వరమే వైద్యాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

ఈటల ఇంటి ముట్టడికి యూత్ కాంగ్రెస్ యత్నం



యూత్ కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

దిష్టిబొమ్మ దహనం.. ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు

మేడ్చల్: బీజేపీ అగ్రనాయకుడు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేంద ఇంటి ముట్టడికి సోమవారం యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు యత్నించారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పూడూర్‌లో ఔటర్ రింగురోడ్డు పక్కన గల ఈటల ఇంటిని ముట్టడించడానికి సర్వీసు రోడ్డులో శామీర్‌పేట్, కండ్లకోయ వైపు నుంచి యూత్ కాంగ్రెస్ నాయకులు ఉదయం దూసుకొచ్చారు. అయితే అప్పటికే అక్కడ మోహరించి ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. అరెస్ట్ చేసి సమీప పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఈటలకు, బీజేపీకి వ్యతిరేకంగా యూత్ కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈటల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈటల ఇంటి ముట్టడికి యూత్ కాంగ్రెస్ పిలుపు ఇవ్వడంతో పోలీసులు ముందుజాగ్రత్తగా పరిసరాల్లో మోహరించారు. ఈటల ఇంటి ముందున్న ఔటర్ సర్వీసు రోడ్డులో రెండు వైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి ఇటువైపుగా ఇతర పార్టీల నాయకుల వాహనాలను అనుమతించలేదు. ముట్టడి సమాచారం తెలుసుకున్న బీజేపీ నాయకులు తెల్లవారుజాము నుంచే ఈటల ఇంటి వద్ద గుమిగూడారు. పోలీసులు బీజేపీ నాయకులను రోడ్లపైకి రాకుండా నిలువరించి, యూత్ కాంగ్రెస్ నాయకులను అక్కడి నుంచి తరలించారు. రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఔటర్ సర్వీసు రోడ్డులో భారీగా జమ కావడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది.

న్యాయవాది నుంచి ఆర్టీఐ కమిషనర్ వరకు..

– న్యాయవాది భూపాల్ ప్రస్థానం



డి.భూపాల్

రాజేంద్రనగర్: రాష్ట్ర సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కమిషనర్‌గా నియమితులైన రాజేంద్రనగర్ మాణిక్యమ్మ కాలనీకి చెందిన డి.భూపాల్ ప్రస్థానం న్యాయవాదిగా మొదలైంది. భూపాల్ 30 ఏళ్లుగా న్యాయవాది వృత్తిలో ఉన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీఏ, ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. ఎంఏ పొలిటికల్ సైన్స్ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన టీపీసీసీ లీగల్ సెల్ మానవ వనరుల అభివృద్ధి విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా ఉన్నారు. గతంలో మామిడిపూడి వెంకట రంగయ్య ఫౌండేషన్ చైర్పర్సన్ శాంతాసిన్హాతో కలిసి అనేక మంది బాలబాలికలకు విద్యాభ్యాసం చేయించాడు. భూపాల్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు. మొదటి కుమార్తె వైద్యురాలిగా, రెండో కుమార్తె న్యాయవాద వృత్తిలో రాణిస్తున్నారు. మూడో కుమార్తె విద్యాభ్యాసం చేస్తోంది. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ తన తండ్రి కీర్తిశేషులు శ్రీశైలం కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక సభ్యుడిగా పని చేశారని, ఆయన అడుగుజాడల్లో తాను సైతం పార్టీలో చేరి పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని తెలిపారు. తన సేవలను గుర్తించి బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అధినేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్, సీఎం రేవంత్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సైనికులతో సమానంగా నర్సుల సేవలు



సీనియర్ నర్సులను సత్కరించిన నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: దేశ రక్షణకు పాటుపడే సైనికులతో సమానంగా నర్సులు రోగులకు సేవలందిస్తున్నారని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. సోమవారం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా జరిగింది. అనంతరం 45 రోజులపాటు జరిగే నర్సుల శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. యుద్ధంలో గాయపడిన సైనికులకు సేవలందించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో రోగులకు మెరుగైన సేవలందించాలని నర్సులకు సూచించారు. చాలా పవిత్రమైన నర్సింగ్ వృత్తిని చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. కరుణ, సానుభూతి, మానవత్వం, అంకిత భావాల మేలు కలయిక నర్సు అని స్పష్టం చేశారు. నిమ్స్‌కు వచ్చే రోగులకు చిరునవ్వుతో సేవలందించి, వారు చిరునవ్వుతో తిరిగి వెళ్లేవిధంగా పనిచేయాలని అన్నారు. అనంతరం పలువురు సీనియర్ నర్సులను డైరెక్టర్ సత్కరించారు. కాగా, నిత్యం నర్సింగ్ యూనిఫాంల్లో కనిపించే నర్సులు, నర్సింగ్ ఆఫీసర్లు ఎల్లో థీమ్‌తో పాల్గొని కార్యక్రమాన్ని పసుపుమయం చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, నిమ్స్ నర్సెస్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆశాలత, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్ని కబళిస్తున్న కాలనీ సంక్షేమ సంఘాలు

- వీటిని ప్లాట్లుగా మార్చి అమ్మేస్తున్నవి అనేకం
- హైడ్రా ప్రజావాణికి పలు ఫిర్యాదులు



సాక్షి, సిటీబ్యూరో: లేఔట్లలో పార్కులు, రహదారులు, ప్రజావసరాలకోసం ఉద్దేశించిన స్థలాలను కాపాడాల్సిన కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులే వాటిని కబళిస్తున్నారు. ఈ స్థలాలను ప్లాట్లుగా మార్చి అమ్మేస్తున్నారు. కొందరైతే చిరు, బడా వ్యాపారులకు ధారాదత్తం చేస్తున్నారు. దీనికోసం అవసరమైతే నకిలీ పత్రాలు సైతం సృష్టిస్తున్నారు. హైడ్రా ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి దీనికి సంబంధించి అనేక ఫిర్యాదులు వచ్చాయి. దీంతో పాటు ఇతర సమస్యలపైనా కలిపి మొత్తం 61 ఫిర్యాదులు హైడ్రాకు అందాయి.

- నిజాంపేట పరిధిలో సర్వే నం.181, 183లో సాయిలక్ష్మీ లేఔట్ ఉంది. ఇందులో ఉండాల్సిన 1800 గజాల పార్కు స్థలం కబ్జా చేశారని హైడ్రాకు ఫిర్యాదు అందింది. అదే ప్రాంతంలోని సర్వే నం.153, 154, 155ల్లోనూ దాదాపు ఐదు ఎకరాల పార్కు స్థలాలు, రహదారులు కనిపించడంలేదని స్థానికులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. 2.3 ఎకరాల వీఎస్ ఆర్ పార్కు స్థలాన్ని కూడా ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ ఫిర్యాదులను స్వీకరించిన కమిషనర్ ఏవీ రంగనాథ్ గూగుల్ మ్యాప్స్ ద్వారా అక్కడి పరిస్థితులను ఫిర్యాదుదారుల సమక్షంలోనే పరిశీలించారు. ఆపై తగిన చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.
- ఏకంగా ఓ లేఔట్‌నే మాయం చేశారంటూ కూకట్‌పల్లి హైదర్‌నగర్‌లోని డైమండ్ హిల్స్ కాలనీ ప్లాట్ల యజమానులు హైడ్రాను ఆశ్రయించారు. తొమ్మిది ఎకరాల విస్తీర్ణంలో 70 రెసిడెన్షియల్ ప్లాట్లతో ఉన్న ఈ లే ఔట్ మొత్తం చెరిపేసిన కొందరు తమ ఆధీనంలోకి తీసుకున్నారని పేర్కొన్నారు. హైకోర్టు గత ఏడాది తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా వారిని ఖాళీ చేయించలేకపోతున్నామని వాపోయారు. లే ఔట్‌లోని రహదారులు, పార్కులు నామరూపాలు లేకుండా పోయాయని ఫిర్యాదు చేశారు.
- మేడ్చల్ జిల్లా తూముకుంట మున్సిపాలిటీలోని దేవరయాంజల్ గ్రామంలో జాతీయ రహదారితో ఓఆర్ఆర్‌ను కలుపుతూ కండ్లకోయ, దేవరయాంజల్ మధ్య ఉన్న 40 అడుగుల రహదారి ఉందని, దానికి అడ్డంగా ప్రహరీ నిర్మించి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.
- హయత్‌నగర్ అనుమగల్‌లోని తిరుమల హౌసింగ్ కాలనీలోని 2955 గజాల జీహెచ్‌ఎంసీ పార్కును కొంతమంది వ్యక్తులు కబ్జా చేశారు. ఈ పార్కును రూ.1.20 కోట్లతో అభివృద్ధి చేయడానికి చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. అంతటితో ఆగకుండా హైకోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. హైకోర్టు కూడా కబ్జా దారులకు వ్యతిరేకంగా తీర్పును ఇచ్చినా కార్యరూపం దాల్చలేదని పలువురు నివాసితులు ఆరోపించారు.
- బాచుపల్లి మండలం నిజాంపేట కార్పొరేషన్ పరిధిలోని తుర్కచెరువులోని ఎఫ్‌టీఎల్ ల్యాండ్‌తో పాటు అక్కడ ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని హైడ్రాకు ఫిర్యాదు అందింది.

జలకన్యల థీమ్‌తో ఎగ్జిబిషన్..



కూకట్‌పల్లి : మలేషియా టౌన్ షిప్ ఎదురుగా, నెక్సస్ మాల్ పక్కన మంగళపూడి రాజశేఖర్ రెడ్డి (ఎం.రాజారెడ్డి) ఆధ్వర్యంలో అబేదిన్ సయ్యద్ నేతృత్వంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన 300 మంది కళాకారులతో జలకన్యల థీమ్‌ను ప్రదర్శించారు. కశ్మీర్‌లో ఉన్న విధంగా మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలలో ఈ జలకన్యల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనతో పాటు జెయింట్‌వీల్, బ్రేక్ డ్యాన్స్, పిల్లలకు సంబంధించిన పలు ఆసక్తికరమైన వినోదాన్ని అందించే రైడ్‌లు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రదర్శన జూన్ వరకూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

హైటెక్స్‌లో 16 నుంచి
నవ్వుల ఫెస్ట్

సాక్షి, సిటీ బ్యూరో: మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకూ 'ది గిగిల్ ఫెస్ట్' పేరుతో మూడు రోజుల పాటు నవ్వుల ఫెస్ట్ నిర్వహించనున్నారు. స్టాండప్ కామెడీ, 30కి పైగా ఫన్ కార్యక్రమాలు, కిడ్స్ ప్లే ఏరియా, షాపింగ్, ఆహారం, మ్యూజిక్, తదితర వినోద కార్యక్రమాలు ఉంటాయి. పలువురు ప్రముఖ కమెడియన్స్, సింగర్స్, హాజరుకానున్నారు. దీంతో పాటు అన్ని వయసుల వారికీ షాపింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే విధంగా వివిధ రకాల ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. అభ్యాసం, నైపుణ్యాన్ని పెంపొందించేలా వర్క్‌షాపులు, కుటుంబ సభ్యుల కోసం వినోద కార్యక్రమాలు, వివిధ రకాల పెంపుడు జంతువుల ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు.



పిల్లల కోసం హిమాలయాస్ ప్లే..

సాక్షి, సిటీబ్యూరో: ఇనార్బిట్‌మాల్‌లో పిల్లలకు ప్రత్యేకంగా వాటర్ ప్లే, ఇసుక ఆటస్థలాలు, రాక్ క్లైంబింగ్, బాల్ పూల్, స్లైడ్స్, అడ్వెంచర్స్, కథలు చెప్పుకునేందుకు ప్రత్యేకమైన స్థలంతో పాటు ఇంకా ఎన్నో ఆకట్టుకునే కార్యక్రమాలు ఉంటాయని హిమాలయాస్ ప్లే పేర్కొంటోంది. ఈ నెల 13 నుంచి 31 వరకూ ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఆసక్తి ఉన్నవారు హైదరాబాద్ ఇనార్బిట్‌మాల్‌లోని హిమాలయాస్ ప్లేను సందర్శించవచ్చు. పిల్లలు బహిరంగ ప్రదేశాల్లో ఆడుకుంటూ పొందే అనుభూతిని, ఉత్సాహాన్ని నింపేవిధంగా దీనిని రూపొందించారు. మిస్టర్ అండ్ మిసెస్ హాప్పర్ పేరుతో తోటలాంటి సాహసంతో కూడిన ఆటలు స్వాగతం పలుకుతున్నాయి. ఈ తోటలో మ్యూజికల్ వాల్, స్కార్ఫ్ షూటర్లు వంటి మరెన్నో వినోదభరితమైన క్రీడలు పిల్లలను ఆహ్వానిస్తున్నాయి. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఇది అందుబాటులో ఉంటుంది.









నగరంలో గృహ అక్వేరియం సంస్కృతి అంతకంతకూ విస్తరిస్తోంది. పాత అలంకరణే అయినా నగరవాసులు తమ ఇళ్లలో అక్వేరియంలను ఏర్పాటు చేయడం ద్వారా కొత్త ఆహ్లాదకర వాతావరణాన్ని ఇష్టపడుతున్నారు. ఇది కేవలం అలంకరణ మాత్రమే కాకుండా, మానసిక ప్రశాంతతను పొందేందుకు కూడా ఉపయోగపడుతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. కోవిడ్-19 మహమ్మారి సమయంలో, ఇంట్లో గడిపే సమయం పెరిగినప్పుడు అక్వేరియంల పట్ల ఆదరణ రెట్టింపైనట్టు అంచనా. ప్రస్తుతం వేసవి సెలవుల్లోనూ పిల్లలు, పెద్దలు వీటి వద్ద ఎక్కువ సమయం గడుపుతున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

మెరిపిస్తూ.. మురిపిస్తూ..

ఒత్తిడిని దూరం చేసే చిట్టి పొట్టి చేపలు

- గృహ అక్వేరియంలకు తగ్గని ఆదరణ
- నగర మార్కెట్‌లో వివిధ వెరైటీ ఫిష్‌లు
- వేసవి సెలవుల్లో చిన్నారులకు ఆత్మీయ నేస్తాలు
- ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉపకరణాలు



నగరంలోని గృహ అక్వేరియమ్స్‌లో పలు ఫిష్ వెరైటీలు సందడి చేస్తున్నాయి. వాటిలో గుప్పీ, బెట్టా, నియాన్ టెట్రా, కార్డినల్ టెట్రా, గోల్డ్‌ఫిష్, కాయ్, ఫ్లవర్‌హార్న్ వంటి చేపలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ చేపలు అందమైన రంగులు, ఆకారాలతో ఆకట్టుకుంటున్నాయి

పలు చోట్ల అందుబాటులో..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని అక్వేరియం స్ట్రీట్ సహా అనేక చోట్ల అక్వేరియం షాపులు, బజార్లు ఉన్నాయి. అదే కాకుండా ఫిషీకార్ట్, బెస్ట్ 4పెట్స్ వంటి ఆన్‌లైన్ స్టోర్లు కూడా భిన్న రకాలైన చేపలు, ట్యాంకులు, ఆక్వాటిక్ ప్లాంట్స్, ఫిష్ ఫుడ్, ఫిల్టర్లు, ఇతర ఉపకరణాలను ఇంటి ముంగిటకే డెలివరీ చేస్తున్నాయి.

ధరలు ఇలా..

అక్వేరియంకు ఉపయోగించేందుకు అవసరమైన చిన్న ట్యాంకులు (5–10 లీటర్లు) ధరలు రూ.1,000 నుంచి ప్రారంభమవుతున్నాయి. మధ్యస్థ ట్యాంకులు (20–50 లీటర్లు): రూ.2,000 నుంచి రూ.5,000 వరకు, పెద్ద ట్యాంకులు (60 లీటర్లు పైగా): రూ.6,000 నుంచి రూ.15,000 వరకూ అందుబాటులో ఉన్నాయి. ఇక చేపలలో గుప్పీ, టెట్రా వంటి సాధారణ చేపలు రూ.30 నుంచి రూ.100 వరకు ఉన్నాయి. బెట్టా, కాయ్ వంటి ప్రత్యేక చేపలు రూ.100 నుండి రూ.500 వరకూ ధరల్లో లభిస్తున్నాయి. ఫిల్టర్లు, హీటర్లు, వంటి ఉపకరణాలు, లైటింగ్, డెకరేషన్ వస్తువులు రూ.500 నుండి రూ.2,000 వరకు అందుబాటులో ఉన్నాయి.



ఫిష్ వెరైటీలు.. ప్రత్యేకతలు..

గుప్పీస్ : ఇవి చిన్నదైన, రంగురంగుల మత్స్యాల్లా వివిధ రంగుల్లో లభిస్తాయి.. సులభంగా సంరక్షించగలగడం వల్ల కొత్తవారికి మంచి ఎంపిక.

మోల్లీస్ : ఇవి శాంతస్వభావ చేపలు. తక్కువ ఖర్చుతో పెంచవచ్చు. స్వీట్ వాటర్‌కి స్వల్ప ఉష్ణోగ్రత మార్పులకు అనువుగా ఉంటాయి.

ప్లాటీస్: చిరు తడిగా సంచరించే ఇవి పిల్లలకు ఎంతో ఇష్టమైనవి. మిశ్రమ ఆహారంతో పెంచవచ్చు. బహుళ రంగుల్లో లభిస్తాయి.

గోల్డ్‌ఫిష్ : శతాబ్దాలుగా ఆదరణ పొందుతున్న ఈ చేపలు కొంచెం ఎక్కువ స్థలంతో కూడిన ట్యాంక్‌లో ఉంచాలి. శుభ్రత సరైన ఆహారానికి వీటికి బాగా అవసరం.

టెట్రాస్ (Tetras) : ఇవి గుంపులుగా తిరిగే చేపలు. నియాన్ టెట్రాస్ వంటి జాతులు ఎంతో ప్రసిద్ధి. వీటికి సాఫ్ట్ వాటర్, మితమైన ఉష్ణోగ్రత అవసరం.

ఏంజెల్ ఫిష్ : విలక్షణమైన ఆకారంతో ఇవి గుంపులుగా స్వేచ్ఛగా తిరుగుతాయి. సాఫ్ట్ వాటర్ సరైన ట్యాంక్ స్నేహస్వభావం కలిగిన చేపలతో పెంచితే మంచిది.








ఈ సూచనలు పాటించాలి..

ప్రతి చేపకు తనదైన ప్రత్యేక అవసరాలు ఉంటాయి. వాటిపై అవగాహన, ఆహారం, నీటి శుభ్రత, పీహెచ్ స్థాయి వంటి అంశాల్లో శ్రద్ధ అవసరం. మొదటిసారిగా చేపలు పెంచే వారు గప్పీస్ లేదా ప్లాటీస్‌తో ప్రారంభించడం మంచిది. ఆన్‌లైన్ ఆర్డర్ చేయడానికి ముందు, స్టోర్ గురించిన రివ్యూలు, రేటింగ్స్ పరిశీలించాలి. చేపల ఆరోగ్యాన్ని నిర్ధారించేందుకు, స్టోర్ నుంచి ఆరోగ్య సర్టిఫికెట్లు లేదా గ్యారంటీల వంటివి ఉన్నాయేమో చూడాలి. అక్వేరియం నిర్వహణకు సంబంధించిన సూచనలు మార్గదర్శకాలను స్టోర్ నుంచి పొందగలిగితే బెటర్. ప్రస్తుతం ట్యాంకులు శుభ్రపరిచేందుకు హానికరమైన వ్యర్థాలను తినేందుకు ప్రత్యేకంగా పలు వెరైటీల ఫిష్‌లు అందుబాటులోకి వచ్చాయి వాటిని పరిశీలించాలి.

బెట్టా ఫిష్.. గృహ అక్వేరియానికి ప్రత్యేక ఆకర్షణ..



అందమైన రెక్కలు, ప్రకాశవంతమైన రంగులు, చురుకైన స్వభావం.. ఇవన్నీ బెట్టా చేపలకు గుర్తింపు తెచ్చిన లక్షణాలు. 'సియామ్ ఫైటింగ్ ఫిష్'గా కూడా ప్రసిద్ధిగాంచిన ఈ చేపలు నగర గృహాల్లోని అక్వేరియంలలో ప్రత్యేక ఆకర్షణగా మారాయి. బెట్టా చేపలు థాయ్‌లాండ్, కంబోడియా వంటి ఆసియన్ దేశాలకు చెందినవి. మగ బెట్టాలు తమ ప్రదేశాన్ని రక్షించేందుకు ఇతర మగ చేపలపై దాడికి కూడా వెళతాయి. అందువల్ల ఒక ట్యాంక్‌లో ఒక్క మగ బెట్టా చేపను మాత్రమే ఉంచడం సురక్షితం. దీనిని పెంచడానికి కనీసం 5 లీటర్ల నీటి సామర్థ్యం ఉండే ట్యాంక్ అవసరం. చిన్న గాజు గిన్నెల్లో కాకుండా గాలి పంపు, హీటర్ కలిగిన ట్యాంక్ మంచిది. ఈ బెట్టా చేపలు 24డిగ్రీల సెల్సియస్ నుంచి 28 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలో జీవిస్తాయి. వీటికి ప్రత్యేకమైన బెట్టా పెలెట్స్, అకేషనల్ బ్లడ్ వార్మ్స్, లేదా బ్రెయిన్ ష్రింప్స్ వంటివి రోజుకు రెండు సార్లు ఆహారంగా ఇవ్వాలి. ఇవి బ్లూ, రెడ్, వైట్, పర్పుల్, మెటాలిక్ షేడ్స్‌లో లభ్యమవుతాయి. హాఫ్ మూన్, క్రౌన్ టెయిల్, ప్లాకాట్ వంటి రెక్కల ఆకారాల్లోనూ ఉన్నాయి.







సాయంకాలాన.. సాగర తీరాన..

నగరంలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌ల సందడి

- ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమంలో భాగస్వామ్యం
- నేడు లాడ్‌బజార్‌కు లవ్లీ క్వీన్స్

సాక్షి, సిటీబ్యూరో: సాయంకాలాన.. సాగర తీరాన.. అని ఇటీవల ఓ చిత్రంలోని పాట గుర్తొచ్చేలా.. నగరంలో జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీలకు విచ్చేసిన వివిధ దేశాలకు చెందిన పోటీదారులు సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో సందడి చేశారు. ఇందులో భాగంగా కొందరు మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు నాగార్జున సాగర్ బుద్ధవనాన్ని సందర్శించి తెలంగాణ విశిష్టతలను తెలుసుకున్నారు. ఇక్కడ నిర్మితమైన చారిత్రక కట్టడాల తిలకించి వాటి ప్రత్యేకతలను ఆరాతీశారు. భాగ్యనగరం అంటేనే ఓ చారిత్రక నేపథ్యం ఉన్న నగరం.. ఇక్కడ విభిన్న రకాల సంస్కృతులు, సంప్రదాయాలు కలగలిసి ఉంటాయి. అలాంటి సమ్మిళితమైన జీవనశైలి అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షిస్తుంది. అలాగే మిస్ వరల్డ్ పోటీదారులను నగర సంస్కృతి ఆకట్టుకుంటోంది. మిస్ వరల్డ్ పోటల్లో పాల్గొంటున్న ఆయా దేశాలకు చెందిన ముద్దుగుమ్మలు ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమంలో పాలుపంచుకుంటూ నగరంలో సందడి చేస్తున్నారు. ఎయిర్‌పోర్టు ఆహ్వానం మొదలు గచ్చిబౌలి ప్రారంభ వేడుకల వరకూ నగర ప్రత్యేకతలను ఆశ్చర్యంగా ఆరాతీస్తున్నారు. అంతటితో ఆగకుండా ఆయా చారిత్రక, ప్రత్యేక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. ఇప్పటికే ప్రతిష్టాత్మక ఎక్స్‌పీరియం పార్క్‌ను సందర్శించి అక్కడ ప్రత్యేకంగా నిర్వహించిన టమాటోరినా ఫెస్ట్‌లో పాల్గొన్నారు. ఇక మంగళవారం చారిత్రాత్మక లాడ్ బజార్లో, చార్మినార్ వీధుల్లో సందడి చేయనున్నారు. ఈ కార్యక్రమం కోసం మిస్ వరల్డ్ నిర్వాహకులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు సన్నహాలు పూర్తి చేశారు. మిస్ థాయ్‌లాండ్ ఓపాల్ సుచేత వంటి పలువురు తారలు ఇప్పటికే తమ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పలు వేదికల్లో పాల్గొన్నారు. అంతేకాకుండా ఈ నెల 31వ తేదీ వరకూ కొనసాగనున్న మిస్ వరల్డ్‌పోటీల నేపథ్యంలో ముందస్తుగా రూపొందించిన ప్రణాళికలకు అనుగుణంగా నగరంలోని మరికొన్ని సందర్శనీయ ప్రదేశాల్లో, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనున్నారు.





- ముంబైలోని మార్వేలో జరిగిన జాతీయ జూనియర్ టోర్నీలో 4 స్వర్ణాలు
- మొత్తం ఆరు పతకాలతో సత్తా చాటిన రాష్ట్ర సెయిలర్లు
- ఆకట్టుకున్న హైదరాబాద్ బాలికల సెయిలింగ్ నైపుణ్యాలు

సెయిలింగ్‌లో తెలంగాణ సత్తా..

సాక్షి, సిటీబ్యూరో: గత కొంతకాలంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి సెయిలింగ్‌లో తెలంగాణ రాష్ట్రం అద్భుతంగా రాణిస్తోంది. ఇందులో భాగంగానే జాతీయ జూనియర్ సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ సెయిలర్స్ నాలుగు బంగారు పతకాలు సహా మొత్తం ఆరు పతకాలతో సత్తా చాటారు. ముంబైలోని మార్వేలో జరిగిన ఈ టోర్నీలో హైదరాబాద్ రసూల్‌పురాలోని ఉద్భవ్ స్కూల్‌కు చెందిన లాహిరి కొమరవెల్లి అండర్–16 సబ్ జూనియర్ విభాగంలో బంగారు పతకం గెలిచింది. మొత్తం 9 రేసుల రెగెట్టాలో 4 రేసుల్లో మొదటి స్థానం, రెండు రేసుల్లో రెండో స్థానంతో 13 పాయింట్లతో 2025 జాతీయ చాంపియన్‌గా నిలిచింది. అదే స్కూల్‌కు చెందిన తనూజ కామేశ్వర్– శ్రవణ్ కత్రావత్‌లు జూనియర్ డబుల్ హ్యాండర్ విభాగంలో చివరి రోజు రెండు రేసులను గెలిచి నేషనల్ చాంపియన్స్ అయ్యారు.



అండర్ -15 విభాగంలో..

అండర్–15 బాలుర విభాగంలో బన్నీ బొంగూర్ బంగారు పతకం నెగ్గగా, రిజ్వాన్ మహమ్మద్ రజతం, రవి కుమార్ కాంస్యం గెలిచారు. ఒక ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన ముగ్గురు సెయిలర్లు పోడియంపైకి రావడం ఇదే తొలిసారి. ఉద్భవ్ స్కూల్‌కు చెందిన చంద్రలేఖ తట్బారి తొలిసారి కాంస్య పతకం సాధించాడు. మొత్తంగా అండర్–16 సబ్ జూనియర్స్ పోడియంపైకి వచ్చిన ఆరుగురు సెయిలర్లలో ఐదుగురు తెలంగాణ క్రీడాకారులే కావడం విశేషం. ఈ సందర్భంగా హైదరాబాద్ యాచ్ క్లబ్ అధ్యక్షుడు, కోచ్ సుహీమ్ షేక్ సంతోషం వ్యక్తం చేశాడు. గతేడాది నుంచి తాము చేసిన ఫిట్‌నెస్, న్యూట్రిషన్, సైద్ధాంతిక శిక్షణ ఫలితాలను ఇచ్చిందని అన్నారు. నేషనల్స్‌లో టాప్–14లో ఎనిమిది మంది తెలంగాణ రాష్ట్రం వాళ్లే ఉండటం తమ శిక్షణ ఫలితమని, ఇది ఎంతో సంతోషాన్నిస్తుందని తెలిపాడు. జూన్‌లో జరిగే లాంగ్‌కవి ఇంటర్నేషనల్ టోర్నీ కోసం ఎంపికైన సెయిలర్స్ జాబితా త్వరలో విడుదల కానుంది. తెలంగాణ నుంచి కనీసం ఏడుగురు ఎంపికయ్యే అవకాశం ఉంది. ఈ సెయిలర్స్ షిల్లాంగ్‌లో జరిగే జాతీయ ర్యాంకింగ్ రెగెట్టాలో పాల్గొని, ఆ తర్వాత హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లో జరిగే మాన్‌సూన్ రెగెట్టా ట్రోఫీలోనూ బరిలో నిలవనున్నారు.

క్లుప్తంగా...

సింగరేణి సీఎండీకి పర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ అవార్డు


షిల్లాంగ్‌లో జాతీయస్థాయి సీఈవోల సమావేశంలో ప్రదానం



సాక్షి, హైదరాబాద్: సింగరేణి సీఎండీ ఎన్. బలరాంకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ (ఐఐఐఈ) సంస్థ ప్రతి ష్టాత్మక పర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ పురస్కారాన్ని ప్రకటించింది. మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన 25వ జాతీయస్థాయి ముఖ్య కార్యనిర్వహణ అధికారుల (సీఈవో) సమావేశంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. సీఎండీ బలరాం తరఫున అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్, ఐఐఐఈ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు భాస్కర్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. షిల్లాంగ్‌లో ప్రదానం చేసిన అవార్డును సోమవారం సింగరేణి భవన్‌లో సీఎండీ బలరాంకు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కోల్ మూమెంట్ ఎస్‌డీఎం సుభానీ, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ భాస్కర్ కలసి అందజేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ పర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు ప్రతీ ఉద్యోగి శ్రమకు లభించిన గుర్తింపు అని అన్నారు. సంస్థ ఉన్నతి కోసం ఉత్పాదకత పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయడం ద్వారా మరింత గుర్తింపు లభిస్తుందన్నారు.

రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలి: చాడ

మంత్రి తుమ్మలకు వినతిపత్రం



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రూ. 2 లక్షల లోపు రుణమాఫీ చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఇ.టి.నరసింహాతో పాటు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక లక్ష రూపాయల రుణమాఫీ చేపట్టి విడతల వారీగా అమలు చేసినందువల్ల రైతులపై వడ్డీ భారం పడిందని వారు వివరించారు. ప్రస్తుతం ప్రభుత్వం విధించిన షరతుల ప్రకారం కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకోవడం వలన యజమాని, ఆయన భార్య, కుమారుడు, కోడలు కూడా బ్యాంక్ నుంచి పంట రుణం తీసుకున్నారని, అవి మొత్తం కలిపితే రూ.రెండు లక్షలకు పైబడి ఉంటాయని, కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకున్నందున దాదాపు 40 శాతం పైబడి రైతులకు రుణమాఫీ కాలేదని తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో 2 లక్షల రుణమాఫీకి అర్హులైనవారు 9,588 ఉండగా, అందులో 5,864 మందికి రుణమాఫీ అయ్యిందని, మిగిలిన రైతులు 3,724 మందివి రుణమాఫీ పెండింగ్‌లో ఉండటంలో రైతులు బ్యాంక్‌లు, వ్యవసాయ అధికారి కార్యాలయా ల చుట్టూ తిరిగి విసిగిపోతున్నారని తెలిపారు.

'ప్రత్యర్థులపై దాడులు చేయడంపైనే సీఎంకు ఎక్కువ శ్రద్ధ'

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చేతకాదని ప్రజలే చెబుతున్నారని, ప్రజల శ్రేయస్సు కంటే ప్రత్యర్థులపై దాడులు చేయడానికే ఎక్కువ శ్రద్ధ పెడుతున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి ఆరోపించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు అవాకులు, చెవాకులు మానుకుని నిర్మాణాత్మకంగా ప్రజలకు జవాబుదారీగా ప్రవర్తించాలని హితవుపలికారు. ప్రభుత్వ ప్రశ్నించే వారిపై వ్యక్తిగత దాడులను ప్రోత్సహించటం ఆందోళన కలిగిస్తోందని దిలీపాచారి అన్నారు.

ఆర్టీఐ కమిషనర్లుగా నలుగురి నియామకం

- పి.వి.శ్రీనివాస్, మొహసినా పర్వీన్, భూపాల్, అయోధ్యరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు
- ఆరు పేర్లకు గాను నాలుగింటికే ఆమోదం తెలిపిన గవర్నర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నలుగురు సమాచార హక్కు చట్టం కమిషనర్లను నియమించింది. పి.వి.శ్రీనివాస్, మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డిలను సమాచార హక్కు చట్టం కమిషనర్లుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర గవర్నర్ ఆమోదం మేరకు ఈ నలుగురిని కమిషనర్లుగా నియమిస్తున్నామని, బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మూడేళ్లు.. లేదంటే వారికి 65 ఏళ్ల వయసు వచ్చేంతవరకు ఆ హోదాలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నలుగురికే ఆమోదం!

కాగా, రాష్ట్ర ఆర్టీఐ చీఫ్ కమిషనర్‌తో పాటు కమిషనర్లుగా ఆరుగురి పేర్లతో ప్రభుత్వం నుంచి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు తొలుత ప్రతిపాదనలు వెళ్లాయి. ఈ ప్రతిపాదనల మేరకు చీఫ్ కమిషనర్ నియామకానికి అనుమతినిచ్చిన గవర్నర్, కమిషనర్ల నియామక ఫైలుపై అభ్యంతరాలు తెలిపినట్టు తెలిసింది. తర్వాత గవర్నర్ కార్యాలయం నుంచి వచ్చిన అభ్యంతరాలకు ప్రభుత్వం సమాధానం పంపిన నేపథ్యంలో నలుగురిని నియమించేందుకు గవర్నర్ అనుమతిచ్చారు. ప్రభుత్వం పంపిన జాబితాలో కప్పర హరిప్రసాదరావు, రాములు పేర్లను పెండింగ్‌లో ఉంచడం గమనార్హం. సోమవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సీఎం రేవంత్‌రెడ్డి రాజ్‌భవన్‌లో కలసిన అనంతరం గంటల వ్యవధిలోనే ఈ నియామక ఉత్తర్వులు వెలువడడం గమనార్హం.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

టీపీసీసీ వార్‌రూమ్ కన్వీనర్ నుంచి..



బోరెడ్డి అయోధ్యరెడ్డి ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ప్రధాన పౌరసంబంధాల అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా, మీడియా కోఆర్డినేటర్‌గా, రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర తెలంగాణకు వచ్చిన సమయంలో మీడియా కోఆర్డినేటర్‌గా, 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీపీసీసీ వార్‌రూమ్ కన్వీనర్‌గా వ్యవహరించారు. అంతకితం దాదాపు రెండు దశాబ్దాలపాటు సాక్షితో సహా వివిధ దినపత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశారు.

జర్నలిస్టు సంఘాల నాయకుడు



పీవీ శ్రీనివాస్ విద్యార్థి సంఘాల నాయకునిగా, వివిధ టీవీ చానల్స్‌లో జర్నలిస్టుగా పనిచేశారు. తెలంగాణ జర్నలిస్టు ఫోరం, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం నాయకునిగా కూడా పనిచేశారు.

సుదీర్ఘకాలం న్యాయవాద వృత్తిలో



మొహసినా పర్వీన్ 23 సంవత్సరాల నుంచి న్యాయవాదిగా పనిచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ ట్రిబ్యునల్ సభ్యురాలిగా, కో–ఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్ ప్రిసైడింగ్ ఆర్బిట్రేటర్‌గా, రాష్ట్ర మహిళా కమిషన్ అడ్‌హాక్ అడ్వొకేట్‌గా, రాష్ట్ర సమాచార కమిషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. జూనియర్ సివిల్ జడ్జీలకు మహిళల రక్షణ, గృహహింసకు సంబంధించి 2005 చట్టంపై అవగాహన కల్పించారు.

న్యాయవాది నుంచి..



దేశాల భూపాల్ రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌కు చెందిన వారు. న్యాయవాదిగా సేవలు అందిస్తున్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్, జూపల్లి

ఓపెన్ ప్లాట్ల విక్రయాలెందుకు పెరగడం లేదు

- వ్యవసాయ భూముల విషయంలోనూ ఆశించిన ప్రగతి లేదు
- కారణాలను విశ్లేషించి తగిన చర్యలు తీసుకోండి
- ఉన్నతాధికారులకు వనరుల సమీకరణ కేబినెట్ సబ్‌కమిటీ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: అపార్ట్‌మెంట్ల విక్రయాల్లో కొంత ప్రగతి కనిపిస్తున్నప్పటికీ ఓపెన్ ప్లాట్ల విక్రయాలు ఎందుకు పెరగడం లేదని వనరుల సమీకరణపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం రాష్ట్ర ఉన్నతాధికారులను ప్రశ్నించింది. ప్లాట్లతో పాటు వ్యవసాయ భూముల క్రయ, విక్రయ లావాదేవీల్లోనూ ఆశించిన ప్రగతి కనిపించడం లేదని, ఇందుకు తగిన కారణాలను విశ్లేషించి, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే దిశలో చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. మంత్రివర్గ ఉపసంఘం సోమవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సమావేశమైంది. ఉపసంఘం సభ్యులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో రాష్ట్ర ఆదాయ వనరులను పెంచే అంశంపై చర్చించారు. వాణిజ్య పన్నుల శాఖ, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, రవాణా, మైనింగ్ తదితర శాఖల పనితీరుపైనా చర్చించారు. గత ఏడాదితో పోలిస్తే వాణిజ్య పన్నుల ఆదాయం 6 శాతం పెరిగిందని, ఈ ఏడాది మార్చి నెలలో రూ.600 కోట్ల సమీకరణ లక్ష్యంగా పెట్టుకోగా, దాదాపు రూ.500 కోట్ల ఆదాయం సమకూరిందని, భవిష్యత్తులో కూడా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని మంత్రివర్గ ఉపసంఘం సూచించింది. ఎక్సైజ్ ఆదాయం పెంచుకునే క్రమంలో లీకేజీలను అరికట్టాలని, ఈ దిశలో తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్దేశించింది. రవాణా శాఖలో కొత్తగా ప్రవేశపెట్టిన ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్)ను వినియోగించుకోవాలని, ఇందుకోసం తనిఖీలు చేపట్టాలని ఆదేశించింది. గిరిజన ప్రాంతాల్లో గిరిజన సొసైటీల ద్వారా మాత్రమే ఇసుక అమ్మకాలను జరపాలని, నిజమైన గిరిజనులను సొసైటీల్లో సభ్యులుగా చేర్పించి వారికి లబ్ధి కలిగే చర్యలను పకడ్బందీగా చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించింది. జిల్లా కేంద్రాల్లో విలువైన భూములను గుర్తించి వాటిని రక్షించే చర్యలను చేపట్టాలని, నిర్మాణ అనుమతుల విషయంలో హెచ్‌ఎండీఏ వేగం పెంచాలని సూచించింది. ఈ సమావేశంలో ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిత్తల్, శ్రీధర్, సంజయ్‌కుమార్, రిజ్వీ, కమిషనర్లు హరిత, సురేంద్రమోహన్, జ్యోతి బుద్ధ ప్రకాశ్, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ తెలంగాణభవన్‌లో పీవీ విగ్రహం?

- ఏర్పాటుకు ఎన్‌డీఎంసీ ప్రతిపాదన.. మార్చి 27నే డీయూఏసీ ఆమోదం
- కేంద్ర ప్రభుత్వ తుది అనుమతి పెండింగ్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహ ఏర్పాటుకు కసరత్తు పూర్తి కావొస్తోంది. ఇప్పటికే కొన్ని అనుమతులు లభించాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి తుది అనుమతి వస్తే.. త్వరలోనే దేశ రాజధానిలో పీవీ విగ్రహం ఠీవీగా కనిపించబోతున్నది. కాంగ్రెస్ పార్టీ పీవీని నిర్లక్ష్యం చేసినా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం ఆయనకు సందర్భోచితంగా తగిన గౌరవం ఇస్తూ వస్తోంది. తాజాగా హస్తినలో కాంస్య విగ్రహం ఏర్పాటు ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఆ క్రెడిట్ కూడా తన ఖాతాలో వేసుకోవాలని భావిస్తోంది.

ప్రకాశం పంతులు విగ్రహం పక్కనే...

రాష్ట్ర విభజన తర్వాత ఢిల్లీలోని ఆస్తులను ఏపీ, తెలంగాణ పంచుకున్నాయి. ప్రస్తుతం ఉన్న భవనాలను రెండు ప్రభుత్వాలు ఉమ్మడిగానే వినియోగించుకుంటున్నాయి. వేర్వేరు భవనాలు ఇంకా నిర్మాణం కాలేదు. అయితే ఏపీ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం పక్కనే మాజీ ప్రధాని పీవీ విగ్రహం ఏర్పాటు చేయాలంటూ పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. దీనిని న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డీఎంసీ) ప్రతిపాదించగా, మార్చి 27న ఢిల్లీ అర్బన్ ఆర్ట్ కమిషన్ (డీయూఏసీ) ఆమోదించి కొన్ని సూచనలు కూడా చేసినట్టు సమాచారం. అధికారుల స్థాయిలో అన్ని అనుమతులు పూర్తయ్యాయి. అయితే కేంద్ర ప్రభుత్వం ఇంకా తుది అనుమతి ఇవ్వలేదు. 2015లో రాజ్‌ఘాట్‌లోని ఏక్తా స్థల్ వద్ద పీవీ స్మారక చిహ్నం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన విషయం తెలిసిందే. 2024 ఫిబ్రవరిలో ఆయన్ను దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నతో గౌరవించింది. హస్తినలో పీవీ కాంస్య విగ్రహ ఏర్పాటుకు కూడా అనుమతి ఇచ్చి మూడో క్రెడిట్ కూడా తన ఖాతాలో వేసుకోవాలని బీజేపీ ప్రభుత్వం అనుకుంటోంది. అయితే విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన సమాచారం తమకు లేదని, ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదన కేంద్రానికి పంపలేదని తెలంగాణభవన్ ఆర్సీ గౌరవ్ ఉప్పల్ వివరణ ఇచ్చారు.

తెలంగాణ భూములు స్టాక్ ఎక్స్ఛేంజీలో తాకట్టు

- టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మార్చిన సర్కారు
- కాంట్రాక్టర్ల నుంచి సీఎం రేవంత్‌కు రూ.20 వేల కోట్ల కమీషన్: కవిత



రామప్ప ఆలయంలో అభిషేకం చేస్తున్న కవిత

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, వరంగల్: తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ)కి చెందిన 1.75 లక్షల ఎకరాల భూములను స్టాక్ ఎక్స్ఛేంజీలో తాకట్టు పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ప్రైవేటు లిమిటెడ్ కంపెనీగా ఉన్న టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మారుస్తూ రేవంత్ ప్రభుత్వం రహస్య జీవో విడుదల చేసిందని తెలిపారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. టీజీఐఐసీ హోదాను మార్చిన విషయం దాచిపెట్టి దొంగచాటుగా జీవో ఎందుకు విడుదల చేశారని ప్రశ్నించారు. టీజీఐఐసీని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మార్చాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పుగా తెచ్చిన రూ.1.80 లక్షల కోట్లలో రూ.లక్ష కోట్లను బడా కాంట్రాక్టర్లకు చెల్లించి రేవంత్ రూ.20 వేల కోట్ల కమీషన్ తీసుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో ఆదరణ, నమ్మకం పెరుగుతున్న సమయంలో తనపై కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఓపెన్ కాస్ట్‌తో రామప్పకు ముప్పు

ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం సమీపంలో ఓపెన్ కాస్ట్ గనులను ఏర్పాటు చేసేందుకు కుట్ర జరుగుతోందని, దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని కవిత స్పష్టం చేశారు. సోమవారం రామప్ప ఆలయంలో రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఓపెన్‌కాస్ట్ పేలుళ్లతో ఆలయం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ములుగు నియోజకవర్గంలో రైతులు, ప్రజలు చనిపోతున్నా మంత్రి సీతక్క పట్టించుకోకపోవడం విచారకరమని కవిత పేర్కొన్నారు.

భూభారతిపై వేగంగా ముందుకెళ్లండి

- పైలట్ మండలాల్లో దరఖాస్తులు నెలాఖరుకు పరిష్కరించాలి
- నాలుగు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టాన్ని మరింత వేగంతో అమలు చేసేలా అధికారులు ముందుకెళ్లాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న మద్దూర్, లింగంపేట, వెంకటాపూర్, నేలకొండపల్లి మండలాల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఈ నెలాఖరుకల్లా పరిష్కారం చూపాలని ఆదేశించారు. భూభారతి చట్టం అమలుపై సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి ములుగు, కామారెడ్డి, ఖమ్మం, నారాయణపేట జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులు కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ కార్యాలయాల్లోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, పైసా ఖర్చు లేకుండా ప్రజల వద్దకే అధికారులు వచ్చి భూసమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో భాగంగా వచ్చిన దరఖాస్తులను తిరస్కరించాల్సిన సందర్భంలో క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదుచేసే సౌకర్యాన్ని సోమవారం నుంచే తహసీల్దార్లకు కల్పించామని చెప్పారు. ఆ నాలుగు మండలాల్లో దరఖాస్తుల పరిశీలన కోసం ఇతర ప్రాంతాల నుంచి నిపుణులైన సిబ్బందిని పంపాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్‌ను మంత్రి ఆదేశించారు. మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు వీలైనంత త్వరగా నిర్మాణం ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని నాలుగు జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో సీసీఎల్ఏ సెక్రటరీ ఎం.మకరంద్ కూడా పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

ప్రజలకు పారదర్శకమైన, ఉత్తమ సేవలందించడమే లక్ష్యంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను మరింత చేరువ చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. రెండోదశలో భాగంగా సోమవారం నుంచి 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభమైన స్లాట్ బుకింగ్ విధానాన్ని ఆయన సమీక్షించారు. 47 కార్యాలయాల్లో ఈ విధానం అమల్లోకి వచ్చిందని, వచ్చే నెలలో రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తెస్తామని చెప్పారు. రిజిస్ట్రేషన్ సేవల్లో జాప్యం, సిఫారసులు, దళారుల జోక్యం లేకుండా ఇకపై ప్రజలకు మెరుగైన సేవలందుతాయని పొంగులేటి వెల్లడించారు.

నేడు లాల్ సలాం అనలేని పరిస్థితి

అరుణోదయ 50 వసంతాల స్ఫూర్తి సభలో సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ

సుందరయ్య విజ్ఞానకేంద్రం(హైదరాబాద్): నేడు లాల్ సలాం అన్న పదాన్ని ఉచ్చరించడానికి కూడా భయపడే పరిస్థితి ఉందని ప్రముఖ సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరుణోదయ 50 వసంతాల స్ఫూర్తి సభ జరిగింది. ఈ సందర్భంగా అరుణోదయ సావనీర్‌ను ఆవిష్కరించారు. సభకు ముందు సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి వీఎస్టీ వరకు ఎర్రజెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద అరుణోదయ జెండాను ఆ సంస్థ ప్రతినిధి రాములన్న ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ అప్పుడు ఉన్న విప్లవ పరిస్థితులు నేడు బలహీనపడ్డాయన్నారు. తమ ఆశయ సాధనలో మరింత శక్తిని పుంజుకొని కదలాలని అభిలాషించారు.

- జనసాహితీ అధ్యక్షుడు దివికుమార్ మాట్లాడుతూ భారతీయ ఫాసిజంపై పోరాటం చేయకుండా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని నిర్మించలేమన్నారు. ఆదివాసీలను అడవుల నుంచి వెలగొట్టి వారి సంపాదనే దోచుకోవడానికే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.



పాటల సీడీని ఆవిష్కరణలో తమ్మారెడ్డి, విమల

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ జంపాల ప్రసాద్ ఆలోచనలతో అరుణోదయ సంస్థ పురుడుపోసుకుందని, ఈ 50 ఏళ్ల కాలంలో పనిచేసి అమరులైన వారికి జోహార్లు అర్పిస్తున్నట్టు చెప్పారు.
- మానవ హక్కులు ఫోరం కన్వీనర్ ఎస్.జీవన్‌కుమార్ మాట్లాడుతూ అనేక రూపాల్లో ప్రజలను చైతన్యం చేయడానికి అరుణోయ చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కట్ట భగవంత్‌రెడ్డి, డాక్టర్ ఏకే ప్రభాకర్, కొల్లాపురం విమల, రాంసత్తయ్య, వరలక్ష్మి యెనిశెట్టి శంకర్, సూర్యం మల్హార్, పోతుల రమేష్, బీఎస్ రాములు, ప్రొఫెసర్లు లక్ష్మీ, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం సీజన్‌కు సిద్ధం కావాలి

- పచ్చిరొట్ట విత్తనాలు, యూరియా సరఫరాపై అధికారులకు మంత్రి తుమ్మల దిశానిర్దేశం
- జూన్ 2 నాటికి మరో 1,000 రైతు వేదికల్లో దృశ్యశ్రవణ మాధ్యమాల ఏర్పాటు
- వానాకాలం సీజన్ సన్నద్ధతపై మంత్రి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: వచ్చే వానాకాలం సీజన్‌కు సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో వ్యవసాయాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి.. వచ్చే వానాకాలం సీజన్‌కు సంబంధించి ప్రణాళికలు, విత్తనాల సరఫరా, ఎరువుల నిల్వల వంటి కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యూరియా, విత్తనాల సరఫరాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా కావాల్సినంత పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించడానికి అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి మండలంలో విత్తనాల సరఫరా స్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. కాగా, 2025–26 వానాకాలం సీజన్ కోసం 3.31 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను ఇప్పటికే భద్రపరచిన విషయాన్ని అధికారులు వివరించారు. మే నెలాఖరు నాటికి మరో 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ముందస్తుగా తెప్పించుకొని, అందు బాటులో ఉంచుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. మరో 1,000 రైతు వేదికలలో దృశ్యశ్రవణ మాధ్యమాలను ఏర్పాటు చేయాలని, జూన్ 2 వరకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేలా వాటి పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

కేంద్ర సహకారం లేకపోవడంతో రాష్ట్రంపై భారం

కేంద్ర ప్రభుత్వం అనేక పంటలకు మద్దతు ధర ప్రకటించి, అక్కడితో తమ బాధ్యత పూర్తయినట్టు భావిస్తోందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. కేవలం ఒకటి, రెండు పంటలు తప్పితే మిగతా అన్ని పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలేయడం వల్ల, రైతుల దగ్గర పంటలను మద్దతు ధరకు సేకరించే తెలంగాణ వంటి రాష్ట్ర ప్రభుత్వాలపై అధికంగా భారం పడుతోందన్నారు. ఈ సమావేశంలో శాఖాపరమైన దీర్ఘకాలిక సమస్యలపై కూడా మంత్రి తుమ్మల సమీక్షించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, డైరెక్టర్ గోపి, మార్కెటింగ్ డైరెక్టర్ సురేంద్రమోహన్, సీడ్ కార్పొరేషన్ ఎండీ యాస్మిన్ బాషా, వ్యవసాయ వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య, ఉద్యానవన వర్సిటీ వీసీ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ డైరెక్టర్‌ను హతమార్చిన మావోయిస్టులు

బీజాపూర్ జిల్లాలో మరో ముగ్గురు కూడా హతం



నాగ బండారి (ఫైల్)

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు దారుణానికి ఒడిగట్టారు. బీజాపూర్ జిల్లాలో ఇన్‌ఫార్మర్ల పేరిట ఒకేరోజు నలుగురిని హతమార్చారు. బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధి మారేడుబాక గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్, పూజారి అయిన నాగ బండారి సమీపంలోని లింగాపూర్‌లో ఓ ఇంట్లో శుభకార్యానికి ఆదివారం వెళ్లాడు. అక్కడే ఆయన నిద్రించగా, అర్ధరాత్రి వేళ ఇంటిని చుట్టుముట్టిన మావోయిస్టులు నాగ బండారిని బయటకు తీసుకొచ్చి పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తూ గొడ్డళ్లతో నరికి చంపారు. ఇక ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోనే లింగాపురం, పామేడు పోలీస్‌స్టేషన్ పరిధి కవచాల, మీనగట్ట గ్రామాల్లో మరో ముగ్గురిని సైతం మావోయిస్టులు హతమార్చారు. పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నందునే వీరందరినీ మావోయిస్టులు హతమార్చినట్టు తెలిసింది. కాగా, నాగ బండారి సోదరుడు తిరుపతి బండారిని కూడా మావోలు ఆరు నెలలక్రితం ఇన్‌ఫార్మర్ నెపంతోనే హతమార్చారు. వరుసగా నలుగురిని మావోయిస్టులు పొట్టన పెట్టుకోవడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్టీసీలో 'వడ్డీ' వార్

రూ.564 కోట్ల వడ్డీ చెల్లించాలంటూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ ఎండీలకు సీసీఎస్ లీగల్ నోటీసు

- 15 రోజుల్లో స్పందించని పక్షంలో హైకోర్టులో న్యాయపోరాటం
- ఇప్పటికే సీసీఎస్ బకాయిల కేసు పెండింగ్‌లో..

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ.. ఆర్టీసీ ఉద్యోగుల సహకార పరపతి సంఘం(సీసీఎస్) మధ్య 'వడ్డీ'వార్ మొదలైంది. నిధులను యథేచ్ఛగా వాడేసుకొని, వాటిని చెల్లించకుండా, ఉద్యోగులకు రుణాలు ఇవ్వలేని పరిస్థితి తెచ్చిందంటూ సీసీఎస్ గతంలో న్యాయపోరాటం చేసి కొంత వరకు విజయం సాధించింది. ఇప్పటికీ ఆ కేసు హైకోర్టులో కొనసాగుతుండగా, తాజాగా ఆర్టీసీ వాడుకున్న సీసీఎస్ నిధులపై వడ్డీని చెల్లించకుండా ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తోందని, అదే జరిగితే ఆర్టీసీలోని ఉద్యోగులు ఏకంగా రూ.564 కోట్లు కోల్పోవాల్సి ఉంటుందని పేర్కొంటూ రవాణా శాఖను పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ ఎండీ, ఆర్టీసీ ఆర్థిక సలహాదారు–చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్లకు సీసీఎస్ లీగల్ నోటీసు పంపింది. 15 రోజుల్లో సానుకూలంగా స్పందించని పక్షంలో హైకోర్టును ఆశ్రయిస్తామని పేర్కొంది. ఇప్పుడిది ప్రభుత్వంలో చర్చనీయాంశంగా మారింది.

దశాబ్దకాలంగా వడ్డీ అలాగే..

ఆర్టీసీలో సహకార పరపతి సంఘం చాలా కీలకమైంది. ఇది నేరుగా సంస్థ ఆధ్వర్యంలో కాకుండా, ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏర్పడే ప్రత్యేక పాలక మండలి ఆధ్వర్యంలో నడుస్తుంది. ప్రతినెలా ఉద్యోగులు తమ జీతంలో ఏడు శాతం మొత్తాన్ని సీసీఎస్‌కు జమ చేస్తారు. అలా పోగయ్యే మొత్తం సీసీఎస్ నిధిగా మారుతుంది. ఉద్యోగులు తమ ఇంటి, వ్యక్తిగత అవసరాలకు ఆ నిధి నుంచి రుణాలు పొందుతారు. దానికి వడ్డీ కూడా చెల్లిస్తారు. తాము పనిచేసినంతకాలం ఆ నిధికి జమ చేసే మొత్తాన్ని తీసుకున్నప్పుడు, దానిపై వడ్డీని సీసీఎస్ చెల్లిస్తుంది. ఉద్యోగ విరమణ పొందినప్పుడు అందే బెనిఫిట్స్ మొత్తాన్ని చాలామంది ఉద్యోగులు సీసీఎస్‌లో డిపాజిట్ చేసి వడ్డీ పొందుతున్నారు. ఈ మొత్తాన్ని ఆర్టీసీ వాడుతోంది. 2011లోనే ఈ నిధుల వినియోగాన్ని వాడటం ప్రారంభించినా, తెలంగాణ ఆర్టీసీ ఏర్పడిన తర్వాత విచ్చలవిడి అయ్యింది. చివరకు ఆ నిధిని ఖాళీ చేయటంతో ఉద్యోగులకు రుణాలివ్వలేని పరిస్థితి, రిటైర్డ్ ఉద్యోగులకు వడ్డీ చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై సీసీఎస్ న్యాయపోరాటం చేయగా, కొంత మొత్తాన్ని ఆర్టీసీ తిరిగి ఆ సంస్థకు చెల్లించింది. ప్రస్తుతం రూ.466 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. కానీ, దశాబ్ద కాలంగా, ఆర్టీసీ వాడేసుకున్న సీసీఎస్ నిధిపై వడ్డీని చెల్లించలేదు. ఆ వడ్డీ పేరుకుపోయి ప్రస్తుతం 564 కోట్లకు చేరిందని తాజాగా అందజేసిన లీగల్ నోటీసులో సీసీఎస్ పేర్కొంది. వడ్డీతో కలుపుకొని బకాయిల మొత్తం రూ.1,029 కోట్లకు చేరిందని వెల్లడించింది. ఆర్టీసీ మాత్రం కేవలం అసలు మొత్తం రూ.466 కోట్లను మాత్రమే బకాయిగా చూపుతోంది. వడ్డీని చెల్లించని పక్షంలో, నేరుగా ఆర్టీసీ ఉద్యోగులు ఆ రూ.564 కోట్లు నష్టపోయినట్టేనని, ఇది ఉద్యోగులకు తీవ్ర నష్టమని, వారు ఆర్టీసీలో పనిచేసిన కాలంలో చేసుకున్న పొదుపును అంతమేర కోల్పోయినట్టేనని సీసీఎస్ పేర్కొంటోంది. లీగల్ నోటీసుకు సానుకూలంగా స్పందించని పక్షంలో, హైకోర్టులో మరో న్యాయపోరాటానికి సీసీఎస్ దిగినట్టే అవుతుంది. వెరసి బకాయిల చెల్లింపు విషయంలో కొనసాగుతున్న న్యాయపోరాటానికి ఇది తోడు కానుంది. ఇప్పటికే, ఒక పర్యాయం బకాయిల చెల్లింపు విషయంలో హైకోర్టు ఆదేశాన్ని పాటించలేదని పేర్కొంటూ ఆర్టీసీపై కోర్టు ధిక్కరణ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. లీగల్ నోటీసులో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పేరు కూడా ఉండటంతో, కేసులో ఆయన కూడా ప్రతివాది అయ్యే అవకాశముంది.



ఈఆర్సీ సభ్యులుగా రఘు, శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) సభ్యులు (టెక్నికల్)గా కంచర్ల రఘు, సభ్యులు (ఫైనా న్స్)గా చెరుకూరి శ్రీనివాసరావు సోమ వారం ప్రమాణస్వీకారం చేశారు. విద్యుత్ నియంత్రణ్ భవన్‌లో ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ డి.నాగార్జున్ వారితో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణభాస్కర్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీతో పాటు పెద్ద సంఖ్యలో విద్యుత్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం తర్వాత జస్టిస్ దేవరాజు నాగార్జున్, సుల్తానియాతో రఘు, శ్రీనివాసరావు.

ఇదివరకైతే ఇలాంటి పోటీల్లో నిర్ణీత కొలతల్లో శరీరాకృతి ఉండాలనే నియమం ఉండేది. కానీ ఇప్పుడు వీరందరినీ చూస్తుంటే అలా అనిపించట్లేదు. అయిదున్నర అడుగుల కంటే తక్కువ ఎత్తున్న వాళ్లున్నారు.. ఆరడుగులు ఎత్తు దాటిన వారూ ఉన్నారు. సన్నజాజి తీగను మరిపించే వారున్నారు, బలిష్ఠమైన శరీరాకృతితో మెరిసిపోతున్న వాళ్లూ ఉన్నారు. ఇంచుమించు అందరివీ వైవిధ్యభరితమైన నేపథ్యాలు, ఎన్నో పోరాటాలు, ఎదురీతలు...





మీకూ మాకూ సామ్యం.. బౌద్ధం!



మిస్ జపాన్ కియానా తుమీత

దాదాపు 120 దేశాల సుందరీమణులు. రకరకాల దేశాల శీతోష్ణస్థితులు... రకరకాల స్కిన్‌టోన్‌లు. వివిధ రకాల ఆకృతులు. వారందరికీ ఒక్కొక్కరిది ఒక్కో కథ! ఆత్మవిశ్వాసమే ఆభరణంగా.. ప్రతిభ, బ్యూటీ విత్ పర్పస్ ప్రధాన అర్హతలుగా తెలంగాణలో జరుగుతున్న 72వ మిస్ వరల్డ్ పోటీలకు వచ్చిన ఆ సుందరీమణుల్లో రోజుకొకరి పరిచయం ఇక్కడ. ఈరోజు మిస్ జపాన్ కియానా తుమీత గురించి ఆమె మాటల్లోనే..

నేను ప్రకృతి వైపరీత్యాల మీద పీహెచ్‌డీ చేస్తున్నాను. అంతకుముందు కేంబ్రిడ్జ్, ఎడింబరో యూనివర్సిటీల్లో విమెన్ లీడర్ షిప్ మాస్టర్ డిగ్రీ చేశాను. ఒక బిజినెస్ చానల్‌లో ఎకనమిక్ న్యూస్ యాంకర్‌గా పని చేస్తున్నాను. నా టాలెంట్ విషయాలకు వస్తే నేను జపనీస్ కాలిగ్రాఫర్‌ని. అందులో నాకు మంచి పేరుంది. ఎలక్ట్రిక్ ఫ్లూట్ కూడా వాయిస్తాను. ఈ పోటీల్లో టాలెంట్ రౌండ్‌లో ఎలక్ట్రిక్ ఫ్లూట్‌నే పెర్ఫార్మ్ చేయబోతున్నాను. ప్రకృతి గౌరవిస్తూ వైపరీత్యాలు రాకుండా జాగ్రత్తపడటం, ఒక వేళ ప్రకృతివైపరీత్యాలు సంభవిస్తే వాటిని ఎలా ఎదుర్కోవాలో పిల్లలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తుంటాను. నా అందంతో ఈ ప్రయోజనాన్ని సాధించాలనుకుంటున్నా! ప్రకృతి వైపరీత్యాల పట్ల పిల్లలకు అవేర్‌నెస్ కల్పించడం! స్త్రీ, పురుష వివక్ష విషయానికి వస్తే.. దానికి జపాన్ కూడా అతీతమేమీ కాదు. చదువుకు సంబంధించి అమ్మాయి, అబ్బాయిలకు సమాన అవకాశాలున్నప్పటికీ.. లీడర్‌షిప్ విషయంలో మాత్రం పురుషులదే ఆధిపత్యం. ఆ అంతరం చాలా ఎక్కువ. వేతనాల్లో కూడా ఆ గ్యాప్ కనపడుతుంది. సమానమైన పనికి మహిళలకన్నా పురుషులకే వేతనాలు ఎక్కువ. డిసిప్లిన్, పని విషయాల్లో ప్రపంచంలోని ప్రతిదేశం జపాన్ వైపు చూస్తుందేమో కానీ.. టెక్నికల్ జాబ్స్ విషయంలో మాత్రం మేము ఇండియాను అప్రిషియేట్ చేస్తాం. కొత్తగా వచ్చిన ఏ టెక్నికల్ చేంజ్‌ను అయినా ఇట్టే గ్రహించి, అడాప్ట్ చేసుకుని రాణిస్తున్నారు. ఇండియాలో జరుగుతున్న క్రైమ్ గురించి వార్తల్లో విన్నప్పుడు కొంచెం నెర్వస్ ఫీలయ్యాను. కానీ ఈ పోటీల కోసం ఇక్కడ ల్యాండ్ అయ్యి, ఇక్కడి మనుషులు, వాళ్లిచ్చే మర్యాద అవన్నీ చూశాక ఆ నెర్వస్‌నెస్, భయాలు అన్నీ పటాపంచలయ్యాయి. ఇక్కడికి రావడానికి నాకు దుబాయ్‌లో కనెక్టింగ్ ఫ్లయిట్ ఉండింది. అక్కడ బోర్డింగ్‌లో నా లగేజీతో అవస్థపడుతుంటే ఒక ఇండియన్ జెంటిల్‌మన్ నాకు చాలా హెల్ప్ చేశాడు. అప్పుడే నాకు ఇండియా మీద గౌరవం రెట్టింపయింది. ఈ దేశానికి సంబంధించి నాకు ఇష్టమైన మరోవిషయం.. ఎర్రటి బొట్టు. ఈ పాజెంట్‌లో ఒక రోజు నేను చీర కట్టుకుని, ఎర్రటి బిందీ పెట్టుకోవాలనుకుంటున్నాను. ఇండియాకు, జపాన్‌కున్న మరో సామ్యం.. బౌద్ధం. మేము ఫాలో అవుతున్న బౌద్ధానికి, ఇక్కడికి వ్యత్యాసమున్నప్పటికీ బౌద్ధం ఈ దేశంతో మాకో కనెక్టివిటీని పెంచింది. ఇక్కడి ఆధ్యాత్మికతకు నేను ఫిదా అయ్యాను. బ్యూటీ పాజెంట్ విషయానికి వస్తే చాలా దేశాల్లో ఉన్నట్టే జపాన్‌లోనూ.. అందాల పోటీలు అంటే స్కిన్ షో తప్ప మరోటి కాదనే అభిప్రాయం, అపోహ ఉన్నాయి. కానీ బ్యూటీ విత్ పర్పస్ అనే ఐడియా నాకు నచ్చి.. పోటీల్లో పాల్గొంటున్నాను. సిస్టర్‌హుడ్ క్రియేట్ చేయడానికి ఇదొక వేదిక. సన్నగా ఉన్నామా.. లావుగా ఉన్నామా.. తెల్లగా ఉన్నామా.. నల్లగా ఉన్నామా అని కాదు.. అదసలు విషయమే కాదు. డజంట్ మ్యాటర్. ఎంత కాన్ఫిడెంట్‌గా ఉన్నామన్నదే మ్యాటర్. అందుకే నా దృష్టిలో ఆత్మవిశ్వాసమే అసలైన అందం!

– సరస్వతి రమ

జూనియర్ ఎన్టీఆర్‌తో నటించాలనుంది..

నాటు నాటు పాట జపాన్‌లో చాలా ఫేమస్. ఆ సినిమా అంటే నాకూ చాలా ఇష్టం. అవకాశం వస్తే జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ పక్కన నటించడానికి నేను సిద్ధం. బాలీవుడ్‌లో ప్రియాంక చోప్రా, షారూఖ్ ఖాన్‌కి వీర ఫ్యాన్‌ని. ఇండియాది రిచ్ కల్చర్. ఇక్కడి రైతా చాలా డెలీషియస్‌గా ఉంటుంది.

– కియానా తుమీత

ఫొటోలు: ఎస్.ఎస్.ఠాకూర్

వైవిధ్యమే అందం



'మిస్ వరల్డ్ వియత్నాం' హువాన్ త్రాన్ నీ

అందం అంటే స్వతహాగా మనం ఉండే విధానమే. అందానికి సూత్రాలేం లేవు. దేనినైనా స్వతహాగా ఆస్వాదించడమే అందం. ఇదే ప్రపంచంలోని అందమైన వైవిధ్యం అన్నారు హువాన్ త్రాన్ నీ. తెలంగాణ (హైదరాబాద్) వేదికగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ 2025 పోటీల నేపథ్యంలో మిస్ వరల్డ్ వియత్నామ్ హువాన్ త్రాన్ నీ 'సాక్షి' తో ప్రత్యేకంగా ముచ్చటించారు. భారతీయతను, మానవత్వాన్ని, భిన్న సంస్కృతుల అద్భుత సమ్మేళనాన్ని గొప్పగా వర్ణించిన హువాన్ త్రాన్ 'సాక్షి'తో పంచుకున్న విషయాలు ఆమె మాటల్లోనే..!!

ఎయిర్‌పోర్ట్‌లోకి రాగానే బొట్టు పెట్టి నన్ను ఆహ్వానించిన విధానం, ఇక్కడి సంస్కృతిలోని ఆప్యాయత నాకెంతో నచ్చింది. తెలంగాణ స్థానిక సంస్కృతిలో ప్రదర్శించిన నృత్యాలు నన్ను అబ్బురపరిచాయి. ఇక్కడి కళాకారుల్లో ఒక వైవిధ్యముంది. ఇక్కడి ఆతిథ్యం నాకు మరో ఇంటిని తలపిస్తోంది. నేను బస చేస్తున్న హోటల్ సిబ్బంది నా కోసం పర్యావరణహితమైన పదార్థాలతో తయారు చేసిన అందమైన బ్యాగ్ బహుమతిగా ఇచ్చారు. మరో సిబ్బంది నా కోసం వియత్నామీస్ భాషలో రాసిచ్చిన లేఖ నన్ను హత్తుకుంది. ఇంటికి దూరంగా ఉన్న నాకు ఈ లేఖ ఎంతో సాంత్వనను అందించింది. ఇవన్నీ ఇక్కడి ప్రజల ఆత్మీయత, ప్రేమానురాగాలకు ప్రతీకలు. హైదరాబాద్‌లో నాకు బాగా నచ్చిన అంశం పానీ పూరీ. వియత్నాం, నేను చదువుకునే ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఎప్పుడూ ఇంత రుచికరమైనది తినలేదు. మిస్ ఇండియా నందినీ గుప్తా పానీ పూరీ ఎలా తినాలో నేర్పించింది.

నా దేశం అందమైన, సాంస్కృతికమైన దేశం. మిస్ వరల్డ్ అంటే.. తమ దేశ సంస్కృతి, సంప్రదాయాల గురించి.. వ్యక్తిగత విశిష్టత గురించి గొప్పగా ప్రదర్శించే ప్రపంచ వేదిక. ఈ స్ఫూర్తితోనే నేను వియత్నామీస్ ఆత్మస్థైర్యం, సామాజిక బాధ్యత గల అమ్మాయిగా మిస్ వరల్డ్ వేదికపైన సగర్వంగా నిలుచున్నాను. మిస్ థాయ్‌లాండ్ ఓపాల్, మరో దేశ వనిత సోమ నాకు స్ఫూర్తినిచ్చారు. సామాజికంగా ఎదురయ్యే కొన్ని అడ్డంకులు, అవరోధాలను ఎలా ఎదుర్కోవాలో వారి కథలు విని నేర్చుకున్నాను.

ఎన్నో స్కూల్స్‌ను పునరుద్ధరించాను

విద్య–విజ్ఞానం ఎక్కడ ఉంటే అక్కడి జీవితాలు బాగుంటాయని నమ్ముతాను. అందుకే మా దేశంలో 'హర్ట్ హెల్ప్' అనే ప్రాజెక్ట్ చేపట్టాను. ఇదే నా బ్యూటీ విత్ పర్పస్ థీమ్. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎన్నో స్కూల్స్‌ను పునరుద్ధరించాను, అక్కడి విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందించడానికి బుక్ రూంలను ఏర్పాటు చేశాను. నేను మిస్ వరల్డ్ విజేతగా నిలిస్తే ఈ ప్రాజెక్ట్‌ను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతానని వాగ్దానం చేస్తున్నాను.

పుస్తకాలే నాకు సాంత్వన

నా ఫ్యాషన్ మోడలింగ్‌లో ఎంతో ఒత్తిడిని ఎదుర్కొన్నాను. దానిని అధిగమించడానికి నాకు తోడుగా నిలిచింది పుస్తకాలు మాత్రమే. పుస్తకాలే నాకు గురువులు, స్నేహితులు, సాంత్వన. వ్యక్తులు, వ్యక్తిత్వాలు, సామాజిక అంశాలను రచయితలు ఎంతో హృద్యంగా మనకు చేరవేస్తారు. 'ఎలయర్' అనే పుస్తకం నాకెంతో నేర్పించింది. ఎప్పుడైనా సరే ఇతరుల విజయాన్ని చూసి మనల్ని పోల్చుకోవద్దు. వారి విజయాలకు కారణాలు వేరు. మన వాస్తవ పరిస్థితులు వేరు. ప్రతీ ఒక్కరికి ఒక వినూత్నమైన దారి ఉంటుంది, ఒక అందమైన ప్రయాణముంటుంది.

– హనుమాద్రి శ్రీకాంత్

అందరినీ గౌరవించండి

ప్రతి ఒక్కరి జీవితంలో ఛాలెంజెస్ ఉంటాయి. నేనూ వాటిని దాటుకునే వచ్చిన దానినే. ఈ సందర్భంగా నేనొక విషయం గట్టిగా చెప్పాలనుకుంటున్నాను. ప్రతి ఒక్కరి విషయంలో దయతో ఉండండి. ఎవరినీ తక్కువ చేసి చూడొద్దు. సామాజిక అసమానతలు, అస్పృశ్యతలు నాలాంటి అమ్మాయిలను వేదనకు గురి చేస్తాయి. ఈ విషయాన్ని మిస్ వరల్డ్ వేదికపైన చెప్పాలనుకున్నాను.. కానీ 'సాక్షి' దీనిపై నన్ను స్పందన కోరడంతో ఎంతో భావోద్వేగానికి లోనవుతున్నాను. దయచేసి ప్రతి ఒక్కరిని గౌరవించండి. వారి ఆలోచనలకు విలువ ఇవ్వండి.

– హువాన్ త్రాన్

బాబే సూత్రధారి..

'ముఖ్య'నేత సమర్పించు.. మందు 'పాత్రలు'!

వ్యూహాత్మకంగా పాత్రధారుల ఎంపిక.. ఎవరి మీద కుట్ర పన్నాలి? ఎవరిని ఇరికించాలని ముఖ్యనేత పన్నాగం

బెదిరింపులు, ప్రలోభాలతో తమ దారికి తెచ్చుకుని అబద్ధపు వాంగ్మూలాలు

తెరపైకి భేతాళ కథలు.. అవే కట్టు కథలు సిట్ రిమాండ్ రిపోర్టులో..

సాక్షి, అమరావతి: మద్యం మాఫియా డాన్‌గా గుర్తింపు పొందిన ముఖ్యమంత్రి చంద్రబాబు రెడ్‌బుక్ కుట్రను రక్తి కట్టించేందుకు సరికొత్త కుతంత్రాలకు పదును పెడుతున్నారు. వ్యూహాత్మకంగా పాత్రధారులను ఎంపిక చేసుకుని ప్రలోభపెట్టి, బెదిరించి దారికి తెచ్చుకుని అబద్ధపు వాంగ్మూలాలతో రోజుకో భేతాళ కథను తెరపైకి తెస్తున్నారు. కట్టు కథలు అల్లుతూ వాటిని వారితో పలికిస్తున్నారు. అవే కల్పిత కథలను రిమాండ్ రిపోర్టులో పొందుపరుస్తున్నారు. దానిపై తాము సంతకం చేయలేదని నిందితులే స్వయంగా న్యాయమూర్తుల ఎదుట వెల్లడిస్తున్నారంటే బాబు భేతాళ కథలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇక టీడీపీకి చెందిన విజయవాడ ఎంపీగా కేశినేని చిన్ని వ్యాపార భాగస్వామిగా ఉన్న రాజ్ కేసిరెడ్డిని సరికొత్త పాత్రధారిగా చంద్రబాబు తీసుకొచ్చారు. తాను అబద్ధాలు చెప్పలేనని, ఇంత దారుణమైన రిమాండ్ రిపోర్టుపై సంతకం చేయలేదని రాజ్ కేసిరెడ్డి చెప్పారు. అదే విషయాన్ని న్యాయస్థానంలోనూ వెల్లడించారు. సిట్ అధికారుల వేధింపులు, అబద్ధపు వాంగ్మూలాలపై మూడుసార్లు కోర్టుకు మొర పెట్టుకున్న బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ ఎంపీ వాసుదేవరెడ్డి చివరకు తమ దారికి రావడంతో ప్రభుత్వ పెద్దలు ఆగమేఘాలపై రిలీవ్ చేసి కేంద్ర సర్వీసులకు సాగనంపారు. రెడ్‌బుక్ అరాచకాలు, బెదిరింపులను డిస్టిలరీల యజమానులు సైతం న్యాయస్థానానికి నివేదించారు. చంద్రబాబు సూత్రధారిగా ఆడిస్తున్న ఈ కపట నాటకంలో బెవరేజస్ కార్పొరేషన్ పూర్వ ఉద్యోగులు సత్యప్రసాద్, అనూష, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, టీడీపీ నేత ఎస్పీవై రెడ్డి అల్లుడు శ్రీధర్‌రెడ్డి పావులుగా మారారు. బెదిరించడం.. వెంటాడి వెంటాడి వేధించడం.. అబద్ధపు వాంగ్మూలాలు ఇప్పించడం దాకా అంతా చంద్రబాబు డైరెక్షన్‌లోనే సాగుతోంది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అడ్డంగా దొరికిపోయి బెయిల్‌పై ఉన్న చంద్రబాబు గత ప్రభుత్వం అమలు చేసిన పారదర్శక మద్యం విధానంపై దుష్ప్రచారం సాగిస్తూ అవే అంశాలను పాత్రధారులతో పలికిస్తున్నారు. గతంలో 2014–19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు విచ్చలవిడిగా సాగించిన మద్యం దందాను మించి ఇప్పుడు 2024లో నూతన విధానం పేరుతో దోపిడీకి రాచబాట వేసుకున్నారు. టీడీపీ సిండికేట్ దోపిడీకి అడ్డుకట్ట వేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేసిన దశలవారీ మద్య నియంత్రణ విధానంపై అక్రమ కేసుతో కుయుక్తులకు పదును పెడుతున్న వైనం ఇదిగో ఇలా ఉంది...

లేని కుంభకోణం ఉన్నట్టుగా చూపించే కుతంత్రం

వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం విధానంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని తెలుసు కాబట్టే అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాల కోసం సిట్ దర్యాప్తు ముసుగులో చంద్రబాబు ప్రభుత్వం బరి తెగించి వేధింపులకు తెగబడుతోంది. 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దశలవారీ మద్య నియంత్రణ విధానాన్ని సమర్థంగా అమలు చేసింది. అంతకుముందు టీడీపీ హయాంలో దోపిడీకి పాల్పడ్డ ప్రైవేటు మద్యం దుకాణాల విధానాన్ని రద్దు చేసింది. ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రవేశపెట్టి వేళలను కుదించింది. టీడీపీ హయాంలో ఉన్న 4,380 మద్యం దుకాణాలను 2,934కి తగ్గించింది. చంద్రబాబు సర్కారు అనధికారిక బార్లుగా లైసెన్సులు జారీ చేసిన 4,380 పర్మిట్ రూమ్‌లను రద్దు చేసింది. టీడీపీ హయాంలో విచ్చలవిడిగా ఏర్పాటైన 43 వేల బెల్ట్ దుకాణాలను నిర్మూలించింది. కొత్తగా ఒక్క మద్యం డిస్టిలరీకి కూడా లైసెన్సు మంజూరు చేయలేదు. ఇలా విప్లవాత్మక చర్యలతో వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం అమ్మకాలు గణనీయంగా తగ్గాయి. మద్యం అమ్మకాలు పెరిగితేనే డిస్టిలరీలు లాభాలు గడించి కమీషన్లకు ఆస్కారం ఉంటుంది. మరి వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం అమ్మకాలు గణనీయంగా తగ్గడంతో డిస్టిలరీలకు లాభాలు తగ్గాయి. అలాంటప్పుడు ఇక కమీషన్లకు ఆస్కారం ఎక్కడుంది? మద్యం అక్రమ కేసులో సిట్ ఎలాంటి ఆధారాలు



సేకరించలేకపోవడంతో తాను ఎంపిక చేసుకున్న పాత్రధారుల ద్వారా చంద్రబాబు అబద్ధపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలు ఇప్పిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

సిట్ వేధింపులపై మూడుసార్లు కోర్టుకు..

– చివరికి తలొగ్గడంతో కేంద్ర సర్వీసులకు

చంద్రబాబు రెడ్‌బుక్ కుట్రలో మొదటి పాత్రధారి బెవరేజస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి. తమ కుట్రకు అనుగుణంగా అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాలని టీడీపీ ప్రభుత్వం ఆయన్ను తీవ్రంగా బెదిరించింది. అందుకు మొదట్లో ససేమిరా అన్న వాసుదేవరెడ్డి మూడుసార్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం గమనార్హం. అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాలని సిట్ అధికారులు తనను బెదిరిస్తున్నట్లు కోర్టుకు మొర పెట్టుకున్నారు. అయినా సరే సిట్ అధికారులు వెనక్కి తగ్గకుండా వేధించారు. కేంద్ర సర్వీసుల నుంచి వచ్చిన ఆయన డెప్యుటేషన్ కాల పరిమితి ముగిసినా రిలీవ్ చేయలేదు. చివరికి సిట్ వేధింపులకు వాసుదేవరెడ్డి తలొగ్గారు. చంద్రబాబు కుట్రకు అనుగుణంగా.. సిట్ అధికారులు చెప్పమన్నట్లుగా అబద్ధపు వాంగ్మూలం ఇచ్చారు. దీంతో ఈ కుట్ర నాటకంలో తాను ఇచ్చిన పాత్రకు వాసుదేవరెడ్డి న్యాయం చేశారని చంద్రబాబు సంతృప్తి చెందారు. అంతే.. ఆ వెంటనే ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వం రిలీవ్ చేయడం... ఢిల్లీలో కేంద్ర సర్వీసులో చేరిపోవడం చకచకా జరిగిపోయాయి.

ఆ ఇద్దరూ.. కీలు బొమ్మలే

బెవరేజస్ కార్పొరేషన్ పూర్వ ఉద్యోగులు సత్యప్రసాద్, అనూషను సైతం చంద్రబాబు తన కుట్ర నాటకంలో పాత్రధారులుగా చేశారు. వారిని కూడా సిట్ అధికారులు భయపెట్టి, బెదిరించి దారికి తెచ్చుకున్నారు. దాంతో సిట్ అధికారులు చెప్పినట్టుగా సత్యప్రసాద్, అనూష అబద్ధపు వాంగ్మూలాలు నమోదు చేశారు.

రాజకీయ పాత్రధారి విజయ్‌సాయిరెడ్డి

అనంతరం చంద్రబాబు పక్కా పన్నాగంతో తన కుట్రలో రాజకీయ నేతను పాత్రధారిగా ప్రవేశపెట్టారు. అది మరెవరో కాదు.. మాజీ ఎంపీ వి.విజయ్‌సాయిరెడ్డి. వైఎస్సార్‌సీపీ అధినేత ఆయన్ను విశ్వసించి వరుసగా రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా చేశారు. మరో మూడున్నరేళ్ల పదవీ కాలం మిగిలి ఉన్నప్పటికీ ఆయన తన ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ఉపఎన్నికలు వస్తే రాజ్యసభ సీటును తిరిగి గెలుచుకునేంత ఎమ్మెల్యేల బలం వైఎస్సార్‌సీపీకి లేదని తెలిసి కూడా రాజీనామా చేయడం గమనార్హం. అంటే రాజ్యసభలో టీడీపీ కూటమికి ప్రయోజనం కలిగించేందుకే ఆయన రాజీనామా చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ మద్యం విధానంపై టీడీపీ కూటమి సర్కారు బనాయించిన అక్రమ కేసుకు ఆయన వంతపాడటం అసలు కుట్రను బట్టబయలు చేసింది. కాకినాడ పోర్టులో వాటాల బదిలీపై కేసు విచారణకు హాజరైన విజయ్ సాయిరెడ్డి బయటకు వచ్చాక మద్యం అక్రమ కేసు గురించి మాట్లాడారంటే దీని వెనుక ఉన్న వ్యూహాన్ని అర్థం చేసుకోవచ్చు.

తాజాగా తెరపైకి టీడీపీ నేత శ్రీధర్‌రెడ్డి..

రెడ్‌బుక్ కపట నాటకంలో చంద్రబాబు తాజాగా టీడీపీ నేత శ్రీధర్‌రెడ్డిని తెరపైకి తెచ్చారు. 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున నంద్యాల ఎంపీగా గెలిచి, వెంటనే టీడీపీలోకి ఫిరాయించిన ఎస్పీవై రెడ్డికి ఆయన అల్లుడు కావడం గమనార్హం. అందుకే ఎస్పీవై రెడ్డి కుటుంబ డిస్టిలరీకి టీడీపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అప్పటి నుంచి శ్రీధర్‌రెడ్డి టీడీపీ కూటమిలో రాజకీయంగా క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఆయనతో అబద్ధపు వాంగ్మూలం ఇప్పించి వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం చేయించేందుకు సిట్ కుట్ర పన్నుతుండటం గమనార్హం.

విజయవాడ ఎంపీ వ్యాపార భాగస్వామి కేసిరెడ్డి

చంద్రబాబు పక్కా పన్నాగంతోనే ఈ కేసులో రాజ్ కేసిరెడ్డిని ఏ 1గా చూపించారు. ఆయన ఎవరో కాదు.. విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వ్యాపార భాగస్వామే! ఇద్దరి కంపెనీల చిరునామా, మెయిల్ ఐడీ కూడా ఒకటే కావడం గమనార్హం. అమెరికా, దుబాయ్ సహా వివిధ దేశాలకు అక్రమ నిధులు తరలించేందుకు వారిద్దరూ భాగస్వాములుగా ఏర్పాటు చేసుకున్న కంపెనీల వివరాలను చిన్ని అన్న, మాజీ ఎంపీ కేశినేని నాని ఇటీవల స్వయంగా వెల్లడించడం తెలిసిందే.

ఆ అధికారులకేం సంబంధం..?

చంద్రబాబు పక్కా పన్నాగంతోనే గత ప్రభుత్వ హయాంలో సీఎంవోలో విధులు నిర్వహించిన ఉన్నతాధికారులను ఈ అక్రమ కేసులో ఇరికిస్తున్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఏ.ధనుంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, వికాట్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పను ఈ కేసులో నిందితులుగా చేర్చడం కుట్రలకు పరాకాష్ఠ. ధనుంజయ్‌రెడ్డి సీఎంవోలో ఎక్సైజ్ శాఖ వ్యవహారాలను ఏనాడూ పర్యవేక్షించలేదు. ఇక ఓఎస్డీ కృష్ణ మోహన్‌రెడ్డికి ఎక్సైజ్ శాఖ, బెవరేజస్ కార్పొరేషన్ వ్యవహారాలతో ఎలాంటి సంబంధం ఉండదు. అయినా సరే వారిని నిందితులుగా చేర్చడం విడ్డూరంగా ఉంది.

భారతీ సిమెంట్స్‌ను ఏనాడో టేకోవర్ చేసిన వికాట్

భారతీ సిమెంట్ కంపెనీలో మెజార్టీ వాటా వికాట్ కంపెనీకే ఉంది. మైనార్టీ వాటా మాత్రమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబానికి ఉంది. కాబట్టి కంపెనీ సర్వసభ్య సమావేశ వివరాలు తెలియచేయడం, కంపెనీ భవిష్యత్ ప్రణాళికలు వివరించడం, త్రైమాసిక ఫలితాల ముందుగానీ తరువాతగానీ తెలియజేయడం.. భారతీ సిమెంట్స్‌పై కొనసాగుతున్న సీబీఐ అక్రమ కేసుల పురోగతి వివరాలు వివరించేందుకు వైఎస్ జగన్ కుటుంబాన్ని ఆయన అప్పుడప్పుడు కలుస్తూ ఉంటారు. వైఎస్ జగన్ కుటుంబం వికాట్ కంపెనీలో వాటాదారు కావడంతోపాటు నాన్ ఎగ్జిక్యూటివ్ స్థానంలో ఉన్నందున ఆ పరిణామాలన్నీ వివరిస్తారు. ఓ కంపెనీ తన వాటాదారులకు ఈ అంశాలను వివరించడం సర్వసాధారణ వ్యవహారం. రిలయన్స్ లాంటి కంపెనీలు కూడా తమ కంపెనీల్లో ఎక్కువ షేర్లు ఉన్నవారికి సంస్థకు సంబంధించిన పరిణామాలను తరచూ వివరిస్తూ ఉంటాయి. ఈ అంశాలను వక్రీకరిస్తూ టీడీపీ కూటమి ప్రభుత్వం అక్రమ కేసు నమోదు చేయడం పక్కా కుట్రే. వైఎస్ జగన్ కుటుంబ కంపెనీ కాకపోయినా భారతీ సిమెంట్‌ను అప్రతిష్ఠ పాలు చేయడం, అందులో మైనార్టీ వాటాదారుగా మాత్రమే ఉన్న ఆ కుటుంబంపై దుష్ప్రచారం చేయాలన్న లక్ష్యంతోనే చంద్రబాబు పన్నిన భేతాళ కుట్రే ఇది.

బాబు కుట్రలకు ఎల్లో మీడియా భజన..

చంద్రబాబు కుట్రలకు ఎల్లో మీడియా కోరస్ పాడుతోంది. వైఎస్ జగన్ కుటుంబానికి బాలాజీ గోవిందప్ప ఆర్థిక సలహాలు ఇస్తుంటారని దుష్ప్రచారం చేస్తోంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఫ్లెక్సీ డిపాజిట్లు, షేర్లలో పెట్టుబడులపై వైఎస్ జగన్ కుటుంబం బాలాజీ గోవిందప్ప సలహాలను ఎందుకు తీసుకుంటారు? వైఎస్ జగన్ కుటుంబానికి దశాబ్దాలుగా పవర్ ప్రాజెక్టులు, మీడియా, రియల్ ఎస్టేట్ లాంటి సొంత కంపెనీలున్నాయి. తమకు మెజార్టీ వాటా ఉన్న ఆ కంపెనీల ద్వారా ఏటా దాదాపు రూ.150 కోట్ల లాభం ప్రకటిస్తున్నారు. ఆ కంపెనీల ఆర్థిక కార్యకలాపాలు పర్యవేక్షించేందుకు, సలహాలు ఇచ్చేందుకు ఎంతోమంది ఆడిటర్లు, ఫైనాన్స్ డైరెక్టర్లు ఉన్నారు. ఆర్థిక సలహాల కోసం వారిని సంప్రదిస్తారు. అంతేగానీ తాను మైనార్టీ వాటాదారుగా ఉన్న భారతీ సిమెంట్ డైరెక్టర్‌ను ఎందుకు సంప్రదిస్తారు? ఈ దుష్ప్రచారం అంతా కేవలం చంద్రబాబు భేతాళ కుట్రే. వాస్తవాలతో నిమిత్తంలేని ఎల్లో మీడియా ఇందులో తరిస్తోంది. చంద్రబాబు డైరెక్షన్‌లో వైఎస్ జగన్ కుటుంబంపై దుష్ప్రచార కుతంత్రానికి వత్తాసు పలుకుతోంది.

సీఐడీ చేతులెత్తేయడంతో..

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యం కేసును సీఐడీకి అప్పగించింది. మూడు నెలలపాటు దర్యాప్తు చేసిన సీఐడీ ఎలాంటి అక్రమాలు లేవని చేతులెత్తేసింది. అయినా సరే ఇది ఎల్లో మీడియాకు పట్టదు. తరువాత టీడీపీ వీర విధేయ పోలీసు అధికారులతో ఏర్పాటైన సిట్ ఈ కుట్రలకు వత్తాసు పలుకుతోంది. రోజుకో కట్టుకథ అల్లుతూ అవాస్తవాలు, అభూత కల్పనలు ప్రచారంలోకి తేవడమే పనిగా పెట్టుకుంది.

మిథున్‌రెడ్డి సవాల్‌పై స్పందించని సర్కారు

చంద్రబాబు తాను ప్రవేశపెట్టిన పాత్రధారుల ద్వారా వైఎస్సార్‌సీపీ కీలక నేతలపై తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారు. వాటిని తిప్పికొడుతూ వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి విసిరిన సవాల్‌కు మాత్రం స్పందించలేదు. తన నివాసంలో సమావేశమయ్యామని విజయ్‌సాయిరెడ్డి పేర్కొనటాన్ని ఎంపీ మిథున్‌రెడ్డి తీవ్రంగా తిప్పికొట్టారు. అదే నిజమైతే గూగుల్ టేక్ అవుట్ ద్వారా నిరూపించాలని మిథున్‌రెడ్డి సవాల్ చేస్తే కూటమి ప్రభుత్వం నోరు విప్పలేదు. ఇక దర్యాప్తు పేరిట సిట్ అధికారులు తమను వేధిస్తుండటంపై పలు డిస్టిలరీల ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. సిట్ అధికారులు తమను హింసిస్తున్నారని వాపోయారు. దాంతో డిస్టిలరీల ప్రతినిధులను వారి నివాసాల్లోనే విచారించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ అక్రమ కేసులో ఇరికించేందుకు చంద్రబాబు ప్రభుత్వం ఎంతగా బరి తెగిస్తోందో చెప్పేందుకు ఈ ఉదంతాలే తార్కాణం.

అక్రమ కేసు కుట్రలు మరోస్థాయికి..

అందుకే బాలాజీ గోవిందప్పను నిందితుడిగా చేర్చిన వైనం

వికాట్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పను ఈ అక్రమ కేసులో చేర్చడం చంద్రబాబు భేతాళ కుట్రకు పరాకాష్ఠ. ఎందుకంటే ఆయనకు ప్రభుత్వ వ్యవహారాలతో అసలు ఏమాత్రం సంబంధమే లేదు. వికాట్ అంతర్జాతీయ దిగ్గజ సిమెంట్ కంపెనీ. 12 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న బహుళ జాతీయ సంస్థ. యూరప్‌లో టాప్ 5 కంపెనీల్లో ఒకటిగా ఉంది. సిమెంట్ రంగంలో అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు ఉన్న వికాట్ కంపెనీకి అనుబంధ సంస్థ భారతీ సిమెంట్స్. అటువంటి అంతర్జాతీయ కంపెనీకి భారత్‌లో ఆపరేషన్ల ఫైనాన్స్ డైరెక్టర్‌గా బాలాజీ గోవిందప్ప ఉన్నారు. ఆ కంపెనీ వ్యవహారాలతోనే ఆయన క్షణం తీరిక లేకుండా ఉంటారు. ఆయన ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండరు. బాలాజీ గోవిందప్ప వృత్తిరీత్యా చార్టెడ్ అకౌంటెంట్. వికాట్ కంపెనీ వ్యవహారాలతోనే ఆయన నిరంతరం తలమునకలై ఉంటారు. ఆంధ్రప్రదేశ్‌తో సంబంధమే లేని ఆయనకు ఐఏఎస్‌లతోగానీ ఇతర ప్రభుత్వ అధికారులతోగానీ ఎలాంటి సంబంధంగానీ పరిచయంగానీ లేనే లేవు. ఇక రాజ్ కేసిరెడ్డితో కనీసం పరిచయం ఉండే ఆస్కారమే లేదు. పక్కా కుతంత్రంతోనే బాలాజీ గోవిందప్పను ఈ అక్రమ కేసులో నిందితుడిగా చేర్చారు. తద్వారా ఈ అక్రమ కేసు కుట్రను మరో స్థాయికి తీసుకువెళ్లాలన్నదే చంద్రబాబు పన్నాగం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఈనెల 17 నుంచి ఐపీఎల్ పునఃప్రారంభం... ఆరు వేదికల్లో మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలతో వాయిదా పడిన ఐపీఎల్ 18వ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లను ఈ నెల 17 నుంచి తిరిగి నిర్వహించనున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తెలిపింది. కేంద్ర ప్రభుత్వం, పోలీసు సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు, లీగ్ భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరిపిన బోర్డు మిగిలి పోయిన 17 మ్యాచ్‌ల్ని ఆరు వేదికలు బెంగళూరు, జైపూర్, న్యూఢిల్లీ, లక్నో, ముంబై, అహ్మదాబాద్‌లలో నిర్వహిస్తామని ప్రకటించింది. మే 17 నుంచి 27 వరకు లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఇందులో రెండు ఆదివారాలు రాగా రెండేసి మ్యాచ్‌లు (డబుల్ హెడర్) నిర్వహిస్తారు. 29న తొలి క్వాలిఫయర్, 30న ఎలిమినేటర్, 1న రెండో క్వాలిఫయర్, 3న ఫైనల్‌తో ఈ సీజన్ ఐపీఎల్ ముగుస్తుంది. 'ప్లేఆఫ్స్' మ్యాచ్ వేదికల్ని తర్వాత ప్రకటిస్తారు. కాగా ఈ నెల 10న హైదరాబాద్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరగాల్సిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆఖరి పోరును 25వ తేదీన న్యూఢిల్లీలో ఏర్పాటు చేశారు. ఈనెల 8న ధర్మశాలలో అర్ధాంతరంగా ఆగిన పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌ను 24న న్యూఢిల్లీలో మొదటి నుంచి నిర్వహిస్తారు.



టెస్టులకు కోహ్లి వీడ్కోలు

'కష్టమే... కానీ సరైన నిర్ణయమే'

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లి తన మనసులో మాటకే కట్టుబడ్డాడు... టెస్టు క్రికెట్ నుంచి తప్పుకోవాలనుకున్న తన నిర్ణయంపై ఎలాంటి పునరాలోచన చేయలేదు... అతడిని ఒప్పించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. టెస్టుల నుంచి రిటైర్ అవుతున్నట్లు కోహ్లి సోమవారం అధికారికంగా ప్రకటించాడు. భారత టెస్టు క్రికెట్‌లో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడిగా, సారథిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అతను 14 ఏళ్ల కెరీర్‌కు గుడ్‌బై చెప్పాడు. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ కోసం త్వరలోనే టీమ్‌ను సెలక్టర్లు ప్రకటించనున్న నేపథ్యంలో తన రిటైర్మెంట్ సమాచారాన్ని ముందుగానే బీసీసీఐకి తెలియజేయడం సరైందని విరాట్ భావించాడు. ఈ నిర్ణయం తీసుకోవడం కష్టంగానే అనిపిస్తున్నా అది సరైందేనని అతను పేర్కొన్నాడు. 2011 జూలైలో కింగ్‌స్టన్ వేదికగా వెస్టిండీస్‌తో తన తొలి టెస్టు ఆడిన కోహ్లి... 2025 జనవరిలో సిడ్నీలో ఆస్ట్రేలియాతో చివరి టెస్టు మ్యాచ్ ఆడాడు. గత ఏడాది వరల్డ్ కప్ విజయం తర్వాత టి20 ఫార్మాట్ నుంచి రిటైర్ అయిన కోహ్లి ఇకపై వన్డేల్లోనే కొనసాగనున్నాడు. గత మంగళవారం రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించగా, ఆస్ట్రేలియా సిరీస్ మధ్యలోనే స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తప్పుకోవడంతో తక్కువ వ్యవధిలో ముగ్గురు భారత సీనియర్లు ఈ ఫార్మాట్ నుంచి నిష్క్రమించినట్లయింది.

ఎందుకీ వెనకడుగు?

రోహిత్ టెస్టులకు గుడ్‌బై చెబితే పెద్దగా ఆశ్చర్యం అనిపించలేదు గానీ ఇప్పుడు కోహ్లి అనూహ్యంగా రిటైర్మెంట్ అనేశాడు. నిజానికి సవాళ్లను ఎదుర్కొనేందుకు కోహ్లి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. కీలకమైన ఇంగ్లండ్ పర్యటన కోసం అతను కూడా సన్నద్ధమైనట్లు కనిపించింది. ఆస్ట్రేలియా టూర్ ముగిసిన తర్వాత ఐపీఎల్ ఆరంభానికి ముందు తన టెస్టు బ్యాటింగ్ లోపాలను సరిదిద్దుకునేందుకు ఎర్ర బంతితో సంజయ్ బంగర్ పర్యవేక్షణలో అతను తీవ్రంగా సాధన చేయడాన్ని బట్టి చూస్తే ఇప్పటికిప్పుడు టెస్టుల నుంచి తప్పుకోడని అర్థమైంది. అతని అద్భుతమైన ఫిట్‌నెస్ ఒక కారణం కాగా, ఇంగ్లండ్‌లో తన అనుభవంతో జట్టుకు మార్గదర్శిగా నిలిచే సత్తా అతనిలో ఉంది.

రిటైర్మెంట్‌పై సరైన కారణంగా బయటికీ ఎవరికీ తెలియకపోయినా... వేర్వేరు కారణాలు అతడిని రిటైర్మెంట్ వైపు నడిపించాయి. తాను ఆశించినప్పుడు టెస్టు కెప్టెన్సీ మళ్లీ ఇవ్వకపోవడంతో నిరాశకు గురయ్యాడనని చెబుతున్నా... నాయకత్వం లేకపోతే ఆడలేనని చెప్పే తక్కువ స్థాయి కాదు అతనిది. జట్టు కోసం వంద శాతం శ్రమించే అతనికి ఇది పెద్ద విషయం కాదు. అయితే ప్రస్తుత స్థితిలో కొన్ని అంశాలు అతను తప్పుకోవడానికి కారణంగా కనిపిస్తున్నాయి. ఇంగ్లండ్ సిరీస్‌తో కొత్తగా 2025–27 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ సైకిల్ మళ్లీ మొదలవుతోంది. వచ్చే రెండేళ్ల పాటు కోహ్లి కొనసాగడం కష్టం కావచ్చు. యువ ఆటగాళ్లతో ప్రణాళికలు రూపొందించుకునే విధంగా తాను తప్పుకోవడమే సరైందని అతను భావించాడు.

ఆస్ట్రేలియాతో తొలి టెస్టు సెంచరీ తర్వాత మిగతా 7 ఇన్నింగ్స్‌లు కలిపి 85 పరుగులే చేశాడు. ఇదే వైఫల్యం ఇంగ్లండ్‌లో కొనసాగితే మరింత చెడ్డపేరు రావచ్చు. ప్రస్తుత స్థితిలో మళ్లీ ఫామ్‌ను అందుకొని చెలరేగిపోగలననే నమ్మకం అతనిలో తగ్గినట్లుంది. బీసీసీఐ సూచనల మేరకు రంజీ ట్రోఫీ ఆడినా అక్కడా హిమాన్షు సాంగ్వాన్‌లాంటి సాధారణ బౌలర్ బంతికి క్లీన్ బౌల్డ్ అయిన తీరు కూడా తన ఆటపై సందేహాలు రేకెత్తించి ఉంటుంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ కోరినట్లు ఇంగ్లండ్‌తో సిరీస్ వరకు ఆడినా కొత్తగా అతను సాధించేదేమీ ఉండదు. పైగా తీవ్ర ఒత్తిడి, అంచనాలు కూడా. రోహిత్ శర్మలాంటి బ్యాటర్ కూడా తప్పుకోవడంతో అందరి కళ్లూ ఇప్పుడు తన బ్యాటింగ్‌పైనే ఉంటాయి. అంత ఒత్తిడి అనవసరం అని అతను భావించి ఉంటాడు.

> టెస్టు క్రికెట్‌లో తొలిసారి బ్యాగీ బ్లూ ధరించి 14 ఏళ్లయింది. ఈ ఫార్మాట్ నాపై ఇంతగా ప్రభావం చూపిస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. టెస్టు క్రికెట్ నన్ను పరీక్షించింది. తీర్చిదిద్దింది. జీవితానికి కావాల్సిన పాఠాలు నేర్పించింది. టెస్టులు ఆడటంలో వ్యక్తిగతంగా ఎంతో తృప్తి ఉంది. అందులోని తీవ్రత, సుదీర్ఘ రోజులు, కొన్ని కీలక క్షణాలు ఎప్పటికీ మర్చిపోలేనివి. ఈ ఫార్మాట్ నుంచి తప్పుకోవడం కష్టంగా అనిపిస్తోంది. కానీ సరైన నిర్ణయమే. టెస్టు క్రికెట్‌కు నేను ఎంతో ఇచ్చాను. నేను ఆశించిన దానికంటే ఇది ఎక్కువ నాకు తిరిగి ఇచ్చింది. ఈ ఆటకు, నాతో కలిసి ఆడిన వారికి, అండగా నిలిచిన వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. నా టెస్టు కెరీర్ పూర్తి సంతృప్తితో ముగిస్తున్నా. #269 వీడ్కోలు.
>
> –వీడ్కోలు ప్రకటనలో విరాట్ కోహ్లి



'విరాట్' పరుగుల పర్వాలు



'నేను టెస్టు క్రికెట్‌ను రోజంతా ఒకే తరహా తీవ్రతతో ఆడాలని భావిస్తా. 88వ ఓవర్లో కూడా బ్యాటర్ షాట్ ఆడితే నేను సింగిల్ ఆపేందుకు అవసరమైతే డైవ్ కూడా చేస్తా. నా దృష్టిలో టెస్టు క్రికెట్ అంటే అదే'... ఇది విరాట్ కోహ్లికి టెస్టు ఫార్మాట్‌పై ఉన్న అభిమానాన్ని చూపిస్తోంది. 'నేను నా మనసును, ఆత్మను కూడా టెస్టు క్రికెట్ కోసమే ఇచ్చా. ఈ ఫార్మాట్‌లో ఫిట్‌నెస్ కోసమే ఎన్నో త్యాగాలు చేశా'... 100 టెస్టులు పూర్తయిన సందర్భంగా అతను తన సంతృప్తిని ప్రదర్శించిన వ్యాఖ్య ఇది. 'ఈ రోజంతా మనిద్దరమే బ్యాటింగ్ చేద్దాం. అవతలి జట్టులో ఒక్కొక్కడికి పగిలిపోవాలి'... ఇది మైదానంలో ప్రత్యర్థులపై అతను ప్రదర్శించిన దూకుడుకు ఒక చిన్న ట్రైలర్... టెస్టు క్రికెట్‌కు ఆదరణ తగ్గిపోతోందని అనిపించినప్పుడల్లా మైదానంలో కోహ్లిని చూస్తే అలాంటి భావనే కనిపించదు. అతను టెస్టుల్లో భారీగా పరుగులు మాత్రమే చేయలేదు. అతను ఎన్నో లెక్కలను కొత్తగా తిరగరాశాడు. సాంప్రదాయ ఫార్మాట్‌లో ఎన్నో సాంప్రదాయాలను బద్దలు కొట్టాడు. క్రమశిక్షణ, పట్టుదల, పోరాటపటిమ, ఫిట్‌నెస్, ఎక్కడా వెనక్కి తగ్గని తత్వం టెస్టుల్లోనే ఎక్కువగా బయట పడింది. కోహ్లిలాంటి టెస్టు క్రికెటర్ ఇకపై రాకపోవచ్చు. ఈ ఫార్మాట్‌లో అది ఎవరూ పూరించలేని లోటు.

–సాక్షి క్రీడా విభాగం

'భారత్ తరఫున ఆడుతున్న ఆస్ట్రేలియన్'... విరాట్ కోహ్లి దూకుడును ఆసీస్ గడ్డపై చూసిన తర్వాత విశ్లేషకులు ఇచ్చిన పేరు ఇది. మైదానంలో దూకుడు, ఢీ అంటే ఢీ అనే తత్వం, అటు బ్యాటర్‌గా, ఇటు కెప్టెన్‌గా అతని శైలి కోహ్లి ప్రత్యేకతను నిలబెట్టాయి. ఒక్క అంగుళం కూడా వెనక్కి తగ్గను అన్నట్లుగా తెల్ల దుస్తుల్లో యుద్ధానికి సిద్ధమైన ఒక సైనికుడిలా అతను కనిపించేవాడు. 2014లో ఆస్ట్రేలియా గడ్డపై నాటి టాప్ పేసర్ మిచెల్ జాన్సన్‌తో అతను తలపడిన తీరును అభిమానులు ఎవరూ మర్చిపోలేరు. తన బౌలింగ్‌లో అద్భుతమైన కవర్ డ్రైవ్‌లు, పుల్ షాట్‌లతో కోహ్లి విరుచుకుపడుతుంటే జాన్సన్ మాటల యుద్ధానికి దిగగా, కోహ్లి ఎక్కడా తగ్గకుండా తాను అదే తరహాలో దీటుగా నిలబడ్డాడు. ఈ సిరీస్‌లో ఏకంగా 4 సెంచరీలతో 692 పరుగులు చేసిన అతను తన సత్తాను ప్రదర్శించాడు. అంతకుముందు దాదాపు మూడేళ్ల క్రితమే కోహ్లి దూకుడును ఆసీస్ చూసింది. 2011–12 టెస్టు సిరీస్‌లో భాగంగా జరిగిన పోరులో సచిన్, ద్రవిడ్, లక్ష్మణ్, గంభీర్‌వంటి స్టార్ బ్యాటర్లంతా విఫలం కాగా భారత్ నుంచి ఒకే ఒక సెంచరీ నమోదైంది. అది కోహ్లి బ్యాట్ నుంచి వచ్చింది. ఇది కోహ్లి కెరీర్‌లో ఎనిమిదో టెస్టు. రెండు టెస్టుల క్రితం సిడ్నీలో క్రమశిక్షణారాహిత్యంతో శిక్షకు గురైన కోహ్లి... ఈ మ్యాచ్‌లో తన దూకుడును పరుగులుగా మలచి కసి తీర్చుకున్నట్లుగా అనిపించింది.

అలా మొదలై...

వన్డేల్లో అరంగేట్రం చేసిన మూడేళ్ల తర్వాత గానీ కోహ్లి తొలి టెస్టు ఆడలేదు. సచిన్ గైర్హాజరులో అతనికి 2011లో వెస్టిండీస్ వెళ్లే అవకాశం లభించింది. అక్కడ పెద్దగా ఆకట్టుకోకపోయినా... ఆ తర్వాత ముంబైలో విండీస్‌తోనే రెండు ఇన్నింగ్స్‌లలో అర్ధ సెంచరీలు చేయడంతో కాస్త నిలదొక్కుకునే అవకాశం లభించింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా సిరీస్ అవకాశం దక్కగా అడిలైడ్‌లో చేసిన సెంచరీతో కొత్త తరం ప్రతినిధిగా అతని ప్రయాణం మొదలైంది. ఆ తర్వాత స్వదేశంలో నిలకడ కొనసాగగా... 2013 దక్షిణాఫ్రికా పర్యటనలో ప్రదర్శన కోహ్లి స్థాయిని పెంచింది. ఆపై కివీస్‌పై వెల్లింగ్టన్‌లో చేసిన శతకంతో అతని బ్యాటింగ్ విలువ అందరికీ కనిపించింది. ఇక్కడి వరకు కోహ్లి టెస్టు కెరీర్ సాఫీగా సాగిపోయింది. తొలి 24 టెస్టుల్లో 46.71 సగటుతో 1721 పరుగులు చేయగా అందులో 6 సెంచరీలు ఉన్నాయి. ఆ తర్వాత వచ్చింది ఇంగ్లండ్ పర్యటన.

ఆరేళ్లు అద్భుతంగా...

విరాట్ టెస్టు కెరీర్ అక్టోబర్ 2014 నుంచి డిసెంబర్ 2019 వరకు అత్యద్భుతంగా సాగింది. ఈ సమయంలో అతని కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శనలు వచ్చాయి. అటు ఆటగాడిగా, ఇటు కెప్టెన్‌గా కూడా ఈ సమయంలో ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందుకున్నాడు. భారత అభిమానుల కోణంలో చూస్తే ఈ సమయంలో కోహ్లి అసలైన టెస్టు మజాను చూపించాడు.

కోహ్లి టెస్టు కెరీర్ గణాంకాలు

ఆడిన టెస్టులు: 123	ఆడిన ఇన్నింగ్స్: 210
చేసిన పరుగులు: 9230	సగటు: 46.85
అత్యధిక స్కోరు: 254*	సెంచరీలు: 30
అర్ధ సెంచరీలు: 31	ఫోర్లు: 1027 సిక్స్‌లు: 30
పట్టిన క్యాచ్‌లు: 121	స్ట్రయిక్‌రేట్: 55.57

జట్టును తన బ్యాటింగ్‌తో బలమైన స్థితిలో నిలపడమే కాదు, కష్టాల్లో ఉన్నప్పుడు అసాధారణ బ్యాటింగ్‌తో టెస్టులను ఎలా ఆడాలో అతను చేసి చూపించాడు. ఈ ఆరేళ్ల కాలంలో 55 టెస్టులు ఆడిన కోహ్లి ఏకంగా 63.65 సగటుతో 5347 పరుగులు సాధించాడు. ఇందులో 21 సెంచరీలు, 13 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఈ సమయంలో గణాంకాలు అతడిని నంబర్‌వన్ టెస్టు బ్యాటర్‌గా నిలిపాయి. ముఖ్యంగా ఒక 18 నెలలు అతని బ్యాటింగ్ శిఖరానికి చేరింది. కేవలం 34 ఇన్నింగ్స్‌ల వ్యవధిలో కోహ్లి ఏకంగా 6 డబుల్ సెంచరీలు నమోదు చేయడం విశేషం. 34 ఇన్నింగ్స్‌ల వ్యవధిలో చూస్తే ఒక్క బ్రాడ్‌మన్ (8) మాత్రమే అతనికంటే మెరుగైన ప్రదర్శన కనబర్చాడు.

కాస్త పదును తగ్గి...

అసాధారణ బ్యాటింగ్ తర్వాత 2020 ఆరంభం నుంచి అతని టెస్టు బ్యాటింగ్‌లో పదును కాస్త నెమ్మదించింది. కోవిడ్ కారణంగా మ్యాచ్‌ల సంఖ్య తగ్గడంతో పాటు ఒకే తరహా జోరును కొనసాగించడంలో కోహ్లి విఫలమయ్యాడు. సెంచరీ మొహం చూసేందుకు మూడేన్నరేళ్లు పట్టాయి. 2021 ఇంగ్లండ్ పర్యటన కేవలం 2 అర్ధసెంచరీలతో నిరాశగా ముగియగా, 2023–24 దక్షిణాఫ్రికా పర్యటనలో కూడా అతని ముద్ర కనిపించలేదు. ఇటీవల ముగిసిన ఆస్ట్రేలియా సిరీస్‌లోనైతే పెర్త్ మినహా అతని బ్యాటింగ్ చూస్తే కెరీర్ ముగింపునకు వచ్చినట్లే అనిపించింది. జనవరి 2020 నుంచి ఇప్పటి వరకు చూసుకుంటే ఆడిన 39 టెస్టుల్లో కోహ్లి కేవలం 30.72 సగటుతో 2028 పరుగులు సాధించాడు. 3 శతకాలు మాత్రమే నమోదు చేయగలిగాడు. గత రెండేళ్లుగా అతని బ్యాటింగ్ సగటు 32.56 మాత్రమే. ఎలా చూసుకున్నా ఇది ఒక ప్రధాన బ్యాటర్‌కు సంబంధించి పేలవ ప్రదర్శనే. టెస్టు బ్యాటర్‌గా తన అత్యుత్తమ దశను ఎప్పుడో దాటిన కోహ్లి ఇప్పుడు కెరీర్‌ను హడావిడి లేకుండా ముగించాడు.

పడి... పైకి లేచి...

కోహ్లి వైఫల్యం గురించి చెప్పాలంటే అందరికీ గుర్తుకొచ్చేది 2014లో ఇంగ్లండ్‌లో జరిగిన ఐదు టెస్టుల సిరీస్. స్వింగ్‌కు అనుకూలించిన అక్కడి పరిస్థితుల్లో సరైన ఫుట్‌వర్క్ లేక ఒకే తరహాలో పదే పదే అవుట్ అవుతూ కోహ్లి అభిమానులను తీవ్రంగా నిరాశపర్చాడు. భారత నంబర్‌వన్ బ్యాటర్‌గా అక్కడ అడుగుపెట్టి అద్భుతాలు చేస్తాడనుకుంటే పూర్తిగా చేతులెత్తేశాడు. 10 ఇన్నింగ్స్‌లలో కలిపి కేవలం 134 పరుగులతో ఘోరంగా విఫలం కావడమే కాదు... అప్పటి బీసీసీఐ నిబంధనలకు విరుద్ధంగా రహస్యంగా గర్ల్‌ఫ్రెండ్ అనుష్క శర్మను టూర్‌కు తీసుకెళ్లి తీవ్ర విమర్శలపాలయ్యాడు. అయితే నాలుగేళ్లు తిరిగాయి... కోహ్లి ఆట మారింది. వ్యక్తిగా కూడా ఎంతో మారాడు. లోపాలను సరిదిద్దుకొని 2018లో మళ్లీ ఇంగ్లండ్ గడ్డపై అడుగు పెట్టాడు. ఏ బౌలర్‌నూ లెక్క చేయకుండా నాటి గాయాలూ మానేలా చెలరేగిపోయాడు. 2 సెంచరీలు, 3 అర్ధ సెంచరీలతో ఏకంగా 593 పరుగులు సాధించి సిరీస్ టాపర్‌గా నిలిచాడు. ఇది కోహ్లిలోని పట్టుదలను, తాను విఫలమైన చోట మళ్లీ తానేంటో చూపించుకోవాలనే కసిని చూపించింది.



'కెప్టెన్ ఫైర్'

టీమిండియాను విదేశీ గడ్డపై కూడా వెన్నెముక ఉన్న జట్టుగా సౌరవ్ గంగూలీ నిలబెడితే ఎమ్మెస్ ధోని 'కూల్ కెప్టెన్'గా జట్టును నడిపించి చూపించాడు. కానీ విరాట్ కోహ్లి అలాంటివాడు కాదు. అతను నాయకుడిగా ఒక రగులుతున్న అగ్నిపర్వతంలాంటివాడు. అప్పటి వరకు ఉన్న స్క్రిప్ట్‌ను తగలబెట్టిన అతను కొత్త నాయకత్వ లక్షణాలను రచించాడు. తన బౌలర్లు, ఫీల్డర్లనుంచి అతను వంద శాతంకు మించి ప్రదర్శనను ఆశించాడు. అందరికంటే ముందు తానే అది చేసి చూపించాడు. తన బౌలింగ్, ఫీల్డింగ్‌ను నమ్ముకొని '60 ఓవర్లు వీరికి నరకం కనిపించాలి' అని లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్‌ను ఆడుకున్న తీరు మర్చిపోలేనిది. కోహ్లికి ముందు చూస్తే బ్యాటర్లయినా భారీ స్కోరుతో జట్టును గెలిపించాలి లేదా స్పిన్నర్లపై భారం ఉండేది. కానీ స్వదేశమైనా, విదేశీ పిచ్ అయినా పేసర్లను అద్భుతంగా వాడుకొని గెలిపించిన తీరు అసాధారణం. ఒక బ్యాటర్‌ను తగ్గించి అయినా అదనపు బౌలర్‌ను తీసుకొని ప్రత్యర్థిని ఆలౌట్ చేయడం, మ్యాచ్ గెలవడమే ముఖ్యంగా కోహ్లి వ్యూహరచన సాగింది. కోహ్లి కెప్టెన్సీలో పేస్ బౌలర్లు కేవలం 26 సగటుతో 591 వికెట్లు పడగొట్టారు. 80ల్లో వివ్ రిచర్డ్స్ నాయకత్వంలో మాత్రమే పేసర్ల సగటు (22.89) ఇంతకంటే మెరుగ్గా ఉంది. 68 టెస్టుల్లో 40 మ్యాచ్‌లు గెలిపించి భారత అత్యుత్తమ కెప్టెన్‌గా అతను నిలిచాడు. ప్రతికూలతలను దాటి ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్ గెలిపించిన సారథిగా (2018–19) కోహ్లి చరిత్రలో నిలిచిపోయాడు.

మరచిపోలేని కొన్ని ఇన్నింగ్స్

115, 141 (అడిలైడ్, 2014): ధోని గైర్హాజరులో కెప్టెన్‌గా తొలి టెస్టు మ్యాచ్‌లో కోహ్లి అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చాడు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆసీస్‌కు భారీ ఆధిక్యం దక్కకుండా చేసిన అతను రెండో ఇన్నింగ్స్‌లో 364 పరుగుల లక్ష్య ఛేదనలో చివరి వరకు పోరాడాడు.

119, 96 (జొహన్నెస్‌బర్గ్, 2013): తొలి ఇన్నింగ్స్‌లో విరాట్ సెంచరీతో భారత్‌కు ఆధిక్యం దక్కగా, రెండో ఇన్నింగ్స్ స్కోరుతో జట్టుకు గెలుపు అవకాశం సృష్టించాడు.

153 (సెంచూరియన్ 2018): కఠినమైన పిచ్‌పై 379 నిమిషాల పాటు పట్టుదలగా నిలబడి సాధించిన సెంచరీ. జట్టులో తర్వాతి అత్యుత్తమ స్కోరు 46 అంటే ఈ ఇన్నింగ్స్ విలువ అర్థమవుతుంది.

123 (పెర్త్, 2018): చేతి వేళ్లకు గాయాలు, హెల్మెట్‌కు దెబ్బలు, బ్యాటర్లంతా కుప్పకూలుతున్నారు. ఇలాంటి స్థితిలో అత్యుత్తమ పేస్, సీమ్ బౌలింగ్‌ను అనూహ్యంగా స్పందిస్తున్న పిచ్‌పై ఎదుర్కొని చేసిన శతకం. ఇరు జట్లలో కలిపి ఇతర బ్యాటర్ల అత్యధిక స్కోరు 70 మాత్రమే.

254 నాటౌట్ (పుణే, 2019): కెరీర్‌లో అత్యధిక స్కోరు. స్వదేశంలో సఫారీ బౌలర్లను అలవోకగా ఎదుర్కొంటూ చేసిన డబుల్ సెంచరీలతో జట్టుకు విజయం.



సచిన్ '100' పదిలం!

అంతర్జాతీయ క్రికెట్‌లో దిగ్గజం సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన 100 సెంచరీల రికార్డు ఇక ఎప్పటికీ చెరిగిపోకపోవచ్చు. ఈ ఘనతను అధిగమించగల సత్తా ఉన్న ఒకే ఒక బ్యాటర్‌గా విరాట్ కోహ్లి కనిపించాడు. ఒక దశలో వరుస శతకాలు బాదుతున్న సమయంలో అతను చేరువగా వచ్చినట్లే అనిపించింది. ఆపై ఫామ్ కోల్పోయి కొంత కాలం సెంచరీ లేక విరాట్ కాస్త వెనుకబడ్డాడు. అయితే 2023 వన్డే వరల్డ్ కప్‌లో మూడు సెంచరీలు కొట్టిన కోహ్లి... ముంబైలోనే 50వ సెంచరీతో వన్డేల్లో సచిన్ అత్యధిక సెంచరీల రికార్డును సమం చేశాడు. ఆపై పెర్త్ టెస్టులో వంద బాదిన అతను... చాంపియన్స్ ట్రోఫీలో పాక్‌పై సెంచరీతో సచిన్ రికార్డును కూడా దాటాడు. దీంతో ఓవరాల్‌గా కోహ్లి సెంచరీల సంఖ్య 82కు చేరింది. కనీసం మరో రెండేళ్లు అటు టెస్టులు, ఇటు వన్డేలు ఆడి నిలకడైన ప్రదర్శన కనబరిస్తే 100 కష్టం కాదనిపించింది. కానీ ఇప్పుడు టెస్టులను కోహ్లి తప్పుకున్నాడు. తన ఫిట్‌నెస్, ఇష్టమైన ఫార్మాట్ దృష్ట్యా 2027 వన్డే వరల్డ్ కప్ కొనసాగి ఆపై రిటైర్ అయ్యే ఆలోచనతో కోహ్లి ఉండవచ్చు. ఆ మెగా టోర్నీలోగా భారత్ వేర్వేరు జట్లతో మొత్తం 27 వన్డేలు ఆడాల్సి ఉంది. కోహ్లి వీటిల్లో ఎంత బాగా ఆడగలడనేది చెప్పలేం. ఎంత అద్భుతమైన ఫామ్, చెలరేగి ఆడినా సరే 27 వన్డేల్లో 18 సెంచరీలు దాదాపు అసాధ్యం! అలా చూస్తే సెంచరీల సెంచరీ రికార్డులు ఢోకా లేదు.



> నీ క్రికెట్ ప్రస్థానం ఎంతో మంది చిన్నారులు ఆటను ఎంచుకునేందుకు స్ఫూర్తిగా నిలిచింది. నీ టెస్టు కెరీర్ నిజంగా చాలా అద్భుతంగా సాగింది. నువ్వు భారత క్రికెట్‌కు పరుగులు మాత్రమే ఇవ్వలేదు. కొత్తతరం వీరాభిమానులను, క్రికెటర్లను అందించావు. అభినందనలు.
>
> –సచిన్ టెండూల్కర్

నువ్వు రిటైర్ అయ్యావంటే నమ్మలేకపోతున్నా. ఆధునిక క్రికెట్ దిగ్గజంగా, ఆటకు అసలైన రాయబారిగా నిలిచావు. మనం కలిసి పని చేసినప్పుడు ఎప్పటికీ మర్చిపోలేని ఎన్నో జ్ఞాపకాలను అందించావు. –రవిశాస్త్రి

ఆధునిక క్రికెట్ యుగంలో టెస్టు ఫార్మాట్ కోసం అన్నీ ఇచ్చిన అతి పెద్ద బ్రాండ్ కోహ్లి. టెస్టు క్రికెట్ అతనికి ఎంతో రుణపడి ఉంది. –సంజయ్ మంజ్రేకర్

సింహంలాంటి పోరాటతత్వం ఉన్నవాడు. ఇకపై నీ లోటు కనిపిస్తుంది. –గౌతమ్ గంభీర్

ఎందుకు రిటైర్ అయ్యావు విరాట్. –హర్భజన్ సింగ్

'నేను ఈ నిర్ణయాన్ని ఊహించలేదు. మరికొంత కాలం టెస్టులు ఆడగల సత్తా కోహ్లిలో ఉంది. అతనికి ఘనంగా మైదానంలో వీడ్కోలు దక్కాల్సింది. –అనిల్ కుంబ్లే

4 భారత్ తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లలో సచిన్ (15,921), ద్రవిడ్ (13,288), గావస్కర్ (10,122) తర్వాత నాలుగో స్థానంలో నిలిచిన కోహ్లి (9230)... అత్యధిక శతకాల జాబితాలో కూడా సచిన్ (51), ద్రవిడ్ (36), గావస్కర్ (34) తర్వాత 30 శతకాలతో నాలుగో స్థానంలోనే ఉన్నాడు.

4 టెస్టుల్లో అత్యధిక విజయాలు సాధించిన కెప్టెన్ల జాబితాలో గ్రేమ్ స్మిత్ (53), రికీ పాంటింగ్ (48), స్టీవ్ వా (41) తర్వాత కోహ్లి (40) నాలుగో స్థానంలో నిలిచాడు.

7 కోహ్లి డబుల్ సెంచరీల సంఖ్య. ఓవరాల్ జాబితాలో బ్రాడ్‌మన్ (12 : ఆస్ట్రేలియా), సంగక్కర (11 : శ్రీలంక), లారా (9 : వెస్టిండీస్) తర్వాత వాలీ హామండ్ (7 : ఇంగ్లండ్), జయవర్ధనే (7 : శ్రీలంక)లతో కలిసి సంయుక్తంగా నాలుగో స్థానంలో నిలిచాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి బిజినెస్
మంగళవారం
13-5-2025

స్టాక్ మార్కెట్లు

(సోమవారం రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
2,975	917
82,430	24,925

విదేశీ సూచీలు

నాస్‌డాక్	18,657	▲	750
డోజోన్స్	42,289	▲	1039
ఎఫ్‌టీఎస్ఈ 100	8,605	▲	50
డాక్స్	23,564	▲	67
షాంఘై	3,369	▲	27
నికాయ్	36,664	▲	141

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధారమ్‌కుర్	83.54	87.22
£	బ్రిటన్ పౌండ్	ధారమ్‌కుర్	111.24	115.17
€	యూరో	ధారమ్‌కుర్	92.67	97.15
¥	జపాన్ యెన్ (100)	ధారమ్‌కుర్	46.00	68.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధారమ్‌కుర్	52.16	56.98
S$	సింగపూర్ డాలర్	ధారమ్‌కుర్	63.04	67.51
SAR	సౌదీ రియాల్	ధారమ్‌కుర్	21.87	23.38
UAE D	యూఏఈ దిర్హామ్	ధారమ్‌కుర్	22.35	24.13
¥	చైనా యువాన్	ధారమ్‌కుర్	10.98	12.80

సీజ్‌ఫైర్.. బుల్ జోష్!

కలిసొచ్చిన అమెరికా–చైనా వాణిజ్య ఒప్పందం

- సెన్సెక్స్ 2,975 పాయింట్లు జూమ్
- 82,000 పాయింట్ల పైకి...
- 917 పాయింట్లు దూసుకెళ్లిన నిఫ్టీ
- నాలుగేళ్లలో సూచీలకు ఒకేరోజు అతిపెద్ద లాభం
- రూ.16.15 లక్షల కోట్ల సంపద సృష్టి



ముంబై: భారత్–పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో దలాల్ స్ట్రీట్‌లో బుల్ పరుగులు తీసింది. అమెరికా–చైనా మధ్య వాణిజ్య ఒప్పందం కుదరడం కూడా బుల్‌కు జోష్‌నిచ్చాయి. ఫలితంగా సూచీలు గడిచిన నాలుగేళ్లలో (2021) తర్వాత ఒకరోజులో అతిపెద్ద లాభాన్ని గడించాయి. సెన్సెక్స్ 2,975 పాయింట్లు లాభపడి 82,430 వద్ద, నిఫ్టీ 917 పాయింట్లు బలపడి 24,925 వద్ద నిలిచింది. ఈ ముగింపు ఇరు సూచీలకు ఏడు నెలల గరిష్టం ముగింపు. సూచీల 4% ర్యాలీతో స్టాక్ మార్కెట్లో ఒక్కరోజే రూ.16.15 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే, బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.432.56 లక్షల కోట్ల(5.05 ట్రిలియన్ డాలర్ల)కు చేరింది.

రోజంతా లాభాలే: గత వారాంతాన భారత్, పాక్‌ల మధ్య సీజ్‌ఫైర్, అమెరికా చైనాల మధ్య ట్రేడ్ ఒప్పందాల పరిణామాల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే భారీ లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 1,350 పాయింట్లు బలపడి 80,804 వద్ద, నిఫ్టీ 412 పాయింట్లు ఎగసి 24,420 వద్ద మొదలయ్యాయి. ఇంట్రాడేలో అన్ని రంగాల్లో కొనుగోళ్ల పర్వం కొనసాగడంతో సూచీలు మరిన్ని లాభాలు ఆర్జించగలిగాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ 3,041 పాయింట్లు దూసుకెళ్లి 82,496 వద్ద, నిఫ్టీ 937 పాయింట్లు ఎగసి 24,945 వద్ద గరిష్టాన్ని తాకాయి.

➤ సెన్సెక్స్ సూచీలో ఇండస్‌ఇండ్ (–3.57%), సన్‌ఫార్మా(–3.36%) మినహా 28 షేర్లూ లాభపడ్డాయి. సూచీల్లో ఐటీ 6.75%, రియల్టీ 6%, మెటల్, టెక్, యుటిలిటీ, పవర్ ఇండెక్సులు 5% రాణించాయి. ఇండస్ట్రియల్, బ్యాంకెక్స్ సూచీలు 4–3% లాభపడ్డాయి.

➤ మార్కెట్ అనూహ్య ర్యాలీలో రక్షణ రంగ, డ్రోన్ల తయారీ కంపెనీల షేర్లకు డిమాండ్ కొనసాగింది. యాక్సిస్‌కేడ్స్ టెక్నాలజీస్ 5%, డేటా ప్యాటర్న్స్ 4%, మిశ్ర ధాతు నిగమ్ 3.50%, భారత్ ఎలక్ట్రానిక్స్ 2%, పెరిగాయి. ఐడియాఫోర్జ్ టెక్నాలజీ 6%, డ్రోణాచార్య ఏరియల్ 5% పెరిగాయి.

లాభాలు ఎందుకంటే:

☛ పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, సరిహద్దుల్లో కాల్పులు పరిణామాలతో భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. అయితే అమెరికా మధ్యవర్తిత్వంలో, అనేక దౌత్యప్రయత్నాల తర్వాత ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి. దీంతో ఒక్కసారిగా దలాల్ స్ట్రీట్‌లో ఒక్కసారిగా ఊపువచ్చింది.

☛ అమెరికా–చైనాల మధ్య 'టారిఫ్ వార్' సైతం ఒక కొలిక్కి వచ్చింది. స్విట్జర్లాండ్ వేదికగా జరిగిన చర్చలు సఫలమై ఇరు దేశాలు వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. తమ టారిఫ్‌లను 115% మేర తగ్గించుకోవడంతో పాటు కొత్త సుంకాలకు 90 రోజుల పాటు విరామం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాయి. అగ్రదేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదరడంతో ప్రపంచ మార్కెట్లకు ఫుల్ జోష్ వచ్చింది.

☛ ఈక్విటీ ఫండ్లలోకి సిప్‌ల ద్వారా ఏప్రిల్‌లో రికార్డు స్థాయి రూ.26,632 కోట్లు పెట్టుబడులు రావడం, అంతర్జాతీయ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ మార్నింగ్‌స్టార్ డీబీఆర్ఎస్ భారత సావరిన్ క్రెడిట్ రేటింగ్‌ను దీర్ఘకాలానికి బీబీబీ(కనిష్టం) నుంచి బీబీబీ(స్థిరత్వం)కి అప్‌గ్రేడ్ చేయడం తదితర అంశాలు మార్కెట్ల ర్యాలీకి దన్నుగా నిలిచాయి.

భారీ లాభాల్లో అమెరికా

చైనాతో వాణిజ్య ఒప్పందంలో భాగంగా వాణిజ్య యుద్ధానికి 90 రోజుల విరామం ప్రకటించడంతో అమెరికా ఈక్విటీ మార్కెట్లు భారీ లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఎస్అండ్‌పీ 500 ఇండెక్సు 2.70%, డోజోన్స్ సూచీ 2%, నాస్‌డాక్ ఇండెక్సు 4% లాభాల్లో ట్రేడవుతున్నాయి. ట్రెజరీ ఈల్డ్స్, డాలర్ ఇండెక్సులూ పెరిగాయి.

జెప్టోలో రామ్‌దేవ్‌కు వాటా


- మోతీలాల్ ఓస్వాల్ సైతం పెట్టుబడి
- డీల్ మొత్తం విలువ రూ. 848 కోట్లు



న్యూఢిల్లీ: మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సహవ్యవస్థాపకులు మోతీలాల్ ఓస్వాల్, రామ్‌దేవ్ అగర్వాల్ తాజాగా క్విక్‌కామర్స్ కంపెనీ జెప్టోలో ఇన్వెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. విడిగా 5 కోట్ల డాలర్లు(రూ. 424 కోట్లు) చొప్పున ఇన్వెస్ట్ చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. సెకండరీ లావాదేవీ ద్వారా విదేశీ ఇన్వెస్టర్ల నుంచి వాటాలు కొనుగోలు చేసినట్లు వెల్లడించాయి. వీటి విలువ 10 కోట్ల డాలర్లు(రూ. 848 కోట్లు)కాగా.. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ మరో 25 కోట్ల డాలర్లు ఇన్వెస్ట్ చేసే ప్రణాళికల్లో ఉన్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. వెరసి పబ్లిక్ ఇష్యూ సన్నాహాల్లో ఉన్న జెప్టో తాజా లావాదేవీ ద్వారా దేశీ యాజమాన్య వాటా పెంపువైపు సాగుతున్నట్లు తెలియజేశాయి. ప్రస్తుతం దేశీ యాజమాన్యానికి కంపెనీలో 42% వాటా ఉంది. ఇతర లావాదేవీల ద్వారా ఐపీవో కంటే ముందే వాటాను 50%కిపైగా పెంచుకోనున్నట్లు తెలుస్తోంది. 2024 ఆగస్ట్‌లో సాధించిన 5 బిలియన్ డాలర్ల విలువలో లావాదేవీలు నమోదైనట్లు వెల్లడించాయి. కాగా.. మోతీలాల్ ఓస్వాల్ ఆధ్వర్యంలో ఎడిల్‌వీజ్, హీరో ఫిన్‌కార్ప్ తదితర సంస్థలు 25 కోట్ల డాలర్ల పెట్టుబడులను సమకూర్చనున్నట్లు సమాచారం. తదుపరి దశలో భాగంగా 25 కోట్ల డాలర్ల పెట్టుబడికి జూన్‌లో తెరతీయనున్నట్లు తెలుస్తోంది.

పసిడికి అమ్మకాల సెగ

- ఒకేరోజు రూ.3,400 పతనం
- ఢిల్లీలో 10 గ్రాముల ధర రూ.96,550
- అమెరికా–చైనా టారిఫ్‌ల యుద్ధానికి తాత్కాలిక బ్రేక్



న్యూఢిల్లీ: పసిడి ఒకే రోజు భారీగా నష్టపోయింది. చైనా దిగుమతులపై విధించిన టారిఫ్‌లను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రకటించడంతో సురక్షిత సాధనమైన బంగారంలో అమ్మకాలు వెల్లువెత్తాయి. మరోవైపు భారత్–పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణపై అంగీకారం సైతం అమ్మకాలకు ఆజ్యం పోసింది. ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.3,400 నష్టపోయి రూ.96,550కు దిగొచ్చింది. యూఎస్–చైనా మధ్య వాణిజ్య చర్చల్లో పురోగతి సంకేతాలు వెలువడడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొంత చల్లబడడం బంగారం ధరల పతనానికి దారితీసినట్టు మెహతా ఈక్విటీస్ కమోడిటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కళంత్రి తెలిపారు. వెండి కిలోకి రూ.200 నష్టపోయి రూ.99,700 స్థాయికి చేరింది. 2024 జూలై 23 తర్వాత ఒకే రోజు బంగారం ఎక్కువగా నష్టపోవడం ఇదే మొదటిసారి. చైనా ఉత్పత్తులపై 145% టారిఫ్‌లను 30%కి తగ్గించడానికి అమెరికా ఒప్పుకుంది. చైనా సైతం అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను 10%కి తగ్గించేందుకు ముందుకు వచ్చింది. రష్యా–ఉక్రెయిన్ మధ్య సంధి కుదరొచ్చన్న సంకేతాలతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు చల్లబడినట్టు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ సీనియర్ అనలిస్ట్ జతిన్ త్రివేది తెలిపారు.

బీ న్యూ మొబైల్స్ రెండు కొత్త స్టోర్లు ప్రారంభం



న్యూఢిల్లీ: బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్ తిరుపతి, శ్రీకాకుళంలో కొత్త స్టోర్లు ప్రారంభించింది. ఈ సందర్భంగా సమ్మర్ ఆఫర్లు ప్రకటించింది. ఎంఐ, వివో, ఒప్పో, రియల్‌మీ, ఐఫోన్, శాంసంగ్, నథింగ్, వన్‌ప్లస్ మొబైల్స్‌పై ఖచ్చితమైన బహుమతులు ఇస్తుంది. ప్రారంభ ధర రూ.5,499 నుంచి ఏసీలు, ఎయిర్ కూలర్లు అందుబాటులో ఉన్నాయి. కంపెనీ సీఈఓ సాయి నిఖిలేష్ మాట్లాడుతూ ''ఈసారి మొబైల్స్ ఫోన్లకే కాకుండా గృహోపకరణాలపై కూడా అద్భుతమైన డీల్స్ అందిస్తున్నాము. కస్టమర్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా ఈ సమ్మర్ ఆఫర్లు ప్రకటించాము. ప్రజలంతా ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలి'' అన్నారు.

మారుతీ కార్లలో 6 ఎయిర్‌బ్యాగ్‌లు


ఆల్టో కే10, వేగన్‌ఆర్ మొదలైన మోడల్స్‌లో అందుబాటులోకి



న్యూఢిల్లీ: భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ వివిధ కార్ల మోడల్స్‌లో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను ప్రామాణికంగా అందించనున్నట్లు వెల్లడించింది. వేగన్‌ఆర్, ఆల్టో కే10, సెలెరియో, ఈకో మోడల్స్ వీటిలో ఉన్నాయి. ఈ మోడల్స్‌కి గణనీయంగా ఆదరణ ఉన్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో వాహనదారులు, ప్రయాణికులకు మరింత మెరుగైన భద్రతా ప్రమాణాలు అందుబాటులోకి వచ్చినట్లవుతుందని సంస్థ తెలిపింది.

రూ. 200 కోట్ల ప్రీమియం లక్ష్యం

గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ ఎండీ శ్రీనివాసన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 200 కోట్ల ప్రీమియం లక్ష్యంగా పెట్టుకున్నట్లు గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ ఎండీ జి. శ్రీనివాసన్ తెలిపారు. గతేడాది అక్టోబర్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన ప్పటి నుంచి గత ఆర్థిక సంవత్సరంలో రూ. 17 కోట్ల ప్రీమియం, 50 వేల పైచిలుకు పాలసీలు విక్రయించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో రీజనల్ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఈ విషయాలు తెలిపారు. ప్రస్తుతం ఏపీ, తెలంగాణతో పాటు 4 రాష్ట్రాల్లో కార్యకలాపాలు ఉండగా మరో ఐదింటికి విస్తరించనున్నట్లు శ్రీనివాసన్ చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా 14 కార్యాలయాలను ఏర్పాటు చేయనుండగా, బీమా ఏజెంట్ల సంఖ్యను 10,000కు పెంచుకోనున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఏడు పథకాలు ఉండగా, మరో 10 ప్రొడక్టులను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. గెలాక్సీ హెల్త్‌కు 'టీవీఎస్' వేణు శ్రీనివాసన్ కుటుంబం, స్టార్ హెల్త్ వ్యవస్థాపకుడు వి. జగన్నాథన్ ప్రమోటర్లుగా ఉన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
అమెరికా–చైనా టారిఫ్ డీల్... మనకు సవాళ్లు.. అవకాశాలు! | డెట్ ఫండ్స్‌లోకి పెట్టుబడుల వెల్లువ

సాక్షి సినిమా

అందరివాడు మన సూర్యకుమార్



● ఉపేంద్ర

'అందనివాడు.. అందరివాడు.. మన సూర్యకుమార్' అంటున్నారు హీరో రామ్. ఈ సూర్యకుమార్ ఎవరో కాదు.. కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర. రామ్ హీరోగా పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో ఓ పీరియాడికల్ ఫిల్మ్ తెరకెక్కుతోంది. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో సూర్యకుమార్ పాత్రలో ఉపేంద్ర నటిస్తున్నారని వెల్లడించి, 'అందనివాడు.. అందరివాడు... మన సూర్యకుమార్' అంటూ ఉపేంద్ర ఫస్ట్‌లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. ఈ నెల 15న ఈ సినిమా టైటిల్ అనౌన్స్‌మెంట్ రానుంది. కాగా ఈ సినిమాకు 'ఆంధ్రా కింగ్ తాలూకా' అనే టైటిల్ అనుకుంటున్నారని, సూపర్‌స్టార్ సూర్యకుమార్ పాత్రలో ఉపేంద్ర కనిపిస్తారని తెలిసింది. ఈ సినిమాకు వివేక్– మెర్విన్ ద్వయం సంగీతం అందిస్తున్నారు.

గురి తప్పదు తమ్ముడు



● నితిన్

నితిన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'తమ్ముడు'. శ్రీరామ్ వేణు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం జూలై 4న రిలీజ్ కానుంది. కాగా ఈ సినిమాలోని పాత్రల్ని పరిచయం చేస్తూ 'మూడ్ ఆఫ్ తమ్ముడు' అంటూ సోమవారం ఓ వీడియో విడుదల చేశారు మేకర్స్. రత్న అనే పాత్రలో సప్తమి గౌడ, చిత్రగా వర్ష బొల్లమ్మ, ఝాన్సీ కిరణ్మయిగా లయ, గుత్తి పాత్రలో స్వసిక విజయన్, అగర్వాల్‌గా సౌరభ్ సచ్‌దేవ్ కనిపించబోతున్నారు. 'మూడ్ ఆఫ్ తమ్ముడు' వీడియో చివర్లో నితిన్ ఎంట్రీ, బాణం వదిలిన తీరు ఆసక్తిగా ఉంది. ''నితిన్, 'దిల్' రాజు, శిరీష్ కాంబినేషన్‌లో 'దిల్, శ్రీనివాస కళ్యాణం' సినిమాలొచ్చాయి. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌లో శ్రీరామ్ వేణు 'ఎంసీఏ, వకీల్ సాబ్' వంటి చిత్రాలు తీశారు. ఈ ముగ్గురి కాంబినేషన్‌లో వస్తున్న 'తమ్ముడు' సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది'' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమేరా: కేవీ గుహన్, సంగీతం: అజనీష్ లోకనాథ్.




● రాజమౌళి, కీరవాణి, రామ్‌చరణ్, ఎన్టీఆర్

చిరంజీవి, బాలకృష్ణగార్ల డ్యాన్స్ మంచి జ్ఞాపకంగా నిలిచిపోతుంది - ఎన్టీఆర్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన సినిమా 'ఆర్ఆర్ఆర్' (రౌద్రం.. రణం.. రుధిరం). ఆలియాభట్, ఒలీవియా మోరిస్, అజయ్ దేవగన్, రే స్టీవెన్‌సన్, అలిసన్ డూడీ ఇతర పాత్రల్లో నటించారు. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ చిత్రం 2022 మార్చి 25న విడుదలైంది. తాజాగా లండన్‌లోని ప్రతిష్టాత్మక రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో 'ఆర్ఆర్ఆర్' సినిమా స్క్రీనింగ్‌తో పాటు కీరవాణి లైవ్ కాన్సెర్ట్ జరిగింది. ఈ వేడుకకు అశాంతి ఓంకార్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ మాట్లాడుతూ–''నాటు నాటు' పాటలో నా మిత్రుడు, అద్భుతమైన డ్యాన్సర్ రామ్‌చరణ్‌తో కలిసి డ్యాన్స్ చేయడాన్ని మర్చిపోలేను. చిరంజీవిగారు గ్రేట్ డ్యాన్సర్. మా బాబాయ్ బాలకృష్ణ కూడా మంచి డ్యాన్సర్. చిరంజీవిగారు, బాలకృష్ణ బాబాయ్ కలిసి 'నాటు నాటు' పాటకు డ్యాన్స్ చేస్తే అది మంచి జ్ఞాపకంగా నిలిచిపోతుంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో రామ్‌చరణ్, రాజమౌళి, కీరవాణి పాల్గొన్నారు. ఇక ఈ వేడుకకు మహేశ్‌బాబు హాజరవుతారనే ప్రచారం సాగినప్పటికీ ఆయన పాల్గొనలేదు. ఇక 2023 మార్చిలో జరిగిన 95వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటు నాటు..' పాటకు బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి, లిరిక్ రైటర్ చంద్ర బోస్‌లకు ఆస్కార్ అవార్డులు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'బాహుబలి: ది బిగినింగ్' సినిమా 2019లో రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో స్క్రీనింగ్ జరిగింది.

బ్యాడ్‌బాయ్ యాక్షన్



● నాగశౌర్య

నాగశౌర్య హీరోగా నటించిన చిత్రం 'బ్యాడ్ బాయ్ కార్తీక్'. విధి హీరోయిన్‌గా నటించారు. రామ్ దేవినా (రమేష్) దర్శకత్వంలో శ్రీ వైష్ణవి ఫిల్మ్స్‌పై శ్రీనివాస రావు చింతలపూడి నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు ప్రకటించారు. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'బ్యాడ్ బాయ్ కార్తీక్'. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తాం'' అని యూనిట్ వెల్లడించింది. ఈ సినిమాకు హారీస్ జయరాజ్ సంగీతం అందించారు.

ప్రేక్షకుల ప్రేమాభిమానాలే ముందుకు నడిపిస్తాయి!



● తారక రామారావు, వీణారావు

''మా యూనిట్‌ని ఆశీర్వదించడానికి విచ్చేసిన మా కుటుంబ సభ్యులతో పాటు అందరికీ ధన్యవాదాలు. మా ముత్తాత ఎన్టీఆర్, మా తాత హరికృష్ణ, మా నాన్న జానకి రామ్‌గార్ల ఆశీస్సులు నాకు ఉంటాయి. ప్రేక్షకుల ప్రేమాభిమానాలే నన్ను ముందుకు నడిపిస్తాయని నమ్ముతున్నాను'' అని నందమూరి తారక రామారావు చెప్పారు. ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు, జానకిరామ్ తనయుడు నందమూరి తారక రామారావు హీరోగా, తెలుగమ్మాయి వీణారావు హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. వైవీఎస్ చౌదరి రచన, దర్శకత్వంలో 'న్యూ టాలెంట్ రోర్స్' బ్యానర్‌పై యలమంచిలి గీత నిర్మించనున్న కొత్త సినిమా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌లో సోమవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దగ్గుబాటి పురందేశ్వరి కెమేరా స్విచ్చాన్ చేయగా, నారా భువనేశ్వరి క్లాప్ కొట్టారు. గారపాటి లోకేశ్వరి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ–''తెలుగు సాహిత్యం, తెలుగు సంప్రదాయం, హైందవ సంస్కృతి నేపథ్యంలో మంచి కథని తయారు చేశాను'' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రమేష్ అత్తిలి.

తెలుగులో ఎంట్రీకి భైరవం సరైన సినిమా - అదితీ శంకర్



''నేను తమిళంలో చేసిన తొలి చిత్రం 'విరుమన్'ని విజయ్ కనకమేడలగారు చూశారు. ఆ తర్వాత నాకు కాల్ చేసి, 'భైరవం' సినిమా గురించి చెప్పారు. కథ నచ్చడంతో నేను ఈ ప్రాజెక్టులోకి వచ్చాను. తెలుగులో ఇది నా తొలి చిత్రం. టాలీవుడ్‌లో నా ఎంట్రీకి 'భైరవం' సరైన సినిమా అవుతుందనే నమ్మకం ఉంది. మంచి సినిమాతో ప్రేక్షకులకు ముందుకు రావడం సంతోషంగా ఉంది'' అని అదితీ శంకర్ తెలిపారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా, అదితీ శంకర్, ఆనంది, దివ్య పిళ్లై హీరోయిన్లుగా నటించిన చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వంలో పెన్ స్టూడియోస్‌పై జయంతిలాల్ గడా సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్‌పై కేకే రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సినిమా ద్వారా తెలుగుకి పరిచయమవుతున్న అదితీ శంకర్ విలేకరులతో మాట్లాడుతూ–''మా నాన్నగారితో(డైరెక్టర్ శంకర్) కలిసి హైదరాబాద్, తెలుగు రాష్ట్రాల్లో షూటింగ్స్‌కి వచ్చేదాన్ని. ఇప్పుడు నా సినిమాకి ఇక్కడికి వచ్చి షూటింగ్ చేయడం చూస్తే నా కల నిజం అయిందనిపిస్తోంది. నాన్నగారి ఇమేజ్‌ని ఒక గౌరవంగానే భావిస్తాను తప్ప ఎప్పుడూ ఒత్తిడిగా తీసుకోను. 'భైరవం'లో బోల్డ్ అండ్ హానెస్ట్‌తో పాటు బబ్లీగా ఉండే క్యారెక్టర్‌లో కనిపిస్తాను. సాయి శ్రీనివాస్, మనోజ్, రోహిత్‌గార్లకు తమిళ్ మాట్లాడడం వస్తుంది. అందుకే ఈ ప్రయాణం చాలా సౌకర్యంగా అనిపించింది. సెట్స్‌లో షూటింగ్‌ని చాలా ఎంజాయ్ చేశాను. రాధామోహన్‌గారు చాలా మంచి వ్యక్తి. ప్రతిరోజు సెట్స్‌కి వచ్చేవారు. విజయ్ కనకమేడలగారు క్లారిటీ విజన్ ఉన్న డైరెక్టర్. శ్రీ చరణ్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. నాకు ఇష్టమైన తెలుగు చిత్రం 'మగధీర'. నేను థియేటర్లో చూసిన తొలి తెలుగు సినిమా అది. అలా రాజమౌళి, రామ్ చరణ్‌గార్లకు నేను బిగ్ ఫ్యాన్‌గా మారిపోయాను. నాకు హిస్టారికల్, పీరియాడిక్ సినిమాలతో పాటు సవాల్‌తో కూడిన పాత్రలు చేయాలని ఉంది'' అని చెప్పారు.

కిల్లర్‌ని ఊహిస్తే లక్ష బహుమతి - మోహన్ వడ్లపట్ల



● జో శర్మ, మోహన్ వడ్లపట్ల

'ఎమ్ 4 ఎమ్' విడుదలైన తొలి రోజు సినిమా చూసి.. కిల్లర్ ఎవరో ఊహించినవారికి లక్ష రూపాయలు బహుమతిగా ఇస్తాం'' అని డైరెక్టర్ మోహన్ వడ్లపట్ల చెప్పారు. జో శర్మ, సంబీత్ ఆచార్య లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ఎమ్ 4 ఎమ్'(మోటివ్ ఫర్ మర్డర్). మోహన్ మీడియా క్రియేషన్స్, జో శర్మ మెక్‌విన్ గ్రూప్ (యూఎస్ఏ) బ్యానర్‌పై రూపొందిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ముంబైలో జరిగిన మీడియా సమావేశంలో మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ–''కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ నెల 17న సాయంత్రం 6 గంటలకు 'పలైస్–సి' థియేటర్‌లో మా 'ఎమ్ 4 ఎమ్' ప్రైవేట్ స్క్రీనింగ్ జరగనుంది'' అన్నారు.

ఫ్యామిలీ డ్రామా



● కిరణ్, రామకృష్ణ గౌడ్, ఆక్సా ఖాన్

కిరణ్, అలేఖ్య రెడ్డి జోడీగా, ఆక్సా ఖాన్, తులసి, అనూష ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'దీక్ష'. ఆర్‌కే ఫిలిమ్స్ పతాకంపై ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో పి. అశోక్ కుమార్‌తో కలిసి నిర్మించిన ఈ సినిమా జూన్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ–''ఒక వ్యక్తి పట్టుదల, దీక్షతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చు అనే పాయింట్‌ను ఇతివృత్తంగా తీసుకుని ఫ్యామిలీ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందించాం. ఈ సినిమా తర్వాత 'కబడ్డీ' అనే చిత్రాన్ని రూపొందిస్తున్నాం'' అని చెప్పారు. ''ఆర్‌కే గౌడ్‌గారి డైరెక్షన్‌లో హీరోగా నటించడం చాలా సంతోషంగా ఉంది'' అన్నారు కిరణ్.

క్లుప్తంగా...

నేడు పాలీసెట్

సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (పాలీసెట్‌–2025) మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా జరగనుంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్షకు మొత్తం 1,06,716 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే హాల్‌టికెట్లు కూడా విడుదల చేశారు.

ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల సమ్మె విరమణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యం తలపెట్టిన ఆందోళనను విరమించేందుకు అంగీకరించారని ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదని డిగ్రీ, పీజీ పరీక్షలను బహిష్కరిస్తామని యాజమాన్యాలు ప్రకటించిన విషయం తెలిసిందే. బుధవారం నుంచి పరీక్షలు జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశం మేరకు బాలకిష్టారెడ్డి యాజమాన్య ప్రతినిధులతో సోమవారం చర్చలు జరిపారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలిచ్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. మొత్తం రూ.7 వేల కోట్లకుపైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇందులో తక్షణం రూ.300 కోట్లు ఇవ్వనున్నట్టు ప్రభుత్వం తెలిపిందని బాలకిష్టారెడ్డి వెల్లడించారు.

ఈసెట్‌కు 96.22 శాతం హాజరు

సాక్షి, హైదరాబాద్: డిప్లొమా ద్వారా బీటెక్, బీఫార్మసీ రెండో ఏడాదిలో చేరేందుకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీఈసెట్) సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. ఉస్మానియా యూనివర్సిటీ నేతృత్వంలో జరిగిన ఈ పరీక్షకు 86 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 19,672 మంది పరీక్షకు దరఖాస్తు చేస్తే, 18,928 (96.22 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు.

మనీ లెండింగ్ యాక్టును అమలు చేయాలి

- సీఎస్‌కు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2011 మనీ లెండింగ్ యాక్ట్ రూల్స్‌ను వెంటనే అమలు చేయాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కలిసి ఓ నివేదికను అందజేశారు. గత పదేళ్ల కాలంలో రాష్ట్రంలో జరిగిన రైతు ఆత్మహత్యలకు గల కారణాలు ప్రైవేట్ అప్పులేనని ఆయన నివేదికలో ఉన్న అంశాలను వివరించారు. ప్రైవేట్ అప్పులు, వడ్డీరేట్లు ఎక్కువగా ఉండటం వల్ల ప్రధానంగా కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వివరించారు. వెంటనే మనీ లెండింగ్ యాక్టును అమలు చేసి, ప్రైవేటు అప్పులపై కఠినంగా వ్యవహరించాలని కోదండరెడ్డి కోరారు. సీఎస్‌ను కలిసిన వారిలో కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, భవానీరెడ్డి, మెంబర్ సెక్రటరీ గోవిందు, వ్యవసాయ అధికారి హరి వెంకటప్రసాద్ ఉన్నారు.

కరాచీ బేకరిపై దాడితో సంబంధం లేదు

మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు


సాక్షి, హైదరాబాద్: కరాచీ బేకరిపై బీజేపీ దాడి చేసిందని మంత్రి సీతక్క చేసిన వ్యాఖ్యలను మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు తీవ్రంగా ఖండించారు. పాకిస్తాన్‌తో యుద్ధ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సైనికుల క్షేమాన్ని, భారత్ విజయాన్ని ఆకాంక్షిస్తూ దేవాలయాల్లో పూజలు నిర్వహించాలని మాత్రమే కోరినట్లు పేర్కొన్నారు. అదే సమయంలో కొందరు కరాచీ బేకరిపై దాడి చేశారని ఆ దాడిని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. ఆ చర్యతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని సోమవారం రామచంద్రరావు పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. సీతక్క వాస్తవాలను తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని వ్యాఖ్యానించారు. అలాంటి సంస్కృతి కాంగ్రెస్‌దేనన్నారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఇంటిపై దాడి చేస్తామని స్వయంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రకటించారని తెలిపారు. ఇప్పటికైనా అవగాహనరహిత మాటలు మాట్లాడొద్దని కాంగ్రెస్ నాయకులను, మంత్రులను హెచ్చరిస్తున్నామని రామచంద్రరావు పేర్కొన్నారు.

జగ్గారెడ్డికి దేశభక్తి, కనీస పరిజ్ఞానం లేవు

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి దేశభక్తి, కనీస పరిజ్ఞానం లేదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. భారత సైనికుల త్యాగాన్ని జగ్గారెడ్డి విమర్శించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గతంలో రాముడిపై దారుణ వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు దేశ సైనికులపై చేస్తున్నారన్నారు. జగ్గారెడ్డి ఊసరవెల్లిలాగా పార్టీలు మార్చే వ్యక్తి అని, గతంలో పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌రెడ్డిపై తీవ్రంగా మాట్లాడిన ఆయనకు ఇతర పార్టీల నాయకులను విమర్శించే నైతిక హక్కులేదని మండిపడ్డారు. పదవి, అధికారం కోసం కాళ్లు మొక్కిన వ్యక్తి జగ్గారెడ్డి అని ప్రకాశ్‌రెడ్డి విరుచుకుపడ్డారు. పేదవాళ్ల భూములు గుంజుకొని ఇబ్రహీంపట్నం దగ్గర ఫార్మాసిటీ పెట్టడానికి కాంగ్రెస్ పార్టీ కుట్ర చేసిందన్నారు.

ఆరోగ్యమే పర్యాటక భాగ్యం..!



అత్యంత చౌకగా వైద్యం లభించడమే కాదు.. ఆపరేషన్ లేదా చికిత్సకు వెయిటింగ్ పీరియడ్ కూడా చాలా మన దేశంలో తక్కువ. అందుకే అత్యవసర సమయాల్లో విదేశీ రోగులను భారత్ ఆపద్బాంధవుడిలా ఆదుకుంటోంది. అమెరికా, యూరప్ వంటి పాశ్చాత్య దేశాలతో పోలిస్తే చాలా వరకు వైద్య సేవలు భారత్‌లో 60–80 శాతం చౌకగా లభిస్తున్నాయి. సకల సదుపాయాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రులు భారత్‌లో దండిగా ఉన్నాయి. అంతేకాదు అత్యంత నైపుణ్యం గల డాక్టర్లు, సర్జన్లు, నర్సులు, హెల్త్‌కేర్ సిబ్బందితో పాటు రోగ నిర్ధారణ పరీక్షల కోసం అధునాతన పరికరాలు, రోబోటిక్ సర్జరీలకు సైతం మన ఆస్పత్రులు ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచాయి.

- భారత్‌కు క్యూ కడుతున్న విదేశీ మెడికల్ టూరిస్టులు
- అత్యంత చౌకగా వైద్యం.. నిపుణులైన వైద్యుల దన్ను.. అధునాతన సాంకేతికత, సదుపాయాలతో ఆకర్షిస్తున్న ఆస్పత్రులు
- సరళతర వీసా నిబంధనలతో ప్రభుత్వ తోడ్పాటు.. 2027 నాటికి 18 బిలియన్ డాలర్లకు పరిశ్రమ

(సాక్షి, బిజినెస్ డెస్క్)

దేశంలో వైద్య పర్యాటకం పరవళ్లు తొక్కుతోంది. అతి తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్య సేవలకు కేరాఫ్ అడ్రస్‌గా మారడంతో భారత్.. మెడికల్ టూరిజంలో ప్రపంచ కేంద్రంగా ఆవిర్భవిస్తోంది. బైపాస్ సర్జరీ మొదలు.. తీవ్రమైన కేన్సర్ దాకా.. మోకాలు చిప్ప మార్పిడి నుంచి అవయవాల మార్పిడి వరకు.. ఎంత క్లిష్టమైన సర్జరీలకైనా మిగతా దేశాలతో పోలిస్తే 5–10 రెట్లు తక్కువ ఖర్చుతో మన ఆస్పత్రుల్లో అధునాతన చికిత్సలు అందుబాటులో ఉండటంతో విదేశీ రోగులకు భారత్ వరప్రదాయినిగా మారుతోంది. దీంతో మెడికల్ టూరిస్టులు మన దేశానికి క్యూ కడుతున్నారు. మెడికల్ టూరిజం ఇండెక్స్ 2020–21 ప్రకారం వైద్య పర్యాటకానికి అత్యంత ఆకర్షణీయ గమ్యస్థానాల్లో భారత్ 10వ స్థానంలో నిలవడమే ఇందుకు నిదర్శనం.

ఎందుకీ జోరు?

- మోకాలి చిప్ప (నీ) రీప్లేస్‌మెంట్ కోసం మన దేశంలో ఆస్పత్రి ఖర్చు 6,000 డాలర్లు (సుమారు రూ.5.10 లక్షలు) కాగా.. బ్రిటన్‌లో ఇందుకు 50,000 డాలర్లు (సుమారు రూ.42.5 లక్షలు) ఖర్చవుతున్నట్లు అంచనా.
- దంత సమస్యలకు విదేశాల్లో 5,000–6,000 డాలర్లు ఖర్చు పెట్టాల్సి వస్తే.. భారత్‌లో దీనికయ్యే వ్యయం 1,000 డాలర్ల లోపే.
- 2023లో మన దేశంలో 18,378 అవయవ మార్పిడి సర్జరీలు జరగగా.. ఇందులో దాదాపు పదో వంతు (1,851) విదేశీయులవే కావడం విశేషం.
- కొన్ని ఆస్పత్రుల్లో విదేశీ రోగుల కోసం ప్రత్యేక వసతులు, వైద్య బృందాలను కూడా కేటాయిస్తున్నారు.
- కీళ్ల నొప్పులు, ఊబకాయం వంటి సమస్యలకు ఆయుర్వేదం, యోగా వంటి సంప్రదాయ, ప్రత్యామ్నాయ ఉపశమన చికిత్సల్లో (హీలింగ్ థెరపీ) పేరొందడం కూడా హెల్త్ టూరిజంలో భారత్‌కు మరింత కలిసొస్తున్న అంశం.

ప్రభుత్వ ప్రోత్సాహమూ..

దేశంలో వైద్య పర్యాటకాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. సులభతర వీసా విధానం ఇందులో ఒకటి. కొన్ని దేశాల నుంచి వచ్చే మెడికల్ టూరిస్టులకు వీసా ఆన్ ఎరైవల్ సదుపాయం కూడా అందుబాటులో ఉంది. దాదాపు 167 దేశాలకు చెందిన రోగులు, వారి వెంట వచ్చే సహాయకుల (అటెండెంట్) కోసం ఈ–మెడికల్ వీసాలను కేంద్రం జారీచేస్తోంది. భారత్‌కు వైద్యం కోసం వచ్చే విదేశీయులకు సకల సమాచారాన్ని అందించడం, మార్గనిర్దేశం చేయడానికి ఇటీవలే హీల్ ఇండియా ప్రోగ్రామ్‌ను కూడా ప్రారంభించింది.


మార్కెట్ రయ్ రయ్...



దేశంలో మెడికల్ టూరిజం పరిశ్రమ మార్కెట్ శరవేగంగా దూసుకుపోతోంది. 2024లో దాదాపు 7.9 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.67,150 కోట్లు)గా ఉన్న మార్కెట్ విలువ ఈ ఏడాది 8.71 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.74,000 కోట్లు) చేరుకుంటుందని అంచనా. ఏటా 19% వృద్ధితో 2027 నాటికి హెల్త్ టూరిజం రంగం ఆదాయం 18 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.1.53 లక్షల కోట్లు) ఎగబాకవచ్చని పరిశ్రమ వర్గాల అంచనా. గుండె ఆపరేషన్లు, కేన్సర్, అవయవాల మార్పిడి, దంత చికిత్స, ప్లాస్టిక్ సర్జరీ ఇలా విభిన్న చికిత్సల కోసం 2023లో 6.35 లక్షల మంది భారత్‌కు వచ్చారు. కోవిడ్‌కు ముందు అంటే 2019లో 6.97 లక్షల మెడికల్ టూరిస్టులు రాగా, మహమ్మారి దెబ్బకు 2020లో ఈ సంఖ్య 1.83 లక్షలకు పడిపోయింది. మళ్లీ క్రమంగా ఆ స్థాయికి చేరుకుంటోంది.


విదేశీయులు ఎక్కువగా ఏ వైద్యం కోసం వస్తున్నారు..


గుండె జబ్బులు	కేన్సర్	బోన్‌మారో మార్పిడి
ఊబకాయం	ఫెర్టిలిటీ చికిత్స	ఆయుర్వేదం
యోగా	ప్లాస్టిక్/కాస్మెటిక్ సర్జరీ	
అవయవాల మార్పిడి	దంత చికిత్స	



బంగ్లాదేశ్ టాప్

వైద్య చికిత్స కోసం భారత్‌కు అత్యధికంగా వస్తున్నది బంగ్లాదేశ్ వాసులే. వారికి 2024లో 3,23,429 మెడికల్ వీసాలు ఇచ్చారు. మొత్తం వీసాల్లో ఇవి 70 శాతం. కాగా, మన పొరుగు దేశాలతో పాటు పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాలకు చెందిన వారు కూడా వైద్యం కోసం ఎక్కువగా భారత్‌నే ఆశ్రయిస్తున్నారు. వైద్య పర్యాటకుల్లో ఆఫ్రికా వాటా 10 శాతంగా ఉంది. అమెరికా, యూరప్, మధ్య ఆసియా దేశాల నుంచి వస్తున్న రోగుల సంఖ్య కూడా పెరుగుతోంది.





నేడు ఇంజనీరింగ్ ఫీజుల ఖరారు!

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కోర్సుల వార్షిక ఫీజులు భారీగా పెరగబోతున్నాయి. కొన్ని కాలేజీల్లో ఫీజులను ఏకంగా వందశాతం పెంచనున్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం కీలక నిర్ణయం తీసుకోబోతున్నారు. తెలంగాణ ఫీజులు, నియంత్రణ మండలి (ఎఫ్ఆర్‌సీ) నేతృత్వంలో ఉదయం 11 గంటలకు ఫీజులపై తుది దశ సమావేశం జరగనుంది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారు. ఇప్పటికే ఇంజనీరింగ్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. సీట్ల కేటాయింపునకు సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంది. అంతకుముందు ఫీజులపై స్పష్టత ఇవ్వాల్సి ఉంటుంది. ఎఫ్ఆర్‌సీ నిర్వహించే తుది భేటీలో ఫీజులను ఖరారు చేసి, ప్రభుత్వానికి పంపుతారు. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత కొత్త ఫీజులను ఎఫ్ఆర్‌సీ వెల్లడిస్తుంది.



ఫీజుల పెంపుపై నేడు ఎఫ్ఆర్‌సీ తుది భేటీ

- అనంతరం ప్రభుత్వానికి నివేదిక
- కొన్ని కాలేజీలకు వందశాతం ఫీజులు పెరిగే అవకాశం
- గరిష్టంగా రూ.2.23 లక్షలకు ఇంజనీరింగ్ ఫీజు.. కాలేజీల ఆడిట్ నివేదికలపై అనుమానాలు
- చాలావరకు కాలేజీలు, ఎఫ్ఆర్‌సీ ఆడిటర్లు ఒక్కరేనని ఆరోపణలు

వచ్చే మూడేళ్లకు ఇదే ఫీజు

ఎఫ్ఆర్‌సీ మూడేళ్లకోసారి ఫీజులను సవరిస్తుంది. 2022లో కొత్త ఫీజులను ఖరారు చేశారు. ఇప్పటివరకు అవే అమలులో ఉన్నాయి. 2022–23, 2023–24, 2024–25 విద్యా సంవత్సరాల్లో కాలేజీల్లో చేరినవారికి ఇవి వర్తిస్తాయి. ఆయా సంవత్సరాల్లో బీటెక్ తొలి ఏడాదిలో చేరినవారికి కోర్సు పూర్తయ్యే నాలుగేళ్లూ పాత రుసుములే ఉంటాయి. వచ్చే విద్యాసంవత్సరం (2025–26) నుంచి కొత్త ఫీజులు అమలులోకి వస్తాయి. ఇవి 2025–26, 2026–27, 2027–28 వరకు వర్తిస్తాయి. 2022లో కొన్ని కాలేజీల వార్షిక నివేదికలు సరిగా లేకపోవడంతో ప్రతిపాదిత ఫీజులను ఎఫ్ఆర్‌సీ ఆమోదించలేదు. కొన్ని కాలేజీలు కోర్టు ఆదేశాల మేరకు ఫీజులు పెంచుకున్నాయి. ఆరు నెలలుగా ఫీజులపై ఎఫ్ఆర్‌సీ కసరత్తు చేస్తోంది. కాలేజీల నుంచి ప్రతిపాదనలు తీసుకుని పలు దఫాలు చర్చలు జరిపింది. ఉన్నతాధికారులు ఇప్పటికే రెండుసార్లు భేటీ అయ్యారు.

ఇష్టానుసారం ఆడిట్..

కొత్త ఫీజుల కోసం 157 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఎఫ్ఆర్‌సీకి దరఖాస్తు చేసుకున్నాయి. రెండు కాలేజీలు ఏకంగా రూ. 2.90 లక్షల వార్షిక ఫీజును ప్రతిపాదించాయి. వీటికి రూ.2.23 లక్షల మేర ఖరారయ్యే అవకాశం కన్పిస్తోంది. 60కి పైగా కాలేజీలు ప్రస్తుతం ఉన్న రూ.లక్ష వార్షిక ఫీజును రూ.2.5 లక్షలకు పెంచాలని ప్రతిపాదించాయి. 33 కాలేజీలు ప్రస్తుతం ఉన్న రూ.లక్ష ఫీజును రెట్టింపు చేయాలని కోరాయి. ఈ ఫీజులు దాదాపు ఖరారైనట్టేనని అధికార వర్గాలు అంటున్నాయి. దాదాపు 45 కాలేజీల్లో ఈసారి రూ.2 లక్షలకుపైగా ఫీజును ఖరారుచేసే వీలుంది. వాస్తవానికి 2021–22, 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాల్లో కాలేజీల ఆదాయ, వ్యయాల ఆడిట్ నివేదికల ఆధారంగా ఎఫ్ఆర్‌సీ ఫీజులను నిర్ణయిస్తుంది. దీన్ని ప్రైవేటు కాలేజీలు అవకాశంగా తీసుకున్నట్టు తెలుస్తోంది. పలు కొత్త కోర్సులు ప్రవేశపెట్టడం, వాటికి లైబ్రరీ, లేబొరేటరీ, అత్యధిక వేతనాలతో ఫ్యాకల్టీని పెట్టడం వల్ల ఖర్చులు భారీగా పెరిగాయని ఆడిట్ నివేదికల్లో పేర్కొన్నాయి. ఈ నివేదికలను ఎఫ్ఆర్‌సీ ఆడిట్ బృందాలు క్షుణ్ణంగా పరిశీలిస్తాయి. దీనికోసం నిపుణులైన ఆడిటర్లను ఎఫ్ఆర్‌సీ తాత్కాలిక పద్ధతిలో నియమించుకుంటుంది. అయితే, కాలేజీలకు ఆడిట్ నివేదికలు ఇచ్చిన ఆడిటర్లే ఎఫ్ఆర్‌సీలోనూ పనిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని కాలేజీలతో సంబంధిత ఆడిటర్లు మిలాఖత్ అయినట్టు విమర్శలు వస్తున్నాయి. ఈ కారణంగానే ఆడిట్ నివేదికలో వాస్తవాలు పరిశీలించకుండానే ఫీజుల పెంపునకు సిఫార్సు చేసినట్టు తెలుస్తోంది.

విశ్వసనీయ సమాచారం మేరకు ఇప్పటి వరకు దాదాపు ఖరారైన కొన్ని కాలేజీల ఫీజుల వివరాలు (రూ.లక్షల్లో)

కళాశాల పేరు	పాత ఫీజు	కొత్త ఫీజు
సీబీఐటీ	1.65	2.23
ఎంజీఐటీ	1.60	2.45
గీతాంజలి	1.20	1.55
గోకరాజు రంగరాజు	1.30	1.80
వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి	1.35	2.20
వాసవి	1.40	2.15
నారాయణమ్మ	1.00	1.95
ఎస్ఆర్	1.30	2.00
సీవీఆర్	1.50	1.98
వర్ధమాన్	1.40	1.90
కిట్స్ (వరంగల్)	1.25	1.90
శ్రీనిధి	1.30	1.80
సెయింట్ మార్టిన్స్	1.00	1.75
బీవీఆర్ఐటీ (నర్సాపూర్)	1.20	1.80
బీవీఆర్ఐటీ (మహిళ)	1.10	1.75
కేఎంఐటీ	1.00	1.70



పున్నమి వెలుగుల్లో.. బంగారు వర్ణంలో..

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం సోమవారం రాత్రి పున్నమి వెలుగుల్లో.. బంగారు రంగు విద్యుత్ కాంతుల్లో భక్తులకు కనువిందు చేసింది. నిండు పున్నమి శ్రీస్వామి వారి గోపురాలపైకి చేరగానే.. రంగు రంగుల విద్యుత్ కాంతుల వెలుగుల్లో మెరిసిపోయింది.

మండుటెండల్లోనూ లిక్కరే తాగారు

- ఏప్రిల్ నెలలో అనూహ్యంగా తగ్గిన బీర్ల అమ్మకాలు
- గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాదిలో పెరిగిన మద్యం అమ్మకాలు
- ఒక్క నెలలోనే రూ.3,200 కోట్ల విలువైన సరుకు విక్రయం



సాక్షి, హైదరాబాద్

సహజంగా ఎండాకాలంలో బీర్ల విక్రయాలు ఎక్కువగా లిక్కర్ కొనుగోళ్లు తక్కువగా ఉంటాయి. కానీ ఈసారి మాత్రం రాష్ట్రంలో బీర్ల విక్రయాలు తగ్గిపోయి, లిక్కర్ విక్రయాలు పెరిగాయి. గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో 3.68 లక్షల కేసుల బీర్ల అమ్మకాలు తగ్గాయని గణాంకాలు చెబుతున్నాయి.

- 2024 ఏప్రిల్ నెలలో రూ.902.28 కోట్ల విలువైన 50.14 లక్షల కేసుల బీర్లు అమ్ముడుపోగా, ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రూ.944.54 కోట్ల విలువైన 46.46 లక్షల కేసుల బీర్లు మాత్రమే అమ్ముడయ్యాయని ఎక్సైజ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే గతేడాది కంటే ఒక్క నెలలో దాదాపు 44 లక్షల బీర్లు తక్కువగా అమ్ముడయ్యాయన్న మాట. అంటే రోజుకు లక్షన్నర బీర్లు తగ్గిపోయాయని అర్థమవుతోంది.
- గత ఏడాది ఏప్రిల్ నెలకంటే ఈ ఏడాది ఏప్రిల్‌లో లిక్కర్ విక్రయాలు పెరగడం విశేషం. గత ఏడాది ఏప్రిల్ నెలలో రూ. 2,302.98 కోట్ల విలువైన 30.6 లక్షల కేసుల లిక్కర్ అమ్ముడుపోగా, ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రూ. 2,327.71 కోట్ల విలువైన 31.17 లక్షల కేసుల లిక్కర్ అమ్ముడైంది. అంటే గత ఏడాది కంటే 0.6 లక్షల కేసులు, 72 వేలకు పైగా బాటిళ్లు ఎక్కువగా సేల్ అయ్యాయని, రోజుకు 2,400 వరకు బాటిళ్ల లిక్కర్ ఎక్కువగా అమ్ముడైందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మొత్తంమీద గత ఏడాది ఏప్రిల్‌లో రూ.3,205.26 కోట్ల విలువైన మద్యం అమ్ముడు కాగా, ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రూ. 3,272.32 కోట్ల విలువైన మద్యం సేల్ అయ్యింది.

ఏం జరిగిందబ్బా...!

మండుటెండల్లో మందుబాబులు బీర్‌బలులుగా మారుతారని, ఎక్కువగా బీర్లు తాగుతారనే అంచనాలో ఎక్సైజ్ శాఖ ఉండగా, ఈ ఏడాది అనూహ్యంగా ఏప్రిల్ నెలలో బీర్ల విక్రయాలు తగ్గడం పట్ల ఆ శాఖ అధికారులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు గల కారణాలపై ఆ శాఖలో పలు రకాల చర్చలు జరుగుతున్నాయి.

- బీర్ల ధరలు ఎక్కువగా ఉండడమే ఇందుకు ప్రధాన కారణమనే చర్చ జరుగుతోంది. రెండు బీర్లు తాగిన ధరకు, మంచి మద్యం క్వార్టర్ తాగిన ధరకు రూ.200 వరకు తేడా వస్తోందని, అందుకే ఎండలను సైతం లెక్క చేయకుండా మందుబాబులు లిక్కర్ వైపు మొగ్గుచూపారని తెలుస్తోంది.
- ఇక, వేసవిలో బీర్లు తాగడం వల్ల ప్రయోజనం లేకపోగా, డీహైడ్రేషన్‌కు ఎక్కువ అవకాశం ఉంటుందన్న ఆరోగ్య సూచనల నేపథ్యంలోనూ బీర్ల పట్ల అనాసక్తత చూపారని, నగరాలు, పట్టణాల్లోని యువత మినహా ఇతర వయసుల వారు పెద్దగా బీర్లకు ప్రాధాన్యమివ్వడం లేదనే చర్చ జరుగుతోంది.

ఈ ఏడాది ఏప్రిల్‌లో మద్యం విక్రయాలు అత్యధికంగా జరిగిన ఎక్సైజ్ జిల్లాలివే:

జిల్లా	లిక్కర్	బీర్ (కేసుల్లో)	విలువ (కోట్లలో)
శంషాబాద్	2,19,649	3,27,711	256.32
సరూర్‌నగర్	2,23,135	3,56,499	244.80
మేడ్చల్	2,23,303	3,03,371	234.44
మల్కాజ్‌గిరి	1,90,193	2,62,622	202.22
హైదరాబాద్	1,57,070	1,53,329	152.49

అందరికీ నచ్చేలా ఫీజుల నియంత్రణ

- త్వరలోనే ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటాం
- తెలంగాణ విద్యా వ్యవస్థను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతాం
- నిబంధనలు అతిక్రమించే స్కూళ్లపై కఠిన చర్యలు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి వేయి ప్రభుత్వ ప్లే స్కూళ్లు
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి
- వివిధ వర్గాలతో మంత్రివర్గ ఉపసంఘం చర్చలు



సాక్షి, హైదరాబాద్

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యా రంగంలో సంస్కరణల కోసం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం సచివాలయంలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు, విద్యా శాఖాధికారులతో సుమారు 5 గంటల పాటు సుదీర్ఘంగా చర్చించింది. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థ ముఖచిత్రాన్ని మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై త్వరలోనే నిర్ణయం వెలువరిస్తామన్నారు.

ప్రైవేటుకు దీటుగా సర్కారీ స్కూళ్లు

తెలంగాణ విద్యా వ్యవస్థను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చి దిద్దేందుకు మంత్రివర్గ ఉపసంఘం కార్యాచరణ సిద్ధం చేస్తోందని శ్రీధర్‌బాబు తెలిపారు. ఇతర రాష్ట్రాల అధికారులు కూడా మన విద్యా వ్యవస్థను అధ్యయనం చేసేలా మార్పులు తేవాలని అధికారులకు సూచించారు. ప్రైవేట్ ఇంటర్నేషనల్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పమని చెప్పారు. సర్కార్ బడులపై తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంచి, వాటికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

టీచర్లకు శిక్షణ

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ ఉపాధ్యాయులను అత్యుత్తమ నైపుణ్యంగల మానవ వనరులుగా తీర్చి దిద్దేందుకు కావాల్సిన శిక్షణపై సమావేశంలో చర్చించామని మంత్రి తెలిపారు. ఇప్పటికే డీఈవోలకు మూడు రోజులపాటు ప్రత్యేక క్యాంప్ నిర్వహించామని వివరించారు. డీఈవో, ఎంఈవోలు క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీలు నిర్వహించి లోపాలను సరిచేయాలని సూచించారు. విద్యార్థుల భద్రత విషయంలో రాజీ పడొద్దని అధికారులకు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదో తరగతిలో గ్రేడింగ్ కొనసాగిస్తారా? మార్కులు ఇస్తారా? లేదా రెండింటిని కొనసాగిస్తారా? అనే అంశంపై తల్లిదండ్రులు, విద్యార్థులకు ముందు నుంచే అవగాహన కల్పించాలని విద్యా శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

తప్పుడు ప్రకటనపై చర్యలు

తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలిచ్చే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ)ను తప్పనిసరిగా అమలు చేస్తామని, ఇందుకోసం ఎంత బడ్జెట్ అయినా కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. విద్యార్థులకు మరింత పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లో కామన్ డిటెన్షన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఒకేరకమైన పరీక్ష ఫీజును కూడా అమల్లోకి తెస్తామని చెప్పారు. 2025–26 నుంచి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా వెయి ప్లే స్కూల్స్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. వీటి కరిక్యులమ్, ట్రైనింగ్ మెటీరియల్‌ను ఎస్‌సీఈఆర్‌టీ నిపుణుల భాగస్వామ్యంతో రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, విద్యా శాఖ ఉన్నతాధికారులు యోగితా రాణా, దేవసేన, హరిత, నర్సింహారెడ్డి, కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

జగిత్యాల ఐకాన్ 'క్లాక్‌టవర్'

అందమైన రీతిలో కట్టడం
జర్మనీ నుంచి తెప్పించిన గడియారం
ఒకప్పుడు సమయం తెలిపేది ఈ టవరే
ప్రస్తుతం నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు


జగిత్యాల నడిబొడ్డున క్లాక్ టవర్

జగిత్యాల: ప్రస్తుత హైటెక్ యుగంలో సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు రావడంతో సమయం సులువుగా తెలిసిపోతోంది. కానీ పూర్వ కాలంలో సమయం తెలియాలంటే పొద్దును (సూర్యుడిని) చూసి తెలుసుకునేవారు. రానురాను గడియారాలు వచ్చాయి. ఈ క్రమంలో జగిత్యాల జిల్లా కేంద్రం నడిబొడ్డున నలువైపులా కనిపించేలా క్లాక్ టవర్ ఏర్పాటు చేశారు. ఇది పట్టణానికి శోభనివ్వడంతో పాటు వచ్చిపోయే వారికి సమయం తెలిపేది. ఇప్పటికీ జగిత్యాల క్లాక్ టవర్ అంటేనే అందరికీ అడ్రస్ తెలిసిపోతుంది. అంత ప్రాచుర్యం పొందింది. 1936లో చల్‌గల్‌కు చెందిన ధర్మ జలపతిరావు దేశ్‌ముఖ్ నడిబొడ్డున క్లాక్ టవర్ నిర్మించినట్లు స్థానికులు చెబుతుంటారు. ఈ గడియారాన్ని జర్మనీ నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి తీసుకువచ్చారు. ఆ సమయంలో ప్రాణాంతకమైన కలరా వ్యాధి వ్యాపించి నగరం కోలుకున్న సందర్భంగా దానిని నిర్మూలనకు సాక్ష్యంగా ఈ క్లాక్ టవర్ నిర్మించారని చరిత్రకారులు చెబుతున్నారు.



ప్రతి ఉత్సవం అక్కడే..

జిల్లా కేంద్రంలో ఏ ఉత్సవాలైనా.. (వినాయక చవితి, దేవి నవరాత్రులు, మొహర్రం, స్వాతంత్ర్య వేడుకలు) ఈ క్లాక్ టవర్ వద్ద నుంచే ర్యాలీ నిర్వహిస్తారు. ప్రతి ఉత్సవాల సమయంలో విద్యుత్ వెలుగులతో అలంకరిస్తుంటారు. జిల్లా కేంద్రంలో టవర్ సర్కిల్ అని పేరు చెబితేనే గుర్తుకు వస్తుంది. కోట్లలో టర్నోవర్ ఉండే వ్యాపారకేంద్రాలు ఇక్కడే ఉన్నాయి. అధికారులు స్పందించి క్లాక్ టవర్‌కు మరమ్మతు చేయడంతోపాటు అభివృద్ధికి కృషి చేయాలని, పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

క్లాక్‌టవర్ ప్రత్యేకం

గడియారం జర్మనీ నుంచి ప్రత్యేకంగా తెప్పించారు. ఇది గంటగంటకు ఎంత సమయం అయిందో తెలుపుతూ మ్రోగుతుంది. దీని శబ్దం చుట్టుపక్కల కొంత దూరం వరకు విన్పిస్తుంది. చదువురాని వారికి, సామాన్యులకు సైతం సమయాన్ని తెలుపుతుంది. చరిత్రాత్మకమైన ఈ టవర్ చాలామందికి ఎంతో ఉపయోగపడేది. గతంలో సమయం తెలియాలంటే క్లాక్ టవర్ ద్వారానే తెలిసేది. జగిత్యాల గతంలో డివిజన్ కేంద్రంగా ఉండటంతో చుట్టూ చాలా మంది ప్రజలు ఈ ప్రాంతానికి వచ్చి వాణిజ్య వ్యాపారాలు కొనసాగించేవారు. ఈ టవర్ జగిత్యాలకు కచ్చితంగా నడిబొడ్డున ఉండటంతో ప్రత్యేకంగా నిలిచింది.

మరమ్మతులకు నోచుకోని గడియారం..

ఇంత ప్రాచుర్యం పొందిన క్లాక్ టవర్‌ను బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. మొదట్లో కాషాయం రంగులో ఈ టవర్‌ను ఏర్పాటు చేసినప్పటికీ పూర్తి శిథిలావస్థకు చేరడంతో గతంలో సుమారు రూ.10 లక్షలు పెట్టి మరమ్మతు చేయించారు. ప్రస్తుతం తెలుపు, నీలం రంగులు వేసి మరమ్మతు చేపట్టారు. 60 అడుగుల ఎత్తుతో అష్టభుజి గోపురం ఈ టవర్ ప్రత్యేకత. స్తంభానికి ఎత్తైన భాగంలో గోపురం ఉంటుంది. నాలుగు వైపులా గడియారం ఉన్నా ఇప్పుడు అది పనిచేయడం లేదు. గతంలో మరమ్మతులు చేపట్టినప్పటికీ మళ్లీ అది అలాగే ఉంటుంది.

సింగరేణి 'జలసిరి'

- 11 ఏరియాలు.. 55 మినీ చెరువులు
- వృథా నీటిని ఒడిసిపట్టి.. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు
- సమీప గ్రామాల చెరువుల్లో పూడికతీత
- నీటిబిందువు–జలసింధువు పేరుతో ప్రణాళిక
- రూ.10 కోట్లతో వర్షాకాలంలోగా పనులు పూర్తి

'ప్రతీ నీటి బొట్టును ఒడిసిపడతాం.. నీటి నిల్వల కోసం ప్రత్యేక వాటర్ స్టోరేజీ ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నాం. 11 ఏరియాల్లో సమ్మర్ వాటర్ స్టోరేజీ ట్యాంకులతో పాటు సింగరేణికి 2 కిలోమీటర్ల దూరంలోని చెరువుల్లో పూడికతీత చేపడతాం. పర్యావరణ పరిరక్షణకు నీటిబిందువు–జలసింధువు కోసం రూ.10 కోట్లు కేటాయించాం'

– ఎన్.బలరాం, సింగరేణి సంస్థ సీఎండీ


ఓసీపీ-3 సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్


శరవేగంగా కొనసాగుతున్న పనులు

గోదావరిఖని: గోదావరి వ్యాలీ వెంట జలసిరి కోసం సింగరేణి భగీరథ ప్రయత్నం మొదలైంది. సంస్థ విస్తరించిన ఏడు జిల్లాల్లో మినీ చెరువులు ఏర్పాటు చేసి నీటి ఒడిసిపట్టాలని సంస్థ నిర్ణయించింది. సింగరేణి సంస్థ సీఎండీ బలరాం సలహా సూచనల మేరకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే ఉన్న చెరువుల్లో పూడిక తీయడంతో పాటు మరిన్ని కొత్త మినీ చెరువులు ఏర్పాటు చేసి భూగర్భజలాల పెంపునకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. మూతపడిన ఓసీపీ సంపులను నీటి కుంటలుగా మార్చాలని, ఓవర్ బర్డెన్ గుట్టల మధ్య నీటి తటాకాలు ఏర్పాటు చేసి వేసవిలో కూడా సింగరేణి పారిశ్రామిక ప్రాంత ప్రజలకు నీటిని అందించాలని యోచించారు.

సమీప గ్రామాల్లో..

సంస్థ విస్తరించి ఉన్న రెండు కిలోమీటర్ల పరిధిలోని చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈమేరకు ఏరియా కార్పొరేట్ స్థాయి అధికారితో పాటు ఏరియా వారీగా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. సహజ చెరువులు, కుంటల్లో నీటి నిల్వకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

11 ఏరియాలు.. 55 మినీట్యాంకులు..

సంస్థ వ్యాప్తంగా 11 ఏరియాల్లో 55 చెరువులు ఏర్పాటు చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఒక్కో ఏరియాకు 5 చెరువులు ఏర్పాటు చేయాలని, ప్రభావిత గ్రామాల్లోని పాత చెరువుల్లో పూడికతీత చేపట్టాలని యాజమాన్యం సూచించింది. కాగా, ఒక్కో ఏరియాకు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు బడ్జెట్ అందజేస్తున్నట్లు సమాచారం.

పెరగనున్న భూగర్భజలాలు

సంస్థ చేపట్టనున్న చర్యల వల్ల సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాలు పెరగనున్నాయి. ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటికే బొగ్గు తవ్వగా ఏర్పడిన ఖాళీ సంపుల్లో నీటి శాతాన్ని పెంచాలని, తద్వారా సమీప ప్రాంతాల్లో వాటర్ టేబుల్ (నీటిఫలకం)ను వృద్ధి చేయాలని నిర్ణయించారు. ఓపెన్‌కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ డంపుల మధ్య ఏర్పడే లోతట్టు ఖాళీ ప్రదేశాలను ఇకపై చిన్నపాటి నీటి తటాకాలుగా తీర్చిదిద్దాలని యోచిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ సూచన మేరకు సింగరేణి పర్యావరణ హిత పథకాన్ని అమలు చేయటానికి ప్రణాళికలు సిద్ధం చేసింది.

పూర్తయిన ప్రణాళికలు

అన్ని ఏరియాల్లో ప్రణాళికలు పూర్తయ్యాయి. కొన్ని ఏరియాల్లో పనులు ప్రారంభించాం. ఒక్కో ఏరియాకు ఐదుకు తగ్గకుండా వాటర్ స్టోరేజీ ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నాం. ఎస్టీపీపీ ద్వారా ఐదు ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నాం. సమీప గ్రామాల్లో చెరువుల పూడికతీత పనులు చేపడతాం. అవసరమైన చోట బడ్జెట్ కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తున్నాం.

– సైదులు, నోడల్ అధికారి, కార్పొరేట్ జీఎం

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం



పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. వీటి కోసం సీఎస్ఆర్, మైనింగ్ నిధులు కేటాయించాం. 11 ఏరియాల్లో వాటర్ స్టోరేజీ ట్యాంకులు నిర్మిస్తున్నాం. దీని ద్వారా వేసవిలో నీటి కొరత తీరడంతో పాటు సమీప గ్రామాల్లో గ్రౌండ్‌వాటర్ పెరుగుతుంది. సంస్థ వ్యాప్తంగా నోడల్ అధికారిని నియమించాం. పనులు శరవేగంగా సాగుతున్నాయి.

– ఎస్.బలరాం, సంస్థ సీఎండీ

మరమ్మతులతో యూరియా కొరత?

ఏడు రాష్ట్రాలపై ప్రభావం

సీజన్‌కు ముందు ప్లాంట్ షట్‌డౌన్


ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారం

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఎరువుల కర్మాగారంలో 6 రోజులుగా వార్షిక మరమ్మతులు కొనసాగుతున్నాయి. దీంతో సుమారు 45 రోజుల పాటు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడనుంది. తెలంగాణలో వ్యవసాయ విస్తీర్ణం పెరిగింది. జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు రాష్ట్రానికి చేరడంతో తొలకరి జల్లులు కురుస్తాయి. రైతులు వరి నార్లు పోసి ఖరీఫ్ సీజన్ పనులు ప్రారంభిస్తారు. జూన్ మొదటి వారం నుంచి యూరియాకు డిమాండ్ ఉంటుంది. మరమ్మతులు ఆలస్యమైతే ఆ ప్రభావం సాగుపై పడే అవకాశాలు ఉన్నాయి. రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్లాంట్ సామర్థ్యం రోజుకు 3,850 మెట్రిక్ టన్నుల యూరియా, 2,200 మెట్రిక్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి కాగా, తెలంగాణతోపాటు ఆరు రాష్ట్రాలకు యూరియా సరఫరా చేయడంలో కీలకపాత్ర పోషిస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 11,94,921.17 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేసింది.

2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ రాష్ట్రాలకు కేటాయించిన యూరియా

రాష్ట్రం	మెట్రిక్ టన్నులు
తెలంగాణ	4,68,954.76
ఆంధ్రప్రదేశ్	1,78,363.39
కర్ణాటక	1,91,288.07
మహారాష్ట్ర	82,986.39
ఛత్తీస్‌గఢ్	60,640.38
తమిళనాడు	1,01,520.99
మధ్యప్రదేశ్	1,11,167.19

2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో ఉత్పత్తి అయిన యూరియా, కేటాయింపు ఇలా

రాష్ట్రం	మెట్రిక్ టన్నులు
తెలంగాణ	39,852.27
ఆంధ్రప్రదేశ్	21,120.12
కర్ణాటక	19,450.71
మహారాష్ట్ర	9,051.48
ఛత్తీస్‌గఢ్	5,259.06
తమిళనాడు	7,837.64
మధ్యప్రదేశ్	5,435.64

కార్మికుల పక్షపాతి నాయిని నర్సింహారెడ్డి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణ తొలి హోంమంత్రి, దివంగత నాయకుడు నాయిని నర్సింహారెడ్డి కార్మిక పక్షపాతి అని, కార్మిక సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేశారని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నాయిని నర్సింహారెడ్డి 85వ జయంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కేసీఆర్ సూచన మేరకు ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో నిర్మించిన స్టీల్ బ్రిడ్జికి నాయిని నర్సింహారెడ్డి పేరు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు.

రామప్ప దేవాలయం, సరస్సు విధ్వంసం చేసే కుట్ర

– మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: యునెస్కో గుర్తింపు పొందిన కాకతీయ కళా సంపద రామప్ప దేవాలయం, రామప్ప సరస్సును విధ్వంసం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. దీన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామప్ప పరిధిలో ఐదు కిలోమీటర్ల మేర ఎలాంటి ఓపెన్ కాస్టు చేయకూడదని నిబంధనలున్నా.. ఇటీవల సర్వే నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రామప్ప పరిసరాల్లో బొగ్గు మైనింగ్ గురించి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదన తెస్తే తీవ్రంగా వ్యతిరేకించారని సుదర్శన్‌రెడ్డి గుర్తుచేశారు. అక్కడ ఓపెన్ కాస్టు మైనింగ్ చేస్తే దేవాలయం విధ్వంసానికి గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు.

తాగునీరు వృథా.. గేదెకు ఉపశమనం




బీబీపేట: వేసవి తాపానికి పశువులు అల్లాడిపోతున్నాయి. నీటి తడులు కనిపిస్తే చాలు అక్కడికి చేరుకుంటున్నాయి. ఇదే తరహాలో మంచినీటి ట్యాంకు నుంచి వృథాగా పోతున్న నీటితో ఓ గేదె ఉపశమనం పొందుతున్న దృశ్యం 'సాక్షి'కెమెరాకు చిక్కింది. కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని తాగునీటి ట్యాంకు పూర్తిగా నిండి నీరు వృథాగా కిందకు పోతున్నాయి. మండుటెండలకు ఎక్కడి నుంచి వచ్చిందో ఓ గేదె వృథాగా పోతున్న నీటి కింద నిలబడి ఉపశమనం పొందింది. ఇదిలా ఉండగా మరోవైపు మండుటెండల్లో గుక్కెడు నీటి కోసం అవస్థలు పడుతున్న సమయంలో తాగునీరును పట్టించుకోకుండా వృథాగా వదిలేయడంపై పలువురు విమర్శిస్తున్నారు.




నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం వద్ద అందాల భామల సందడి

కారుమబ్బులు కమ్మిన వేళ



పగలంతా ఎండలు మండిపోయాయి. సాయంత్రం కాగానే వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుని ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో ఈ ఆహ్లాదకర దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.
- సాక్షి ఫొటోగ్రాఫర్ విశాఖపట్నం

మూగజీవాల విడిది





ఎండలు మండిపోతున్నాయి. మనుషులంటే గొడుగులు పట్టుకుని టోపీలు పెట్టుకుని ఎండ బారి నుంచి తప్పించుకుంటున్నారు. మూగజీవాలు మాత్రం ఇలా ప్రకృతి సాయంతో నీడను వెతుక్కుంటున్నాయి.శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం బాణాపురం పంచాయతీ పరిధిలో గుమ్మడ గ్రామం సమీపంలో చెరువు ఉంది. ఒడ్డున కాస్త నీరు మధ్యలో కొన్ని చెట్లు ఉండడంతో అది మూగజీవాలకు విడిదిలా మారింది. మండుటెండలో పక్షులు, పశువులు ఆ చెరువులో సేద తీరుతున్నాయి. - మెళియాపుట్టి

ఓహ్హోహో నాకె ముందు.. లక్ష్మీనారాయణ వంటకంబు!



రుచుల రాజ్యంలో ఆయనది ప్రత్యేక స్థానం

- ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికా వరకూ ప్రస్థానం
- ప్రత్యేకమైన రెసిపీల తయారీలో సృజన
- ఆధునిక నలభీమునిగా గుర్తింపు

తెనాలి: చల్లా లక్ష్మీనారాయణ–'ఏదో ఒక రోజు పెద్ద చెఫ్‌ని అవుతాను' అంటూ చిన్నప్పుడు అన్నప్పుడు, అందరూ నవ్వుకున్నారు. అయితే, అమ్మను తొలి గురువుగా తీసుకున్న ఆయన, పాకశాస్త్రంలో అపూర్వ శిఖరాలను అధిరోహించారు. ఆధునిక నలభీమునిగా, ప్రత్యేకమైన రెసిపీల సృష్టిలో తన ప్రతిభను చాటారు. ఆయన వంటల ప్రయాణం.. 'శ్రమ'కు 'రుచి'ని మేళవించి, ఆహారప్రియులను 'ఔరా..' అనిపించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికా వరకు ఆయన ప్రస్థానం, నిజంగా ఈ రంగంలో యువతకు ప్రేరణ. ప్రస్తుతం వీసా రెన్యువల్ కోసం భారత్‌కు వచ్చిన ఆయన స్ఫూర్తిదాయక జీవన ప్రయాణం మీ కోసం..

అదృష్టానికి తొలి మెట్లు..

లక్ష్మీనారాయణ స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి రూరల్ మండలానికి చెందిన అంగలకుదురు. తెనాలిలో డిగ్రీ పూర్తి చేసిన తర్వాత, హైదరాబాద్‌లోని ఐఐహెచ్‌ఎంలో హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా పొందారు. ఒక హోటల్‌లో ఉద్యోగంతో పాటు హోటల్ మేనేజ్‌మెంట్, టూరిజంలో పీజీ డిప్లొమా కూడా పూర్తి చేశారు. ఆపై సింగపూర్‌లో ఫుడ్ హైజీన్ కోర్సు అభ్యసించి, ముంబయిలోని బ్రిటిష్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ద్వారా హోటల్ మేనేజ్‌మెంట్, కేటరింగ్ టెక్నాలజీలో దూరవిద్య ద్వారా కోర్సు పూర్తి చేశారు. 1997లో ఆయన వృత్తి జీవితం ప్రారంభమైంది. విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో ప్రముఖ హోటళ్లలో చెఫ్‌గా సేవలందించారు. 2007–09 కాలంలో సింగపూర్‌లోని నయామి హోటల్స్‌లో చెఫ్‌గా పనిచేసి ప్రత్యేక గుర్తింపు సాధించారు. అనంతరం మైసూరు, కూర్గ్ ప్రాంతాల్లోని రిసార్ట్స్, తిరుపతిలోని ఐటీసీ హోటల్‌లో సేవలందించారు. 2014 నుంచి 2019 వరకు కాకినాడ, చెన్నై నగరాల్లోని ప్రముఖ హోటళ్లలో పనిచేశారు. శ్రమతో పాటు ప్రతిభకు గుర్తింపుగా, అదృష్టం తలుపు తట్టినట్లు 2023లో అమెరికా నుంచి ఆహ్వానం లభించింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో ప్రసిద్ధ హోటల్‌లో చెఫ్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

అవార్డులు-గుర్తింపులు

సింగపూర్‌లోని వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ చెఫ్స్ సొసైటీ, సౌత్ ఇండియన్ చెఫ్స్ అసోసియేషన్ (ఎస్ఐసీఏ), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ కలినరీ అసోసియేషన్ (ఐఎఫ్‌సీఏ), అమెరికన్ కలినరీ ఫెడరేషన్ (ఏసీఎఫ్) సభ్యత్వాలు లక్ష్మీనారాయణకు లభించాయి. ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ తిరుపతి, విశాఖపట్నం వేదికగా నిర్వహించిన వంటకాల పోటీలతో పాటు అనేక సోలో, గ్రూపు విభాగాల్లో పాల్గొని పలు ప్రతిష్టాత్మక అవార్డులను ఆయన గెలుచుకున్నారు.

ఎన్నో దేశాల వంటకాల్లో మేటిగా..

ఎన్నో దేశాల వంటకాలలో ఆయన ప్రావీణ్యం సంపాదించారు. దక్షిణ భారతీయ వంటకాలకే పరిమితం కాకుండా, థాయ్, ఇటాలియన్, మెక్సికన్ వంటి అంతర్జాతీయ వంటకాల్లోనూ తన ప్రత్యేకతను చాటుకున్నారు. నీటిపైన పెరిగే మొక్కల నుంచి తయారుచేసే ప్రత్యేకమైన 'హనీ చిల్లీ చెస్ట్ నట్స్' రెసిపీలో లక్ష్మీనారాయణ సిద్ధహస్తులు. ఆయన తయారుచేసే మరో ప్రసిద్ధ వంటకం 'చిల్లీ తోఫు' కూడా ఎంతో ఆదరణ పొందింది. నాన్ వెజిటేరియన్ వంటకాల విషయంలో, మటన్ కర్రీతో దోపెలా స్టీమ్ చేసి వడ్డించే ప్రత్యేకమైన 'మటన్ మొప్పాస్', మంగళూరు శైలిలో 'ఘీ రోస్ట్ ప్రాన్స్', ఆంధ్ర ప్రత్యేకత అయిన 'నాటుకోడి-రాగిముద్ద', అరుదైన 'జాక్‌ఫ్రూట్ బిర్యానీ', మసాలా రుచులతో నిండిన 'గుంటూరు మటన్ ఫ్రై బిట్ బిర్యానీ'లు ఆయనకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయి.

యువతకు 'సాఫ్ట్‌వేర్' ఒక్కటే మార్గం కాదు...

నేటి యువతకు 'సాఫ్ట్‌వేర్ ఉద్యోగం' ఒక్కటే మార్గం కాదు. హోటల్, టూరిజం వంటి రంగాలలోనూ అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయి. నా వృత్తి విషయానికి వస్తే, ప్రతి దేశం నాకు ఒక కొత్త పాఠం, ప్రతి వంటకం ఒక కొత్త సవాలు. ఇన్నేళ్ల ప్రయాణంలో అనుభవించిన అవమానాలు, ఒంటరితనం, సుదీర్ఘమైన పనిగంటలు– ఇవన్నీ నా ఎదుగుదలకు బలమైన మూల స్తంభాలయ్యాయి. వంటకాలు తయారుచేయడం మాత్రమే కాదు, వాటిలో మనసు కలపాలి. పదార్థాలకు భావాలను మేళవించినప్పుడే వంటకానికి ప్రాణం వస్తుంది. – చల్లా లక్ష్మీనారాయణ

క్లుప్తంగా...

శ్రీశైలం డ్యాంను సందర్శించిన సీడీవో బృందం



శ్రీశైలం డ్యాం పరిసరాలను పరిశీలిస్తున్న బృందం

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాంను సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్(సీడీవో) బృందం సోమవారం పరిశీలించింది. ప్లంజ్‌పూల్ ప్రాంతంలో ఏర్పడిన గోతులపై అధ్యయనం చేయాలంటే, ఆ ప్రాంతానికి వెళ్లడానికి అనువైన అప్రోచ్ రోడ్ నిర్మాణం, 904 అడుగుల ఎత్తులో కొండకు షార్ట్‌క్రీటింగ్, డ్యాం ముందు భాగంలో దెబ్బతిన్న కాంక్రీట్ సిలిండర్లను అత్యవసరంగా పటిష్టం చేయాల్సి ఉందని సీడీవో చీఫ్ ఇంజనీర్ విజయభాస్కర్ తెలిపారు. ఈ పనులకు అవసరమైన డిజైన్లు రూపొందించడానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో నిర్వహించిన అండర్ వాటర్ వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ ఆధారంగా డ్యాం పునాదులకు ముందు, ప్లంజ్‌పూల్ ప్రాంతం వెనుక ఉన్న కాంక్రీట్ సిలిండర్లు దెబ్బతిన్నట్లు నిర్ధారించామన్నారు. డ్యాం ముందు నిర్మించిన 62 సిలిండర్లలో 12 సిలిండర్లు పూర్తిగా, 8 సిలిండర్లు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. సిలిండర్ల పటిష్టతకు తక్షణమే ట్రెమీ కాంక్రీట్ చేయాల్సి ఉందని విజయభాస్కర్ తెలిపారు. సీడీవో బృందంతో పాటు డ్యాం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి, ఈఈ వేణుగోపాల్‌రెడ్డి, ఇంజనీర్లు మోహన్, మల్లికార్జున, శ్యామ్యూల్ విజయ్ పరిశీలనలో పాల్గొన్నారు.

కాలువల తవ్వకం మే నెలాఖరుకు పూర్తి చేయాలి

- జలవనరుల మంత్రి రామానాయుడు



సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా కాలువల్లో పూడిక తీత, గుర్రపుడెక్క, తూటి కాడ తొలగింపు, షట్టర్లు,, గేట్ల మరమత్తులు, గ్రీజు పెట్టడంవంటి నిర్వహణ పనుల కోసం ఇటీవల రూ.344 కోట్లు విడుదల చేశామని, ఈ పనులను స్వీయ పర్యవేక్షణ చేస్తూ, మే చివరి నాటికి పూర్తి చేయాలని జలవనరుల శాఖ మంత్రి ఎస్.రామానాయుడు అధికారులను ఆదేశించారు సోమవారం విజయవాడలో జలవనరుల క్యాంపు కార్యాలయం నుండి సీఈలు, ఎస్ఈలతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, కడా కమీషనర్ రాంసుందర్ రెడ్డి, ఈఎన్సీ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. గుర్రపుడెక్క, తూటికాడ వంటి వాటి తొలగింపుకోసం, మందుల పిచికారీకి డ్రోన్లు వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైన చోట్ల ఏడు రోజుల వ్యవధిలో షార్ట్ టెండర్లు పిలవడానికి అనుమతిచ్చినట్లు మంత్రి తెలిపారు. గేట్లు, షట్టర్లు, వంటి మెకానికల్ పనులను తప్పనిసరిగా అసిస్టెంట్ ఇంజనీర్ పరిశీలించి, సక్రమంగా పనిచేసే స్థితిలో ఉన్నాయనే ధ్రువీకరణ పత్రాన్ని, చీఫ్ ఇంజనీర్‌కు ఇవ్వాలని ఆదేశించారు.

ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు ఏర్పాటు

సాక్షి, అమరావతి: ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ రూల్స్, 2025 ప్రకారం ఈ బోర్డులో పది మంది సభ్యులుంటారని తెలిపింది. వీరిలో చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్(డైరెక్టర్ ఆఫ్ ఎలక్ట్రికల్ సేఫ్టీ), ఏపీ ట్రాన్స్‌కో నుంచి సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) స్థాయి అధికారి, విజయవాడ, తిరుపతిలోని డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్లు, సాంకేతిక విద్యాశాఖ నుంచి జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారి, మైన్స్ నుంచి ఒకరు, ఆర్ అండ్ బీ నుంచి ఇంజనీర్, గుంటూరు ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్, విద్యుత్ వినియోగదారుడు ఒకరు సభ్యులుగా నియమించాలని చెప్పింది. అయితే వీరితో పాటు ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నుంచి ఇద్దరికి స్థానం కల్పించింది. వీరిలో ఒకరు ఏ గ్రేడ్ కాంట్రాక్టర్స్, మరొకరు బి – గ్రేడ్ కాంట్రాక్టర్స్ నుంచి ఉండాలని సూచించింది.ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరోగ్య సంరక్షణలో నర్సుల కృషి అమోఘం

మంత్రి సత్యకుమార్ యాదవ్



అవార్డులు అందుకున్నవారితో మంత్రి సత్యకుమార్

సాక్షి, అమరావతి/భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఆరోగ్య సంరక్షణలో నర్సుల కృషి అమోఘమని వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా సోమవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన 'ఫ్లోరెన్స్ నైటింగేల్' అవార్డుల ప్రదానం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నర్సింగ్ రంగంలో సేవల్ని ప్రోత్సహించేందుకు భవిష్యత్‌లోనూ ఈ అవార్డుల ప్రదానం కొనసాగిస్తామని తెలిపారు. విశాఖ ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎం.సత్యవల్లి, విశాఖ అమెరికన్ ఎన్ఆర్ఐ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ సిబా ఫ్రాన్సిస్, రేణిగుంట పీహెచ్‌సీ ఎంపీహెచ్‌డబ్ల్యూ పి.రోహిణి, జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రి స్టాఫ్ నర్సు ఎం.నిరీక్షణా కుమారి, తిరుపతి పద్మావతి నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ బి.గంగాభవాని నైటింగేల్ అవార్డులు అందుకున్నారు.

కర్ణాటకలో కారును ఢీకొన్న లారీ

ముగ్గురు గుంటూరు జిల్లా వాసుల మృతి



సాక్షి, బళ్లారి: కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వెంగళాయపాలెం గ్రామానికి చెందిన సునీత (34), శ్యాంబాబు (19), శివనాగ (60) అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు కారులో శివమొగ్గ వెళుతుండగా, జాతీయ రహదారిపై హొళల్కెరె సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నర్సుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తా

సాక్షి, అమరావతి: పిఠాపురం నియోజకవర్గ ప్రభుత్వ స్టాఫ్ నర్సులతో సోమవారం మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ సమావేశమయ్యారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా 8 మంది స్టాఫ్ నర్సులను ఆయన సత్కరించారు. నర్సుల సమస్యలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్తానని పవన్ తెలిపారు.

ఏనుగుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించండి

సాక్షి, అమరావతి: తిరుపతి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని పంటలకు, ప్రజలకు ఏనుగుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ డిప్యూటీ సీఎం పవన్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం లేఖ రాశారు. ఏనుగుల వల్ల 16 మంది ప్రాణాలు కోల్పోయారని, వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు. ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని, నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

హేతుబద్ధీకరణ సమస్యలు పరిష్కరించాలి: ఏపీటీఎఫ్

సాక్షి, అమరావతి: పాఠశాలల హేతుబద్ధీకరణను ఇష్టానుసారంగా మార్చి ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 117 జీవో రద్దు పేరుతో పాఠశాలలను ప్రయోగశాలలుగా చేయడం తగదన్నారు. అసంబద్ధ విధానాలపై ఉత్తర్వులు వెలువడక ముందే విద్యాశాఖ మంత్రి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి సరైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో చర్చించిన అంశాలను మార్గదర్శకాలుగా ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఒక్క పోస్టును కూడా బ్లాక్ చేయబోమని హామీ ఇచ్చి, మార్గదర్శకాల్లో పోస్టులను బ్లాక్ చేస్తుండడాన్ని తప్పుబట్టారు. అసంబద్ధ విధానాలతో కొంత మంది రెండు, మూడుసార్లు రేషనలైజేషన్‌కు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక వైపు ఏకీకృత సర్వీస్ రూల్స్ కోసం ప్రయత్నం చేస్తూనే ఉపాధ్యాయులను యాజమాన్యాల వారీగా విభజించడం సరైంది కాదన్నారు. ఉపాధ్యాయ బదిలీల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం కల్పించాలని కోరినా పట్టించుకోకపోవడంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. ఇప్పుడు వారి స్థానాలను ఖాళీలుగా చూపకపోవడంతో ఆ ప్రభావం ఇతర ఉపాధ్యాయులపై పడుతోందన్నారు.

బదిలీల్లో ఎనిమిదేళ్ల స్టేషన్ పాయింట్లు కేటాయించాలి: ఎపీఎస్టీఏ

ఒకే పాఠశాలలో ఎనిమిదేళ్లు పూర్తి కాకుండానే వారిని తప్పనిసరిగా బదిలీ చేస్తున్నప్పుడు వారికి ఎనిమిదేళ్ల స్టేషన్ పాయింట్లు ఇవ్వాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2017లో బదిలీ అయిన ఉపాధ్యాయులకు వచ్చే ఆగస్టుకు ఎనిమిదేళ్లు పూర్తవుతాయని, వారిని తప్పనిసరి బదిలీల్లో చేర్చారన్నారు. వారికి ఎనిమిదేళ్ల పూర్తి పాయింట్లు కేటాయించాలన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో ఎనిమిదేళ్లకు పూర్తి స్టేషన్ పాయింట్లు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రేషనలైజేషన్‌కు గురయ్యే ఉపాధ్యాయులకు పాత స్టేషన్, కొత్త స్టేషన్, రేషనలైజేషన్ పాయింట్లు అనేది లేకుండా వారందరికీ ఎనిమిదేళ్ల పాయింట్లు కేటాయిస్తేనే అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు.

పొగాకు రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వానిదే బాధ్యత

ఏపీ రైతు, కౌలురైతు సంఘాల నేతలు ఆగ్రహం

సాక్షి, అమరావతి: నల్ల బర్లీ పొగాకు సాగు చేసిన రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కేవీవీ ప్రసాద్, పి.జమలయ్య సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎలాంటి జాప్యం లేకుండా గతేడాది చెల్లించిన ధరలకే నల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని ఏప్రిల్ 29న గుంటూరు లాంలో జరిగిన సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పొగాకు కంపెనీల ప్రతినిధులను ఆదేశించినా ఒక్కరూ ముందుకురావడం లేదన్నారు. దీంతో పొగాకు కొనేవారు లేక, అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచక మానసిక వేదనకు గురై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. నల్ల బర్లీ పొగాకు కొనుగోలులో జాప్యాన్ని నివారించాలని 14వ తేదీన గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రైతు నాయకులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తారని పేర్కొన్నారు.

పట్టణాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

సాక్షి, అమరావతి: పట్టణాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని.. వర్షాకాలంలోగా కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలని అధికారులను మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లతో ఆయన సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతి, విశాఖ, గుంటూరులో టీడీఆర్ బాండ్ల జారీని వేగవంతం చేయాలని సూచించారు. అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యతను పరీక్షించాలని ఆదేశించారు. పన్నుల వసూళ్లలో అలసత్వం వద్దని.. ఆదాయంపై దృష్టి సారించాలని సూచించారు. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు వేగవంతం చేయాలన్నారు.

మద్యం మత్తులో యువకుడి హత్య

కాళ్ల: మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో యువకుడు హత్యకు గురైన ఘటన పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం ఎల్ఎన్ పురం గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు సోమవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా కోమటిలంకకు చెందిన చెన్నకేశవ అరవింద్(22), ప్రత్తికోళ్లలంకకు చెందిన బండి జాన్ యేసు ఇద్దరూ బంధువులు. కొంతకాలం క్రితం కాళ్ళ మండలం ఎల్ఎన్ పురం గ్రామంలోని చెరువుల వద్దకు జీవనోపాధి నిమిత్తం వచ్చారు. వీరు పనిచేసే చెరువుల వద్ద కిరణ్ అనే వ్యక్తి పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి వీరు ముగ్గురూ పనిచేస్తున్న చెరువు వద్ద మద్యం తాగారు. మద్యం మత్తులో బంధువులైన జాన్ యేసు, అరవింద్ ఘర్షణకు దిగారు. అనంతరం జరిగిన దాడిలో జాన్ యేసు మేత బస్తాలపై ఉన్న చాకుతో అరవింద్ ఛాతీపై పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో పడిపోయిన అరవింద్‌ని పక్కనే ఉన్న కిరణ్ వేరే వ్యక్తి సహాయంతో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు.

మురళీనాయక్ స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలి

ప్రభుత్వానికి సీపీఐ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: దేశం కోసం అమరుడైన వీర జవాన్ మురళీ నాయక్ పేరుతో స్మారక చిహ్నం, స్మారక అవార్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆయన సోమవారం లేఖ రాశారు. శ్రీసత్యసాయి జిల్లాలోని కల్లి తండాకు మురళీ నాయక్ పేరు పెట్టాలని రామకృష్ణ కోరారు.

మాజీ ఎంపీ దరూర్ మృతిపై సంతాపం

అనంతపురం మాజీ ఎంపీ దరూర్ పుల్లయ్య మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సంతాపం తెలిపారు. అనంతపురం జిల్లాకు తాగునీరు, హంద్రీ-నీవా ప్రాజెక్టు సాధన కోసం, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఆయన విశేష కృషి చేశారని గుర్తు చేశారు.

16,18న తిరంగా ర్యాలీలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

సాక్షి, అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, భారత సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. సోమవారం ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా బీజేపీ శ్రేణులతో మాట్లాడుతూ ఈ నెల 16న జిల్లా కేంద్రాల్లో, 18న మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని సూచించారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా శైలజ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా రాయపాటి శైలజను ప్రభుత్వం నియమించింది. ఆమె రెండేళ్లపాటు ఆ పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి: పూటుగా మద్యం తాగిన ఓ వ్యక్తి గొంతెండి మృతి చెందిన సంఘటన సోమవారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయ నాలుగో గేటు సమీపంలో ఉన్న మణికంఠేశ్వర స్వామి ఆలయం వద్ద చోటు చేసుకుంది. సత్యవేడు మండలం పాలగుంట గ్రామానికి చెందిన రాధాకృష్ణ(41) శ్రీకాళహస్తీశ్వరాలయం వద్దకు వచ్చాడు. పూటుగా మద్యం తాగడంతో ఆ మత్తులో మణికంఠేశ్వర స్వామి ఆలయం వద్ద నిద్రించాడు. గొంతెండడంతో నిద్రలోనే మృతిచెందాడు.

● హెల్దీ హోమ్

ఇంటి 'గుట్టు' వంటికి చేటు



వాస్తవానికి ఇల్లు అనగానే అక్కడ మనకే భయాలూ ఉండవని ఫీలవుతాం. మన ఇంటిని మనం టేకెన్ ఫర్ గ్రాంటెడ్‌గా తీసుకుంటాం. అక్కడ నిర్భయంగా ఫీలవుతూ హాయిగా ఉంటాం. కానీ అక్కడా మనకు అడుగడుగునా అపాయాలు పొంచి ఉంటాయి. అది సోఫాలో కావచ్చు. కర్టెన్ల వెనకాల కావచ్చు. డైనింగ్ టేబుల్‌ను తుడిచే స్పాంజి కావచ్చు. ఇక్కడా, అక్కడా అని కాకుండా మన ఇంట్లోనే ప్రతిచోటా ముప్పులెలా పొంచి ఉంటాయో, వాటిని తెలుసుకుని మనమెలా జాగ్రత్తపడాలో చూద్దాం...

ఇంట్లో ఉన్నవన్నీ మన ఉపయోగానికి అనుకుంటాం. మనకు ఉపయోగపడుతున్నాయని మనం భావించే అవన్నీ మనకు ఎలాంటి కీడు చేస్తున్నాయో తెలుసుకుందాం.

ప్లాస్టిక్ అనేది ఓ అందమైన విషం...

చాలామంది డైనింగ్ టేబుల్స్ మీద ఉండే డిన్నర్‌సెట్‌ల తాలూకు సూప్ బౌల్స్, కూరలు వడ్డించడానికి వాడే ప్లాస్టిక్ గిన్నెలన్నీ పైకి కనిపించేటంతటి అందమైనవి కావు. నిజానికి ఇవన్నీ 'మెలామైన్' అనే ఒక రకం ప్లాస్టిక్ పదార్థంతో తయారవుతాయి. ఇందులోకి వేడి వేడి కూరలు, పులుసులు తీయగానే వేడికి ఆహారంతో పాటు ఆ మెలామైన్ అనే ప్లాస్టిక్ కూడా నోటి ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుంది.

'జామా ఇంటర్నల్ మెడిసిన్' జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయన నివేదిక ప్రకారం దేహంలోకి వెళ్లిన మెలామైన్ కారణంగా కిడ్నీలో రాళ్లు వస్తాయని తేలింది. గతంలో జరిగిన ఈ అధ్యయనంలో భాగంగా... కొంతమంది వాలంటీర్లకు మెలామైన్ బౌల్స్‌లో నూడుల్స్ ఇచ్చారు. మరికొందరికి పింగాణీ బౌల్స్‌లో అదే పదార్థాన్ని వడ్డించారు. నిర్ణీత కాలవ్యవధి తర్వాత ఈ రెండు గ్రూపుల వారికి నిర్వహించిన మూత్ర పరీక్షల్లో మెలామైన్ బౌల్స్‌లో తిన్నవారి మూత్రంలో మెలామైన్ మోతాదులు దాదాపు ఎనిమిది రెట్లు ఎక్కువనీ, దాంతో కిడ్నీఫెయిల్యూర్ అవకాశాలూ ఎక్కువని తేలింది. క్యాన్సర్ ముప్పు కూడా ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు చెబుతున్నాయి.

మైక్రోవేవ్ ఓవెల్‌లో ఉంచి వేడి చెయవద్దు

వడ్డించడానికి మెలామైన్ బౌల్‌లోకి పులుసునో, కూరనో తీశాక... ఇక అందులోని పదార్థాన్ని వేడి చేయడం కోసం ఆ బౌల్‌ను మైక్రోవేవ్ ఒవెన్‌లో ఉంచి వేడి చేయకూడదని అమెరికన్ ప్రమాణాల సంస్థ ఎఫ్‌డీఏ గట్టిగా చెబుతోంది. ఈ ప్లాస్టిక్ బౌల్స్‌లో ఉంచుకుని వేడి వేడి ఆహారం తింటే అది హార్మోన్లపై... మరీ ముఖ్యంగా మహిళల్లోని ఈస్ట్రోజెన్ స్రావంపై దాని దుష్ప్రభావం ఉంటుందని పేర్కొంది. ఫలితంగా ప్రత్యుత్పత్తికి తోడ్పడే హార్మోన్ల సమతౌల్యంతో తేడాలు వచ్చి గర్భధారణ సమస్యలు రావచ్చు. పురుషుల్లో వీర్యకణాల సంఖ్య, కదలికలు తగ్గడం, పురుష సంబంధ హార్మోన్ల స్రావం తగ్గుతాయంటున్నారు. ఇలాంటి బౌల్స్‌లో తినే చాలామందిలో డయాబెటిస్ రిస్క్ పెరుగుతున్నట్లుగా మరో అధ్యయనంలో తేలింది.

అనేక ముప్పుల పుట్ట ఆ మెలామైన్ బౌల్



స్థూలకాయం వస్తున్న వారి సంఖ్య బాగా పెరుగుతోంది. దీంతో రొమ్ము క్యాన్సర్ వంటి క్యాన్సర్ రిస్కులు చాలా ఎక్కువ. ప్లాస్టిక్ బౌల్స్‌లో వేడి వేడి ఆహారం పెట్టుకుని తీసుకునేవారిలో మెదడు కణాలు బలహీనమైపోయి జ్ఞాపకశక్తి తగ్గే ముప్పు ఉందనీ, అలాగే వెంటవెంటనే మూడ్స్ మారిపోవడం వంటి సమస్యలు వస్తున్నట్లు కూడా గుర్తించారు. ఫలితంగా అల్జైమర్స్ వంటి నాడీసంబంధమైన సమస్యలూ పెరుగుతున్నాయంటూ అనేక అధ్యయనాల్లో తేలింది.

పరిష్కారమిది

వేడివేడి సూప్‌లను వడ్డించాలనుకుంటే పింగాణీ బౌల్స్ లేదా పింగాణీ ప్లేట్లే ఆరోగ్యదాయకం. గాజు బౌల్స్ లేదా గాజు ప్లేట్లు కూడా వాడుకోవచ్చు.

నల్లాల్లోంచి ఈ-కొలై...



దీర్ఘకాలం పాటు నిల్వ ఉండే నీళ్లు... కొళాయి (నల్లా/పంపు) నుంచి వస్తున్నప్పుడు అందులో ఆ నీళ్లతో పాటు 'ఈ-కొలై' (ఎష్చరీషియా కొలై) అనే ఏకకణ పరాన్న జీవులూ రావచ్చు. ఎందుకంటే అవి నిల్వ ఉండే నీళ్లలో పెరిగి, ఆ నీళ్లను కలుషితం చేస్తాయి. ఈ నీటితో ఆహారాలను కడిగినప్పుడూ లేదా ఆహారం తింటున్నప్పుడు... కలుషితమైన ఆ నీళ్లను తాగినప్పుడు 'ఈ-కొలై' సూక్ష్మజీవులు ఒంట్లోకి ప్రవేశించే అవకాశముంది. దాంతో నీళ్ల విరేచనాల వంటి ప్రమాదముంది. నిజానికి ఆ నీళ్లతో వంట చేసే సమయంలో మరిగించినప్పుడు ఈ-కొలై నశించిపోవచ్చు. కానీ నీళ్లను మరిగించకుండా వాడే 'పానీపూరీ/ గప్‌చుప్ / గోల్‌గప్పా' వంటి వాటిల్లో... ఈ-కొలై ఉన్న నీటిని ఉపయోగిస్తే నీళ్ల విరేచనాల ముప్పు తప్పదు. పైగా దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు అక్కడ ఇలాంటి ఈ-కొలై ఉన్న నీళ్లను వాడితే ఆరోగ్య సమస్యలతో పాటు ఇంటికి దూరంగా ఉన్నప్పుడు ఇతరత్రా అనేక ఇతర సమస్యలతోనూ ఉక్కిరిబిక్కిరి అయ్యే అవకాశముంటుంది.

పరిష్కారమిది

ఇంటికి దూరంగా దూరప్రాంతాల్లో ప్రయాణాలు చేస్తున్నవారు మరిగించకుండా తయారు చేసే ఆహారాలనూ లేదా వేడిగా లేని ఆహారాన్ని తీసుకోకపోవడమే మంచిది

కర్టెయిన్‌లతో కల్లోలాలిలా...



గతంలో మన ఇళ్లలో బట్టతో నేసిన కర్టెయిన్లు ఉండేవి. మాసిపోగానే ఉతుక్కునేందుకు వీలుగా ఉండేవి. కొద్దికాలంలో పాడైపోతే మళ్లీ కొత్త కర్టెయిన్‌లు తెచ్చుకోవాల్సి వచ్చేది. ఆ తర్వాత బట్టలతో చేసిన కర్టెయిన్లు కాకుండా మరింత కాలం మన్నడానికి ప్లాస్టిక్ వంటి పదార్థంతో రూపొందించిన కర్టెయిన్లను వాడటం మొదలు పెట్టాం. అవి కాల ప్రభావానికి లోనై పాడైపోకుండా చాలాకాలం మన్నికతో ఉంటాయని ఆశపడ్డాం. ఇక బాత్‌రూమ్‌ల విషయానికి వస్తే... అక్కడ నీళ్లతో తడిసి పాడైపోకుండా ఉండటం కోసం, అలాగే షవర్ కర్టెయిన్లుగా పిలిచే వాటర్‌ప్రూఫ్ మెటీరియల్‌తో తయారైనవే ఎక్కువగా వాడుతున్నాం.

'థాలేట్' అనే పదార్థంతో తయారయ్యే ఈ ప్లాస్టిక్ కర్టెయిన్లు ఎటు పడితే అటు వంగేందుకు ఎలా పడితే అలా వంచేందుకు వీలుగా రూపొందుతాయి. ఈ షవర్ కర్టెయిన్లే కాకుండా, ఇండ్లలో అలంకరణ కోసం ఉపయోగించే వాల్‌పేపర్లు, ఫ్లెక్సీలు కూడా ఈ థాలేట్ అనే పదార్థంతోనే తయారవుతాయి. ఈ థాలేట్ అనే పదార్థంతో తయారయ్యే అన్ని రకాల ఉత్పాదనలు పురుష సెక్స్ హార్మోన్స్‌పై దుష్ప్రభావం చూపుతాయని అనేక అధ్యయనాల్లో తేలింది. అంతేకాదు వీటి వల్ల వీర్యం క్వాలిటీ దెబ్బతింటుందని కూడా నిర్ద్వంద్వంగా తేలింది. ఈ తరహా ప్లాస్టిక్‌తో తయారయ్యే ఉత్పాదనల మీది నుంచి వచ్చే గాలి పీల్చడం కారణంగా అలర్జీలు, శ్వాస సంబంధ సమస్యలు ఉత్పన్నం కావడం జరగవచ్చు. ఆస్తమా, పిల్లికూతల వంటి లక్షణాలు కనిపించవచ్చు.ఇళ్లలో గర్భవతులు ఉంటే అది వారికి మరీ ప్రమాదం. ఇవి ఉపయోగించడం అంటే... ఇళ్లను అందంగా చేసి, ఆ ఇండ్లలో పుట్టి పెరగబోయే పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే. ఎందుకంటే ఇలాంటివి ఉపయోగించే ఇళ్లలో పెరిగే పిల్లల్లో అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివ్ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) వంటివి కనిపించే అవకాశాలు ఎక్కువ. మరీ ముఖ్యంగా నాలుగు నుంచి తొమ్మిదేళ్ల పిల్లల్లో ఈ ధోరణులు మరింత ఎక్కువగా పెరిగే అవకాశాలు ఎక్కువని మౌంట్ సినాయ్ మెడికల్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశోధనల ఫలితాలు తెలుపుతున్నాయి.

పరిష్కారమిది

ఇంట్లో డోర్ కర్టెయిన్లు, షవర్ కర్టెయిన్లు కేవలం నేసిన బట్టతో తయారైన నిరపాయకరమైన కర్టెయిన్లనే వాడాలి. అలంకరణ కోసం అమర్చేవీ, ఫర్నిచర్‌లు... ప్లాస్టిక్ లేదా పీవీసీతో తయారు చేసిన వాటి కంటే కలపతో చేసినవే మంచివని గుర్తుంచుకోవాలి.

సోఫాలో కూర్చుండే విషాలూ అనేకం...

ఇటీవల ఆధునికమైన ఇంటి ఫర్నిచర్‌తో పాటు కొన్ని రకాల సోఫాల వంటి వాటిని నిప్పు అంటుకోకుండా ఉండేందుకు వాటిని ఫైర్ రెసిస్టెంట్ పదార్థాలతో తయారు చేస్తున్నారు. ఈ ఫైర్ రెసిస్టెంట్ రసాయనాలను 'ఫ్లేమ్ రిటార్డెంట్స్' అంటారు. మనం ఈ ఫర్నిచర్‌తో పాటు సోఫాలపై చేతులు ఉంచినప్పుడు ఈ రసాయనాలూ చేతులపైకి చేరతాయి. ఆ చేతులతోనే మనం ఏవైనా ఆహారపదార్థాలను తిన్నప్పుడు అవి నోటి ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తాయి.

ఇలాంటి విషపదార్థాలన్నీ మన వినాళ గ్రంథుల వ్యవస్థ (ఎండోక్రైన్ సిస్టమ్)ను దెబ్బ తీస్తాయి. దాంతో మన గ్రంథుల నుంచి స్రవించే అనేక ఎంజైముల, అలాగే జీవరసాయనాల సమతౌల్యం దెబ్బతినడానికి అవకాశముంది. దాంతో మన ప్రత్యుత్పత్తి వ్యవస్థ మీద వాటి తాలూకు దుష్ప్రభావం పడే అవకాశం ఉంది. దాంతో కొన్ని రకాల ప్రత్యుత్పత్తి సంబంధిత వ్యాధులూ (రీప్రొడక్టివ్ డిజార్డర్స్) రావచ్చు. ఒక్కోసారి కొన్ని క్యాన్సర్లు వచ్చేందుకూ అవకాశముంది.

పరిష్కారమిది : సోఫాలను క్రమం తప్పకుండా వాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రపరుచుకుంటూ ఉండాలి. ఇలా శుభ్రపరిచే సమయంలో ఎయిర్ ఫిల్టర్ ఉపయోగించడం మరింత శ్రేయస్కరం.



సోఫా మీద కూర్చున్న తర్వాత ఏదైనా తినాల్సి వస్తే... చేతులు శుభ్రంగా కడుక్కోవడం, తినే ముందు నోటిని నీళ్లతో పుక్కిలించడం అవసరం. (ఇది సోఫాలోని విష రసాయనాలనుంచే కాకుండా, ఈ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల ఇతరత్రా జబ్బులు వచ్చే అవకాశాలూ తగ్గుతాయి).





డాక్టర్ కె. శివరాజు
సీనియర్ ఫిజీషియన్

ప్లాస్టికే కాదు... 'నాన్‌స్టిక్' కూడా...

ఈమధ్యకాలంలో వంట చేస్తున్నప్పుడు పదార్థాలు ఆ పాత్రల అడుగు భాగాన అంటుకుపోకుండా ఉండే గిన్నెలు, పెనం వంటివాటిని ఉపయోగించేందుకు గృహిణులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఇలా అడుగున అంటకుండా ఉండే వంట పాత్రలను 'నాన్‌స్టిక్ కుక్‌వేర్' అంటారన్న విషయం తెలిసిందే. పాత్రలు శుభ్రపరచుకునేటప్పుడు ఈ తరహా వంట సామగ్రి, గిన్నెలు కడగడానికి వీలుగా, సౌకర్యంగా తేలిగ్గా కడగడానికి వీలుగా ఉంటాయి. దాంతో ఈ తరహా నాన్‌స్టిక్ వంటపాత్రలకు డిమాండ్ పెరుగుతోంది.

కానీ నాన్‌స్టిక్ కుక్‌వేర్‌లో వండిన ఆహారం అంత ఆరోగ్యకరమైనది కాదని అనేక అధ్యయనాల్లో తేలింది. ఇలాంటి వంటపాత్రలను ఉపయోగించడం వల్ల ఆ వంటలను తిన్న పిల్లలకు భవిష్యత్తులో స్థూలకాయం, డయాబెటిస్ వంటివి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువని తేలింది. అంతేకాదు... ఈ వంటపాత్రల్లో వండిన ఆహారం తిన్నవారిలో దీర్ఘకాలంలో హార్మోన్లకు సంబంధించిన సమస్యలు, హార్మోన్‌ల అసమతౌల్యత వంటివి వచ్చేందుకు అవకాశాలూ ఎక్కువే. అంతేకాదు... వాళ్లలో వ్యాధి నిరోధక శక్తి తగ్గే అవకాశాలూ ఎక్కువేనని ఆ అధ్యయనాల్లో తేలింది. వ్యాధి నిరోధకత కోసం వేసే టీకాల ప్రభావం కూడా మందగిస్తుందన్నది పరిశోధకుల మరోమాట. అనేక అధ్యయనాల్లో తేలిన ఈ విషయాలన్నింటినీ 'జర్నల్ ఆఫ్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్' నివేదికల్లో ప్రచురితమయ్యాయి. ఇక మరో హెల్త్ జర్నల్ అయిన 'ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ పర్‌స్పెక్టివ్' నివేదికల ప్రకారం... ఈ తరహా గృహ ఉపకరణాలు వాడేవారిలో వంధ్యత్వం (ఇన్‌ఫెర్టిలిటీ) లేదా పిల్లలు పుట్టే అవకాశాలు తగ్గిపోవడం వంటి సమస్యలు వస్తుంటాయని తెలుస్తోంది.

పరిష్కారమిది

వంటపాత్రలుగా టెఫ్లాన్ కోటింగ్ ఉన్న నాన్‌స్టిక్ కుక్‌వేర్‌కు బదులుగా మామూలు స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలనే ఉపయోగించాలి. కనీసం ఇంట్లో ఎవరైనా గర్భవతులుగా ఉన్నప్పుడు ఈ తరహా నాన్‌స్టిక్ గృహోపకరణాలను ఉపయోగించడం సరికాదు. అంతేకాదు... ఒకవేళ కొన్ని వంటలు చేయడానికి అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద వండాల్సి వస్తే... అలాంటప్పుడు నాన్‌స్టిక్ కుక్‌వేర్‌ను వాడకపోవడమే మంచిది. ఇలాంటి నాన్‌స్టిక్ వంటసామగ్రిని ఉపయోగించేవారు ఆ పొగలూ, గాలులు (ఫ్యూమ్స్) కిచెన్ విస్తరించకుండా, ఎప్పటికప్పుడు బయటకు వెళ్లిపోయేలా ఎగ్జాస్ట్ ఫ్యాన్ అమర్చడం మంచిది.

బాత్‌రూమ్‌ల్లోనూ హానికర రసాయనాలు!



బాత్‌రూమ్‌లో కూడా హానికరమైన రసాయనాలు ఉండేందుకు అవకాశాలెక్కువ. అక్కడ ఉపయోగించే షాంపూలలో హానికరమైన రసాయనాలు ఉండవచ్చు. ఇక సువాసన వెలువరించేందుకు కొన్ని రకాల సబ్బుల్లో చేర్చే కొన్ని రకాల సుగంధ ద్రవ్యాల వల్ల కూడా చర్మంపై అలర్జీలు, శ్వాసకోశ సమస్యలు రావచ్చు.

పరిష్కారమిది

రసాయనాలు తక్కువగా ఉండేలా... చాలావరకు స్వాభావికమైన ఆర్గానిక్ పదార్థాలతో చేసిన సబ్బులు, షాంపులు ఉపయోగించడం మంచిది.

ఇళ్లలో ఎలుకలతో కలకలం...



ఇంటి కిచెన్‌లోకి అర్ధరాత్రి వెళ్లినప్పుడు ఆహారపదార్థాలను ఎలుకలు తింటున్నట్లుగా గమనిస్తే... ఎలుకలు అలా ఆహారాలను తాకడం చాలా ప్రమాదమని గుర్తుంచుకోవాలి. ఎలుకలు ఆహార పదార్థాలను తాకడం వల్ల 'లెప్టోస్పైరోసిస్' అనే వ్యాధి వస్తుంది. అది స్కిన్, మూత్రపిండాలు, మెదడును దెబ్బతీసే ప్రమాదం ఉందని తెలుసుకోవాలి.

పరిష్కారమిది

కిచెన్‌లోని ఆహార పదార్థాలను ఎలుకల నుంచి దూరంగా ఉంచాలి. వాటిని మెస్‌తో ఉన్న కప్‌బోర్డులలో ఉంచి ఎలుకలు తాకని విధంగా జాగ్రత్తపడాలి.

బొద్దింకలనుంచీ జాగ్రత్త...

ఎందుకంటే బొద్దింకలకు ఆహారం కానిదేదీ ఈ లోకంలో లేదు. అందుకే ఈ ప్రపంచంలోని ఏ కిచెన్ కూడా బొద్దింలు లేకుండా ఉండదంటే అది అతిశయోక్తి కాదు.

బొద్దింకలనుంచి వెనువెంటనే వచ్చే ప్రమాదమేమీ పెద్దగా లేకపోయినా... ఆహారాన్ని కలుషితం చేసే పనులను అవి కూడా చేస్తాయి. దాంతో ఆరోగ్యానికి నీళ్ల విరేచనాల వంటి ముప్పు ఉండవచ్చు. ఇక్కడ మరో ఆసక్తికరమైన విషయమేమిటంటే... బొద్దింకలు అలర్జీని, ఆస్తమాను ప్రేరేపిస్తాయి. కాబట్టి ఆస్తమా బాధితులు తమ ఇండ్లలోకి బొద్దింకలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.

పరిష్కారమిది

ఆహారాన్ని బొద్దింకలు తాకకుండా ఉండేలా మెష్ ఉండే సురక్షితమైన చోట ఉంచుకోవాలి. బొద్దింకలు బాగా తేమగా, తడిగా, వెలుగు అంతగా ప్రసరించని చోట పెరుగుతాయి. కాబట్టి ఇంట్లోని ప్రతి ప్రదేశమూ పొడిగా, వెలుతురూ,గాలీ ధారాళంగా వచ్చేలా చూసుకోవాలి. దాంతో బొద్దింకలు వృద్ధి కావు.

వంటచేసే ప్రదేశంలో ధారాళంగా గాలి...

చాలామంది వంటగదిని ఇరుకుగా రూపొందించుకుంటారు. కేవలం వంట సమయంలో తప్ప మిగతా వేళల్లో అక్కడ పెద్దగా ఉండబోమనే అభిప్రాయంతో వంటగదిని ఇరుగ్గా నిర్మించుకుంటారు. నిజానికి కిచెన్‌లోకి ధారాళంగా గాలి వచ్చేలా ఏర్పాటు చేసుకోవాలి. ఇప్పుడు పెద్దగా కిరోసిస్ స్టవ్‌లు ఉపయోగించడం లేదుగానీ... గతంలో ఇలాంటివి ఎక్కువగా వాడేవారు. అలాగే కట్టెల పొయ్యి మీద కూడా వంటలు చేసుకునేవారు. వంటగది ఇరుగ్గా ఉంటే అక్కడ ఇంధనం మండే సమయంలో కార్బన్ డై ఆక్సైడ్‌తో పాటు కార్బన్ మోనాక్సైడ్ వంటి హానికరమైన వాయువులు వెలువడే అవకాశాలు ఎక్కువే. ఒక్కోసారి వాటివల్ల ప్రాణాపాయం కలిగే అవకాశమూ ఉండవచ్చు. అందుకే కిచెన్ తగినంత విశాలంగా, గాలి ఆడేలా ఉండాలి. ఒక్కోసారి గ్యాస్ వాటర్ హీటర్స్ నుంచి కూడా విషవాయువులు వెలువడే ప్రమాదం ఉంది.

పరిష్కారమిది

వంటగది విశాలంగా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. అనవసరమైన వస్తువులతో దాన్ని నింపేయవద్దు. బొగ్గులు, నిప్పుల మీద చేసే వంటలను కిచెన్‌లో చేయకపోవడమే మంచిది. అలాంటి వంటకాలను ఆరుబయటే చేయాలి. ఆర్థిక స్తోమత ఉన్నవారు వంటిళ్లలో పొగ, కార్బన్‌మోనాక్సైడ్ డిటెక్టర్లను, ఎగ్జాస్ట్ ఫ్యాన్‌లను అమర్చుకోవడం వల్ల ఎన్నో అనర్థాలూ, ప్రమాదాలు తప్పుతాయి.

మౌల్డ్ (బూజు)కు ఆస్కారమివ్వద్దు...

బ్రెడ్ ప్యాకెట్ తెరచి కొన్ని స్లైస్‌లు తిన్నతర్వాత, అలాగే ఉంచేస్తే మిగతా స్లైస్‌లపైన బూజు రావడం చాలామంది అనుభవంలోకి వచ్చే విషయమే. ఈ బూజునే మౌల్డ్ అంటారు. ఈ బూజు నుంచి వచ్చే గాలులు పీల్చినప్పుడు ముక్కులు బిగుసుకుపోవడం, ఊపిరితిత్తుల్లోకి వెళ్లే గాలిగొట్టాలు (విండ్‌పైప్స్) సన్నబడినట్లుగా మారి ఆయాసం, ఆస్తమా రావడం చాలామందిలో కనిపించే సమస్యే. ఇక చూసుకోకుండా అలాంటి బ్రెడ్ స్లైస్ తింటే విరేచనాల వంటి అనారోగ్యాలు తప్పవు. అందుకే డైనింగ్ టేబుల్ మీద ఉండే బ్రెడ్ వంటి ఆహారాలకు మౌల్డ్ సోకనివ్వకుండా తాజాగా ఉన్నప్పుడే తినేయాలి.

పరిష్కారమిది

తేమ ఎక్కువగా ఉండే చోట్ల ఆహారాలను నిల్వ చేయడం వల్ల మౌల్డ్ వెంటనే వస్తుంది. అందుకే అలాంటి వాతావరణం ఉండేచోట్ల ఆహారాన్ని నిల్వ చేయకూడదు. మన వంటపాత్రలను వీలైనంత వరకు డిష్-వాషింగ్ సోప్‌తో కడిగి పెట్టుకోవాలి. పల్లెల్లో కొందరు మట్టితో గిన్నెలు కడుగుతుంటారు. అలా మట్టితో కడగడం ఎంతమాత్రమూ సబబు కాదు. ఎందుకంటే మట్టిలో సైతం మన ఆరోగ్యానికి కీడు చేసే సూక్ష్మజీవులు ఉండే అవకాశముంది. అందుకే పల్లెల్లోని వారు సబ్బు ఉపయోగించకపోతే గిన్నెలు తోమడానికి బూడిదను ఉపయోగించడం మంచిది. ఎందుకంటే మట్టితో పోలిస్తే బూడిదలో హానికరమైన పదార్థాలు అంతగా ఉండవు.

షూస్, సాక్స్... పాదరక్షలు ఇంటి బయటనే

ఒకసారి వేసుకున్న సాక్స్ (మేజోళ్లు) మళ్లీ రెండుమూడు రోజులు వేసుకుంటే దుర్వాసన వస్తాయన్నది తెలిసిందే. సాక్స్‌లో బ్యాక్టీరియా పెరగడం వల్ల ఇలా దుర్వాసన వస్తుంటుంది. ఆ సాక్స్‌తోనే ఇంట్లోకి వచ్చి అక్కడ విప్పితే ఆ బ్యాక్టీరియా ఇంట్లోకి వచ్చేసే అవకాశాలుంటాయి. దాంతో ఇంట్లోని వాతావరణం కలుషితం కావచ్చు.

పరిష్కారమిది

షూజ్, పాదరక్షలూ, సాక్స్ వంటివి ఇంటి బయటే వదలాలి. సాక్స్ ఉతికి పొడిగా మారాకే ఇంట్లోకి తీసుకురావాలి. వీలైనంతవరకు చెప్పులు, పాదరక్షలు, షూస్ స్టాండ్, సాక్స్ వంటివి ఇంటి బయట ఉండటమే మంచిది.

చివరిగా... పైన పేర్కొన్న జాగ్రత్తలను పాటించడం వల్ల ఆరోగ్యాల్ని పదిలంగా కాపాడుకోవచ్చు.

అమెరికా-చైనా టారిఫ్ డీల్...

మనకు సవాళ్లు.. అవకాశాలు!

- ఫార్మా, ఐటీ, రత్నాభరణాల ఎగుమతులు పటిష్టం చేసుకోవచ్చు
- దేశీయ ఎగుమతిదార్ల అంచనాలు



న్యూఢిల్లీ: టారిఫ్‌ల పెంపును 90 రోజుల పాటు నిలిపివేయాలన్న అమెరికా, చైనా నిర్ణయంతో భారత్‌కు సవాళ్లు ఉన్నప్పటికీ, నిర్దిష్ట వ్యాపార అవకాశాలు కూడా ఉంటాయని ఎగుమతిదారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గడమనేది అంతర్జాతీయంగా వాణిజ్య స్థిరత్వానికి సానుకూలాంశమని ఎగుమతి సంస్థల సమాఖ్య ఎఫ్‌ఐఈవో ప్రెసిడెంట్ ఎస్‌సీ రాల్హన్ తెలిపారు. టారిఫ్‌ల తగ్గింపు వల్ల, ఎలక్ట్రానిక్స్, మెషినరీ, రసాయనాలు వంటి అధిక విలువ చేసే ఉత్పత్తులకు సంబంధించి అమెరి-చైనా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ఎగియవచ్చని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ పరిణామంతో భారత ఎగుమతిదార్లకు సవాళ్లు ఎదురుకావచ్చన్నారు. అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవలి కాలంలో ఆగ్నేయాసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలాంటి మార్కెట్లో చొచ్చుకుపోయిన భారత ఎగుమతిదార్లకు పోటీ పెరగవచ్చని రాల్హన్ చెప్పారు. కానీ, ఆ రెండు దేశాల వాణిజ్య పరిధిలోకి రాని ఇతర రంగాలపై మరింతగా దృష్టి పెట్టేందుకు అవకాశం లభించగలదన్నారు.

ఫార్మా ఏపీఐలు, ఐటీ ఆధారిత సర్వీసులు, రత్నాభరణాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, ఆర్గానిక్ రసాయనాల్లాంటి ఎగుమతులను పటిష్టపర్చుకోవచ్చని రాల్హన్ చెప్పారు. విశ్వసనీయమైన ప్రత్యామ్నాయ సరఫరాదారుగా ఉంటుందనే విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తూ వాణిజ్యంలో మరింత ప్రాధాన్యం దక్కేలా అమెరికాతో భారత్ క్రియాశీలకంగా సంప్రదింపులు జరపడం శ్రేయస్కరమని ఆయన పేర్కొన్నారు. అలాగే టారిఫ్‌ల తగ్గింపనేది తాత్కాలికమే కావడం వల్ల భవిష్యత్తులో సమస్యలు ఎదురవకుండా హెడ్జింగ్ చేసుకునేందుకు కంపెనీలు పీఎల్‌ఐ (ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు) స్కీమ్, మేకిన్ ఇండియా కార్యక్రమం కింద భారత్‌లో ఉత్పత్తిని పెంచుకునేందుకు మొగ్గు చూపవచ్చని రాల్హన్ చెప్పారు. చైనా నుంచి భారత్‌లోకి దిగుమతులు వెల్లువలా వచ్చిపడకుండా ప్రభుత్వం ఓ కన్నేసి ఉంచాలని మరో ఎగుమతిదారు చెప్పారు.


వ్యయాలు తగ్గించుకోవాలి..

మన ఎగుమతులపై అమెరికాలో సుంకాల రేటు చైనాతో పోలిస్తే తక్కువే ఉన్నప్పటికీ.. వ్యత్యాసం గణనీయంగా తగ్గిపోతోందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్‌ఐ) వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ వ్యాఖ్యానించారు. కొద్ది రోజుల క్రితమే చైనా ఉత్పత్తులపై అమెరికా 145 శాతం టారిఫ్‌లు విధించినప్పుడు 10 శాతం శ్లాబ్‌లో ఉన్న భారత్ వైపు మొగ్గు ఎక్కువగా కనిపించిందని పేర్కొన్నారు. ప్రస్తుత 30 శాతంతో పోల్చినప్పుడు మనం ఇంకా మెరుగైన స్థితిలో ఉన్నప్పటికీ.. గతంలో ఉన్నంత ప్రయోజనం ఉండదని శ్రీవాస్తవ చెప్పారు. టారిఫ్‌లను ప్రతిపాదిత 26 శాతానికి పెంచకుండా, 10 శాతం స్థాయిలోనే కొనసాగించేలా అమెరికాతో సంప్రదింపుల ద్వారా భారత్ స్మార్ట్ డీల్ కుదుర్చుకునేందుకు ప్రయత్నించాలని ఆయన సూచించారు. వాణిజ్య విధానానికే పరిమితం కాకుండా భారత్ అత్యవసరంగా ఉత్పత్తి వ్యయాలను తగ్గించుకోవాలని, లాజిస్టిక్స్‌ను ప్రక్షాళన చేయాలని, నిబంధనలు అంచనాలకు అందే విధంగా ఉండేలా విధానాలను మెరుగుపర్చుకోవాలని పేర్కొన్నారు. వాణిజ్య వివాదాలను పరిష్కరించుకోవడంపై సంప్రదింపులు జరుగుతున్నందున 90 రోజుల పాటు చాలా మటుకు సుంకాలను గణనీయంగా తగ్గించుకునేందుకు అమెరికా, చైనా అంగీకారానికి వచ్చాయి.

ఫార్మా రేట్ల కోతతో భారత్‌పై ఒత్తిడి: జీటీఆర్ఐ

ప్రిస్కిప్షన్ ఔషధాల రేట్లను 30–80 శాతం వరకు తగ్గించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రణాళికలతో అంతర్జాతీయంగా ఫార్మా రేట్లలో మార్పులు చోటు చేసుకుంటాయని జీటీఆర్ఐ తెలిపింది. అమెరికాలో వాటిల్లే నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు ఫార్మా సంస్థలు ఇతర దేశాల్లో తాము ధరలు పెంచుకునేందుకు ప్రయత్నిస్తాయని పేర్కొంది. ఇందుకోసం పేటెంట్ చట్టాలను మార్చే విధంగా భారత్‌లాంటి దేశాలపై ఒత్తిడి తేవొచ్చని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. ప్రపంచానికి చౌకగా ఔషధాలను అందించేందుకు ఉపయోగపడుతున్న తన పేటెంట్ చట్టాల విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు లొంగరాదని సూచించారు. మన జనరిక్స్‌పై ప్రపంచం ఆధారపడి ఉన్న నేపథ్యంలో ఈ మోడల్‌ను పరిరక్షించడమనేది భారత్‌కి ప్రయోజనం చేకూర్చడమే కాకుండా, ప్రపంచానికి కూడా అవసరమని వివరించారు.

జెన్సోల్ ఇంజినీరింగ్ ప్రమోటర్ల రాజీనామా



న్యూఢిల్లీ: సంక్షోభంలో చిక్కుకున్న జెన్సోల్ ఇంజినీరింగ్ సంస్థ ప్రమోటర్లు అన్మోల్ సింగ్ జగ్గీ, పునీత్ సింగ్ జగ్గీ తమ పదవులకు రాజీనామా చేశారు. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ మధ్యంతర ఉత్తర్వుల మేరకు వారు కంపెనీ నుంచి తప్పుకున్నారు. అన్మోల్ సింగ్ జగ్గీ ఎండీగా, పునీత్ సింగ్ జగ్గీ హోల్‌టైమ్ డైరెక్టరు పోస్టులకు రాజీనామా చేసినట్లు స్టాక్ ఎక్స్చేంజీలకు కంపెనీ తెలియజేసింది. అలాగే, వారిద్దరూ ఇకపై వివిధ కమిటీల్లో సభ్యులుగా కూడా ఉండబోరని పేర్కొంది. నిధుల మళ్లింపు, గవర్నెన్స్ లోపాల ఆరోపణలపై సెబీ విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే.

రూ. 2 వేల కోట్ల ఐపీవోకు మోర్ రిటైల్



కోల్‌కతా: సూపర్‌మార్కెట్ చెయిన్ మోర్ రిటైల్ .. ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ద్వారా రూ. 2,000 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. రుణ భారాన్ని తగ్గించుకునేందుకు, కార్యకలాపాలను విస్తరించేందుకు ఈ నిధులను వినియోగించుకోనుంది. కంపెనీ ఎండీ వినోద్ నంబియార్ ఈ విషయాలు తెలిపారు. వేల్యుయేషన్, మార్కెట్ పరిస్థితులు బట్టి వచ్చే 12–18 నెలల్లో ఐపీవోకి వచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుత ప్రమోటర్లు సుమారు 10 శాతం వాటా విక్రయించవచ్చని పేర్కొన్నారు. 2030 నాటికి స్టోర్ల సంఖ్యను 3,000కు పెంచుకునేందుకు, సంస్థను రుణరహితంగా మార్చుకునేందుకు ఇష్యూ ద్వారా సమీకరించే నిధులను ఉపయోగించుకోనున్నట్లు నంబియార్ చెప్పారు. గత 120 రోజుల్లో ఫ్యామిలీ ఆఫీసుల నుంచి సంస్థ రూ. 150 కోట్లు సమీకరించినట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం కంపెనీకి సుమారు రూ. 500 కోట్ల రుణభారం ఉంది. సమరా క్యాపిటల్, అమెజాన్ సంస్థలు మోర్ రిటైల్‌కు ప్రమోటర్లుగా వ్యవహరిస్తున్నాయి. కంపెనీ కొనుగోలు కోసం రూ. 4,300 కోట్లు వెచ్చించడంతో పాటు గత అయిదేళ్లలో వ్యాపార విస్తరణకు రెండు సంస్థలు రూ. 900 కోట్ల పైగా ఇన్వెస్ట్ చేశాయి.

డేటా సెంటర్లపై బిలియన్ డాలర్ల పెట్టుబడులు

టెక్నో డిజిటల్ ఇన్‌ఫ్రా సంస్థ ఏర్పాటు



న్యూఢిల్లీ: డిజిటల్ మౌలిక సదుపాయాల వ్యాపార కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా టెక్నో డిజిటల్ ఇన్‌ఫ్రా పేరిట సంస్థను ప్రారంభించినట్లు టెక్నో ఎలక్ట్రిక్ అండ్ ఇంజినీరింగ్ కంపెనీ (టీఈఈసీఎల్) వెల్లడించింది. ఇది సుమారు 1 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో దేశవ్యాప్తంగా మొత్తం మీద 250 మెగావాట్ల సామర్థ్యంతో హైపర్‌స్కేల్, ఎడ్జ్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. చెన్నైలో 36 మెగావాట్ల హైపర్‌స్కేల్ డేటా సెంటర్ (హెచ్‌డీసీ) కార్యకలాపాలను ప్రారంభించిన సందర్భంగా టీఈఈసీఎల్ ఈ విషయాలు పేర్కొంది. తదుపరి హెచ్‌డీసీలను కోల్‌కతా, నోయిడా ఏర్పాటు చేయనున్నట్లు వివరించింది. మరోవైపు, 23 రాష్ట్రాలవ్యాప్తంగా 102 నగరాల్లో ఎడ్జ్ డేటా సెంటర్లను నిర్మించేందుకు రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు టీఈఈసీఎల్ తెలిపింది. క్లౌడ్ మాధ్యమం ద్వారా పెద్ద కంపెనీలకు భారీ డేటా స్టోరేజీ, ప్రాసెసింగ్ సర్వీసులు అందించేందుకు హెచ్‌డీసీలు ఉపయోగపడతాయి. యూజర్లకు సమీపంలో స్థానికంగా ఏర్పాటు చేసే చిన్న డేటా సెంటర్లను ఎడ్జ్ సెంటర్లుగా వ్యవహరిస్తారు.

అన్ని ఐటీఆర్ పత్రాలు నోటిఫై

మూలధన లాభం విషయంలో స్వల్ప మార్పు



న్యూఢిల్లీ: ఆదాయపన్ను శాఖ మొత్తం ఏడు ఆదాయపన్ను రిటర్నుల (ఐటీఆర్) పత్రాలను నోటిఫై చేసింది. తద్వారా రిటర్నుల దాఖలుకు ఇవి అందుబాటులోకి వచ్చినట్లయింది. గత ఆర్థిక సంవత్సరానికి (2024–25) సంబంధించి ఆదాయపన్ను రిటర్నులను జూలై 31లోగా దాఖలు చేయాలని తెలిసిందే. వ్యక్తులు, ఖాతాల ఆడిటింగ్ లేని వారికి ఈ గడువు వర్తించనుంది. ఐటీఆర్ 2, 3, 5, 6, 7లో మూలధన లాభాల స్థిరీకరణకు సంబంధించి మార్పు చోటుచేసుకుంది. దీనికింద పన్ను చెల్లింపుదారులు తమ మూలధన లాభాలను 2024 జూలై 23కు ముందు, ఆ తర్వాత అని రెండు భాగాలుగా చూపించాల్సి ఉంటుంది. అలాగే, ఐటీఆర్ 1, 4కు సంబంధించి కూడా మరో మార్పు జరిగింది. వేతన జీవులు, రూ.1.25 లక్షలు మించని దీర్ఘకాల మూలధన లాభం కలిగినప్పుడు ఐటీఆర్ 1 లేదా 4 ఎంపిక చేసుకోవచ్చు. గతంలో వీరు ఐటీఆర్ 2 దాఖలు చేయాల్సి వచ్చేది. వేతనంతోపాటు దీర్ఘకాల మూలధన లాభాలు రూ.1.25 లక్షలకు మించితే అప్పుడు ఐటీఆర్ 2ను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-5-2025	
విశాఖ	505-00
చిత్తూరు	583-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HDFCLIFE	641.7	7.99
BEL	277.5	3.6
SBILIFE	1,515.35	2.89
SHRIRAMFIN	546.95	2.58
ADANIPORTS	1,154.05	2.23

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	6,230.00	-2.51
DRREDDY	1,307.00	-2.26
HCLTECH	1,790.15	-1.95
TATACONSUM	938	-1.84
INFY	1,920.05	-1.52

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,859
ఎన్ఎస్ఈ	1,06,751
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,38,422
ఎఫ్ఐఐ	+ 1,246
డీఐఐ	+ 1,448

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.97 (రాత్రి 11.30కు)	$ 61.02 (క్రితం ముగింపు)
బ్రెంట్	65.10 (రాత్రి 11.30కు)	$ 63.91 (క్రితం ముగింపు)

డెట్ ఫండ్స్‌లోకి పెట్టుబడుల వెల్లువ

ఏప్రిల్ నెలలో రూ.2.19 లక్షల కోట్లు

- ఆర్థిక సంవత్సరం మొదటి నెలలో జోరు
- మార్చిలో రూ.2.02 లక్షల కోట్ల ఉపసంహరణ



న్యూఢిల్లీ: డెట్ మ్యూచువల్ ఫండ్స్ ఏప్రిల్ నెలలో మంచి జోరు చూపించాయి. ఈ విభాగంలో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ఎక్కువ మంది ముందుకు వచ్చారు. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు, వాణిజ్య అనిశ్చితుల నేపథ్యంలో ఇన్వెస్టర్లు కొంత రక్షణాత్మక ధోరణితో డెట్ విభాగం వైపు మొగ్గు చూపించినట్టు తెలుస్తోంది. ఫలితంగా ఏప్రిల్ నెలలో డెట్ మ్యూచువల్ ఫండ్స్ నికరంగా రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. అంతకుముందు నెలలో (2025 మార్చిలో) ఇదే డెట్ ఫండ్స్ నుంచి ఇన్వెస్టర్లు రూ.2.02 లక్షల కోట్లను ఉపసంహరించుకోవడం గమనార్హం. అంటే ఒక్క నెలలోనే ఇన్వెస్టర్ల ప్రాధాన్యంలో స్పష్టమైన మార్పు కనిపించింది. ఆర్థిక సంవత్సరం చివరి నెల కావడంతో పెట్టుబడుల్లో మార్పులు–చేర్పులు కూడా ఇందుకు కారణమై ఉండొచ్చు. సంస్థాగత ఇన్వెస్టర్లు ముందస్తు పన్ను చెల్లింపులు, బ్యాలన్స్ షీట్ల సర్దుబాట్లు మార్చి నెలలో పెట్టుబడుల ఉపసంహరణకు కారణమై ఉండొచ్చని మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా సీనియర్ అనలిస్ట్ నేహల్ మెశ్రామ్ తెలిపారు. ఇక ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో డెట్ మ్యూచువల్ ఫండ్స్ నుంచి రూ.6,525 కోట్లను ఇన్వెస్టర్లు ఉపసంహరించుకోగా.. జనవరిలో రూ.1.28 లక్షల కోట్లను ఇన్వెస్ట్ చేయడం గమనార్హం.

రూ.17.57 లక్షల కోట్ల నిర్వహణ ఆస్తులు

ఏప్రిల్ చివరికి మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని డెట్ పెట్టుబడులు (ఏయూఎం) రూ.17.57 లక్షల కోట్లకు చేరాయి. అంతకు ముందు మార్చి చివరికి డెట్ నిర్వహణ ఆస్తుల విలువ రూ.17.02 లక్షల కోట్లుగా ఉంది. ఇక డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టే ఇన్వెస్టర్ల సంఖ్యలోనూ వృద్ధి కనిపించింది. ఏప్రిల్‌లో కొత్తగా 1.44 లక్షల ఫోలియోలు (పెట్టుబడి ఖాతాలు) ప్రారంభమయ్యాయి. మొత్తం డెట్ ఫోలియోలు 79.36 లక్షలకు చేరాయి. డెట్‌లో మొత్తం 16 కేటగిరీలు ఉంటే అందులో 12 కేటగిరీల్లోకి నికరంగా పెట్టుబడులు వచ్చాయి. "ఏప్రిల్‌లో డెట్ ఫండ్స్‌లోకి పెట్టుబడులు రాక పెరగడం అన్నది స్థిరాదాయ పథకాల పట్ల ఇన్వెస్టర్లలో ఉన్న విశ్వాసానికి నిదర్శనం"అని మార్నింగ్ స్టార్ మెశ్రామ్ తెలిపారు. లిక్విడ్ ఫండ్స్‌లోకి ఎక్కువ పెట్టుబడులు రావడం అన్నది స్వల్పకాల పెట్టుబడుల పట్ల ప్రాధాన్యాన్ని సూచిస్తున్నట్టు ఈక్విరస్ వెల్త్ ఎండీ అంకుర్ పంజ్ తెలిపారు.

లిక్విడ్ ఫండ్స్‌లోకే అధికం..

- డెట్‌లో లిక్విడ్ ఫండ్స్‌లోకి అత్యధికంగా ఏప్రిల్ నెలలో రూ.1.18 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి.
- ఓవర్‌నైట్ ఫండ్స్ రూ.23,900 కోట్లు, మనీ మార్కెట్ ఫండ్స్ రూ.31,507 కోట్ల చొప్పున పెట్టుబడులను ఆకర్షించాయి.
- అల్ట్రా షార్ట్ ఫండ్స్‌లోకి రూ.26,734 కోట్లు, లో డ్యురేషన్ ఫండ్స్‌లోకి రూ.9,371 కోట్ల చొప్పున పెట్టుబడులు వచ్చాయి.
- గిల్ట్ ఫండ్స్ నుంచి ఇన్వెస్టర్లు రూ.425 కోట్లను ఉపసంహరించుకున్నారు. క్రెడిట్ రిస్క్ ఫండ్స్ నుంచి రూ.302 కోట్లు, గిల్ట్ ఫండ్స్ నుంచి 39 కోట్లు చొప్పున బయటకు వెళ్లిపోయాయి.
- మొత్తానికి ఏప్రిల్ నెలలో మ్యూచువల్ ఫండ్స్‌లోని అన్ని విభాగాల్లోకి కలిపి నికరంగా రూ.2.77 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు యాంఫి గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

మార్చి త్రైమాసిక ఫలితాలు

టాటా స్టీల్ లాభం జూమ్

- క్యూ4లో రూ. 1,201 కోట్లు
- షేరుకి రూ. 3.6 డివిడెండ్



న్యూఢిల్లీ: మెటల్ రంగ టాటా గ్రూప్ దిగ్గజం టాటా స్టీల్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపై రూ. 1,201 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 555 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు ఒక్కో షేరుకి రూ. 3.6 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 58,863 కోట్ల నుంచి రూ. 56,679 కోట్లకు క్షీణించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 56,497 కోట్ల నుంచి రూ. 54,167 కోట్లకు తగ్గాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి టర్న్‌అరౌండ్ సాధిస్తూ రూ. 3,174 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023–24లో రూ. 4,910 కోట్ల నికర నష్టం ప్రకటించింది. విదేశీ మారక నిబంధనల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం(2025–26)లో ఒకేసారి లేదా దశలవారీగా 2.5 బిలియన్ డాలర్లు(రూ. 21,411 కోట్లు) పెట్టుబడులు అందించే ప్రతిపాదనకు బోర్డు తాజాగా అనుమతించింది. సొంత విదేశీ అనుబంధ సంస్థ టీ స్టీల్ హోల్డింగ్స్ పీటీఈ ఈక్విటీ షేర్లకు సబ్‌స్క్రయిబ్ చేయడం ద్వారా నిధులు సమకూర్చనుంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 6 శాతంపైగా జంప్‌చేసి రూ. 152 వద్ద ముగిసింది.

నష్టాల్లోనే పీవీఆర్ ఐనాక్స్

క్యూ4లో రూ. 125 కోట్లు

న్యూఢిల్లీ: మల్టీప్లెక్స్ దిగ్గజం పీవీఆర్ ఐనాక్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 125 కోట్ల నికర నష్టం ప్రకటించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 130 కోట్ల నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం నామమాత్ర క్షీణతతో రూ. 1,250 కోట్లకు చేరింది. 2023–24 క్యూ4లో రూ. 1,256 కోట్ల టర్నోవర్ సాధించింది. మొత్తం వ్యయాలు నామమాత్రంగా తగ్గి రూ. 1,479 కోట్లకు పరిమితమయ్యాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 281 కోట్ల నికర నష్టం ప్రకటించింది. 2023–24లో కేవలం రూ. 33 కోట్ల నష్టాలు నమోదయ్యాయి. మొత్తం ఆదాయం 5 శాతం నీరసించి రూ. 5,954 కోట్లకు పరిమితమైంది. 2023–24లో రూ. 6,264 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. సామర్థ్యం, లాభదాయకతను మెరుగుపరచుకునే యోచనతో వివిధ ప్రాంతాలలో 72 తెరలను మూసివేయడంతోపాటు.. కొత్తగా 77 స్క్రీన్లను ఏర్పాటు చేసింది. తద్వారా స్క్రీన్ పోర్ట్‌ఫోలియోను క్రమబద్ధీకరించింది. ప్రస్తుతం 352 సినిమాల ద్వారా 1,743 తెరలను నిర్వహిస్తోంది.

ఫలితాల నేపథ్యంలో పీవీఆర్ షేరు బీఎస్ఈలో 5 శాతం జంప్‌చేసి రూ. 967 వద్ద ముగిసింది.

నష్టాలు తగ్గించుకున్న ఏథర్ ఎనర్జీ



ముంబై: బెంగళూరుకు చెందిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ మార్చి త్రైమాసికంలో నష్టాలు తగ్గించుకుంది. ఇటీవలే ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ముగించుకుని స్టాక్ ఎక్స్చేంజ్‌ల్లో లిస్ట్ అయిన ఈ సంస్థ.. 2024–25 సంవత్సరం చివరి మూడు నెలల కాలానికి రూ234 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం చివరి క్వార్టర్‌లో నష్టం రూ.283 కోట్లుగా ఉండడం గమనించొచ్చు. కార్యకలాపాల రూపంలో ఆదాయం ఇదే కాలంలో 29.5 శాతం వృద్ధి చెందింది. రూ.523 కోట్ల నుంచి రూ.676 కోట్లకు చేరింది. ఇక 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఏథెర్ ఎనర్జీ రూ.812 కోట్ల నికర నష్టాన్ని మూటగట్టుకుంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో నష్టం రూ.1,060 కోట్లతో పోల్చితే తగ్గింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కంపెనీ షేరు 3 శాతానికి పైగా లాభపడి రూ.310 వద్ద స్థిరపడింది.

జ్యోతి ల్యాబ్స్ లాభం డౌన్

క్యూ4లో రూ. 76 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ కంపెనీ జ్యోతి ల్యాబ్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం స్వల్పంగా(2 శాతం) నీరసించి రూ. 76 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 78 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం నామమాత్ర(1 శాతం) వృద్ధితో రూ. 682 కోట్లను తాకింది. 2023–24 క్యూ4లో రూ. 673 కోట్ల టర్నోవర్ అందుకుంది. మొత్తం వ్యయాలు రూ. 571 కోట్లుగా నమోదయ్యాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఉజాలా, ప్రిల్, మార్గో, ఎక్సో బ్రాండ్ల కంపెనీ నికర లాభం దాదాపు యథాతథంగా రూ. 370 కోట్లుగా నమోదైంది. 2023–24లో రూ. 369 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 3 శాతం పుంజుకుని రూ. 2,903 కోట్లకు చేరింది. ఇబిటా మార్జిన్లు స్వల్పంగా మెరుగుపడి 17.5 శాతాన్ని తాకాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 4.3 శాతం పతనమై రూ. 350 వద్ద ముగిసింది.

బజాజ్ ఎలక్ట్రికల్స్ లాభం రెట్టింపు

- క్యూ4లో రూ. 59 కోట్లు
- షేరుకి రూ. 3 డివిడెండ్



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం బజాజ్ ఎలక్ట్రికల్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపై రూ. 59 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 29 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు ఒక్కో షేరుకి రూ. 3 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం 6 శాతంపైగా ఎగసి రూ. 1,265 కోట్లను తాకింది. 2023–24 క్యూ4లో రూ. 1,188 కోట్ల టర్నోవర్ అందుకుంది. మొత్తం వ్యయాలు రూ. 1,232 కోట్లకు చేరాయి. ఆదాయంలో కన్సూమర్ ప్రొడక్టుల నుంచి 8 శాతం అధికంగా రూ. 994 కోట్లు లభించాయి. లైటింగ్ సొల్యూషన్ల బిజినెస్ నామమాత్ర వృద్ధితో రూ. 271 కోట్ల టర్నోవర్ సాధించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 2 శాతం నీరసించి రూ. 133 కోట్లకు పరిమితమైంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 15 శాతం దూసుకెళ్లి రూ. 610 వద్ద ముగిసింది.

ఎస్ఆర్ఎఫ్ లాభం జూమ్

క్యూ4లో రూ. 526 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఎస్ఆర్ఎఫ్ లిమిటెడ్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 25 శాతం జంప్‌చేసి రూ. 526 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 422 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 20 శాతం ఎగసి రూ. 4,215 కోట్లను తాకింది. 2023–24 క్యూ4లో రూ. 3,506 కోట్ల టర్నోవర్ అందుకుంది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 6 శాతం క్షీణించి రూ. 1,241 కోట్లకు పరిమితమైంది. 2023–24లో రూ. 1,336 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 14,358 కోట్లుగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో ఎస్ఆర్ఎఫ్ షేరు బీఎస్ఈలో 0.2 శాతం బలపడి రూ. 3,013 వద్ద ముగిసింది.

సలీమా సారథ్యంలో...

యూరోపియన్ అంచె ప్రొ హాకీ లీగ్ బరిలో టీమిండియా

న్యూఢిల్లీ: ప్రొ హాకీ లీగ్ చివరి అంచె టోర్నమెంట్‌లో పాల్గొనే భారత మహిళల జట్టును ప్రకటించారు. 24 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు జార్ఖండ్‌కు చెందిన మిడ్‌ఫీల్డర్ సలీమా టెటె సారథ్యం వహిస్తుంది. పంజాబ్‌కు చెందిన ఫార్వర్డ్ నవ్‌నీత్ కౌర్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుంది. ప్రొ హాకీ లీగ్ చివరి అంచె మ్యాచ్‌లు జూన్ 14 నుంచి 29వ తేదీ వరకు యూరోప్‌లోని జర్మనీ,బ్రిటన్, బెల్జియం దేశాల్లో జరుగుతాయి. ఈ టోర్నీలో భారత జట్టు మొత్తం ఎనిమిది మ్యాచ్‌లు ఆడుతుంది. ఆస్ట్రేలియా, అర్జెంటీనా, బెల్జియం, చైనా జట్లతో భారత్ రెండు మ్యాచ్‌ల చొప్పున ఆడుతుంది. భారత జట్టు వరుసగా జూన్ 14, 15వ తేదీల్లో లండన్‌లో ఆస్ట్రేలియా జట్టుతో... జూన్ 17, 18వ తేదీల్లో లండన్‌లో అర్జెంటీనాతో... జూన్ 21, 22వ తేదీల్లో ఆంట్‌వర్ప్‌లో బెల్జియంతో... జూన్ 28, 29వ తేదీల్లో బెర్లిన్‌లో చైనా జట్టుతో పోటీపడుతుంది. తొమ్మిది జట్లు పోటీ పడుతున్న ప్రొ హాకీ లీగ్‌లో భారత్ ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. ఇందులో రెండు మ్యాచ్‌ల్లో గెలిచి, రెండు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. మొత్తం తొమ్మిది పాయింట్లతో భారత్ ఆరో స్థానంలో ఉంది. టోర్నీ ముగిశాక చివరిదైన తొమ్మిదో స్థానంలో నిలిచిన జట్టు వచ్చే సీజన్‌లో ప్రొ లీగ్ నుంచి బయటకు వచ్చి నేషన్స్ కప్‌లో ఆడాల్సి ఉంటుంది. ప్రొ లీగ్ విజేత జట్టు తదుపరి ప్రపంచకప్ టోర్నీకి నేరుగా అర్హత సాధిస్తుంది.

భారత మహిళల హాకీ జట్టు

సలీమా టెటె (కెప్టెన్), నవ్‌నీత్ కౌర్ (వైస్ కెప్టెన్), సవిత, బిచ్చూదేవి (గోల్ కీపర్లు), సుశీలా చాను, జ్యోతి, సుమన్ దేవి, జ్యోతి సింగ్, ఇషిక చౌధరీ, జ్యోతి ఛత్రి (డిఫెండర్లు), వైష్ణవి విఠల్ ఫాడ్కే, సుజాత కుజుర్, మనీశా చౌహాన్, నేహా, లాల్‌రెమ్‌సియామి, షర్మిలా దేవి, సునెలితా టొప్పో, మహిమా టెటె (మిడ్ ఫీల్డర్లు), దీపిక, దీపిక సోరెంగ్, బల్జీత్ కౌర్, రుతుజా, బ్యూటీ డుంగ్‌డుంగ్, సాక్షి రాణా (ఫార్వర్డ్‌లు).




గాయత్రి-ట్రెసా జాలీ జోడీ పునరాగమనం

నేటి నుంచి థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



బ్యాంకాక్: గాయాల కారణంగా సుదిర్మన్ కప్ ప్రపంచ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఆడలేకపోయిన భారత మహిళల డబుల్స్ నంబర్ వన్ జోడీ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం పునరాగమనం చేయనుంది. నేటి నుంచి మొదలయ్యే థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం బరిలోకి దిగనుంది. తొలి రౌండ్‌లో ఒంగ్ జిన్ యి-కార్మెన్ తింగ్ (మలేసియన్) జంటతో గాయత్రి-ట్రెసా ద్వయం తలపడుతుంది. మరో వైపు పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ సహా యువ బ్యాడ్మింటన్ తారలు ఆయుశ్ షెట్టి, ఉన్నతి హుడాలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. నేడు క్వాలిఫయింగ్ పోటీలు జరుగుతాయి. 20 ఏళ్ల ఆయుశ్, 17 ఏళ్ల ఉన్నతిలు తమ జోరు కొనసాగించేందుకు పట్టుదలతో ఉన్నారు. గతవారం జరిగిన చైనీస్ తైపీ ఓపెన్‌లో ఈ ఇద్దరు సెమీఫైనల్స్ చేరి భారత బ్యాడ్మింటన్ భవిష్యత్‌కు కొత్త ఊపిరిలూదారు. అయితే ఈ టోర్నీలో వీరిద్దరు క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. ఆయుశ్, ఉన్నతిలు ఉన్న ఫామ్ దృష్ట్యా మెయిన్ 'డ్రా' చేరడం ఏమంత కష్టం కాదు. తొలి మ్యాచ్‌లో ఆయుశ్ ఫిన్‌లాండ్‌కు చెందిన జొకిమ్ ఒల్డార్ఫ్‌తో, మహిళల క్వాలిఫయర్స్‌లో ఉన్నతి... స్థానిక ప్లేయర్ తమోన్‌వన్ నితిటిక్‌రాయ్‌తో తలపడతారు. బుధవారం జరిగే మెయిన్ 'డ్రా' తొలి మ్యాచ్‌లో భారత స్టార్ లక్ష్యసేన్ ఐర్లాండ్ ఆటగాడు ఎన్‌హత్ నెన్‌గుయెన్‌ను ఎదుర్కొంటాడు. గాయం నుంచి కోలుకోకపోవడంతో సుదిర్మన్ కప్‌కు దూరంగా ఉన్న లక్ష్యసేన్ తాజా టోర్నీద్వారా తన ఫిట్‌నెస్‌ను పరీక్షించుకోనున్నాడు. మరో మ్యాచ్‌లో నిలకడగా రాణిస్తున్న ప్రియాన్షు రజావత్... అల్వీ ఫర్హాన్ (ఇండోనేసియా)తో తలపడతాడు. మహిళల సింగిల్స్‌లో భారత మేటి షట్లర్ మాళవిక న్సోద్... తుర్కియేకు చెందిన నెస్లిహన్ యిగిత్‌తో జరిగే తొలి రౌండ్ పోరుతో థాయ్ ఓపెన్‌ను ప్రారంభించనుంది. మిగతా మ్యాచ్‌ల్లో మాజీ జాతీయ చాంపియన్ అనుపమకు మొదటి రౌండ్లోనే గట్టి సవాల్ ఎదురవుతోంది. ఆమె మాజీ ప్రపంచ చాంపియన్ రత్చనోక్ ఇంతనాన్ (థాయ్‌లాండ్)ను ఎదుర్కోనుంది.

మెరిసిన అనుశ్



బీలేఫీల్డ్ (జర్మనీ): భారత ఈక్వెస్ట్రియన్ (గుర్రపు స్వారీ) స్టార్ అనుశ్ అగర్‌వల్లా జర్మనీలో ఈవెంట్‌లో మెరిశాడు. ఆసియా క్రీడల్లో రెండు పతకాలు సాధించిన అనుశ్ ఇక్కడ జరిగిన హాల్జ్‌కంపెర్ డ్రెసుర్టేజ్ గ్రాండ్‌ప్రిలో తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. ఈ పోటీలో అతను 69.44 శాతం స్కోరు సాధించాడు. తాను బరిలోకి దిగిన రెండో గ్రాండ్‌ప్రిలోనే అద్భుతమైన ప్రదర్శనతో మెరుగైన స్కోరు చేయడం విశేషం. తన ప్రదర్శన పట్ల అనుశ్ సంతోషం వ్యక్తం చేశాడు. 'ఈ తరహా ప్రదర్శన చేస్తాననుకోలేదు. నా వ్యక్తిగత అత్యుత్తమ స్కోరును సాధించడం ఆనందంగా ఉంది. ఈ ప్రదర్శనను చూస్తుంటే నాకే గర్వంగా ఉంది' అని అనుశ్ అన్నాడు. తదుపరి ఇదే వారంలో బెల్జియంలో జరిగే పోటీల్లోనూ అతను పాల్గొంటాడు. ఏడాది ఆలస్యంగా హాంగ్జౌ (చైనా; 2023)లో జరిగిన ఆసియా క్రీడల్లో అతను టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం, వ్యక్తిగత విభాగంలో కాంస్యం గెలుపొందాడు.

తరుణ్‌కు రజతం

పట్నా: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో ఆంధ్ర ప్రదేశ్‌కు మరో పతకం లభించింది. సోమవారం జరిగిన వెయిట్‌లిఫ్టింగ్ పురుషుల 81 కేజీల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎం.తరుణ్ రజత పతకం సాధించాడు. తరుణ్ మొత్తం 287 కేజీలు బరువెత్తి రెండో స్థానంలో నిలిచాడు. మహారాష్ట్రకు చెందిన సాయిరాజ్ పర్‌దేశి (312 కేజీలు) స్వర్ణం నెగ్గగా... ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఆయుశ్ రాణా (264 కేజీలు) కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు.

బోపన్న ద్వయం శుభారంభం

రోమ్: ఈ ఏడాది పదో టోర్నమెంట్‌లో భారత పురుషుల టెన్నిస్ డబుల్స్ దిగ్గజం రోహన్ బోపన్న శుభారంభం చేశాడు. రోమ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-ఆడమ్ పావ్లాసెక్ (చెక్ రిపబ్లిక్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన తొలి రౌండ్‌లో బోపన్న-పావ్లాసెక్ ద్వయం 4-6, 7-6 (8/6), 10-4తో 'సూపర్ టైబ్రేక్'లో ఆరో సీడ్ నికోలా మెక్‌టిక్ (క్రొయేషియా)-మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జంటను బోల్తా కొట్టించింది. 1 గంట 41 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడీ తొలి సెట్‌ను కోల్పోయినా... ఆందోళన చెందకుండా రెండో సెట్‌లో పట్టుదలతో పోరాడి టైబ్రేక్‌లో సెట్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక 'సూపర్ టైబ్రేక్'లో ఇండో-చెక్ జంట కీలకదశలో పాయింట్లు గెలిచి సెట్‌తోపాటు విజయాన్ని సొంతం చేసుకుంది. బోపన్న-పావ్లాసెక్ మూడు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 70 సర్వీస్ పాయింట్లకుగాను 54 పాయింట్లు సాధించింది.

యూకీ జంట ఓటమి

మరోవైపు ఇదే టోర్నీలో ఆడిన యూకీ బాంబ్రీ (భారత్)-రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. నాలుగో సీడ్ మార్సెల్ గ్రానోలెర్స్ (స్పెయిన్)-హొరాసియో జెబలాస్ (అర్జెంటీనా) ద్వయంతో జరిగిన మ్యాచ్‌లో యూకీ-గాలోవే జంట 1-6, 2-6తో ఓటమి పాలైంది. 58 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో యూకీ-గాలోవే జంట తమ సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది. తొలి రౌండ్‌లో ఓడిన యూకీ-గాలోవే జోడీకి 16,690 యూరోలు (రూ. 15 లక్షల 76 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.





కమిన్స్

ఇష్టం లేకపోతే వెళ్లొద్దులే!

ఐపీఎల్‌లో మిగిలిన మ్యాచ్‌లు ఆడనున్న ఆసీస్ క్రికెటర్లకు అండగా సీఏ

మెల్‌బోర్న్: ఐపీఎల్ వాయిదా పడటంతో స్వదేశం చేరిన ఆస్ట్రేలియా క్రికెటర్లకు ఆ దేశ క్రికెట్ బోర్డు అండగా నిలుస్తోంది. మిగతా లీగ్‌కు ఇష్టమైతేనే వెళ్లాలని లేదంటే ఇక్కడే ఉండిపోవచ్చని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) సూచించిందని మీడియా కథనం వెలువరించింది. ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించిన ఆస్ట్రేలియన్ క్రికెటర్లంతా లీగ్ వాయిదా పడగానే స్వదేశానికి వెళ్లిపోయారు. కోచింగ్ స్టాఫ్‌లో ఉన్న రికీ పాంటింగ్, బ్రాడ్ హాడిన్ తదితరులు మాత్రం భారత్‌లోనే ఉండిపోయారు. ప్రస్తుతం భారత్, పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరగడంతో ఈనెల 17 నుంచి తిరిగి ఐపీఎల్‌ను ప్రారంభించడానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా విదేశీ క్రికెటర్లకు పిలిపించుకొని సిద్ధంగా ఉండాలని బోర్డు ఇదివరకే ఫ్రాంచైజీలకు తెలిపింది. అయితే ఆటగాళ్లంతా ఐపీఎల్ కోసం భారత్ వెళ్లేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలిసింది. ఈ నేపథ్యంలో సీఏ వారికి అండగా నిలవాలనుకుంటుందని 'సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్' పత్రిక తమ కథనంలో పేర్కొంది. దాయాది దేశాల మధ్య నెలకొన్న యుద్ధవాతావరణ పరిస్థితులతో తమ ఆటగాళ్లంతా భయాందోళనకు గురయ్యారని అలాంటపుడు మళ్లీ ఐపీఎల్ కోసం వెళ్లమని క్రికెట్ ఆస్ట్రేలియా చెప్పబోదని ఆ కథనంలో రాసింది. నిజానికి తమ ఆటగాళ్లకు మే 24తో ముగిసే ఐపీఎల్ షెడ్యూల్ వరకే ఆడేందుకు సీఏ అనుమతిచ్చింది. ఇప్పుడు గనక వారు మళ్లీ వెళ్లాలంటే సీఏ నుంచి మరోసారి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) తీసుకోవాల్సి ఉంటుందని ఆ పత్రిక వెల్లడించింది.

రెండో రౌండ్‌లోనే ఖేల్ ఖతం


షికాగో: ప్రపంచ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో పోటీపడ్డ భారత ఏకైక క్రీడాకారిణి అనాహత్ సింగ్ రెండో రౌండ్‌లో నిష్క్రమించింది. ఫెరూజ్ అబోల్‌ఖెర్ (ఈజిప్ట్)తో 28 నిమిషాలపాటు జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో అనాహత్ 7-11, 11-8, 4-11, 3-11తో పరాజయం పాలైంది. తొలి రౌండ్‌లో ప్రపంచ 28వ ర్యాంకర్ మరీనా స్టెఫానోని (అమెరికా)పై సంచలన విజయం సాధించిన అనాహత్ రెండో రౌండ్‌లో అదే ఫలితాన్ని పునరావృతం చేయలేకపోయింది. పురుషుల సింగిల్స్‌లో భారత ప్లేయర్లు అభయ్ సింగ్, వీర్ చోత్రాని, రమిత్ టాండన్ కూడా రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. అభయ్ 6-11, 6-11, 9-11తో ప్రపంచ 13వ ర్యాంకర్ యూసుఫ్ ఇబ్రహీం (ఈజిప్ట్) చేతిలో, వీర్ 11-7, 7-11, 3-11, 10-12తో టాప్ సీడ్ అలీ ఫరాగ్ (ఈజిప్ట్) చేతిలో, రమిత్ 9-11, 7-11, 11-5, 11-8, 8-11తో ఎనిమిదో సీడ్ మర్వాన్ ఎల్‌షోర్‌బగి (ఇంగ్లండ్) చేతిలో ఓటమి చవిచూశారు.



వీర్ చోత్రాని

బంగ్లాదేశ్ పేస్ బౌలింగ్ కోచ్‌గా షాన్ టెయిట్

ఢాకా: బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) మాజీ ఆస్ట్రేలియన్ పేసర్ షాన్ టెయిట్‌ను బంగ్లాదేశ్ శిక్షణ బృందంలో నియమించింది. ఆండ్రూ ఆడమ్స్ స్థానంలో పేస్ బౌలింగ్ కోచ్‌గా 42 ఏళ్ల టెయిట్‌ను నియమించినట్లు బీసీబీ తెలిపింది. నవంబర్ 2027 వరకు అతను కోచ్ పదవిలో ఉంటాడని బీసీబీ పేర్కొంది. గతంలో ఈ కంగారూ బౌలర్ పాకిస్తాన్, వెస్టిండీస్, అఫ్గానిస్తాన్ జట్లకు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. 2007లో ఆస్ట్రేలియా గెలుపొందిన వన్డే ప్రపంచకప్ విజేత జట్టులో సభ్యుడైన షాన్ టెయిట్ అంతర్జాతీయ కెరీర్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి 59 మ్యాచ్‌లు ఆడాడు. 95 వికెట్లు పడగొట్టాడు. ఈ సందర్భంగా టెయిట్ మాట్లాడుతూ 'బంగ్లాదేశ్ క్రికెట్ టీమ్‌లో భాగమవ్వడం ఆనందంగా ఉంది. ఈ జట్టులో ప్రతిభావంతులైన పేసర్లు ఉన్నారు. వారంతా అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తున్నారు కూడా! వారి ప్రతిభకు మరింత మెరుగులు దిద్దేందుకు, వారి ప్రదర్శన మెరుగయ్యేందుకు నా వంతు ప్రయత్నం చేస్తాను. హెడ్ కోచ్, విండీస్ మాజీ క్రికెటర్ ఫిల్ సిమన్స్‌తో కలిసి పనిచేయడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని టెయిట్ అన్నాడు. బంగ్లాదేశ్ గత పేస్ బౌలింగ్ కోచ్ ఆండ్రూ ఆడమ్స్ టి20 ప్రపంచకప్, ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీల్లో నిరాశపరచడంతోనే కొత్త కోచ్‌ను నియమించినట్లు తెలిసింది.



32 విమానాశ్రయాలు పునఃప్రారంభం

- సోమవారం ఉదయం నుంచే కార్యకలాపాలు ప్రారంభం
- ఆదివారం రాత్రి ఎలాంటి ఘర్షణ లేకపోవడంతో నిషేధాజ్ఞలు రద్దు చేసిన ఏఏఐ

న్యూఢిల్లీ: భారత్–పాక్ ఉద్రిక్తతల కారణంగా మే 9 నుంచి మూసివేసిన విమానాశ్రయాలన్నింటినీ భారత్ సోమవారం తిరిగి ప్రారంభించింది. కాల్పుల విరమణ చర్చల మధ్య పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు తగ్గడంతో 32 విమానాశ్రయాలు తిరిగి తెరిచారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకపోవడంతో విమాన కార్యకలాపాలను తిరిగి ప్రారంభించడానికి కేంద్రం సోమవారం ఉదయం నోటామ్ (ఎయిర్‌మెన్‌కు నోటీసు) జారీ చేసింది. ''15 మే 2025 ఉదయం 05:29 గంటల వరకు తాత్కాలికంగా పౌర విమాన కార్యకలాపాల కోసం మూసివేసిన 32 విమానాశ్రయాలు ఇప్పుడు తక్షణమే సేవల్లోకి వస్తాయి''అని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులు విమాన స్థితిని నేరుగా ఎయిర్‌లైన్స్‌తో తనిఖీ చేసుకోవాలని, మార్పుచేర్పుల కోసం ఎయిర్‌లైన్స్ వెబ్‌సైట్లను పరిశీలించాలని సిఫార్సు చేసింది. దీంతో చండీగఢ్, శ్రీనగర్ సహా ప్రభావిత ప్రాంతాల్లోని విమానాశ్రయాలు తెరుచుకున్నాయి. క్రమంగా విమాన కార్యకలాపాలు కూడా ప్రారంభమయ్యాయి.

3 గంటల ముందే విమానాశ్రయానికి...

విమానాశ్రయాలలో కఠినమైన భద్రతా ప్రోటోకాల్ కోసం గురువారం జారీ చేసిన ఉత్తర్వులు మే 18 వరకు అమలులో ఉంటాయి. విమానాశ్రయాలలోకి సందర్శకులకు అనుమతి ఉండదు. చెక్–ఇన్, బోర్డింగ్ సజావుగా జరిగేందుకు ప్రయాణికులు విమానం షెడ్యూల్ చేసిన సమయానికి కనీసం మూడు గంటల ముందే సంబంధిత విమానాశ్రయాలకు చేరుకోవాల్సి ఉంటుంది.

క్రమంగా రాకపోకల పెరుగుదల

ఆదేశాన్ని అనుసరించి మే 12 నుంచి ఉదయం 10 గంటలకు చండీగఢ్ అంతర్జాతీయ విమానాశ్రయం విమాన కార్యకలాపాలను తిరిగి ప్రారంభించింది. శ్రీనగర్, అమృత్‌సర్, లూధియానా, భుంటార్, కిషన్‌గఢ్, పాటియాలా, సిమ్లా, కాంగ్రా–గగ్గల్, భటిండా, జైసల్మేర్, జోధ్‌పూర్, బికనీర్, హల్వారా, పఠాన్‌కోట్, జమ్మూ, లేహ్, ముంద్రా, జామ్‌నగర్, హిరాసర్, భుందార్, పోర్‌బందర్, రాజ్‌కోట్, సర్సావా, సిమ్లా, థోయిస్, ఉత్తరలై విమానాశ్రయాలు కూడా తమ కార్యకాలాపాలను ప్రారంభించాయి. తమ విమానాల రాకపోకలు క్రమంగా పెరుగుతాయని ఇండిగో తెలిపింది. విమానాల షెడ్యూలింగ్‌లో కొంత జాప్యం ఉంటుందని, వివరాల కోసం ప్రయాణికులు తమ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించింది. ప్రయాణికులు ప్రయాణ ప్రణాళికలను పునఃపరిశీలించాలనుకుంటే.. మే 22 వరకు మార్పు, రద్దు రుసుము మినహాయింపులు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది.



సరిహద్దుల్లో పరిస్థితులు చక్కబడటంతో తిరిగి ఇళ్లకు పయనమైన కశ్మీర్ వాసులు



శ్రీనగర్‌లోని లాల్‌చౌక్ సమీపంలో గస్తీ విధుల్లో ఉన్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు

షెల్లింగ్ లేదు, కాల్పులు లేవు

19 రోజుల తరువాత సరిహద్దు రేఖ వెంబడి ప్రశాంతంగా గడిచిన రాత్రి

జమ్మూ/శ్రీనగర్/చండీగఢ్: భారత్–పాకిస్తాన్ కాల్పుల విరమణ అనంతరం ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు జమ్మూకశ్మీర్, నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు చాలా ప్రశాంతంగా ఉంది. 19 రోజుల్లో మొదటిసారిగా షెల్లింగ్, కాల్పులు జరగకుండా ఉన్నాయని ఆర్మీ తెలిపింది. ఏప్రిల్ 22న పహల్గాం దాడి తర్వాత కాల్పుల విరమణ ఉల్లంఘనలలో మొదటిసారి పూర్తిగా విరామం కనిపించింది.

కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన కొన్ని గంటల తర్వాత, శనివారం రాత్రి, పాకిస్తాన్ జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు మీదుగా వరుస క్షిపణి, డ్రోన్ దాడులను ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే ఆదివారం మాత్రం ఎలాంటి హింసాత్మక ఘటనలు నమోదు కాలేదు. పూంచ్‌లోని సురాన్‌కోట్‌లో సాధారణ పరిస్థితులు తిరిగి నెలకొన్నాయి. పహల్గాం దాడి తరువాత ఏప్రిల్ 23 నుంచి మే 6 వరకు, నియంత్రణ రేఖ వెంబడి అనేక కాల్పుల ఘటనలు నమోదయ్యాయి. రెండు రోజుల కిందట సూరన్‌కోట్‌లో భారీ కాల్పులు జరిగాయి. దీనితో నివాసితులు భయాందోళనకు గురయ్యారు. దాడి తరువాత, నివాసితులు పట్టణం నుంచి పారిపోయారు. కొందరు సమీపంలోని కొండ గ్రామాలు మరియు బంకర్లలో ఆశ్రయం పొందారు. మరికొందరు జమ్మూలోని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. పరిస్థితి ఇప్పుడు మెరుగుపడటంతో, ప్రజలు త్వరలో పూంచ్‌లోని తమ ఇళ్లకు తిరిగి రావాలని ఆశిస్తున్నారు. శ్రీనగర్, పఠాన్‌కోట్, రాజౌరి, అఖ్‌నూర్, జమ్మూ, కుల్గాం, శ్రీ గంగానగర్, బుద్గాంలలో సాధారణ పరిస్థితికి అద్దం పడుతూ అనేక దృశ్యాలు ఆన్‌లైన్‌లో కనిపించాయి. సరిహద్దు ప్రాంతాలకే కాకుండా, చండీగఢ్‌తో సహా ఇతర ప్రాంతాల్లో ఆంక్షలు ఎత్తివేయడంతో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. రోజువారీ జీవితం తిరిగి ప్రారంభమైందని, పరిస్థితి ఇప్పుడు స్థిరంగా ఉందని చండీగఢ్ డిప్యూటీ కమిషనర్ తెలిపారు. దుకాణాలు, ఇతర వాణిజ్య సంస్థలు సాధారణ సమయాల ప్రకారం తెరిచి ఉండటానికి పోలీసులు అనుతించారు. అయితే పౌరులు ఎలాంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకుండా ఉండాలని డిప్యూటీ కమిషనర్ హెచ్చరించారు. పగటి పూట ఎలాంటి సమస్యలు లేవని, రాత్రి 7.30 గంటల తరువాత దుకాణాలు మూసివేస్తుండటంతో సాధారణ జనజీవనానికి ఇబ్బందేమీ లేదని, ప్రజల జీవనోపాధి కూడా ప్రభావితం కావడం లేదని జైసల్మేర్‌కు చెందిన ఓ వ్యక్తి వివరించారు.

ప్రధాని మోదీ ప్రసంగం... ఉత్కంఠ

సోమవారం రాత్రి ప్రధాని మోదీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగాన్ని టీవీలు, ఫోన్లలో ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు




ప్రయాగ్‌రాజ్‌లో
బికనేర్‌లో
హుబ్బళ్లిలో
జమ్మూలో
జమ్మూలో
హైదరాబాద్‌లో

యుద్ధమంటే బాలీవుడ్ సినిమా కాదు

దౌత్యానికే నా మొదటి ప్రాధాన్యం • ఆర్మీ మాజీ చీఫ్ నరవణె వ్యాఖ్యలు

పుణె: యుద్ధం, పర్యవసానాలపై భారత ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ నరవణె కీలక వ్యాఖ్యలు చేశారు. 'యుద్ధమంటే సరదా కాదు, బాలీవుడ్ సినిమా అంతకంటే కాదు'అని పేర్కొన్నారు. భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం నిలిచిపోవడంపై కొందరు చేస్తున్న విమర్శలకు ఆయనీ మేరకు బదులిచ్చారు. ఆదివారం పుణెలో జరిగిన ఒక కార్యక్రమంలో నరవణె మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌తోపాటు పీవోకేలోని ఉగ్ర శిబిరాలు, సైనిక మౌలిక వనరులపై భారత ఆర్మీ దాడులు, ఆ తర్వాత నాలుగు రోజులపాటు వైమానిక దాడులు, సరిహద్దుల్లో కాల్పులతో వారం పాటు దేశంలో ఉద్రిక్త పరిస్థితులు సాగాయని ఆయన తెలిపారు. 'అనంతరం సైనిక దాడులకు ఫుల్‌స్టాప్ పెడుతున్నట్లు రెండు దేశాలు ప్రకటనలు చేశాయి. ఇది మిలిటరీ ఆపరేషన్‌కు విరామమే తప్ప, కాల్పుల విరమణ వంటిది మాత్రం కాదని మరోసారి నేను చెప్పాలనుకుంటున్నా. వచ్చే మరికొన్ని రోజుల్లో పరిణామాలు ఎలా మలుపులు తిరుగాయో మీరే చూడండి'అని ఆయన పేర్కొన్నారు. సైనిక దాడులను నిలిపివేయడం మంచిది కాదంటూ కొందరు చేస్తున్న వాదనపై మాట్లాడుతూ 'యుద్ధంతో కలిగే వ్యయం అంకెలు, గణాంకాలను పరిశీలించండి. ఈ నష్టం మరీ ఎక్కువ కాకముందే, పూడ్చలేనంతగా మారడానికి ముందే యుద్ధాన్ని ఆపేయాలని తెలివైన వారెవరైనా అనుకుంటారు'



అని చెప్పారు. దాడుల ద్వారా పాక్ భూభాగంలోని ఉగ్ర స్థావరాలను మాత్రమే కాదు, వైమానిక స్థావరాల్లోని మౌలిక సౌకర్యాలకు సైతం తీవ్రంగా నష్టం కలిగించాం. వైఖరి మారకుంటే నష్టం మరింత ఎక్కువగా ఉంటుందని పాక్ గ్రహించేలా చేయగలిగామని భావిస్తున్నాను. అందుకే పాక్ ఆర్మీ చేసేదిలేక కాల్పుల విరమణ కోసం మన ఆర్మీతో సంప్రదింపుల బేరానికి వచ్చింది'అని ఆర్మీ మాజీ చీఫ్ వివరించారు.

రక్షణ వ్యయం కూడా పెట్టుబడే

'అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఇటువంటి దేశాలు రక్షణ కోసం ఎంత ఖర్చు చేయగలవు? రోజూ టీవీల్లో చూసే సమస్యల పరిష్కారానికి ఖర్చు చేయాలా? విద్య, ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రత, పారిశుధ్యం, ఇంకా ఇతర చాలా ముఖ్యమైన అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలా?అని ఆయన ప్రశ్నించారు. 'మన బడ్జెట్‌లో రక్షణ రంగం వాటా 15 శాతం వరకు ఉంటోంది. ఇదీ ఒక రకమైన పెట్టుబడే. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఇలాంటి బ్యాకప్ ప్లాన్ అవసరం. గతవారం ఆపరేషన్ సిందూర్‌తో అటువంటి ప్రణాళిక మనకు ఉందనే విషయం స్పష్టమైంది. రక్షణ బలగాలు సర్వసన్నద్ధంగా, ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటే మనపై దాడి చేయాలనుకునే వాళ్లు ఒకట్రెండు సార్లు ఆలోచిస్తారు'అని ఆర్మీ మాజీ చీఫ్ నరవణె వివరించారు.

సామాజిక కోణం మరువరాదు

యుద్ధంతో వాటిల్లే నష్టాల్లో సామాజికపరమైన కోణం కూడా ఉందన్న జనరల్ నరవణే..'ఇతరత్రా నష్టాలతోపాటు యుద్ధంతో ప్రాణ నష్టం సైతం ఎక్కువగా ఉంటుంది. తల్లిదండ్రులను కోల్పోయే చిన్నారులుంటారు. ఇటువంటి నష్టాన్ని ఎవరూ పట్టించుకోరు. సన్నిహితులను కోల్పోయిన వారిని ఆ ఆవేదన జీవితాంతం వెంటాడుతూనే ఉంటుంది. యుద్ధ దృశ్యాలను దగ్గర్నుంచి చూసేవారు పీటీఎస్‌డీ అనే మానసిక రుగ్మత బారినపడతారు. దీన్నుంచి బయటపడేందుకు కనీసం 20 ఏళ్లపాటు వీరికి చికిత్స కొనసాగించాల్సి ఉంటుంది'అని వివరించారు.

యుద్ధం చివరి అస్త్రం

ఆదేశాలొస్తే వెంటనే కదనరంగంలోకి దూకేందుకు సిద్ధంగా ఉన్నానన్న నరవణె..ఈ విషయంలో తన మొట్టమొదటి ప్రాధాన్యం దౌత్యానికే ఉంటుందన్నారు. 'ఇతర దేశాలతో సమస్యలకు చర్చల ద్వారానే పరిష్కారం కనుగొనాలే తప్ప, యుద్ధానికి వెళ్లరాదు, హింస పరిష్కారం కాదు'అని కుండబద్దలు కొట్టారు. 'యుద్ధం ఆషామాషీ కాదు. మన బాలీవుడ్ సినిమా కాదు. చాలా సీరియస్ వ్యవహారం. చిట్టచివరి అవకాశం లేక అస్త్రంగా మాత్రమే యుద్ధానికి దిగాల్సి ఉంటుంది. ఇది యుద్ధాల శకం కాదని మన ప్రధాని మోదీ చెప్పింది ఇందుకే. కొందరు మూర్ఖులు యుద్ధాన్ని మనపై రుద్దారు. యుద్ధంపై మనం ఉత్సాహం చూపరాదు'అని ఆయన అన్నారు.

జైళ్ల నుంచి జర్నలిస్టులను విడిచిపెట్టాలి

- పత్రికా స్వాతంత్ర్యం విలువైన కానుక
- మొట్టమొదటి మీడియా భేటీలో పోప్ లియో 14

వాటికన్ సిటీ: జైళ్లలో ఉన్న జర్నలిస్టులందరినీ వెంటనే విడుదల చేయాలని నూతన పోప్ లియో 14 పిలుపునిచ్చారు. పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం మనకున్న విలువైన కానుకలని ఆయన నొక్కి చెప్పారు. మొట్టమొదటిసారిగా ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. వాటికన్ సిటీలో ఆడిటోరియంలోకి ఆయన ప్రవేశించడంతోనే అందరూ లేచి నిలబడి చప్పట్లతో స్వాగతం పలికారు. శాంతి బలోపేతమయ్యేలా, యుద్ధాన్ని తిరస్కరించేలా రాయాలని, అణగారిన వారికి గొంతుకగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా సత్యాన్ని కనుగొనే క్రమంలో జైళ్ల పాలైన జర్నలిస్టులకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఇటువంటి వారిని వెంటనే విడుదల చేయాలని ఆయన పిలుపునివ్వగానే ప్రాంగణమంతా చప్పట్లతో ప్రతిధ్వనించడం విశేషం. 'ఇటువంటి వారిని చర్చి గుర్తిస్తుంది. ప్రాణాలను సైతం పణంగా పెట్టి యుద్ధం పురోగతిని గురించి బయటి ప్రపంచానికి తెలిపే వారి గురించే నా తపనంతా. గౌరవం, న్యాయం, ప్రజల సమాచార హక్కును కాపాడే ధీరులు వీరంతా. ఎందుకంటే, సమాచారం ఉంటేనే కదా ఎంపికలో స్వేచ్ఛ ఉండేది!'అని పోప్ పేర్కొన్నారు. మనం ఇతరులను చూసే విధానం, వారి మాట వినడం, వారి గురించి మాట్లాడే విధానం ద్వారా శాంతి మనతోనే ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. పోప్ ఎన్నికను కవర్ చేసేందుకు ప్రపంచ దేశాల నుంచి తరలివచ్చిన సుమారు 6వేల మంది పాత్రికేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రారంభంలో కొద్ది సేపు ఇంగ్లిష్‌లో మాట్లాడిన ఆయన..ఆ తర్వాత మొత్తం ఇటాలియన్‌లోనే కొనసాగించారు. ముందు వరుసల్లో ఉన్న కొందరు జర్నలిస్టులను పోప్ లియో 14 పలకరించారు. హాలు నుంచి తిరిగి బయటకు వెళ్లేటప్పుడు కొందరితో కరచాలనం చేశారు. ఆటోగ్రాఫ్‌లపై సంతకం చేశారు. కొందరితో సెల్ఫీలకు పోజిచ్చారు.



వాటికన్ సిటీలో జర్నలిస్టులతో మాట్లాడుతున్న పోప్ లియో 14

ప్రేమికుడి సాయంతో పదేళ్ల కొడుకును చంపిన తల్లి

గౌహతి: ప్రపంచమంతా ఆదివారం మాతృదినోత్సవాన్ని జరుపుకొన్నది. కానీ.. అస్సాంలో మాత్రం కన్న తల్లే కర్కశంగా ప్రాణాలు తీసింది. ఆదివారం గౌహతిలో సూట్‌కేస్‌లో పదేళ్ల బాలుడి మృతదేహం దొరకడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గౌహతిలోని అటవీశాఖ కార్యాలయ సమీపంలోని నిర్జనదారిలో చెత్త ఏరుతున్న ఓ వ్యక్తికి సూట్‌కేస్ దొరికింది. తెరిచి చూడగా బాలుని మృతదేహం ఉంది. బాలుడిని నవోదయ జాతీయ విద్యాలయంలో ఐదో తరగతి చదువుతున్న బాలుడు మృణ్‌మోయ్ బర్మన్‌గా గర్తించారు. ప్రాథమిక అనుమానం మేరకు.. పోలీసులు బాలుని తల్లి దీపాలి రాజ్‌బోంగ్శి, ఆమె ప్రేమికుడు జ్యోతిమోయ్ హలోయ్‌లను అదుపులోకి తీసుకున్నారు. మొదట తన కొడుకు అదృశ్యమయ్యాడని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశానని చెప్పిన దీపాలి.. తరువాత విచారణలో ప్రేమికుడితో కలిసి బాలుడిని హత్య చేసినట్లు అంగీకరించింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం.. 13 మంది మృతి

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో రెండు ట్రక్కులు ఢీకొన్న ఘటనలో 13 మంది చనిపోగా 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో నలుగురు చిన్నారులు, తొమ్మిది మంది మహిళలున్నారు. రాయ్‌పూర్–బలోడాబజార్ రహదారిపై సారాగావ్ సమీ పంలో ఆదివారం అర్ధరాత్రి దాటాక చోటుచేసుకుంది. చటౌడ్ గ్రామానికి చెందిన ఓ కుటుంబం బన్సారి గ్రామంలో జరిగిన వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా వీరి ట్రక్కు ప్రమాదానికి గురైంది. దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

అమెరికా మధ్యవర్తిత్వంపై కేంద్రం సమాధానమివ్వాలి: శరద్ పవార్

ముంబై: పాకిస్తాన్‌తో తలెత్తిన యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో అమెరికా మధ్యవర్తిత్వానికి అంగీకరించడంపై కేంద్రం వెంటనే వివరణ ఇవ్వాలని ఎన్‌సీపీ(ఎస్‌పీ) నేత, రక్షణ శాఖ మాజీ మంత్రి శరద్ పవార్ డిమాండ్ చేశారు. 'మన దేశానికి సంబంధించిన విషయంలో అమెరికా ప్రభుత్వం బహిరంగంగా మాట్లాడటం ఇదే మొదటిసారి. ఇదేమంత మంచి విషయం కాదు'అని ఆయన ట్రంప్ చేసిన కాల్పుల విరమణ అంగీకార ప్రకటనపై వ్యాఖ్యానించారు. ద్వైపాక్షిక సమస్యల్లో మూడో దేశం ప్రమేయాన్ని అంగీకరించరాదని సిమ్లా ఒప్పందం సైతం స్పష్టం చేసిందని ఆయన గుర్తు చేశారు. అయినప్పటికీ, అమెరికా ప్రభుత్వం జోక్యం చేసుకోవడంపై కేంద్రం వెంటనే సమాధానం చెప్పాలన్నారు. పహల్గాం ఉగ్ర దాడి అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు వెంటనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని, అఖిల పక్ష భేటీని ఏర్పాటు చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌ను శరద్ పవార్ సమర్థించారు.

వివాదాస్పద పోస్ట్‌ను తొలగించిన కాంగ్రెస్

బెంగళూరు: జమ్మూకశ్మీర్‌ను పాకిస్తాన్‌లో ఉన్నట్లు చూపుతూ సోషల్ మీడియాలో కర్ణాటక కాంగ్రెస్ పార్టీ పెట్టిన పోస్ట్‌పై వివాదం చెలరేగింది. పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ రుణం మంజూరును ఆపడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విఫలమైందంటూ కర్నాటక కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేసింది. ఇందుకు సంబంధించి అప్‌లోడ్ చేసిన మ్యాప్‌లో జమ్మూకశ్మీర్ పాకిస్తాన్‌లో ఉంది. వివాదంపై డిప్యూటీ సీఎం శివకుమార్ స్పందించారు. 'ఇది చాలా తప్పు. చిన్న పొరపాటు దొర్లింది. ఆ పోస్ట్‌ను తొలగించారు. ఎవరో ఈ తుంటరి పని చేశారు'అని పేర్కొన్నారు. దీనిపై బీజేపీ మండిపడింది. పాపపు పాకిస్తాన్‌పై కర్ణాటక కాంగ్రెస్ మరోసారి ప్రేమను చాటుకుందని, ఆ పార్టీ ఐటీ విభాగంలో పాక్ ఉగ్రమూకల స్లీపర్‌సెల్ ఉందంటూ వ్యాఖ్యానించింది. పహల్గాం ఉగ్రదాడికి బదులుగా యుద్ధం అవసరం లేదని సీఎం సిద్దరామయ్య అన్నారని గుర్తు చేసింది.

నకిలీ బీఎస్‌ఎఫ్ జవాన్ పట్టివేత

గ్వాలియర్: సన్నిహిత కుటుంబసభ్యులకు సైతం తెలియకుండా బీఎస్‌ఎఫ్ జవానుగా చలామణీ అవుతున్న ఓ వ్యక్తిని మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో పట్టుకున్నారు.యూపీలోని మైన్‌పూర్ జిల్లా ఖిదార్‌పూర్ గ్రామానికి చెందిన రాహుల్ సింగ్ జాతవ్(26) 2022లో జరిగిన బీఎస్‌ఎఫ్ పరీక్ష రాశాడు. అయితే, ఎంపిక కాలేకపోయాడు. ఇంట్లో మాత్రం బీఎస్‌ఎఫ్‌కు ఎంపికైనట్లు చెప్పి నమ్మించాడు. జాతవ్ అప్పటి నుంచి జవాను యూనిఫాంతోనే తిరుగుతున్నాడు. అనుమానం వచ్చిన పోలీసులు ఆదివారం గ్వాలియర్ జిల్లా బిలావువా పోలీసులు మకోడా గ్రామం వద్ద ఉండగా జాతవ్‌ను పట్టుకున్నారు. బీఎస్‌ఎఫ్‌కు సంబంధించిన ఎలాంటి గుర్తింపు కార్డును అతడు చూపలేకపోయాడు. పరీక్ష ఫెయిలైన విషయం ఇంట్లోవాళ్లకు చెప్పలేకనే ఇలా జవాను యూనిఫాంతో తిరుగుతున్నట్లు అంగీకరించాడని స్టేషన్ అధికారి ఇలా టాండన్ తెలిపారు. జాతవ్ యూనిఫాం ఎలా సంపాదించాడు? ఎవరినైనా మోసం చేశాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అఫ్గానిస్తాన్‌లో చెస్‌ను నిషేధించిన తాలిబన్లు

కాబూల్: అఫ్గానిస్తాన్‌లో తాలిబన్ ప్రభుత్వం చెస్‌ను నిషేధించింది. జూదం వంటి ఈ ఆట.. ఇస్లామిక్ చట్టం షరియా ప్రకారం చట్ట విరుద్ధమని తాలిబన్ క్రీడా డైరెక్టరేట్ తెలిపింది. మతపరమైన ఆందోళనలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ ఆందోళనలు పరిష్కారమయ్యే వరకు, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అఫ్గానిస్తాన్‌లో చెస్ నిషేధంలో ఉంటుందని తేల్చి చెప్పింది. ఇప్పటికే తాలిబన్లు దేశంలో అనేక క్రీడలకు పరిమితులు విధించారు. హింసాత్మకమైనది, ఇస్లా ప్రకారం సమస్యాత్మమైనదంటూ మార్షల్ ఆర్ట్స్‌ను నిషేధించారు. ఇక మహిళలకు మొత్తం క్రీడల నుంచే దూరం పెట్టారు. ఈ నేపథ్యంలో చెస్‌పై నిషేధం చర్చనీయాంశమైంది. ఇటీవలి కాలంలో కాబూల్‌లోని అజీజుల్లా గుల్జాదా కేఫ్ చెస్ పోటీలు నిర్వహించింది. ఇతర ముస్లిం మెజారిటీ దేశాల్లోనూ చెస్ ఆడతారని, అంతర్జాతీయ స్థాయిలో ఆటగాళ్లు ఉన్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ నిషేధం తన వ్యాపారంతోపాటు ఆటను ఆస్వాదించేవారిని దెబ్బతీస్తుందని.. అయినా తాను నిషేధాన్ని గౌరవిస్తానని వెల్లడించారు. యువతకు పెద్దగా కార్యకలాపాలు లేవని, దీంతో కొందరు యువకులు వచ్చి ఓ కప్పుటీ తాగి, స్నేహితులతో చెస్ ఆడతారని వెల్లడించారు.

స్కూలుపై మయన్మార్ సైన్యం దాడి 20 మంది విద్యార్థులు దుర్మరణం

బ్యాంకాక్: మయన్మార్ సైన్యం సోమవారం ఓ పాఠశాల భవనంపై జరిపిన వైమానిక దాడిలో 20 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోయారు. భారత్ సరిహద్దులకు సమీపంలోని సగయింగ్ ప్రాంతంలో దారుణం చోటుచేసుకుంది. డెపాయిన్ పట్టణ సమీపంలోని గ్రామంపై జరిగిన ఈ దాడిలో 50 మంది విద్యార్థులు గాయపడినట్లు ప్రైవేట్ మీడియా సంస్థలు తెలిపాయి. ప్రజాస్వామ్య అనుకూల వాదులు ఈ స్కూలును నడుపుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం, ప్రభుత్వ మీడియా ఈ దారుణంపై స్పందించలేదు. 2021లో అంగ్‌సాన్ సుకీ సారథ్యంలోని ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూల్చేసిన సైన్యం అధికారాన్ని హస్తగతం చేసుకుంది. సాయుధ గ్రూపులకు వ్యతిరేకంగా సైనిక జుంటా భారీ వైమానిక దాడులు కొనసాగిస్తోంది. ఆర్మీ దాడుల్లో ఇప్పటి వరకు కనీసం 6,600 మంది పౌరులు చనిపోయినట్లు అంచనా.



ధ్వంసమైన స్కూలు భవనంలో పిల్లల బ్యాగులు

ప్రధాని ప్రసంగంలో ట్రంప్ ప్రస్తావనేదీ?: సిబల్

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో భారత్, పాకిస్తాన్ సంక్షోభంలో తలదూర్చిన అమెరికాను గురించీ, అధ్యక్షుడు ట్రంప్ గురించీ ఎలాంటి ప్రస్తావన లేకపోవడాన్ని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ ప్రశ్నించారు. కొద్దిసేపటి ముందే ట్రంప్ చేసిన వ్యాఖ్యలపైనా మోదీ తన ప్రసంగంలో బదులివ్వలేదన్నారు. రెండు దేశాల మధ్య కాల్పులు విరమణకు కుదిరిన అవగాహనపైనా ప్రధాని ఎలాంటి వివరాలు దేశ ప్రజలకు వెల్లడించ లేదన్నారు. ఇటువంటి మరో ఘటన జరిగితే తగు రీతిలో బుద్ధి చెబుతామంటూ ప్రధాని మోదీ చెప్పడంపై సిబల్ మండిపడ్డారు. దీనర్థం, ఉగ్రవాదం అంతం కాలేదని చెప్పడమేనని దెప్పిపొడిచారు. పహల్గాం, అంతకుముందు పుల్వామా ఘటనలకు బాధ్యత ఎవరిదని ఆయన ప్రశ్నించారు. అస్సలు ఉగ్రవాదమే లేదు, అదసలు సమస్యే కాదన్నట్లుగా డొనాల్డ్ ట్రంప్ మాట్లాడారని సిబల్ వ్యాఖ్యానించారు.

పార్లమెంట్‌ను సమావేశపర్చాలి: ఖర్గే పునరుద్ఘాటన

కలబురగి(కర్నాటక): పహల్గాం ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్, సరిహద్దుల్లో కాల్పులు, కాల్పుల విరమణ తదితర కీలక పరిణామాలపై చర్చకు తక్షణమే ప్రత్యేక పార్లమెంట్ సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. తమ అగ్ర నేత రాహుల్ గాంధీ కూడా ఇదే డిమాండ్ చేశారన్నారు. దేశ ప్రజలను కాపాడేందుకు తీసుకున్న చర్యలపైనా చర్చ జరగాలని ఆయన పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూద్దామని చెప్పారు. కాల్పుల విరమణకు భారత్ కట్టుబడి ఉండగా పాకిస్తాన్ మాత్రం ఉల్లంఘించి, ప్రజలను కష్టాలకు గురి చేసిందని చెప్పారు. నేరుగా పోరాటకుండా ఉగ్రవాదాన్ని ఎగదోస్తోందని పాక్‌పై మండిపడ్డారు. 'టీవీలో, బహిరంగ సభల్లోనూ మాట్లాడిన మోదీ ఇదే విషయాన్ని ఆయన పార్లమెంట్‌లోనూ చెప్పాలి. అందుకే పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశపర్చాలని లేఖలు రాశాం. ఇప్పటి వరకు సమాధానం రాలేదు'అని ఖర్గే చెప్పారు. 'మన విషయాల్లో వేరే దేశం ఎన్నడూ జోక్యం చేసుకోలేదు. దీనిపై సమయం వచ్చినప్పుడు మాట్లాడుతా. దేశ ప్రయోజనాల రీత్యా ఇలాంటి విషయాలను కొన్ని వేదికలపైనా మాట్లాడాలి'అంటూ ట్రంప్ మధ్యవర్తిత్వ వ్యాఖ్యలపై ఖర్గే స్పందించారు.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐహెచ్ఎంసీఎల్‌లో 49 ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్(ఐహెచ్ఎంసీఎల్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఇంజనీర్(ఐటీఎస్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 49.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీలో(ఐటీ /కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్/డేటా సైన్స్ అండ్ ఏఐ), గేట్‌లో ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 02.06.2025 నాటికి 21 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.40,000 నుంచి 1,40,000
» ఎంపిక విధానం: గేట్ స్కోర్‌లో మెరిట్ ఆధారంగా
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 02.06.2025
» వెబ్‌సైట్: https://www.birac.nic.in

సీపీఆర్ఐ, బెంగళూరులో 44 పోస్టులు

బెంగళూరులోని సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీపీఆర్ఐ).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 44.
» పోస్టుల వివరాలు: సైంటిఫిక్ అసిస్టెంట్-4, ఇంజనీరింగ్ అసిస్టెంట్-8,టెక్నీషియన్ గ్రూప్ 1-6, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్-1, అసిస్టెంట్ గ్రేడ్2-23, అసిస్టెంట్ లైబ్రేరియన్-2.
» వయసు: సైంటిఫిక్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు, టెక్నీషియన్‌కు 28 ఏళ్లు, ఇతర పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 25.05.2025
» వెబ్‌సైట్: https://cpri.res.in

బార్క్ ముంబైలో డిప్లొమా కోర్సులో ప్రవేశాలు

ముంబైలోని ట్రాంబేలోని భారత అణుశక్తి విభాగానికి చెందిన బాబా అణు పరిశోధనా కేంద్రం, రేడియోలాజికల్ ఫిజిక్స్ అండ్ అడ్వైజరీ డివిజన్ రేడియోలాజికల్ ఫిజిక్స్‌లో డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: 30.
» అర్హత: కనీసం 60 శాతం మార్కులతో బీఎస్సీ, ఎంఎస్సీ లేదా ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ(ఫిజిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
» గరిష్ఠ వయో పరిమితి: 01.08.2025 నాటికి 26 ఏళ్లు మించకూడదు.
» స్టైపెండ్: నెలకు రూ.30,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 13.05.2025
» రాతపరీక్ష తేది: 22.06.2025.
» ఇంటర్వ్యూ తేదీలు: 23.06.2025 నుంచి 25.06.2025 వరకు
» కోర్సు ప్రారంభం: 2025 ఆగస్టు మొదటి వారం
» వెబ్‌సైట్: https://barc.gov.in

బీఈఎంఎల్, బెంగళూరులో అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్(బీఈఎంఎల్).. ఆఫీసర్/అసిస్టెంట్ మేనేజర్(గ్రేడ్ 2, గ్రేడ్ 3) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 06.
» పోస్టుల వివరాలు: ఆఫీసర్/అసిస్టెంట్ మేనేజర్(హెచ్ఆర్) గ్రేడ్2-02, ఆఫీసర్/అసిస్టెంట్ మేనేజర్(హెచ్ఆర్) గ్రేడ్3-04.
» అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ/పీజీడీఎం/ఎంఏ ఉత్తీర్ణులవ్వాలి
» వయసు: ఆఫీసర్ అసిస్టెంట్ పోస్టుకు 29 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు 30 ఏళ్లు మించకూడదు. » వేతనం: నెలకు ఆఫీసర్ అసిస్టెంట్‌కు రూ.40,000 నుంచి రూ.1,40,000, అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.50,000 నుంచి 1,60,000.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 14.05.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.05.2025.
» వెబ్‌సైట్: www.bemlindia.in

ఎస్ఎం పోర్టు, కోల్‌కతాలో వివిధ పోస్టులు

కోల్‌కతాలోని శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ పోర్టు(ఎస్ఎంపీ) ఒప్పంద ప్రాతిపదికన క్యాబిన్ అసిస్టెంట్, పాయింట్స్ మెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » మొత్తం పోస్టుల సంఖ్య: 09.

» పోస్టుల వివరాలు: క్యాబిన్ అసిస్టెంట్-05, పాయింట్స్‌మెన్-04.
» అర్హత: పోస్టును అనుసరించి ఏదైనా గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్మీడియట్ లేదా దానికి సమానమైన ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు:01.04.2025 నాటికి 62 ఏళ్లు ఉండాలి
» వేతనం: నెలకు క్యాబిన్ అసిస్టెంట్‌కు రూ. 40,000, పాయింట్స్‌మెన్ పోస్టుకు 35,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ప్రొఫిషియన్సీ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సీనియర్ డిప్యూటీ సెక్రటరీ-2, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్ట్, కోల్‌కతా, 15వ స్ట్రాండ్ రోడ్ వద్ద, కోల్‌కతా-700001 చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 16.05.2025.
» వెబ్‌సైట్: https://smp.smportkolkata.in

ఎస్‌బీఐలో ఆఫీసర్ కొలువు

బ్యాంకు ఉద్యోగార్థులకు శుభవార్త. దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ).. భారీగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా దేశవ్యాప్తంగా 2,964 సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు కనీసం రెండేళ్ల సంబంధిత అనుభవమున్న వారు ఈ పోస్టులకు పోటీ పడొచ్చు. ఎంపిక ప్రక్రియలో ప్రతిభ చూపి కొలువు ఖరారైతే ప్రారంభం నుంచే ఆకర్షణీయ వేతనం అందుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఎస్‌బీఐ సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్టుల వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర సమాచారం..

» 2,964 సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» ఏదైనా డిగ్రీతోపాటు కనీసం రెండేళ్ల అనుభవం తప్పనిసరి
» ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక

✦ మొత్తం పోస్టుల సంఖ్య: 2,964.
✦ పోస్టుల వివరాలు: సర్కిల్ బేస్డ్ ఆఫీసర్స్.
✦ తెలుగు రాష్ట్రాల్లో పోస్టుల సంఖ్య: తెలంగాణకు సంబంధించి హైదరాబాద్ సర్కిల్‌లో 233 పోస్టులు, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి అమరావతి సర్కిల్‌లో 186 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఇంటిగ్రేటెడ్ డ్యుయెల్ డిగ్రీ కోర్సులు, మెడికల్, ఇంజనీరింగ్, చార్టర్డ్ అకౌంటెంట్, కాస్ట్ అకౌంటెంట్ వంటి కోర్సుల ఉత్తీర్ణులు కూడా దరఖాస్తుకు అర్హులే.

వయసు

30.04.2025 నాటికి 21-30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

అనుభవం

30.04.2025 నాటికి కనీస విద్యార్హతలు పొందిన అనంతరం ఏదైనా షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ లేదా రీజనల్ రూరల్ బ్యాంకులో ఆఫీసర్‌గా రెండేళ్ల అనుభవం ఉండాలి. దీనికి సంబంధించి ప్రస్తుత లేదా గత ఎంప్లాయర్ నుంచి జాబ్ ప్రొఫైల్ సర్టిఫికెట్‌ను అందించాల్సి ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ

నాలుగు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఆన్‌లైన్ పరీక్ష, స్క్రీనింగ్, ఇంటర్వ్యూ, లోకల్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్.

ఆన్‌లైన్ పరీక్ష

✦ రాత పరీక్షలో భాగంగా ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ టెస్ట్ 120 మార్కులకు, డిస్క్రిప్టివ్ టెస్ట్ 50 మార్కులకు ఉంటాయి. ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ పరీక్షలో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు-30 మార్కులకు, బ్యాంకింగ్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు-40 మార్కులకు, జనరల్ అవేర్‌నెస్/ఎకానమీ 30 ప్రశ్నలు-30 మార్కులకు, కంప్యూటర్ అప్టిట్యూడ్ 20ప్రశ్నలు-20 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ ఆబ్జెక్టివ్ పరీక్షలో ఎలాంటి నెగెటివ్ మార్కుల నిబంధన లేదు. అదేవిధంగా ఈ పరీక్షలో సెక్షనల్ అర్హత మార్కుల నిబంధన కూడా లేదు. అయితే మొత్తంగా కనీస అర్హత మార్కుల నిబంధన ఉంది. ఈ కనీస అర్హత మార్కులను బ్యాంక్ నిర్ణయిస్తుంది.
✦ డిస్క్రిప్టివ్ పరీక్ష: ఆబ్జెక్టివ్ పరీక్ష అనంతరం 50 మార్కులకు డిస్క్రిప్టివ్ పరీక్ష నిర్వహిస్తారు. ఇది ఇంగ్లిష్ భాషా నైపుణ్య పరీక్ష. ఇందులో లెటర్ రైటింగ్,ఎస్సే ఉంటాయి.రెండు ప్రశ్నలు అడుగు తారు. డిస్క్రిప్టివ్ పరీక్ష వ్యవధి 30 నిమిషాలు.

స్క్రీనింగ్

ఆన్‌లైన్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల ఆన్‌లైన్ దరఖాస్తులను, సర్టిఫికెట్లను బ్యాంకు ఏర్పాటు చేసే స్క్రీనింగ్ కమిటీ పరిశీలిస్తుంది. ఈ కమిటీ అభ్యర్థి పత్రాలను, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని.. సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ కొలువుకు తగిన అర్హతలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని తేలుస్తుంది. అనంతరం ఆన్‌లైన్ టెస్టులో సాధించిన మార్కుల ఆధారంగా సర్కిల్ వారిగా, కేటగిరీల వారీగా మెరిట్ లిస్టులను రూపొందిస్తుంది. ఇలా మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు.

50 మార్కులకు ఇంటర్వ్యూ

సర్కిల్ వారీగా, కేటగిరీల వారీగా పోస్టుల సంఖ్యకు మూడు రెట్ల మంది అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఈ ఇంటర్వ్యూకు 50 మార్కులు కేటాయించారు. ఇంటర్వ్యూలో అభ్యర్థులు కనీస అర్హత మార్కులు పొందాల్సి ఉంటుంది. కనీస అర్హత మార్కులను బ్యాంక్ నిర్ణయిస్తుంది.

తుది ఎంపిక ఇలా

ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూలో అర్హత సాధించిన అభ్యర్థులను తుది ఎంపికకు పరిగణనలోకి తీసుకుంటారు. తుది ఎంపికలో 100 మార్కులకు నార్మలైజేషన్ ప్రక్రియను అనుసరిస్తారు. మొత్తం 170 మార్కులకు జరిగిన ఆన్‌లైన్ టెస్టు(ఆబ్జెక్టివ్ టెస్ట్, డిస్క్రిప్టివ్ టెస్ట్)లో సాధించిన మార్కులను 75 మార్కులకు, అదేవిధంగా 50 మార్కులకు నిర్వహించిన ఇంటర్వ్యూలో పొందిన మార్కులను 25 మార్కులకు నార్మలైజేషన్' చేస్తారు. అంటే ఆన్‌లైన్ టెస్టుకు, ఇంటర్వ్యూకు 75 : 25 నిష్పత్తిలో వెయిటేజీ ఉంటుంది. వంద మార్కులకు సాధించిన మార్కుల ఆధారంగా తుది జాబితా రూపొందిస్తారు.

స్థానిక భాష పరీక్ష

ఇలా ప్రొవిజనల్ లిస్ట్‌లో నిలిచిన అభ్యర్థులకు లోకల్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్టు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న స్థానిక భాషలో చదవడం, రాయడంతోపాటు సదరు భాషపై ఉన్న అవగాహనను పరీక్షిస్తారు. ఇందులోనూ అర్హత సాధిస్తే కొలువు ఖరారైనట్లే. స్థానిక భాష పరీక్షలో అర్హత సాధించని వారికి ఆఫర్ లెటర్ ఇవ్వరు. అయితే పదో తరగతి లేదా 12వ తరగతిలో సదరు భాషను ఒక సబ్జెక్టుగా చదివినట్లు సర్టిఫికెట్లు సమర్పించిన అభ్యర్థులకు స్థానిక భాష పరీక్ష నుంచి మినహాయింపు లభిస్తుంది.


వేతనాలు

ఎంపిక ప్రక్రియలో విజేతలుగా నిలిచి కొలువు ఖరారు చేసుకున్న అభ్యర్థులకు ప్రారంభంలోనే మూల వేతనం నెలకు రూ.48,480 అందుతుంది. దీనితోపాటు డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర అలవెన్సులు, సౌకర్యాలు లభిస్తాయి.

కెరీర్

ఎంపికైన అభ్యర్థులకు 'సర్కిల్ బేస్డ్ ఆఫీసర్స్' హోదాలో కెరీర్ ప్రారంభమవుతుంది. వీరికి బ్యాంకులో చేరిన రోజు నుంచి ఆరు నెలల పాటు ప్రొబేషన్ పీరియడ్ ఉంటుంది. ప్రొబేషన్‌ను కూడా విజయవంతంగా పూర్తి చేసుకుంటే.. జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్ 1 హోదాలో బ్యాంకులో పూర్తి స్థాయి కొలువు ఖరారవుతుంది.

ప్రిపరేషన్ ఇలా



✦ ఇంగ్లిష్ లాంగ్వేజ్: మంచి స్కోర్ సాధించేందుకు అవకాశం ఉన్న విభాగం ఇది. ఇందులో మంచి మార్కుల కోసం రీడింగ్ కాంప్రహెన్షన్, క్లోజ్ టెస్ట్, పారా జంబుల్స్, ఎర్రర్ స్పాటింగ్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, వొకాబ్యులరీ, గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. రీడింగ్ కాంప్రహెన్షన్ కోసం ప్రామాణిక ఇంగ్లిష్ దినపత్రికలు, మ్యాగజీన్స్‌లో వ్యాసాలను చదవడంతోపాటు ప్రాక్టీస్ ద్వారా వేగాన్ని, కచ్చితత్వాన్ని పెంచుకునే ప్రయత్నం చేయాలి. దీంతోపాటు వొక్యాబులరీ పెంచుకోవడంపై దృష్టిపెట్టాలి. అలాగే గ్రామర్‌కు సంబంధించి టెన్సెస్, పార్ట్స్ ఆఫ్ స్పీచ్, సినానిమ్స్, యాంటానిమ్స్ తదితరాలపై పట్టు సాధించాలి. గత బ్యాంక్ పరీక్షల ప్రశ్న పత్రాలు సేకరించి ప్రాక్టీస్ చేయడం మేలు చేస్తుంది.
✦ బ్యాంకింగ్ నాలెడ్జ్: ఈ విభాగం నుంచి భారత్‌లో బ్యాంకింగ్ రంగం, ఆర్‌బీఐ, కరెన్సీ, బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, బ్యాంకుల రుణాలు, బీమా, భారత్‌లో ఫారిన్ బ్యాంకులు, స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, సిబిల్, ఎఫ్‌డీఐలు, ఫెరా, మనీ లాండరింగ్, ద్రవ్యోల్బణం తదితర అంశాలపై అవగాహన పెంచుకోవడంతోపాటు తాజా పరిణామాలను తెలుసుకోవాలి.
✦ జనరల్ అవేర్‌నెస్/ఎకానమీ: ఈ విభాగంలో మార్కుల కోసం గతేడాది కాలంగా జాతీయ, అంతర్జాతీయ తాజా పరిణామాలతోపాటు కరెంట్ అఫైర్స్, స్టాక్ జీకేపై పట్టు సాధించాలి.
✦ కంప్యూటర్ అప్టిట్యూడ్: ఇందులో కంప్యూటర్స్‌తో ప్రయోజనాలు, వాటి అనువర్తనాలు, బేసిక్ కంప్యూటర్ కాన్సెప్ట్‌లు, కంప్యూటర్ లాంగ్వేజెస్, కంప్యూటర్ సెక్యూరిటీ అండ్ వైరెస్‌లు, నెట్‌వర్కింగ్, ఇన్‌పుట్/అవుట్‌పుట్ డివైసెస్, ఏఐ వంటి తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

ముఖ్య సమాచారం

✦ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
✦ ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 29.05.2025
✦ ఆన్‌లైన్ టెస్ట్ హాల్‌టికెట్‌ల డౌన్‌లోడ్: జూలై 2025
✦ ఆన్‌లైన్ పరీక్ష తేది: జూలై 2025
✦ పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://bank.sbi/web/careers/currentopenings

విద్య, ఉద్యోగ సమాచారం

సీఎస్ఐఆర్ మద్రాస్ కాంప్లెక్స్‌లో జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టులు

చెన్నైలోని సీఎస్ఐఆర్-మద్రాస్ కాంప్లెక్స్‌లో జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ మొత్తం పోస్టుల సంఖ్య: 08.
✦ పోస్టుల వివరాలు: జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(జనరల్)-01, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(ఎఫ్-ఏ)-02, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(ఎస్-పీ)-01, జూనియర్ స్టెనోగ్రాఫర్-04.
✦ అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 10+2లో ఉత్తీర్ణతతో పాటు టైపింగ్ వచ్చి ఉండాలి.
✦ వయసు: 20.05.2025 నాటికి జేఎస్ఏకు 28 ఏళ్లు, జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు 30 ఏళ్లు మించకూడదు.
✦ వేతనం: నెలకు జేఎస్ఏ పోస్టులకు రూ.37,885, జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు రూ.51,408.
✦ ఎంపిక విధానం: ప్రొఫిషియన్సీ టెస్ట్, రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
✦ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
✦ ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 19.05.2025.
✦ ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 29.05.2025.
✦ వెబ్‌సైట్: https://www.csircmc.res.in

ఎస్ఎం పోర్టు, కోల్‌కతాలో అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

కోల్‌కతాలోని శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ పోర్టు(ఎస్ఎంపీ) ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ మొత్తం పోస్టుల సంఖ్య: 02.
✦ వేతనం: నెలకు రూ.75,000.
✦ అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
✦ వయసు: 29.05.2025 నాటికి 45 ఏళ్లు మించకూడదు.
✦ ఎంపిక విధానం: గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
✦ దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సీనియర్ డిప్యూటీ మేనేజర్(పి-ఐఆర్), హల్దియా డాక్ కాంప్లెక్స్, జవహర్ టవర్, పి.ఓ. హల్దియా టౌన్‌షిప్, పుర్బా మెదినీపూర్ జిల్లా, పశ్చిమ బెంగాల్-721607 చిరునామకు పంపించాలి.
✦ దరఖాస్తులకు చివరితేది: 29.05.2025.
✦ వెబ్‌సైట్: https://smp.smportkolkata.in

'కనుల కొలనులో దాగిన నీ రూపం'



కావ్య సరస్వతికి శోభను చేకూర్చేవి అలంకారాలు. 'అలం' శబ్దానికి 'కృ' ధాతువు చేరి 'అలంకారం' అనే రూపం సిద్ధించింది. అలంకారమంటే భూషణం అని అర్థం. ఇవి కావ్య సౌందర్యాన్ని పెంపొందించి, శోభను కలిగిస్తాయి. ఆలంకారకులు వీటిని ప్రధానంగా శబ్దాలంకారాలు, అర్థాలంకారాలని రెండు రకాలుగా విభజించారు. భోజుడు 'సరస్వతీ కంఠాభరణం'లో మూడు విధాలుగా పేర్కొన్నాడు. శబ్ద, అర్థాలంకాలతో పాటు ఉభయాలంకారాలను (శబ్దార్థ మిశ్రమాలు) వివరించాడు. ఆ తర్వాత మమ్మటుడు, రుయ్యకుడు, విశ్వనాథుడు, విద్యానాథుడు లాంటివారు మిశ్రాలంకారాల గురించి ప్రస్తావించారు.

అలంకారాలు

అలంకారాల్లో ప్రధానమైనవి శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు.

శబ్దాలంకారాలు

శబ్ద వైచిత్రీ రామణీయకత వల్ల కావ్యానికి సౌందర్యాన్ని చేకూర్చేవి శబ్దాలంకారాలు. సంగీతానుగుణ్యమైన శ్రవణ పేయతతో పాఠకులకు ఆహ్లాదం కలిగించేవి శబ్దాలంకారాలు. ఇవి ఆరు రకాలు.

1. వృత్త్యనుప్రాసం 2. ఛేకానుప్రాసం
3. లాటాను ప్రాసం 4. యమకం
5. ముక్తపదగ్రస్తం 6. అంత్యానుప్రాసం

1. వృత్త్యనుప్రాసం: ఒకటి లేదా రెండు మూడు వర్ణాలు పునరుక్తాలై ఆహ్లాదం కలిగిస్తే అది వృత్త్యనుప్రాసం.
ఉదా: 'హరిహరి సిరియురమున గలహరి'
ఇందులో 'ర' కారం పునరుక్తమై ఆహ్లాదం కలిగిస్తోంది. అందువల్ల ఇది వృత్త్యనుప్రాసం.
2. ఛేకానుప్రాసం: అర్థ భేదం ఉన్న రెండేసి హల్లులు అవ్యవధానంగా పునరుక్తమై ఆహ్లాదాన్ని కలిగిస్తే అది ఛేకానుప్రాసం. ఛేకులంటే పండితులు అని అర్థం. ఛేకులకు ఆహ్లాదం కలిగించే అనుప్రాసం ఛేకానుప్రాసం.
ఉదా: 'కందర్పదర్పములగు సందర దరహాస రుచులు'. ఈ లక్ష్యంలో దర్ప-దర అనే రెండేసి హల్లులు అర్థభేదంతో పునరుక్తమయ్యాయి. కాబట్టి ఇది ఛేకానుప్రాసం.
3. లాటాను ప్రాసం: తాత్పర్య భేదం ఉన్న శబ్దాలు పునరుక్తాలై ఆహ్లాదాన్ని కలిగిస్తే అది లాటానుప్రాసం.
ఉదా: 'కమలాక్షునర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ'
'కరములు', 'జిహ్వ' శబ్దాలు తాత్పర్య భేదంతో పునరుక్తాలైనందువల్ల ఇది లాటానుప్రాసం.
4. యమకం: సమాన స్వరసహితాలైన వ్యంజనాలు అర్థభేదంతో అవ్యవహితంగా పునరుక్తాలైతే అది యమకం.
ఉదా: 'మన సుభద్ర మనసుభద్రమయ్యె'
సుభద్ర అనే అక్షరాలు అర్థభేదంతో అవ్యవహితంగా వచ్చాయి. కాబట్టి ఇది యమకం.
5. ముక్తపదగ్రస్తం: మొదటి పాదం చివరి పదం రెండో పాదంలో మొదటి పదంగా రావడాన్ని ముక్తపదగ్రస్తం అంటారు. అంటే విడిచిన పదాన్ని గ్రహించడం అని అర్థం.
ఉదా: 'సుదతీ నూతన మదనా
మదనా గతురంగ పూర్ణ మణిమయసదనా'
మొదటి పాదం చివర ఉన్న 'మదనా' పదం రెండోపాదం మొదటిపదంగా వచ్చింది. అందువల్ల ఇది ముక్తపదగ్రస్తం.
6. అంత్యానుప్రాసం: ప్రతి పాదం చివరన ఒకే అక్షరం లేదా పదం రావడాన్ని అంత్యాను ప్రాసం అంటారు.
ఉదా: కమనీయశుభగాత్రు - కంజాతదళనేత్రు
వసుధాకళత్రు - పావన చరిత్రు
'త్రు' అనే అక్షరం పాదాల చివర వచ్చినందు వల్ల ఇది అంత్యానుప్రాసం.

అర్థాలంకారాలు

అర్థ సౌందర్యం వల్ల కావ్య శోభను ద్విగుణీకృతం చేసేవి అర్థాలంకారాలు. అర్థం లేని శబ్ద సౌందర్యం ఆహ్లాదకరం కాదు. అర్థ ప్రధానమైన అలంకారాలు అర్థాలం కారాలు. వీటిలో ప్రధానమైనవి..

1. ఉపమాలంకారం: ఉపమాన, ఉపమేయా లకు మనోహరమైన సాదృశ్యాన్ని చెప్పడాన్ని ఉపమాలంకారం అంటారు. ఇందులో ఉపమేయం (ప్రస్తుతం), ఉపమానం (అప్రస్తుతం), సమాన ధర్మం (ఉపమేయ, ఉపమానాల్లో సమానంగా ఉండేది), ఉపమావాచకం (ఉపమేయ, ఉపమానాలకు సమాన ధర్మాన్ని సూచించేది) ఉంటాయి. వలెన్, పోలెన్, ఎంతయున్, కైవడి, భంగి, అట్లు, అనంగ మొదలైనవి ఉపమావాచకాలు. పైన పేర్కొన్న నాలుగు అంశాలుంటే దాన్ని పూర్ణోపమాలంకారం అంటారు. ఏదైనా ఒక అంశం లోపిస్తే దాన్ని లుప్తోపమాలంకారం అంటారు.
భరతుడు ఉపమాలంకారంలో ఐదు భేదాలను చెప్పాడు. మమ్మటుడు లాంటి ఆలంకారకులు 25 భేదాలను పేర్కొన్నారు. దండి 32 భేదాలను చెప్పాడు. చంద్రాలోకకర్త చెప్పిన ఏడు భేదాలు ప్రాచుర్యంలో ఉన్నాయి.
అలంకారాల్లో ప్రసిద్ధమైంది, ప్రాచీన మైంది ఉపమాలంకారం. దీన్ని ప్రయోగించని కవులు లేరు. కాళిదాసు లాంటి సంస్కృత కవులు విరివిగా ఉపయోగించారు. అందుకే 'ఉపమా కాళిదాసస్య' అనే నానుడి ప్రసిద్ధమైంది.
లక్ష్యం:
ఓ కృష్ణా! నీ కీర్తి హంసవలె ఆకాశ
గంగయందు మునుగుచున్నది
ఉపమేయం = కీర్తి, ఉపమానం = హంస, 'ఆకాశగంగయందు మునుగుట' ఉపమేయ ఉపమానాలు రెండింటిలో ఉన్నందువల్ల ఇది సమాన ధర్మం. ఉపమావాచకంలా ఇందులో నాలుగు అంశాలున్నందువల్ల ఇది 'పూర్ణోపమ అలంకారం'.
2. ఉత్ప్రేక్షాలంకారం: జాతి, గుణ, ధర్మ సామ్యం వల్ల ఉపమేయాన్ని ఉపమానంగా ఊహిస్తే అది ఉత్ప్రేక్షాలంకారం. ఇందులో ఉపమేయ ఉపమానాలతోపాటు ఉత్ప్రేక్షా వాచకం ఉంటుంది. తలంచెదన్, ఎంచెదన్, భావించెదన్, ఊహించెదన్, అనన్ మొదలైనవి ఉత్ప్రేక్షా వాచకాలు.
లక్ష్యం: "ఈ చీకటిని చక్రవాక విరహాగ్ని నుండి పుట్టిన ధూమమో అని తలంతును"
ఇందులో చీకటి ఉపమేయం, ధూమం ఉపమానం. ధూమం నల్లనిది, దృష్టిని ఆపుచేసేది. ఈ గుణసామ్యం వల్ల ఉపమేయమైన చీకటిని ఉపమానమైన ధూమంగా ఊహించారు. కాబట్టి ఇది ఉత్ప్రేక్షాలంకారం.
రూపకాలంకారం: ఉపమేయంలో ఉపమాన ధర్మాన్ని ఆరోపించడం లేదా ఉపమేయ ఉపమానాలకు భేదం లేనట్లుగా వర్ణించడం రూపకాలంకారం. ఇందులో రూపక సమాసం కూడా ఉంటుంది.
లక్ష్యం: రాజుపై లతాలలనలు కుసుమాక్షతలు చల్లిరి.
ఇందులో ఉపమేయమైన లతల్లో ఉపమానమైన లలనల ధర్మం ఆరోపించారు. ఉపమేయమైన కుసుమాల్లో ఉపమానమైన అక్షతల ధర్మాన్ని ఆరోపించారు. కాబట్టి ఇది రూపకాలంకారం.
4. అనన్వయాలంకారం: ఒక వస్తువు సాటి లేనిది అని చెప్పడానికి అదే వస్తువుతో పోల్చడాన్ని అనన్వయాలంకారం అంటారు. ఇందులో ఉపమేయమే ఉపమానంగా ఉంటుంది.
లక్ష్యం:
'మేరునగానికి సాటి మేరునగమే
సముద్రానికి సాటి సముద్రమే'
ఇందులో ఉపమేయమైన మేరునగమే ఉపమానంగా ఉంది. ఉపమేయమైన సముద్రమే ఉపమానంగా ఉంది. అందువల్ల ఇది అనన్వయాలంకారం.
5. స్వభావోక్తి: జాతి, గుణక్రియాదులను సహజ సిద్ధంగా, మనోహరంగా వర్ణించడాన్ని స్వభావోక్తి అలంకారం అంటారు.
లక్ష్యం: "ఉద్యానవనంలో జింకలు చెవులు రిక్కించి చంచల నేత్రాలతో సరోవరంలో నీళ్ల త్రాగుచున్నవి" ఇందులో జింకల స్థితిని మనోహరంగా, సహజసిద్ధంగా వర్ణించారు. అందువల్ల ఇది స్వభావోక్తి.
6. అర్థాంతరన్యాసాలంకారం:
విశేషాన్ని సామాన్యంతో లేదా సామాన్యాన్ని విశేషంతో సమర్థించి వర్ణిస్తే.. అది అర్థాంతరన్యాసాలంకారం.
లక్ష్యం: 1
"ఆంజనేయుడు సముద్రాన్ని దాటాడు
మహాత్ములకు అసాధ్యమైంది లేదు కదా!"
ఆంజనేయుడు సముద్రాన్ని దాటడం విశేష విషయం. మహాత్ములకు సాధ్యం కానిది లేదు అనే సామాన్య విషయంతో సమర్థించినందువల్ల ఇది అర్థాంతరన్యాస అలంకారం.
లక్ష్యం: 2
పూలతో కూడిన నారకు వాసన కలిగినట్లు
సజ్జన సాంగత్యం వల్ల సర్వశ్రేయాలు కలుగుతాయి.
పూలతో కూడిన నారకు వాసన కలగడం సామాన్య విషయం. సజ్జన సాంగత్యం వల్ల సర్వశ్రేయాలు కలుగుతాయి అనే విశేష విషయంతో దీన్ని సమర్థించడం వల్ల ఇది అర్థాంతరన్యాస అలంకారం.
7. అతిశయోక్తి అలంకారం: లోకస్థితిని మించి అతిశయించి వర్ణిస్తే అది అతిశయోక్తి అలంకారం.
లక్ష్యం: ఆ పట్టణమందలి సౌధాలు చంద్ర మండలాన్ని తాకుచున్నవి. సహజస్థితిని మించి వర్ణించడం వల్ల ఇది అతిశయోక్తి.
8. శ్లేషాలంకారం: అనేక అర్థాలకు ఆశ్రయ మైంది శ్లేషాలంకారం. చమత్కారమైన పదాల విరుపులతో అనేక అర్థాల వల్ల ఆహ్లాదం కలిగించేది శ్లేష.
లక్ష్యం: 'రాజు కువల యానందకరుడు'
ఇందులో రాజు శబ్దానికి పాలకుడు, చంద్రుడు అని; 'కువలయం' పదానికి భూమి, కలువ అనే అర్థాలున్నాయి. రాజు భూ ప్రజలకు సుపరిపాలనతో ఆనందం కలిగించేవాడని ఒక అర్థం. చంద్రుడు కలువలను వికసింపజేసి ఆనందం కలిగించే వాడని మరో అర్థం ఉన్నందువల్ల ఇది శ్లేషాలంకారం.
9. సమాసోక్తి అలంకారం: ప్రస్తుత వర్ణన వల్ల అప్రస్తుత విషయం స్ఫురిస్తే అది సమాసోక్తి అలంకారం.
లక్ష్యం: చంద్రుడు రక్తుడై ఐంద్రీముఖమును ముద్దిడుచున్నాడు. ప్రస్తుత వర్ణన వల్ల పరకాంతా చుంబనాభిలాషియైన కాముకుడు స్ఫురిస్తున్నందువల్ల ఇది సమాసోక్తి అలంకారం.
10.దీపకాలంకారం: ఉపమేయ ఉపమా నాలకు (ప్రకృత, అప్రకృతాలకు) సాధారణ ధర్మంతో ఒకే అన్వయాన్ని కలిగిస్తే అది దీపకాలంకారం.
లక్ష్యం: "బ్రహ్మ రాత, విష్ణు చక్రం, ఇంద్రుడి వజ్రాయుధం, పండిత వాక్యం వ్యర్థం కాబోవు" పండిత వాక్యం వ్యర్థం కాదు అనే ఉపమేయంతో బ్రహ్మ రాత, విష్ణు చక్రం, ఇంద్రుడి వజ్రాయుధం లాంటి ఉపమే యాలను అన్వయించి చెప్పారు. అందువల్ల ఇది దీపకాలంకారం.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. విశేషాంశం-సామాన్యం అనే రెండింటితో ప్రవర్తించే అలంకారం?
1) రూపకం 2) వ్యాజస్తుతి
3) ఉత్ప్రేక్ష 4) అర్థాంతరన్యాసం
2. 'రాజ బింబాస్య రుక్మిణి తేజరిల్లె సానబట్టిన మకరాంకు శస్త్రమనగ'లోని అలంకారం?
1) ఉపమ 2) ఉత్ప్రేక్ష
3) రూపకం 4) అర్థాంతరన్యాసం
3. 'కనుల కొలనులో దాగిన నీ రూపం' అనేది?
1) యమకాలంకారం 2) అతిశయోక్తి
3) రూపకాలంకారం 4) ఉత్ప్రేక్ష


సమాధానాలు
1) 4; 2) 1; 3) 3.

మాదిరి ప్రశ్నలు

1. 'రక్షాదక్ష! విపక్ష శిక్షా' ఏ అలంకారం?
1) ఛేకానుప్రాసం 2) వృత్త్యనుప్రాసం
3) లాటానుప్రాసం 4) యమకం
2. 'మన సుభద్ర మనసుభద్రమయ్యె' ఇందులోని అలంకారం?
1) ముక్తపదగ్రస్తం 2) లాటానుప్రాసం
3) యమకం 4) అంత్యానుప్రాసం
3. 'శేషశాయికి మ్రొక్కు శిరముశిరము'లోని అలంకారం?
1) లాటానుప్రాసం 2) యమకం
3) ఛేకానుప్రాసం 4) వృత్త్యనుప్రాసం
4. 'కమనీయ శుభగాత్రు - కంజాత దళనేత్రు వసుధాకళత్రు - పావన చరిత్రు' లోని అలంకారం?
1) వృత్త్యనుప్రాసం 2) లాటానుప్రాసం
3) అంత్యానుప్రాసం 4) యమకం
5. యమకాలంకార లక్షణం?
1) అచ్చులు మారతాయి, హల్లులు మారవు
2) అచ్చులు మారవు, హల్లులు మారవు
3) అచ్చులు మారకూడదు, హల్లులు మారతాయి
4) అచ్చులు మారవచ్చు, హల్లులు మారవచ్చు
6. ఉభయాలంకారాలను మొదటగా పేర్కొన్న లాక్షణికుడు?
1) మమ్మటుడు 2) విశ్వనాథుడు
3) భోజుడు 4) విద్యానాథుడు

సమాధానాలు
1) 2; 2) 3; 3) 1; 4) 3;
5) 2; 6) 3.

గుండె సంకోచాన్ని ఏమంటారు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

రక్తం, రక్త ప్రసరణ

మానవ శరీరంలో ముఖ్యమైన ద్రవం రక్తం. 70 కిలోల బరువున్న ఆరోగ్యవంతుడైన పురుషుడిలో 5-6 లీటర్ల రక్తం ఉంటుంది. రక్తం అధ్యయనం హెమటాలజీ. రక్తం ద్రవ రూపంలోని సంయోజక కణజాలం. ఆహార పదార్థాలు, శ్వాస వాయువులు, వ్యర్థాలు, హార్మోన్ల రవాణాను రక్తం నిర్వహిస్తుంది. తెల్ల రక్తకణాలు ఉండటం ద్వారా రక్తం శరీర నిరోధక శక్తిలో పాల్గొంటుంది. రక్తంలో రెండు భాగాలు ఉంటాయి. అం దులో ఒకటి ప్లాస్మా. ఇది రక్తంలోని ద్రవభాగం. రక్తంలో 55 శాతం ప్లాస్మా ఉంటుంది. మిగిలిన 45 శాతం రక్తకణాలు ఉంటాయి. ప్లాస్మాలో 92 శాతం నీరు, మిగిలిన 8 శాతం ఘనపదార్థాలు ఉంటాయి. ఈ ఘన పదార్థాల్లో ప్రొటీన్లు, పిండి పదార్థాలు, కొవ్వులు వంటివి కర్బన పదార్థాలు. ఖనిజాలన్నీ అకర్బన పదార్థాలు.

రక్తకణాలు

ఇవి మూడు రకాలు. అవి ఎర్రరక్తకణాలు, తెల్ల రక్త కణాలు, రక్తఫలికికలు. రక్త కణాలు ఎముక మజ్జ నుంచి ఏర్పడుతాయి. పిండాభివృద్ధిలో వీ టిని కాలేయం ఏర్పరుస్తుంది. రక్తం, రక్తకణాలు ఏర్పడడాన్ని హీమోపాయిసస్ అంటారు. శరీరంలోని మరో ముఖ్యద్రవం శోషరసం. ఎర్రరక్తకణాలు లేని ద్రవం శోషరసం. శరీర కణజాలా ల మధ్య ప్రత్యేకనాళాల్లో శోషరసం ప్రవహిస్తుం ది. దీనిలో తెల్ల రక్తకణాలు ఉంటాయి కాబట్టి ఇదికూడా రోగ నిరోధక శక్తిలో పాల్గొంటుంది.

ఎర్ర రక్తకణాలు:

ప్రతి క్యూబిక్ మిల్లీ మీటరు రక్తంలో 4.5 నుంచి 5 మిలియన్ల ఎర్రరక్తకణాలు ఉంటాయి. శరీరంలో సుమారు 32 బిలియన్ల ఎర్ర రక్తకణాలు ఉంటాయి. ఎముక మజ్జలో ఇవి ఏర్పడడాన్ని ఎరిత్రోపాయిసిస్ అంటారు. ఇవి ద్విపుటా కారంలో ఉంటాయి. అభివృద్ధి చెందిన క్షీరదాల ఎర్ర రక్తకణాల్లో కేంద్రకం, ఇతర కణభాగాలు ఉండవు. కేవలం హీమోగ్లోబిన్ మాత్రమే ఉంటుంది. హీమోగ్లోబిన్‌లో రెండు భాగాలు ఉంటాయి. అవి.. హీం, గ్లోబిన్. ఇనుము ఫెర్రస్ రూపంలో కలిగి ఉన్న కర్బన పదార్థం హీం. గ్లోబిన్ ఒక ప్రొటీను. రక్తం ఎరుపు రంగులో ఉండటానికి కారణమైన వర్ణకం హీమోగ్లోబిన్. ఇది ఆక్సిజన్, కార్బన్ డై ఆక్సైడ్‌ల రవాణాను నిర్వహిస్తుంది. ప్రతి హీమోగ్లోబిన్ అణువు నాలుగు ఆక్సిజన్ అణువులను రవాణా చేస్తుంది. హీమోగ్లోబిన్ ఏర్పడడానికి, ఎర్రరక్తకణాలు అభివృద్ధి చెందడానికి ఇనుము, విటమిన్ బి12 (సైనకోబాలమిన్), విటమిన్ బి9 (ఫోలిక్ ఆమ్లం) అవసరమవుతాయి. ఆహారంలో ఇవి లోపిస్తే అనీమియా (రక్తహీనత) సంభవిస్తుంది. ఎర్ర రక్తకణాల జీవితకాలం 120 రోజులు. ఆ తర్వాత అవి ప్లీహంలో నశిస్తాయి.

తెల్ల రక్తకణాలు:

వీటిని ల్యూకోసైట్లు అంటారు. శరీర రక్షక భటులుగా వ్యవహరిస్తాయి. వీటి జీవితకాలం కొన్ని రోజుల నుంచి కొన్ని వారాల వరకు ఉంటుంది. ఇవి ప్రధానంగా రెండు రకాలు. అవి.. గ్రాన్యులోసైట్లు, ఎగ్రాన్యులోసైట్లు. గ్రాన్యులోసైట్ల కణ ద్రవ్యంలో ప్రత్యేక కణికలు ఉంటాయి. ఇవి ప్రధానంగా మూడు రకాలు. అవి.. అసిడోఫిల్స్, బేసోఫిల్స్, న్యూట్రోఫిల్స్. ఎగ్రాన్యులోసైట్లు రెండు రకాలు. అవి.. మోనోసైట్‌లు, అసిడోఫిల్స్ లేదా ఇసినోఫిల్స్. అలర్జీ చర్యల్లో పాల్గొంటాయి. న్యూట్రోఫిల్స్, మోనోసైట్లు భక్షక కణాలుగా వ్యవహరిస్తాయి. శరీర రోగ నిరోధక శక్తిలో ప్రధానమైనవి లింఫోసైట్లు. ఇవి రెండు రకాలు. అవి T, B లింఫోసైట్లు. T లింఫోసైట్లు మళ్లీ రెండు రకాలు. అవి CD_4/T_4 కణాలు, CD_8 కణాలు. శరీరంలోకి ప్రవేశించిన వ్యాధి కారకాన్ని గుర్తించి దాన్ని నాశనం చేసే ప్రక్రియను T లింఫోసైట్‌లు ప్రారంభిస్తాయి. వీటి ద్వారా సెల్యులార్ ఇమ్యూనిటీ లభిస్తుంది. వ్యాధి కారకానికి విరుద్ధంగా ప్రతి దేహకాల (యాంటీ బాడీస్)ను విడుదల చేసి ఇమ్యూనిటీని అందించేవి B లింఫోసైట్లు. ఈ రకమైన ఇమ్యూనిటీ హ్యూమొరల్ ఇమ్యూనిటీ. తెల్ల రక్తకణాల సంఖ్య అసాధారణంగా పెరిగితే ల్యుకేమియా లేదా రక్త కేన్సర్ వస్తుంది. వీటి సంఖ్య అసాధారణంగా తగ్గడం ల్యూకోపినియా.

రక్త ఫలకికలు:

ఇవి నిజమైన కణాలు కాదు. ఎముక మజ్జలో మెగా క్యారియోసైట్‌ల నుంచి ఏర్పడిన ఖండితాలు. వీటి జీవితకాలం 3-10 రోజులు. ప్రతి క్యూబిక్ మిల్లీ మీటరు రక్తంలో 2.5-5 లక్షలు ఉంటాయి. గాయమైనప్పుడు రక్త స్కందన ప్రక్రియను ప్రారంభిస్తాయి. గాయమైన ప్రాంతంలో ఇవి విచ్ఛిన్నం చెంది థ్రాంబోప్లాస్టిన్ పదార్థాన్ని విడుదలచేస్తాయి. ఇవి రక్తంలోని ప్రొథ్రాంబిన్‌ను థ్రాంబిన్‌గా మారుస్తాయి. ఆ తర్వాత థ్రాంబిన్ చర్య ద్వారా రక్తంలోని ఫైబ్రినోజన్‌ను ఫైబ్రిన్‌గా మారుస్తాయి. ఫైబ్రిన్ ప్రొటీన్ పోగులుగా మారి సంక్లిష్ట జాలకాన్ని ఏర్పర్చి రక్తం నష్టాన్ని నివారిస్తుంది. ఈ ప్రక్రియలో 13 ప్రధాన రక్తస్కందన కారకాలు, కొన్ని అనుబంధ కారకాలు పాల్గొంటాయి. శరీరంలో రక్తం గడ్డకట్టడాన్ని హిపారిన్ నివారిస్తుంది. రక్త సంకోచానికి కావాల్సిన ఖనిజం కాల్షియం. అనుబంధ కారకాల్లో ముఖ్యమైంది విటమిన్ -కె. ఏ చిన్న దెబ్బ తగిలినా రక్తస్కంధనం జరగని వ్యాధి హీమోఫీలియా. కృత్రిమ రక్తస్కందన కారకాలుగా ఉపయోగించేవి సిట్రేట్‌లు, ఆక్సలేట్‌లు, డైకొమరల్.

రక్త వర్గాలు:

ఎర్రరక్తకణాల్లోని ప్రత్యేక ప్రతిజనకాల ఆధారంగా మానవ రక్తాన్ని వివిధ గ్రూపులుగా విభజించారు. A, B, O రక్తవ్యవస్థను తొలిసారిగా ల్యాండ్‌స్టీనర్ గుర్తించారు. మానవ ఎర్రరక్తకణాలపై A,B ప్రతిజనకాలు ఉండటం లేదా లేకపోవడం ఆధారంగా మనుషులు నాలుగు వర్గాలు. A గ్రూపు ఎర్రరక్తకణాల్లో A అనే ప్రతిజనకం ఉంటుంది. B గ్రూపు ఎర్ర రక్తకణాలపై B ప్రతిజనకం ఉంటుంది. ఎర్ర రక్తకణాలపై A,B ప్రతిజనకాలు రెండూ ఉన్న వారు AB గ్రూపునకు చెందుతారు. ఈ రెండు ప్రతిజనకాలూ లేనివారు O గ్రూపునకు చెందుతారు. A గ్రూపు రక్తాన్ని B గ్రూపు వారికి ఇస్తే A ప్రతిజనకానికి విరుద్ధంగా B వ్యక్తి శరీరంలో ప్రతిదేహకాలు విడుదలై రక్తం గడ్డకడుతుంది. ఇది ప్రాణాంతకం కూడా కావచ్చు. అదేవిధంగా B గ్రూపు రక్తాన్ని A గ్రూపు వారికి ఇస్తే ఇదే సమస్య వస్తుంది. కాబట్టి A గ్రూపు వారికి A గ్రూపు రక్తాన్ని, B గ్రూపు వారికి B గ్రూపు రక్తాన్ని ఇవ్వాలి. ఐతే వీరిద్దరికీ O గ్రూపు రక్తాన్ని ఇవ్వొచ్చు. అదేవిధంగా AB గ్రూపు వారికి A,B,O, గ్రూపు రక్తాన్ని ఇవ్వొచ్చు. కాబట్టి AB గ్రూపు వారు విశ్వ గ్రహీతలు. O గ్రూపు వారి రక్తాన్ని అందరికీ ఇవ్వొచ్చు. కాబట్టి వీరు విశ్వదాతలు. వీరికి మాత్రం O గ్రూపు రక్తాన్నే ఇవ్వాలి. A, B ప్రతిజనకాలకు అదనంగా మనిషి ఎర్ర రక్తకణాలపై Rh ప్రతిజనకాన్ని కూడా ల్యాండ్‌స్టీనర్, వీనర్ గుర్తించారు. ABO రక్త వ్యవస్థకు సంబంధం లేకుండా ఒక వ్యక్తి ఎర్ర రక్తకణాలపై Rh ప్రతిజనకం ఉండొచ్చు లేదా ఉండకపోవచ్చు. దీన్ని కలిగి ఉన్నవారిని Rh పాజిటివ్ అని, లేనివారిని Rh నెగిటివ్ అని సంబోధిస్తారు. అరుదుగా ఎవరిలో లేని ప్రతిజనకం కొందరి ఎర్రరక్తకణాల్లో ఉంటుంది. దీనికి మంచి ఉదాహరణ బాంబే ప్రతిజనకం. బాంబే రక్త గ్రూపునకు చెందిన వారిలో బాంబే ప్రతిజనకం (H) ఉంటుంది.

గుండె, రక్త ప్రసరణ:

శరీరంలో రక్తాన్ని పంపు చేసే అవయవం గుండె. అకశేరుకాల్లో నాడీ జనిత, సకశేరుకాలలో కండర జనిత గుండె ఉంటుంది. మనిషిలో నాలుగు గదుల గుండె ఉంటుంది. ఊపిరితిత్తుల మధ్యలో మీడియా స్టీనియం అనే కుహరంలో గుండె అమరి ఉంటుంది. గుండెలోని పై గదులు కర్ణికలు. కింది గదులు జఠరికలు. గుండె లయ ఒక కండర కణుపులో మొదలవుతుంది. దీన్ని లయారంభకం అంటారు. మానవుడి గుండెలో రెండు లయారంభకాలు ఉంటాయి. సిరాకర్ణికా కణుపు గుండె కుడికర్ణిక కుడి వైపు పై భాగంలో ఉంటుంది. రెండోది కర్ణికా జఠరికా కణుపు. ఇది కుడి కర్ణిక, కుడి జఠరిక మధ్య ఉంటుంది. సిరా కర్ణికా కణుపు వద్ద జనించిన సంకోచ తరంగాలు కర్ణికలకు మాత్రమే పరిమితమవుతాయి. దీని నుంచి సంకోచ తరంగాలను అందుకున్న కర్ణిక, జఠరిక కణుపు హిస్ కండరకట్ట ద్వారా జఠరికలకు చేరుతాయి. ఈ విధంగా మొత్తం గుండె సంకోచిస్తుంది. గుండె సంకోచం సిస్టోల్. గుండె సడలిక డయాస్టోల్. కర్ణికల సంకోచం ద్వారా రక్తం జఠరికల్లోకి చేరుతుంది. జఠరికల సంకోచం ద్వారా మళ్లీ రక్తం కర్ణికల్లోకి చేరకుండా ప్రత్యేక కవాటాలు అడ్డుకుంటాయి. ఎడమ కర్ణిక, జఠరికల మధ్య అగ్రద్వయ లేదా మిట్రల్ కవాటం; కుడి కర్ణిక, జఠరికల మధ్య అగ్రత్రయ కవాటం ఉంటాయి.

సిరలు:

శరీరంలోని సిరలు వివిధ భాగాల నుంచి సేకరించిన మలిన/ ఆమ్లజని రహిత రక్తాన్ని ఊర్ధ్వ, నిమ్న మహా సిరల ద్వారా గుండె కుడి కర్ణికలోకి విడుదల చేస్తాయి. ఐతే ఒక్క పుపుస సిర మాత్రమే ఊపిరితిత్తుల నుంచి శుద్ధ/ ఆమ్లజని సహిత రక్తాన్ని ఎడమ కర్ణికలోకి విడుదల చేస్తుంది. కర్ణికలు సంకోచిస్తాయి. జఠరికల్లోకి రక్తం చేరుతుంది. ఎడమ జఠరికలోకి చేరిన శుద్ధ రక్తం మహాధమని ద్వారా శరీరంలోని ధమనుల్లోకి చేరుతుంది. కుడి కర్ణికలోకి చేరిన మలిన రక్తం ఒక పుపుస ధమని ద్వారా ఊపిరితిత్తులకు చేరుతుంది. ఈ విధంగా శరీరంలోని ధమనులన్నీ గుండె ఎడమ జఠరిక నుంచి శుద్ధ రక్తాన్ని అన్ని శరీర భాగాలకూ సరఫరా చేస్తాయి. ఒక పుపుస ధమని మాత్రమే గుండె కుడి జఠరిక నుంచి మలిన రక్తాన్ని ఊపిరితిత్తులకు సరఫరా చేస్తుంది. ఈ రకంగా గుండె కుడి భాగంలో మలిన రక్తం, ఎడమ భాగంలో శుద్ధ రక్తం స్వతంత్రంగా సరఫరా కావడం ద్విరక్త ప్రసరణ.

మాదిరి ప్రశ్నలు

1. ప్రతి 100 మి.లీ. రక్తంలో హీమోగ్లోబిన్ ఏ మోతాదులో ఉంటుంది?
ఎ) 15 గ్రాములు బి) 15 మిల్లీ గ్రాములు
సి) 25 గ్రాములు డి) 25 మిల్లీ గ్రాములు
2. ఎముక మజ్జ నుంచి రక్తం, రక్త కణాలు ఏర్పడని జన్యువ్యాధి?
ఎ) హీమోఫీలియా బి) థలసీమియా
సి) పాలిసైథామియా డి) అడిసిన్స్
3. విటమిన్ బి12 లోపం ద్వారా సంభవించే రక్తహీనత?
ఎ) మెగలోబ్లాస్టిక్ బి) మాక్రోసిస్టిక్
సి) పెర్నిసియస్ డి) న్యూట్రిషినల్
4. మానవుడిలో ఎర్ర, తెల్ల రక్తకణాల నిష్పత్తి?
ఎ) 1:600 బి) 600:1
సి) 6000:1 డి) 1:6000
5. రక్తం రసాయన గుణం?
ఎ) స్వల్పక్షారం బి) మోస్తరు క్షారం
సి) స్వల్ప ఆమ్లం డి) మోస్తరు ఆమ్లం
6. ప్రతి క్యూబిక్ మిల్లీ మీటరు రక్తంలో తెల్ల రక్తకణాలు సంఖ్య?
ఎ) 8000- 12,000 బి) 2- 2.5 లక్షలు
సి) 3.0- 3.5 మిలియన్‌లు
డి) 3,000- 5,000
7. తెల్ల రక్తకణాలలో ఎక్కువగా ఉండేవి?
ఎ) అసిడోఫిల్స్ బి) బేసోఫిల్స్
సి) న్యూట్రోఫిల్స్ డి) మోనోసైట్‌లు
8. దోమ లాలాజలంలో రక్తస్కందన నివారిణి?
ఎ) హీమోలైసిన్ బి) హిరుడిన్
సి) లైసోజైం డి) అల్బుమిన్
9. బాంబే ప్రతిజనకం?
ఎ) H బి) M సి) N డి) p
10. కింది ఏ జంటకు కలిగే రెండు వరుస Rh పాజిటివ్ శిశువు తల్లి గర్భంలోనే మరణించే అవకాశం ఉంది?
ఎ) Rh^+ పురుషుడు, Rh^- స్త్రీ
బి) Rh^- పురుషుడు, Rh^+ స్త్రీ
సి) Rh^+ పురుషుడు, Rh^+ స్త్రీ
డి) Rh^- పురుషుడు, Rh^+ స్త్రీ
11. వీటిలో ఏ అవయవం తొలగించినప్పటికీ ఏ సమస్యా ఉండదు?
ఎ) ప్లీహం బి) కాలేయం
సి) ఊపిరితిత్తులు డి) పీయూష గ్రంథి
12. రక్తనాళాల్లో రక్తప్రవాహ వేగాన్ని కొలిచే పరికరం?
ఎ) ఈసీజీ బి) స్పిగ్మామానోమీటరు
సి) స్ట్రోమరు డి) ఈఈజీ
13. కర్ణికల సంకోచం (సిస్టోల్)కు పట్టే సమయం?
ఎ) 0.1 సెకను బి) 0.3 సెకను
సి) 0.5 సెకను డి) 0.8 సెకను
14. రక్త నాళాల అధ్యయనం?
ఎ) కైనిసియాలజీ బి) సిన్‌డెస్మాలజీ
సి) ఆంజియాలజీ డి) ట్రికాలజీ
15. గుండె వేగం అసాధారణంగా పెరగడం?
ఎ) టేకీకార్డియా బి) బ్రేడీ కార్డియా
సి) ఎరిథిమియా డి) ఏదీకాదు
16. గుండె లయలో లబ్ శబ్దానికి కారణం?
ఎ) కర్ణికల సంకోచం
బి) జఠరికల సంకోచం
సి) కర్ణిక-జఠరిక కవాటాలు మూసు కోవడం
డి) అర్ధ చంద్రాకార కవాటాలు మూసు కోవడం
17. హెచ్ఐవి ప్రత్యేకంగా దాడిచేసే తెల్ల రక్తకణాలు?
ఎ) బి - లింఫోసైట్‌లు బి) CD4 కణాలు
సి) CD8 కణాలు డి) మోనోసైట్‌లు
18. కృత్రిమంగా రూపొందిన గుండె?
ఎ) టెక్నోకోర్ బి) అబియోకోర్
సి) కార్డియోకోర్ డి) ఏదీకాదు
19. పురుషుడి గుండె బరువుతో పోలిస్తే స్త్రీ గుండె బరువు ఎంత శాతం తక్కువ ఉంటుంది?
ఎ) 50 బి) 25 సి) 10 డి) 2
20. శోషరసంలో లేనివి?
ఎ) తెల్ల రక్తకణాలు బి) ఎర్రరక్తకణాలు
సి) ప్లాస్మా డి) పైవన్నీ
21. రక్త పరిమాణాన్ని నియంత్రించే అవయవం?
ఎ) కాలేయం బి) మూత్రపిండం
సి) ప్లీహం డి) పైవన్నీ
22. సీరంలో లేనివి?
ఎ) ఎర్రరక్తకణాలు బి) తెల్ల రక్తకణాలు
సి) రక్త ఫలికలు డి) పైవన్నీ
23. భారత్‌లో ఎక్కువ మంది ప్రజలు ఏ రక్త గ్రూపునకు చెందినవారు?
ఎ) ఎ బి) బి సి) ఎబి డి) ఒ
24. రక్త స్కందన నివారిణిగా ఉపయోగప డేవి?
ఎ) పొటాషియం ఆక్సలేట్
బి) అమ్మోనియం ఆక్సలేట్
సి) డై కొమరల్ డి) పైవన్నీ
25. సిరలకు సంబంధించిన రుగ్మత?
ఎ) అథెరోస్క్లిరోసిస్ బి) స్కిజోఫ్రినియా
సి) వారికోస్ డి) అల్జిమర్స్

సమాధానాలు: 1) ఎ; 2) బి; 3) సి; 4) బి; 5) ఎ 6) ఎ; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) ఎ; 11) ఎ; 12) సి; 13) ఎ; 14) సి; 15) ఎ; 16) సి;17) బి; 18) బి; 19) బి; 20) బి; 21) సి; 22) డి; 23) బి; 24) డి; 25) సి

A common way of expanding the basic..

Bank Exams
ENGLISH

Friends here is the study material for bank probartionary officer's exam. Before going into the details let us take a look at the syllabus and preparation strategy. The English section of probartionary officer's exam has two categories objective and descriptive papers. For objective the questions are based on grammar, comprehension and vocabulary. For grammar the questions are based on subject-verb agreement, tenses, prepositions and articles. More than 65% questions are given from these areas. In sentence correction the first thing you have to check is concord i.e. subject-verb agreement. Apart from this the questions will also be given from tenses and prepositions. After getting enough knowledge on these areas move on to prepare on adverbs and pronouns.

One way to begin studying basic sentence structures is to consider the traditional parts of speech. To know for sure what part of speech a word is, we have to look not only at the word itself but also at its meaning, position, and use in a sentence. Assuming that many of you have undergone proper education for all these years elaborate explanation is not being given on this section.

The next thing which is important is the sentence structure. The basic parts of a sentence are the subject, the verb and the object. The subject is usually a noun--a word that names a person, place, or thing. The verb or predicate usually follows the subject and identifies an action or a state of being. An object receives the action and usually follows the verb.

A sentence expresses a relationship, conveys a command, voices a question, or describes someone or something. It begins with a capital letter and ends with a period, question mark, or exclamation mark.

See if you can identify the subject and the predicate in each of the following short sentences:

- The dog barks.
- My daughter is a dancer.
- The children are tired.

In each of these sentences, the subject is a noun: dog, daughter, and children. The verb in the first sentence-barks shows action and answers the question, "What does the subject do?" The verbs in the next two sentences--is, are--are called linking verbs because they link the subject with a word that renames it (dancer) or describes it (tired). Look at the table below and understand the typical sentence structure.

Subject	Verb	Comple-ment	Modifier of time
The pilot	com-pleted	his trainng their assig-	last year.
All stu-dents	must submit	nments fishing.	by next week.
The boy	enjoys		

The subject of a sentence may be a singular word noun, such as teacher or table or it may be a noun phrase. A noun phrase is a group of words ending with a noun but not beginning with a preposition.

Adjectives and Adverbs:

A common way of expanding the basic sentence is with modifiers--words that add to the meanings of other words. The simplest modifiers are adjectives and adverbs. Adjectives modify nouns, while adverbs modify verbs, adjectives,



and other adverbs.

Example:
Maggie cooked the chicken on the grill.
Noun verb complement modifier

Adjective Clauses:

To show that one idea in a sentence is more important than another, we rely on subordination--that is, treating one word group as secondary (or subordinate) to another. One common form of subordination is the adjective clause--a word group that modifies a noun. The most common adjective clauses begin with one of these relative pronouns: who, which, and that.

Example:
Although the bear is able to sprint rapidly,
Clause
it tires easily due to its weight.

Appositives:

An appositive is a word or group of words that identifies or renames another word in a sentence--most often a noun that immediately precedes it. Appositive constructions offer concise ways of describing or defining a person, place, or thing.

Example: Hyderabad, the capital of Andhra Pradesh is famous for pearls.

Adverb Clauses:

Like an adjective clause, an adverb clause is always dependent on (or subordinate to) an independent clause. Like an ordinary adverb, an adverb clause usually modifies a verb, though it can also modify an adjective, an adverb, or even the rest of the sentence in which it appears. An adverb clause begins with a subordinating conjunction--an adverb that connects the subordinate clause to the main clause.

Example: When Julie returned, she found Tom very ill.

Participle Phrases:

A participle is a verb form used as an adjective to modify nouns and pronouns. All present participles end in -ing. The past participles of all regular verbs end in -ed. Irregular verbs, however, have various past participle endings. Participles and participial phrases can add vigour to our writing as they add information to our sentences.

Example: Is that John running for the bus?

Absolute Phrases:

Among the various kinds of modifiers, the absolute phrase may be the least common but one of the most useful. An absolute phrase, which consists of a noun plus at least one other word, adds details to an entire sentence--details that often describe one aspect of someone or something mentioned elsewhere in the sentence.

Example: A linguistics student studies how languages are created.

Structures generally test one of the following items:

Sentence structure: This area questions test more than a word or two; they test the ability to make a sentence complete. Sentence structure questions also test one's understanding of subordinate clauses.

Word order: Word order questions are generally more detail-oriented than sentence structure questions. For example, it gives the knowledge pertaining to one's understanding whether an adjective should appear before the noun it modifies, not after it.

Word form: These questions test your ability to recognize which form of a word should be used in a given situation. Word form questions include recognizing which ending should be on a word. For example, you need to recognize if a plural ending on a noun should be singular, a singular designation on a verb should be plural and so on. It also requires you to determine that an adjective form of a word is being used when the noun form of the word is required.

Word choice: Word choice type of questions test your understanding of idiomatic expressions, words often confused, appropriate prepositional usage and so on.

Missing or extra words: Missing or extra word questions overlap with some other categories, but they are easy to recognize than some other question types.

PRACTICE TEST

The questions given below consists of incomplete sentences, with a blank line showing where information is to be filled in. Choose the word that most correctly completes the sentence.

1. The twinkling stars ____ shining brightly.
a) Are b) is c) have d) had
2. Despite the polar bear's tremendous weight and height, ____ of sprinting at tremendous speed.
a) It is capable b) is capable
c) it is able d) ability
3. The twinkling stars, which shine so brightly, ____ very far away.
a) Are b) was c) have
d) had
4. The rain forest, ____ large trees that provide shade to the vegetation below, is home to unique flora and fauna.
a) Has b) with its
c) and d) although has
5. The leaders of the two countries ____ an agreement to avoid future conflicts.
a) Have recently reached
b) recently reach
c) have reached recently
d) have recently reach
6. Laura had hurt her leg and ____ not walk very well.
a) Shouldb) would c) could
d) had
7. They did not want to come with us at first but we ____ able to persuade them.
a) Was b) were c) are d) is
8. Chocolate cake with raspberry filling ____ my favourite.
a) Had b) is c) but d) yet
9. The giraffe's long neck ____ for reaching the tops of trees.
a) Is useful b) used
c) using d) being used
10. The giraffe's long neck and long, spindly legs ____ strange sight to see.
a) Are a b) were c) had d) have
11. A tray of mouth-watering cookies and frosted cupcakes ____ for you.
a) Wait b) is waiting
c) waited d) waiting
12. The pad of paper ____ a grocery list on it.
a) Have been b) has
c) will d) can
13. The phone is ringing. Who do you think it is? 'It ____ be Rahul.'
a) Would b) should c) could
d) can
14. Eating six eggs ____ breakfast might give you a stomach ache.
a) To b) for c) have
d) none
15. Reading a book ____ very rewarding.
a) Can be b) is be
c) were d) had

KEY:
1. A; 2. A; 3. A; 4. B; 5. A; 6. C; 7. B; 8. B; 9. A; 10. A; 11. B; 12. B; 13. C; 14. B; 15. A;